# జానంటే కాదంటా...

బలభద్రపాత్రుని రమణి



అంకితం

## మన బంగారు కొండలకు...

మగవాడి ప్రతివిజయం వెనుకా ఓ స్త్రీ వుంటుందంటారు. అలాగే స్త్రీకి పురుషుడి సహకారం ఎంతో అవసరం అని మనం నమ్ముతాం. కానీ స్త్రీకి ఏ పని పూర్తిచేయాలన్నా కావాల్సింది పిల్లల సహకారం, ఓరకంగా వాళ్ళ త్యాగం.

పాలుగారే బుగ్గలతో అమాయకమైన కళ్ళతో వున్న పసిపాపని ఇంట్లో ఆయాలదగ్గర, క్రష్‌లలోనూ దింపి వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ వెళ్ళే తల్లుల్ని చూసినప్పుడల్లా నాకు మనసు ద్రవిస్తుంది. అలా వెళ్ళవలసిన పరిస్థితులేమిటో తల్లులకి తెలుసు కానీ ఆ చిన్నారులకేం అర్థమవుతుంది! తల్లిదండ్రుల కోసం ఆశని కళ్ళనిండా ప్రోదిచేసుకుని బాలనేరస్థుల్లా కటకటాల వెనుక నిలబడి ఎదురు చూస్తుంటారు.

"అన్నింట్లోకి నీకు కష్టమైన పనేమిటి?" అని ఎవరైనా నన్ను అడిగితే, "ఆదమరిచి నిద్రపోతున్న పిల్లల్ని పొద్దున్నే లేపడం" అని తడుముకోకుండా చెప్పేస్తా.

తెల్లవారుఝామునుంచి కలలొస్తాయి... ఆ కలల్లో రాక్షసులతో ఫైట్స్ వుంటాయి. ఆ సమయంలో రాక్షసులకంటే ఎక్కువ విలనీతో పెద్దవాళ్ళం వాళ్ళని కుదిపీ, కసిరీ నిద్ర లేపేస్తాం. వాళ్ళు నిద్రలేవగానే గడియారం ముళ్ళతో పోటీ పడుతూ వెంటనే మొహం కడుక్కోవడం, గడగడా పాలు తాగడం, చకచకా స్కూల్‌కి తయారవడం చేయాలన్నది మన సంకల్పం. కానీ వాళ్ళకి మాత్రం... తాపీగా పెరట్లోకి వెళ్ళి పనసచెట్టు గుబురుల్లోని బంగారు పిచ్చుక గూట్లో గుడ్లు పగిలాయో లేదో చూడాలనీ, చెట్టుకి వేలాడుతున్న మామిడికాయల సైజు కొలిచి చూడాలనీ అనిపిస్తుంది.

ప్రతి తల్లీ మిలటరీ ఆఫీసర్‌లా మొహంపెట్టి సబార్డినేట్స్‌తో మాట్లాడు తున్నట్లుగా రొటీన్‌గా చెప్పే డైలాగ్స్ వుంటాయి.

"పాలు తాగేటప్పుడు శబ్దం చెయ్యకు."

"కాళ్ళు దబదబా బాదుతూ నడవకు."

"స్నానం అరగంటసేపు నానుతూ చెయ్యకు."

"ఐస్‌క్రీమ్‌లు తింటే జలుబు చేస్తుంది. జామకాయలు తింటే దగ్గు వస్తుంది."

"టీవీ కట్టేసి చదువుకో!"

"బజార్లో కనిపించినవల్లా కొనమని అడక్కండి."

రోట్లో ఇసక పోసి రుబ్బుతున్నట్లుగా పదేపదే ఇవే వల్లించాల్సి వస్తుంది.

పిల్లలకీ మనోభావాలుంటాయి. వాళ్ళు రూపంలోనే కాదు, మనసు విషయంలోనూ మనకంటే చాలా సున్నితం. కేవలం వాళ్ళు మన పిల్లలైనందువల్లా, ఆధారపడినవాళ్ళు కాబట్టి మనం చాలా దుర్మార్గంగా మనకి తెలీకుండానే ప్రవర్తించేస్తుంటాం. ముఖ్యంగా మన ఎమోషన్స్ వాళ్ళమీద చూపించేస్తాం.

నేను సీరియస్‌గా రాసుకుంటున్నప్పుడు వాళ్ళు ఇంట్లో అల్లరి చేస్తుంటే "బయటికి పోయి ఆడుకోండి. ఎవరూ ఫ్రెండ్స్ లేరా?" అంటాను.

ఆడుకోవడానికి వెళతామని అడిగినప్పుడు "ఇప్పుడా... మీకూ, మీ ఫ్రెండ్స్‌కీ పనిలేదా?" అనేస్తాను.

అప్పుడు మా చిన్నాడు నావైపు ఓ చూపుచూస్తాడు. ఆ చూపులో భావాలు అర్థమై నేను గిల్టీగా ఫీలవుతాను.

మనం మంచి నటులం. వానలో తడుస్తూ నీళ్ళల్లో పడవలు వెయ్యకుండా, ఎండలో పెద్దాళ్ళ కన్నుగప్పి బైటికి పరుగెత్తి ఆడకుండా ఎవరూ పెద్దవరని మనకూ తెలుసు. కానీ తెలియనట్లు నటిస్తాం.

నా, పరా, బేధం లేకుండా ఒక్కళ్ళూ వున్నప్పుడూ, వందమందిలో వున్నప్పుడు కూడా ఒకేరకంగా ప్రవర్తించగలగడం పిల్లలకే చెల్లుతుంది. ఒకసారి మా పెద్దవాణ్ని నా స్నేహితురాలింటికి తీసుకెళ్ళాను. ఆమె వాళ్ళ పిల్లలతో బాటు వీడికీ మామిడిపండు ఇచ్చి తినమంది. ఎన్నిసార్లు అడిగినా వీడు తినలేదు. వాడికి చాలా ఇష్టం అని నాకు తెలుసు. "అదేమిట్రా నీకు ఇష్టంకదా!" అన్నాను. తనూ వాణ్ని అదే ప్రశ్న వేసింది.

"కానీ మీద పోసుకోకుండా, నాకకుండా తినడం నాకు చేతకాదు. అలా తింటే మమ్మీ తిడుతుంది" అని కుండబద్దలు కొట్టినట్లు వాళ్ళముందు చెప్పేశాడు. ఎక్కడికైనా తీసుకెళ్ళేముందు వాళ్ళతో "అక్కడ కుదురుగా వుండండి. బుద్ధిగా వుండండి" అని జాగ్రత్తలు చెప్పడంవల్ల మనసుమీద ఎంత ప్రభావం చూపిస్తాయో ఈ సంఘటనతో నాకు తెలిసొచ్చింది.

ఏమీ మీదపడకుండా తినడం, కోపంవస్తే కాళ్ళు బాదుతూ ప్రతిఘటించక పోవడం, బాధొస్తే వెంటనే ఏడ్చి మనకి తెలియపరచకపోవడం, బజార్లో కన్పిస్తూ ఊరించే ఆటవస్తువుల్ని కొనమని అడగకపోవడం ఇవన్నీ చేసే పిల్లల్ని... పిల్లలు అని ఎలా అంటాం?

మాకు తెలిసినవాళ్ళ చిచ్చర పిడుగొకడు, వాళ్ళ నాన్న దగ్గరున్న నకిలీ వందరూపాయలనోటొకటి చూసి కావాలని మారాం చేయసాగాడు.

ఆయన "వద్దు... నీకిస్తే చింపేస్తావు" అన్నాడు.

వాడు "చింపను. ఆడుకుని ఇచ్చేస్తాను ప్రామిస్" అన్నాడు.

"ఒకవేళ చిరిగిపోతేనో..." ఆయన బెదిరిస్తున్నట్లుగా అడిగాడు.

"అవతల పారేయ్" వాడు అంతకంటే సీరియస్‌గా చెప్పాడు.

'కొట్టు' అనో లేకపోతే ఇంకేదో అంటాడనుకున్న ఆయన తెల్లబోయి, వెంటనే వాడి సిన్సియారిటికీ నవ్వొచ్చి నవ్వేశారు.

ఒకసారి మేము వేరే ఊరునించి వస్తూ అక్కడ స్టేషన్లో రైలుకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాం. పక్కనే కొందరు బిచ్చగాళ్ళ పిల్లలు ఆడుకుంటున్నారు. మావారు మా పిల్లలిద్దరికి ఐస్‌క్రీమ్స్ తెచ్చిచ్చారు. నేనూ ఆయనా ఏదో మాట్లాడుకుంటూ వుండిపోయి, కాసేపటికి చూసేసరికి మా పెద్దాడి చేతిలో ఐస్‌క్రీమ్ మొత్తం కారిపోయి వుంది. వాడికళ్ళు ఆ బిచ్చగాళ్ళ పిల్లలవైపే తదేకంగా చూస్తున్నాయి.

"ఐస్‌క్రీమ్ తినలేదేమిట్రా?" అని ఆయన అడిగారు.

వాడు కళ్ళనిండా నీళ్ళతో "అమ్మా! ఆ పిల్లలకి క్రీమ్‌రోల్స్ అంటే, ఐస్‌క్రీమ్స్ అంటే ఎలా వుంటాయో తెలీదు కదూ?" అని అడిగాడు.

ఆ వయసులో ప్రతి చిన్నారిలోనూ ఒక సిద్ధార్థుడు దాగుంటాడు. అస్తమానం చలించిపోతారు. వాళ్ళకి లోకం పోకడ దగ్గరకి తీసుకుని ప్రేమగా వివరించాలి. లేకపోతే ఆ విచారాలు వాళ్ళని చాలారోజులు వెంటాడుతుంటాయి.

పిల్లలు మనకంటే చిన్నగా వుంటారు కాబట్టి కోపం వస్తే మొట్టికాయ లేస్తుంటాం. కోపం, అలకా తొందరగా మరిచిపోయి మన కొంగు పట్టుకు తిరుగుతుంటారు. అందుకే నోటికొచ్చిన మాటేదో తిట్టేస్తుంటాం. చిరాకు పడటం, విదిలించుకోవడం, వాళ్ళకి మూడ్ లేకపోయినా మనకి మూడ్ వుందని పీకీ, లాగీ ముద్దులు పెట్టుకోవడం, ఇంటికెవరైనా వచ్చినప్పుడు హాయిగా, స్వేచ్ఛగా ఆడుకుంటున్న పిల్లల్ని పిలిచి వాళ్ళ వినోదం కోసం ఆడమనడం, పాడమనటం లేదా వాళ్ళ ఐ.క్యూ కి పరీక్షలు పెట్టడంలాంటివి నిరంకుశంగా చేసేస్తుంటాం.

ఇవన్నీ చేసినా భరిస్తారు కానీ... పక్కింటి పిల్లలతోనో, ఎవరితోనో పోల్చి వాళ్ళ 'బంగారుకొండ'లని తిడుతుంటే మాత్రం క్షమించరు. మనసులోనే శపిస్తారు. 'ఈ పెద్దాళ్ళు వచ్చే జన్మలో అస్సలు పెద్దవకుండా పిల్లలుగానే వుండిపోయి ఈ బాధలన్నీ పడాలని." ఆ పరిస్థితి మనం తెచ్చుకోకూడదు.

"హోమ్ ఎలోన్" సినిమాలో పిల్లాడిలా ఒక్కసారిగా ఇంట్లో వాళ్ళందరూ మాయమైపోతే ఇష్టంవచ్చినంతసేపు పడుకుని, యిష్టం వచ్చింది తిని, ఇష్టం వున్నంతసేపు టి.వి. చూడాలని వుంటుంది వాళ్ళకి.

కానీ మనం వాళ్ళని ప్రతి నిముషం క్రమశిక్షణలో పెట్టి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనుకుంటాం. అందుకని వాళ్ళ ప్రతి పర్సనల్ విషయంలోనూ మర్యాద లేకుండా తలదూరుస్తాం. మన దురుసుతనంతో అహంభావంతో దండిస్తాం. ఖండిస్తాం.

వాళ్ల చదువులూ, ఆటలూ, తిండీ, అభిరుచులూ, నిద్రా... అన్నీ మనకి ఇష్టం వచ్చినట్లు నిర్దేశిస్తాం. ఇవన్నీ బాధాకరం అయినప్పటికీ మనం అధికారం చూపిస్తున్నాం అనుకోరు. అసహ్యించుకోరు. అలిగి మాట్లాడటం మానెయ్యరు. ముద్దుగా పిలిస్తే పరిగెత్తుకుంటూ వచ్చి మెడచుట్టూ చేతులేసి అల్లుకుపోవడం మానరు. మనం కొట్టామనో, తిట్టామనో అవమానపడి మనసులో పెట్టుకోరు. చిన్నపిల్లలైనా పెద్ద మనసుతో మన సమస్త తప్పిదాన్నీ క్షమించేస్తారు. మనమీద నమ్మకాన్ని పోగొట్టుకోరు. అందుకే వాళ్ళని దైవస్వరూపాలన్నారు.

ఇక్కడ మహాత్ముడిని స్మరించుకోవాలనిపిస్తోంది. మా అమ్మమ్మా, తాతయ్యా స్వాతంత్ర్య సమరయోధులు. వాళ్ళు పాదయాత్రచేసి లక్నోలో కాంగ్రెస్ మీట్‌కి వెళ్ళినప్పుడు, మా అమ్మమ్మ ఏడాది వయసున్న మా పెద్దమ్మతో గాంధీగారి కాళ్లకి నమస్కారం చేయించాలనుకున్నారట. పాప చేయనని మొరాయించి ఏడ్చిందట. అప్పుడు బాపూజీ చిరునవ్వుతో "పసిపిల్లలు దైవస్వరూపాలు... వాళ్ల నమస్కారాలందుకునే అర్హత మానవులకి లేదమ్మా" అన్నారట.

అందుకే ఆయన మహాత్ముడయ్యాడు.

మనం మహాత్ములం కాకపోయినా, మానవత్వం మర్చిపోకుండా మన ఇంట్లోని చిన్నారుల్ని ప్రేమిద్దాం. వాళ్ళ మనోభావాల్ని గౌరవిద్దాం. రోజులో కాస్త సమయం వాళ్ళకోసం వినియోగించి వాళ్ళ అభిప్రాయాలని తెలుసు కుందాం.

మా పెదబాబు పసితనంలో నేను ఎక్కువగా నవలలు చదువుతూ వాడి పసి చేష్టల్ని పెద్దగా ఎంజాయ్ చేయలేదు. చిన్నవాడి పసితనంలో రాయాలన్న తపనతో ఎక్కువ సమయం రచనలకి కేటాయిస్తూ వాడి చిలిపి అల్లర్నీ పూర్తిగా అనుభూతించలేదు. ఇప్పుడు పసిపిల్లల తల్లులు పొందే ఆనందం చూస్తుంటే నాకు ఏమూలో చివుక్కుమంటూ వుంటుంది. కానీ కాలం చేజార్చుకుంటే మళ్ళీ తిరిగిరానిది. మన పిల్లల చిన్నతనం మళ్ళీ వీ.సీ.ఆర్‌లో రీవైండ్ చేసుకుంటే వెనక్కి రానిది. ఏ కంప్యూటరూ మనిషి పారవేసుకున్న బాల్యాన్ని వెనక్కి తెప్పించలేదు. పిల్లలకి బాగా చదువు రావాలని నేను వాళ్ళని తిట్టీ, కొట్టీ చదివిస్తుంటే చూడలేకా, విని భరించలేకా కళ్ళు తుడుచుకుంటూ ఆ ప్రహసనం అయ్యేదాకా దూరంగాపోయి కూర్చుని, అయిపోయాక "నాన్నమ్మా, అమ్మ కొట్టడం అయిపోయింది' అని బాబు చెబితే వాణ్ని తీసుకుని ఏడ్చిన మా అత్తగారికీ, మా అమ్మకి నేను ఎన్ని క్షమార్పణలు చెప్పినా తక్కువే! నాలోని మూర్ఖత్వం పూర్తిగా కరిగిపోయేటప్పటికి వాళ్ళు పెద్దవాళ్ళు అయిపోయారు. పెద్దవాడు తొమ్మిదో తరగతీ, చిన్నవాడు ఆరో తరగతికీ వచ్చేశారు. ఇప్పుడెవరైనా తల్లులు పిల్లల్ని అలా కొడుతుంటే, తిడుతుంటే నా మనసు పెరపెరలాడిపోతుంది. అమ్మా, అత్తయ్యా అనుభవించిన నరకం గుర్తొచ్చి పశ్చాత్తాపం కలుగుతుంది. అటువంటి బాధలనుంచి తల్లులు తప్పించుకోవాలనే ఈ 'మదర్స్ డే" సందర్భంగా నేను ఇది రాశాను.

ఇప్పుడిప్పుడే కథలు రాసి అవి ఇంగ్లీష్ మేగ్‌జైన్స్‌లో ప్రచురితం అయ్యేటట్లు చేసుకుంటున్న మా పెదబాబు అశ్వనీ ఒకరోజు దేవుడిని ఇలా ప్రార్థన చేయడం నేను విన్నాను.

"నాతో కలిసి అల్లరి చేయడానికి ఒక తమ్ముణ్ని తోడుగా పంపిన నీకు థాంక్స్... దేవా!"

నేను అప్పుడు నవ్వుకున్నాను. కానీ దానిభావం లోతుగా వుండటం తరువాత అర్థం అయింది.

మనం పట్టించుకోనీ, గ్రహించలేనీ ఎన్నో విషయాల్ని పిల్లలనుంచి తెలుసుకోవచ్చని నాకు తెలియజేసిన మా అబ్బాయిలు చిరంజీవులు 'అశ్వనీ కుమార్, కృష్ణకాంత్'లకి నేను నా కృతజ్ఞతలు ఈ నవల ఇవ్వడం ద్వారా తెలియజేసుకుంటున్నాను.

ఈ వయసులో వాళ్ళకి అంకితాలూ, కృతజ్ఞతలూ అర్థంకావు. కానీ పెద్దయ్యాక ఇది చదివి నవ్వుకోవాలనీ, వాళ్ల పిల్లలకి చూపించుకోవాలనీ నా అభిమతం.

వాళ్ళతో కలిసి గడపాల్సిన సమయాన్ని పిల్లలు త్యాగం చేస్తే తప్ప ఏ తల్లీ తను సాధించాలనుకున్నది సాధించలేదన్న నా అభిప్రాయంతో మీరూ ఏకీభవిస్తారు కదూ! అయితే పిల్లలకి జేజేలు చెప్పండి.

## ఔనంటే... కాదంటా!

**జీవితం ఒక పెద్ద ఫిక్షన్ నవలలాంటిది! పుస్తకాల్లో, సినిమాల్లో చూసి అసహజం అని గోలపెట్టిన సంఘటనలే నిజజీవితంలో జరిగితే చాలా మామూలుగా తీసుకుంటాం.**

ఆమె సముద్రం దగ్గరగా కూర్చుని వుంది.

అయినా కెరటాల హోరు ఆమెకు వినపడటంలేదు.

అంతగా ఆలోచనల్లో మునిగిపోయి వుంది!

గాలికి నుదుటిమీద వాలి చిరాకుపెడుతున్న ముంగురుల్ని కూడా పట్టించుకోకుండా శిల్పంలా కూర్చొని వుంది.

ఆ అందం, ముగ్ధత్వం వాటితో పోటీపడే పరువం చూస్తుంటే ఆ అమ్మాయి అలా కూర్చోవడానికి కారణం తప్పకుండా ప్రేమలో పడటమే అనిపిస్తుంది.

కానీ అది తప్పు అభిప్రాయం!

ఆమె ప్రేమరాహిత్యంతో బాధపడుతోంది.

అవసరాన్ని బట్టి వేషాలు మారుస్తూ జీవిత రంగస్థలంమీద నటించేస్తున్న నటుల నిజమైన ముఖాలు తెలీక బాధపడుతోంది. ఆ బాధావీచికలు ఆమెముఖంలో కనిపించిపోతున్నాయి.

ఆమె గబగబా సముద్రంవైపు అడుగులు వేయసాగింది.

పాలనురగలాంటి అలలు ఎగసిపడుతూ ఆమెని వెనక్కి తోసేస్తున్నా ఆమె ఏమాత్రం లక్ష్యపెట్టకుండా, జంకూ బొంకూ లేకుండా ముందుకి అడుగెయ్యడానికే ప్రయత్నిస్తోంది.

ఇంకా కొద్దిదూరం వెళితే ఏం జరిగేదో...

కానీ ఇంతలో అనుకోని సంఘటన ఒకటి జరిగింది.

ఆమె ఏం జరుగుతుందో తెలుసుకునేలోగానే ఓ యువకుడు ఆమెని రెండుచేతుల్తో పైకి ఎత్తేసి వేగంగా ఒడ్డుకి తీసుకొచ్చి ఇసుకమీద పడుకో బెట్టేశాడు.

ఆమె ఎంత ఆశ్చర్యానికి లోనయిందంటే కనీసం ప్రతిఘటించలేక పోయింది.

ఆ యువకుడు ఆమె జాకెట్టుకీ చీర కుచ్చెళ్ళకీ మధ్యన చెయ్యేసి బలంగా నొక్కబోతుంటే... అప్పుడు అరిచిందామె!

"ఏయ్... ఏం చేస్తున్నావ్?"

అతను చేస్తున్న పనాపి ఆమెవైపు సీరియస్‌గా చూశాడు.

ఆమె లేచి కూర్చుంటూ "యూ ఇడియెట్... హౌ డేర్ యూ... నన్ను నీ ఇష్టం వచ్చినట్లు టచ్ చేయడానికి!" అంది.

ఆమె మాట పూర్తి చేసేలోపే చెంప ఛెళ్ళుమనిపించాడు అతను.

ఈసారి ఆమె కళ్ళల్లో కోపంకన్నా విస్మయం హెచ్చుగా కదలాడింది. చెంప పట్టుకుని అతనివైపు మాట రానట్లు చూస్తూండిపోయింది.

ఆమెని కొట్టినచేతిని ఓసారి చూసుకుని అతను ప్యాంటుకి తుడిచేసు కున్నాడు. పెద్ద గిల్టీఫీలింగ్ ఏం లేకుండా "జీవితంలో ఆడపిల్లమీద చెయ్యి చేసుకోకూడదనుకున్నాను... జీవితం మొదట్లోనే తప్పేట్లు చేశావు" అన్నాడు.

ఆమె అప్పటికి తేరుకుని "నీకెంత ధైర్యం? మొదట నన్ను టచ్ చేశావు. తర్వాత కొట్టావు. ఇప్పుడు నీ అభిప్రాయాలూ, నిర్ణయాలూ ముచ్చటిస్తున్నావు. పద పోలీస్‌స్టేషన్‌కి. నీమీద కేసు పెడతాను" అని ఆవేశంగా అరిచింది.

"పద... ముందు నిన్ను ఆత్మహత్యా నేరంమీద అరెస్ట్ చేసి పడేస్తాను" అతనూ లేచి నిల్చుంటూ అన్నాడు.

"ఆ...త్మ...హ...త్యా...!!!" కళ్ళు పెద్దవిచేసి వినకూడని విషయం విన్నట్లుగా అంది.

"వయసు రాగానే హడావుడిగా ఎవడ్నో ప్రేమించడం, నమ్మడం, సర్వస్వం అర్పించడం ఆ తర్వాత సముద్రాలూ, నదులూ వెదుక్కుని



అమాంతం దూకి చావడం... ఛీ! ఛీ! ఎన్ని యుగాలైనా మీ ఆడాళ్ళు మారరు" అన్నాడు.

"షటప్!" ఆమె కోపంగా అరుస్తూ అతని ముందుకెళ్ళింది. "నేను ఆత్మహత్య చేసుకోవడం ఏమిటి? అందులోనూ స్విమ్మింగ్ ఛాంపియన్‌ని. పిచ్చిపిచ్చిగా వాగకు" అంది.

"మరి నీళ్ళల్లోకి ఎందుకెళ్ళావు?" అడిగాడు.

"నీళ్ళల్లోకి స్నానం చెయ్యడానికీ, చేపలు పట్టడానికీ, ముత్యాలు ఏరుకోవ డానికీ కూడా వెళతాను" అంది.

"తమరు ముత్యాలకోసమా?" హేళనగా అడిగాడు.

"ఉహూ! గవ్వలకోసం" అంది.

అతను కొంచెం అనుమానంగా "నిజంగా ఆత్మహత్యా ప్రయత్నం కాదా?" అన్నాడు.

"ఆత్మహత్య చేసుకునే ఖర్మ నాకేం పట్టలేదు" ఆమె విసుగ్గా అంది.

అతను తల గోక్కుని "చాలాసేపట్నించీ గమనించాను. ఆ వాటం... అదీ అచ్చు ఆ అమ్మాయిల్లా వుంటే" అన్నాడు.

"ఏ అమ్మాయిల్లాగా?" ఆమె చిరాగ్గా అరిచింది.

"అదే... ఇంతకుముందు నేను వాటేసుకుని ఒడ్డుకు తీసుకొచ్చిన ముప్ఫై మూడుమంది ఆడపిల్లల్లాగా" అన్నాడు.

"మీకు ఇంతకన్నా వేరే పనేంలేదా?" అంది.

అతను నవ్వి "నిజం చెప్పాలంటే... అంతే. పరోపకారం తప్ప నేనింకే పనీ చెయ్యను" అన్నాడు.

"పరోపకారమా?" అతను ముట్టుకున్న ప్రదేశాన్ని విసుగ్గా చూసుకుంది.

అతను తేలిగ్గా నవ్వేసి "ఆల్‌రైట్. అప్పుడప్పుడు మేధావులు కూడా పొరపాటు పడతారన్నమాట. సరే కానీ, అసలు ఇంత అందమైన ఫేస్‌లో ఆ విచారమేఘాలేలా? ఎందుకంత శాడ్‌మూడ్‌లో వున్నారు? తెలుసు కోవచ్చా?" అన్నాడు.

"ఉహూ! తెలుసుకుని మీరు ఉద్ధరించేదేం లేదు" ఆమె చీరకి అంటిన ఇసుక దులుపుకొని వెళ్ళడానికి ఉద్యుక్తురాలైంది.

"మీకు సింహమూ, చిట్టెలుకా కథ తెలీదనుకుంటాను. ఎవరి సహాయం ఎప్పుడు అవసరం అవుతుందో ఎవరు చెప్పగలరు?" అన్నాడు

ఆమె కోపంగా చూసి "నీ సహాయం మాత్రం నాకు అవసరం రాదనుకుంటాను" అని వెనక్కి తిరిగి అడుగులు వెయ్యసాగింది.

అతను వెనుకనుంచి "మూర్ఖులూ, చనిపోయినవాళ్ళూ మాత్రమే తమ అభిప్రాయాలు మార్చుకోరు. కాబట్టి మీరు తప్పకుండా మీ మీ అభిప్రాయం మార్చుకుంటారని నాకు నమ్మకం వుంది"అన్నాడు.

ఆమె వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది.

❖ ❖ ❖

ఆ రాత్రి శక్తిమతి మంచంమీద బోర్లా పడుకుని నిద్రపోవడానికి ప్రయత్నిస్తుంటే సాయంత్రం బీచ్‌లో జరిగిన సంఘటనలూ, ఆ యువకుడి మాటలూ గుర్తొచ్చాయి.

ఆమె పెదవులమీద చిన్ననవ్వు పరుచుకుంది.

మనం చెప్పే జోక్‌లో విట్ వుంటే శత్రువుల్ని కూడా నవ్వించవచ్చు. ఆమెకి ఆ విధంగా అతనిమీద కోపం పోయింది.

ముందు గదిలోనుంచి పెద్దక్క ఏడవడం, ఆమెని తండ్రి సముదాయించడం వినిపిస్తోంది.

"ఏళ్ళ తరబడి ఒకే విషయానికి ఈ ఆడవాళ్ళు ఎందుకేడుస్తారో?" అనుకొంది శక్తిమతి.

ఆమె పెద్దక్క తన భర్త అనుమానంతో తనని పెడుతున్న చిత్రహింసల గురించి చెప్పుకొని ఏడుస్తోంది.

ఇంతగా ఏడుస్తున్న ఈమె రేపు ఆ భర్తగారొచ్చి రమ్మనగానే మారు మాట్లాడకుండా "ఆయనకి యిబ్బందే... నేను మా ఇంటికెళతాను" అని వెళ్ళిపోతుందని శక్తిమతికి తెలుసు.

కొంతసేపటికి తండ్రీ, అక్కల సంభాషణ శక్తిమతి పెళ్ళివైపు మళ్ళింది.

"ఈ సంబంధం అయినా కుదిరితే బావుణ్ణు. కట్నంగురించి దానికి తెలీనివ్వకండి" శక్తిమతి పెద్దక్క సలహా యిస్తోంది.

'పెళ్ళి చేసుకుని తను అనుభవిస్తున్నది చాలదన్నట్లు చెల్లెలిని కూడా ఆ రొంపిలోకి దించమని సలహా ఒకటీ!' అనుకొంది శక్తి.



"నెలకి ఐదువేల పైగా సంపాదించే నేను ఎందుకని కట్నం యివ్వాలంటుంది? మొగుడిగా వుండటానికి వాడికి పగడీనా? అని గోల పెడుతుంది. పైగా కాలేజీలో ఏదో శపథంకూడా చేసిందట" తండ్రి నిష్ఠూరంగా అంటున్నాడు.

శక్తి కిటికీలోంచి బయటకు చూసింది.

ఆకాశం నల్లని రగ్గులా, అందులో ఓ చిరుగులా చందమామా కనిపించాయి.

'నాకూ నా జీవితానికీ సంబంధించిన విషయంగురించి వీళ్ళంతా ఎందుకు డిస్కస్ చేసుకుంటారు' అనిపించింది.

ఆమె పెద్దబావ, చిన్నబావా గుర్తొచ్చారు.

'అటువంటి మొగుళ్ళనీ, వాళ్ల కాపురాల్నీ చూశాక ఆకాశం, వెన్నెలా, పెళ్లీ, సంసారంలాంటి విషయాల్ని అందంగా ఎలా వూహించుకోవడం' అనుకొని గట్టిగా కళ్ళు మూసుకుంది.

తండ్రీ, పెద్దక్కా కలిసి చిన్నక్క కాపురంగురించి మాట్లాడుతున్నారు.

'వేరే వాళ్ళ విషయాలగురించి చర్చించే సమయం మన విషయాలపై కేటాయిస్తే ఏదైనా పరిష్కారం దొరకవచ్చు అని వీళ్ళకి ఎవరు బోధించగలరూ!' అనుకొంది.

❖ ❖ ❖

శక్తిమతి పనిచేసే బ్యాంక్ బ్రాంచ్ వూరికి కాస్తంత దూరంలో వుండడంతో ఆమె ఓ గంట ముందుగా బయల్దేరాల్సి వస్తుంది. ఆమె హడావుడిపడుతూ తయారవుతుండగా తండ్రి పిలిచాడు.

"ఏమిటీ?" శక్తి టైం చూసుకుంటూ అడిగింది.

"ఈరోజు కాస్త త్వరగా రా తల్లీ!" అన్నాడు.

శక్తికళ్ళల్లో అంతులేని చిరాకు కనిపించింది.

"మళ్ళీ పెళ్ళిచూపులా?" కోపంగా అంది.

ఆయన నచ్చచెబుతున్నట్టుగా "మంచి సంబంధం. అబ్బాయి ఇంజనీర్, పైగా నీ ఫోటో బాగా నచ్చిందట" అన్నాడు.

"రేటెంత అడుగుతున్నారు? ఇంజనీర్లకి బాగా పలుకుతోందనుకుంటాను. ఇవికూడా "పెళ్ళికొడుకుల మార్కెట్" అని పేపర్లో ఓ పక్కన ప్రకటిస్తే బాగుంటుందేమో!" హేళనగా అంది.

కూతురితో మాట్లాడడానికి జంకుతున్నట్లుగా ఆయన ఒకనిముషం ఆగి "శక్తీ... ఈ అందం, వయసూ వుండగానే జీవితంలో సెటిలై పోవాలమ్మా. సిద్ధాంతాలూ, నినాదాలూ బాధల్నితప్ప ఆనందాల్నివ్వవు" అన్నాడు.

ఆమె నవ్వి "ఇద్దరు కూతుళ్ళ పెళ్ళిళ్ళు కట్నాలిచ్చి ఘనంగా చేసిన నువ్వు ఇలా మాట్లాడుతున్నావా నాన్నా! నీ పెద్ద కూతురూ, చిన్నకూతురూ జీవితంలో సెటిలైనట్లేనా? ఆనందంగా కాపురం చేసుకుంటున్నట్లేనా? అభద్రతాభావంతో ప్రతి నిముషం బ్రతికేవాళ్ళు హాయిగా కాపురం చేసుకుంటున్నారని లోకానికి తెలియజేయడానికి వాళ్ళకొచ్చే కడుపులూ, పురుళ్ళూ రుజువులేమో కానీ అన్నీ తెలిసిన నాకు కాదు" అని కొట్టిపారేసింది.

ఆయన బాధగా "అందరి అదృష్టాలూ ఒకేలా వుండవు తల్లీ! నువ్వు చిన్నప్పటినుంచీ చదువు విషయంలోనూ, మిగతా అన్ని విషయాల్లోనూ వాళ్ళ కన్నా మెరుగ్గానే వున్నావు. మొగుడి విషయంలోకూడా అని అనుకోవచ్చుగా!"

శక్తి గూట్లోంచి చెప్పులు తీసి వేసుకుంటూ "వాళ్ళని చూసి నేను జాగ్రత్త పడుతూ వచ్చాను. ఈ విషయంలో కూడా అంతే! నా జీవితాన్ని నాకొదిలెయ్ నాన్నా... ప్లీజ్!" అంది.

"ఈ ఒక్కసారికీ..." తండ్రి నసిగాడు.

"ప్రయత్నిస్తాను" అని ఆమె వెళ్ళిపోయింది.

ఆరోజు శనివారం కావడంతో బ్యాంక్ చాలా రష్‌గా వుంది. శక్తి క్యాష్ కౌంటర్లో వుంది. వూపిరి పీల్చుకోవడానికి కూడా టైం దొరక్క అవస్థ పడుతోంది.

అటెండర్ టీ తీసుకొచ్చి పెడుతూ "చుట్టుపక్కల పాములు బాగా తిరుగు తున్నట్లున్నాయి. వాచ్‌మెన్ రాత్రి పెద్ద తాచుపాముని చూశాడట" అన్నాడు.

ఆమె ఆ విషయంపై పెద్దగా శ్రద్ధ చూపించలేదు. గ్యాప్ దొరికినప్పుడు టీ తాగుతుండగా "హాయ్! మీరు ఈ బ్రాంచ్‌లో పనిచేస్తున్నారా?" అన్న పలకరింపు విని తలెత్తి చూసింది.



నిన్న బీచ్‌లో తారసపడిన యువకుడు నవ్వుతూ కనిపించాడు. 'లేదు. గవ్వలాడుకుంటున్నాను' అనాలనిపించినా, అనకుండా గంభీరంగా తలవూపింది.

"బాబూ... నిలబడలేకపోతున్నానయ్యా!" అంటున్న ఓ వృద్ధుడు అతని పక్కన వున్నాడు.

"అయిపోయింది. మీరు కూర్చోండి. మనకి తెలిసిన అమ్మాయి ఇక్కడ వుంది కూడానూ" ఆయనతో చెబుతూ కూర్చోబెట్టి వచ్చాడు అతను.

"చూడండి మిస్... నా పేరు ఇంద్రనీల్. ఈ ముసలాయన ఫ్రీడం ఫైటర్. రెండుమాసాలుగా పెన్షన్ తీసుకోలేకపోయారట. ఆయన కుడిచెయ్యి స్వాధీనంలో లేదు. ఇప్పుడు ఆ రెండు నెలలదీ చూసి ఇప్పిస్తే మేలు చేసిన వారౌతారు" అన్నాడు.

"అందులో మేలేముందీ? ఫార్ము తెచ్చారా?" అడిగింది శక్తి.

"ఆ... ఆ..." అతను అందించాడు.

శక్తి వాటిని చూసి "సంతకం టాలీ కావడంలేదు" అంది.

ఇంద్రనీల్ గొంతు సవరించుకుని "దేశంకోసం జీవితాన్నీ, ప్రాణాన్నీ త్యాగం చెయ్యడానికి వెనుకాడని ఇలాంటివారికి మనం ఇవ్వవలసిన మన్నన ఎలాగూ ఇవ్వడంలేదు. పైనుంచి వాళ్ళని ఏడాదికోసారి "మేం ఇంకా బతికే వున్నాం" అనో, స్వాతంత్ర్య సమరయోధుల భార్యలైతే "మేం మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు" అనో గెజిటెడ్ ఆఫీసర్ల సంతకాలతో ధ్రువీకరించాలనడం మానవత్వం కాదు. ఆయన కుడిచెయ్యి స్వాధీనంలో లేక ఎడమచేతితో సంతకం పెట్టారు. అందుకే అక్షరాలు అలా ఒంకర టింకరగా వున్నాయి. రూల్స్... రెగ్యులేషన్స్ పక్కనపెట్టి ఒక్కసారి భారత పౌరురాలిగా ఆలోచించండి" అన్నాడు.

శక్తి ఆలోచించి ఫారాలు తీసుకుంటూ "ఆయన మీకేమౌతారు?" అంది.

"ఇప్పుడే బస్‌లో పక్కన కూర్చున్నప్పుడు పరిచయం అయ్యారు" అన్నాడు.

"ఓ... మర్చేపోయాను. మీరు పరోపకారి పాపన్నగారు కదూ!" అంటూ ఆమె నవ్వి డబ్బు లెక్కపెట్టి అందించింది.

ముసలాయన అతనికి చాలా కృతజ్ఞతలు చెప్పుకుని వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నానికల్లా శక్తి మూడ్‌లో మార్పు వచ్చింది. లంచ్‌టైంలో బయటికి వచ్చి ఓ మూలగా వున్న లంచ్‌రూంవైపు వెళుతుండగా "హలో... మేడమ్.." అంటూ ఇంద్రనీల్ దగ్గరకు వచ్చాడు.

"మీరింకా వెళ్ళలేదా?" అంది.

స్కూటర్ స్టార్ట్ చేసుకుంటున్న ఓ అమ్మాయిని చూపిస్తూ "ఆ అమ్మాయి ఏదో సలహా అడిగితే చెబుతున్నాను. ఇంతకీ మీ పేరు చెప్పనేలేదు" అన్నాడు.

"అపరిచితులకి పేర్లు చెప్పడం, ఎడ్రస్‌లూ, ఫోన్ నెంబర్లూ ఇవ్వడం నాకు ఇష్టం వుండదు" అంది శక్తిమతి.

"రెండుసార్లు కలిసాం... ఇంకా అపరిచితులమేనా?" అడిగాడు.

"నేను మిమ్మల్ని కలవాలని ప్రయత్నించనంతవరకూ అంతే!" అని శక్తి వెళ్ళిపోయింది.

అతనూ వెళ్ళిపోబోతుండగా వాచ్‌మన్ పెద్దకర్రతో పరిగెత్తుకొచ్చి "సార్... ఇటువైపు పెద్ద పామువచ్చి లంచ్‌రూమ్‌లోకి వెళ్ళడం ప్యూన్ చూశాడుట. లోపలికి ఎవరైనా వెళ్ళారా?" అని ఆదుర్దాగా అడిగాడు.

ఇంద్రనీల్ జవాబిచ్చేలోగానే లోపల్నుంచి శక్తి "కె...వ్వు..." మన్న కేక వేసింది.

"అయిపోయింది. అసలే తాచుపాము కూడానట" అన్నాడు ప్యూన్.

ఈలోగా మిగతా స్టాఫ్ అంతా వచ్చి అక్కడ గుమిగూడారు.

"ఇప్పుడేం చెయ్యడం?" ఒకావిడ భయంగా అడిగింది.

"ఈపాటికి కాటేసి వుంటుందా?" ఒకాయన అడిగాడు.

"చూసొచ్చి చెప్తాను" అంటూ ఇంద్రనీల్ రూమ్‌తలుపు నెమ్మదిగా తోశాడు.

అది తెరుచుకుంది. శక్తి పాదాలకి రెండు అడుగుల దూరంలో పడగవిప్పి... కాటెయ్యడానికి సిద్ధంగా వున్నట్లు చూస్తోంది తాచుపాము!

తలుపు తెరుచుకున్న శబ్దానికి కళ్ళుమాత్రం త్రిప్పి ఇంద్రనీల్‌ని చూసింది శక్తి.



అతను చటుక్కున వంగి పాము పీకదగ్గర పట్టుకుని బయటికి తీసుకొచ్చాడు. అది అతనిచేతిలో తల అటూయిటూ తిప్పటానికి ప్రయత్నిస్తోంది. దాన్ని తీసుకెళ్ళి ఓ రాయికేసి కొట్టాడు. గాయపడిన దాన్ని కింద వదిలేస్తే వాచ్‌మెన్ వచ్చి కర్రతో కొట్టి చంపేశాడు.

అందరూ అతనిచుట్టూ చేరి అభినందిస్తూ, అతని ధైర్యాన్ని పొగుడుతున్నారు.

శక్తి కొద్దిగా షాక్‌నుంచి తేరుకుని చుట్టుపక్కలవాళ్ళ ప్రశ్నలకి జవాబిస్తూనే అతనికోసం వెతికింది.

అతను జనంమధ్య వున్నాడు. అతనికి కృతజ్ఞతలు చెప్పుకోవటానికి అందర్నీ తప్పించుకొని అతనివైపు వెళ్ళింది.

ఆ సంఘటన జరిగిన నాలుగుగంటల తరువాత... శక్తి ఇంద్రనీల్ ఎదురుగా కూర్చుని వుండగా అతను బెడ్‌మీద నీరసంగా పడుకుని ఆమెవైపు చూసి నవ్వాడు.

అదొక ప్రైవేట్ నర్సింగ్‌హోమ్!

"ఈ డాక్టర్ నాకు ప్రాణస్నేహితురాలవటంవల్లా, మీ ఒంట్లోకి విషం పూర్తిగా ఎక్కకపోవడం వల్లా మీరు బతికారు. ఎందుకంత రిస్క్ తీసుకున్నారు?" కొద్దిగా వణుకుతున్న గొంతుతో అంది శక్తి. అతని ముంజేతిమీద పాము కాటు వెయ్యడంతో అక్కడ కొద్దిగా కట్‌చేసి, స్టిచెస్ వేయాల్సొచ్చింది.

అతను నవ్వి "అక్కడ మీరు కాకుండా యింకో పుల్లమ్మ వున్నా అలాగే చేసేవాడ్ని" అన్నాడు.

"పుల్లయ్య అయితే?" కొంటెగా అడిగింది.

"అలాగే చేసేవాణ్ని" అన్నాడు.

ఆమె కళ్ళల్లో అల్లరిస్థానే ఆసక్తి చోటుచేసుకుంది.

"రిస్క్ అంటే సరదానా?" అడిగింది.

"సరదా కాదు. ఒకప్పుడు అవసరంగా వుండేది. పదేళ్ళవయసులో వున్నప్పుడు బన్‌రొట్టెకోసం భూమికి ముప్ఫై అడుగుల ఎత్తులో తాడుమీద నడిచాను. ఆ చివర్నుంచి ఈ చివరికి నడిస్తే బన్‌రొట్టె ఇస్తానని

గారడీవాడు ఆశ పెట్టాడు. కడుపులో ఆకలి కరకరమంటోంది. కళ్ళల్లో రొట్టెతప్ప ఇంకేం కనపడటం లేదు. ఏకాగ్రతంతా కాళ్ళల్లోకి తెచ్చుకుని నడిచాను" అన్నాడు.

"ప్రాక్టీస్ లేకుండానే!" ఆమె ఆశ్చర్యంగా అడిగింది.

"ఆ... ఇంకోసారి అలా చెయ్యబోయి కిందపడి కాలు ఫ్రాక్చర్ చేసుకున్నాను. ఇప్పటికీ కాస్త ఒంకరగా వుంటుంది చూడండి" కాలివైపు చూపిస్తూ అన్నాడు.

ఈసారి ఆమె జాలిగా చూస్తూ "మీకు అమ్మా నాన్నా లేరా?" అంది.

"వాళ్ళు లేకుండా నేనెలా పుట్టాను? కుండలోంచీ, చేపలోంచీ పుట్టాననుకుంటున్నారా?" అంటూ పెద్దగా నవ్వేశాడు.

శక్తి అలా అడిగినందుకు సిగ్గుపడి తలవంచుకుంది.

"మీరిలా అడగగానే విచారంగా మొహంపెట్టి, వెనుకనుంచి విషాదగీతం వినిపిస్తుండగా అదో పెద్దకథ...! నేను పడ్డకష్టాలు అన్నీ ఇన్నీ కావు అని మొదలుపెట్టాలి. కానీ నాకు అలా చెప్పడం అలవాటు లేదు. ఎదుటివాళ్ళ సమస్యలు విని సలహాలివ్వడం మాత్రమే అలవాటు" అన్నాడు.

"మీలాంటివారు చాలా తక్కువమంది వుంటారు" అంది.

"అంటే ప్రపంచంలో మీకు ఎక్కువమంది తెలియరన్నమాట" అన్నాడు.

నర్స్ వచ్చి టెంపరేచర్, బీపీ చెక్ చేసింది.

"ఈ రాత్రికి ఆయనకి డైట్ ఏం ఇవ్వకండి. నిద్రపోకుండా చూడండి" అని నర్స్ వెళ్ళిపోయింది.

అతను శక్తివైపు చూసి "మీరింక యింటికి వెళ్ళండి. యింట్లోవాళ్ళు కంగారుపడవచ్చు" అన్నాడు.

ఆమె నవ్వుతూ "ఇంకా అపరిచితుల్లా వుండటం నాకు యిష్టం లేదు. నా పేరు శక్తిమతి" అంది.

అతను ఆశ్చర్యం దాచుకోకుండా "శక్తిమతి...!" అన్నాడు.

ఆమె కాళ్ళు బెంచీమీద పెట్టుకొని సర్దుకు కూర్చుంటూ "మీకూ... నాకూ కాలక్షేపం కావడానికి మా కుటుంబం గురించి చెప్పాలనుకుంటున్నాను. వినే ఓపికుందా?" అని అడిగింది.



అతను చెప్పమన్నట్లు తల ఆడించాడు.

"మా నాన్న ప్రభుత్వోద్యోగిగా ఓమాత్రం మంచి కేడర్‌లోనే రిటైర్ అయ్యారు. మా అమ్మ నా చిన్నప్పుడే పోయింది. నాన్న ముగ్గురు ఆడపిల్లలకీ ఏ లోటూ రాకుండా పెంచారు. అక్కలిద్దరికీ అరుంధతీ, సుమతీ అన్న పురాణ కాలంలో పతివ్రతల పేర్లుపెట్టి నాకుమాత్రం కాస్త తెలివితెచ్చుకుని శక్తిమతి అని పేరుపెట్టినట్లున్నారు.

మా పెద్దక్క చిన్న వయసులోనే చాలా పెద్దతనం మీదేసుకుని ఆరిందాలా అన్నిపనులూ చేస్తూ చదువుసంగతి మర్చిపోయింది. దాంతో ఎస్.ఎస్.సి. తర్వాత బండి ముందుకెళ్ళలేదు. లంగా, ఓణీలేసుకునే సరికి ఆడపిల్ల చాలా అమాయకంగా ఆలోచిస్తుంది. అందుకేనేమో ఇప్పటి ఆడపిల్లలెవరూ వాటి జోలికే పోవడం లేదు.

చదువు ఆగిపోవడంతో దానికి నవల్స్ చదవడానికీ, ఊహల్లో బతకడానికీ బోలెడు తీరిక చిక్కింది. వాటివల్ల అందిన పరిజ్ఞానమూ, తీరికలతో ఎదురింట్లో అద్దెకు దిగిన ఓ బెంగాలీ కుర్రాడికి మనసిచ్చేసింది. ఆ సంగతి ఆ కుర్రాడికి తెలీదు. ఇదిమాత్రం నెత్తిమీంచి కొంగేసుకుని కొంగుచివర తాళం చెవులగుత్తి కట్టుకోవటంవరకూ ప్రాక్టీసు చేసింది. ఎప్పుడూ చేతిలో 'బడదీదీ' నో, 'దేవదాసో' పట్టుకుని చదువుతుండేది. అతను కాలేజీకి వెళ్ళే టైమూ, వచ్చే టైమూ దీనికి తెలుసు. ఠంచనుగా తయారయ్యి గేట్లో నిల్చుని వుండేది. ఓ సారి నూటమూడు డిగ్రీల జ్వరం వచ్చింది. అయినా అంత నీరసంలోనూ జడేసుకుని, పౌడర్ రాసుకుని గేటులో నిల్చుంది. దాంతో మా చిన్నక్కకి అనుమానం వచ్చింది. వాళ్ళిద్దరూ నన్ను దూరంగా నెట్టి... మంచంమీద పడుకుని గుసగుసలాడుకునేవారు. వాళ్ళ మాటల్లో నాకు "ప్రేమ నిజాయితీనే కోరుతుంది. కులమత భాషా బేధాలు లేవు..." లాంటి మాటలు వినిస్తుండేవి.

ఆ బెంగాలీ కుర్రాడి పేరు కమల్ అనుకుంటా. వాళ్ల అమ్మ 'కొమల్' అని నోటినిండా తాంబూలం వేసుకుని పిలుస్తుండేది. క్రమం తప్పకుండా చేపలు బేరంచేసి కొనేది. ఓరోజు ఆవిడ మార్కెట్‌నుండి వస్తూవుంటే మా పెద్దక్క ఎదురుపడిందట. ఆవిడ్ని పరిచయం చేసుకుని ఆవిడ చేతిలోని బరువైన బుట్ట ఇంటిదాకా మోసుకొచ్చింది. ఆరోజు రాత్రి

చిన్నక్క చెవిలో ఆవిడ తనపేరు 'అరుంధతి' అని తెలుసుకుని ఎంత మెచ్చుకున్నదీ, తన జడవైపు ఎంతసేపు చూసిందీ తెగ చెప్పి మురిసి పోయింది.

ఇంకోరోజు పక్కింటికి మేం పేరంటానికి వెళితే కమల్ వాళ్ళ అమ్మకూడా వచ్చింది. పెద్దక్క ఆవిడ్ని చూడగానే లేచి నిలబడింది. అందరూ ఎంత కూర్చోమన్నా వినలేదు. నాకు అప్పట్లోనే దాని ఫూలిష్‌నెస్ అర్థమై నవ్వొస్తుండేది.

ఇంటికొచ్చాక చిన్నక్కతో "నేను మానసికంగా ఆవిడ్ని అత్తగారిగా అంగీకరించాననడానికి ఇంతకన్నా నిదర్శనమేమిటి" అంది.

చిన్నక్క అది చెప్పేవన్నీ ఓపిగ్గా వినేది. ఇద్దరూ తెల్లారుఝామునే లేచి బాయిలర్ అంటించే నెపంతో అక్కడ ఓ గంట గుసగుసలాడేవారు.

ఉగాది పండగరోజున ఇది పులిహోర తీసుకెళ్ళి వాళ్ళకి యిచ్చింది. "ఖట్టా ఖానా బహుత్ అచ్ఛాహై" అన్నాడు మా కమల్ అని ఆవిడ చెప్పగానే ఆరోజు ఇది ఆనందం పట్టలేక గుడికెళ్ళి నూట ఎనిమిది ప్రదక్షిణాలు చేసింది.

పులిహోర పంపించిన డిష్‌లో ఆవిడ ఏదో వంటకం పెట్టి పంపించింది. దానివాసన చూసి నేనూ, చిన్నక్కా దూరంగా నెట్టేశాము. పెద్దక్కమాత్రం "జన్మంతా ఆ వంటలు తినాల్సిన దాన్నేగా!" అంటూ మొత్తం తిని మర్నాడంతా వాంతులు చేసుకుంధి.

అందం సంగతొస్తే కమల్ అందం, తెలివితేటల సంగతొస్తే అతని తెలివీ... ఇలా మా చెవుల్ని అది అదరగొట్టి చంపుకుతినేది. ఇది ఇంతగా పొగిడే ఆ కమల్ ఇంటర్‌లో ఓ సబ్జెక్ట్ ఫెయిలయ్యాడు. ఆరోజు వాళ్ళ నాన్నగారు షటిల్‌బ్యాట్‌తో కొడితే అతని అరుపులు మా యింటివరకూ వినిపించాయి. మర్నాడు అతని నుదుటిమీద పట్టీ కనిపించింది.

ఓ గంటకల్లా మా పెద్దక్క బావి దగ్గర జారిపడింది. బాగా రక్తం కారింది. నాన్నగారు డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళారు. దాని నుదుటికి కూడా పట్టీ వచ్చింది.

దాన్ని చూస్తే జాలికన్నా కోపం ఎక్కువగా వచ్చిన నేను "నీకేమైనా పిచ్చెక్కిందా?" అని అరిచాను. నల్లని చీర కట్టుకుని తులసికోటకి



ఆనుకుని కూర్చుని విరక్తిగా "ప్రేమా, పిచ్చీ ఒకటే... నీకిప్పుడు అర్థంకాదులే!" అంది.

అనుకోకుండా ఒక మధ్యాహ్నసమయంలో కమల్ మా ఇంటి కొచ్చాడు.

అప్పుడే నేను నేలమీద, ముందుకు వంగి కూర్చుని బోటనీ రికార్డులో బొమ్మలేసుకుంటున్నాను.

చిన్నక్క రేడియోలో చిత్రసీమ వింటూ ముగ్గులపుస్తకం చూస్తోంది. పెద్దక్కమాత్రం నాన్నగారి గదిలో బూజు దులుపుతోంది.

అతను మొహమాటంగా తలుపుదగ్గర ఆగి "శక్తీ..." అని నన్ను పిలిచాడు. అతనికి నాపేరుమాత్రమే తెలుసుంటుంది. ఎందుకంటే నాకోసం సాయంత్రం అయ్యేసరికి ఓ డజనుమంది అమ్మాయిలు "శక్తీ! ఆడుకోడానికి రా..." అని పిలుస్తూ అరుగుమీద చేరేవారు.

నేను అతణ్ణి చూసి "ఏమిటీ?" అన్నాను.

చిన్నక్క గబుక్కున లేచి లోపలికి పరిగెత్తింది. ఈ వార్త పెద్దక్కకి చెప్పడాని కేమో!

అతను తడబడుతూ "బాబీ... తాళం యిచ్చిందా మా మమ్మీ?" అన్నాడు.

"ఏమో? మా అక్కని అడుగు" అన్నాను.

ఇంతలో పెద్దక్క లోపల్నుంచి పరుగులాంటి నడకతో వచ్చింది. దాని తలనిండా బూజూ, మొహంనిండా చెమటా... కళ్ళల్లోమాత్రం చెప్ప లేనంత మెరుపు!

"తాళం చెవి కోసం" అన్నాడు కమల్.

మా పెద్దక్క చిన్నక్కచెవిలో ఏదో చెప్పి హడావుడిగా లోపలికి వెళ్ళింది.

చిన్నక్క నాన్నగారి ఫేముకుర్చీ తెచ్చి వేసి అందులో మెత్తవేసి "కూర్చోండి" అంది.

అతను మొహమాటంగానూ, ఇబ్బందిగానూ చూశాడు.

జరుగుతున్న డ్రామాలో అతని వేషం ఏమిటో నిజంగా అతనికి తెలీదు పాపం! ముగ్గురు ఆడపిల్లలు ఒక్కసారిగా ఎదురుపడేసరికి చాలా కంగారు పడిపోయినట్లున్నాడు.

చిన్నక్క నాతో "వెళ్ళి టీ తీసుకురా!" అని పురమాయించింది.

"నే వెళ్ళను" అన్నాను. ఇంకా వేసుకోవలసిన బొమ్మలు నాకు చాలా వున్నాయి.

అది కళ్ళతో మందలిస్తూ "అక్క పిలుస్తోంది. వెళ్ళు" అంది.

విధిలేక లేచి వెళ్ళాను.

కమల్‌కి ఏం చెయ్యాలో తోచక టీపాయ్‌మీదున్న బట్టను వేళ్ళతో సవరించసాగాడు.

నేను లోపలికి వెళ్ళేసరికి పెద్దక్క జరీ బుటా వున్న చందేరీచీర కట్టుకుని తల దువ్వుకుంటూ కనిపించింది. నాకు చిర్రెత్తుకొచ్చింది.

"ఇప్పుడీ ముస్తాబెందుకూ? టీ పెట్టానన్నావు... ఏదీ?" అని అరిచాను.

అది నా నోటిమీద తన చేతిని వేసి గట్టిగా మూసి "పద... యిస్తాను" అంది.

"నువ్వే తీసుకెళ్ళి ఇయ్యి" అని నేను వెళ్ళిపోయాను.

అది టీ తీసుకుని ముందుగదిలోకి వచ్చేసరికి "కమల్... కమల్" అని పిలుస్తూ వాళ్ళమ్మ వాకిట్లోకి వచ్చింది.

అతను ఒక్క వుదుటున కుర్చీలోంచి లేచి వాళ్ళమ్మ దగ్గరకి వెళ్ళాడు. సింగారించుకుని వచ్చిన అక్కవైపు చూడనేలేదు. అంతలోనే వెనక్కి తిరిగి చేతిలోని లేసుకుట్టిన బట్ట తీసుకొచ్చి అక్కడ పెట్టెయ్యబోయాడు.

పెద్దక్క ముందుకెళ్ళి "అది మీరే వుంచుకోండి... ప్లీజ్" అని మళ్ళీ అతనిచేతికి అందించేసింది.

అతను విచిత్రంగా చూసి దాన్ని తీసుకుని వెళ్ళిపోయాడు.

వెళ్ళిపోతున్న అతణ్ని అక్క కన్నీళ్ళతో చూస్తూ నిలబడిపోయింది.

చిన్నక్క దాన్ని దగ్గరకు తీసుకుని ఓదారుస్తూంటే నేను టీ తాగుతూ వాళ్ళ పిచ్చితనానికి నవ్వుకున్నాను.

కానీ ఆ సంఘటన పెద్దక్క మనసులో చాలా అపురూపంగా ముద్రించుకు పోతుందని అస్సలు అనుకోలేదు.

కమల్ కూర్చున్న కుర్చీ, అంటుకున్న టీపాయీ రోజూ నీట్‌గా తుడిచేది. మమ్మల్ని ఎవర్నీ కూర్చోనిచ్చేది కాదు! అది అప్పుడప్పుడూ కుర్చీలో కూర్చుని కలల్లోకి వెళ్ళేది.



అలాంటి అలౌకికమైన ప్రేమస్థితిలో అది వుండగా మా సుందరం మావయ్య దానికో సంబంధం తెచ్చాడు. నాన్నగారితో ఆయన వరుడి వివరాలు చెబుతుంటే మేం అందరం చాటునుంచి చెవులు రిక్కించి విన్నాం.

ఆ రాత్రి పెద్దక్క పెరట్లో కూర్చుని వెక్కివెక్కి ఏడుస్తుంటే చిన్నక్క "పోనీ కమల్‌ని ప్రేమించావని నాన్నతో చెప్పేద్దాం" అంది.

"ముందు అతనికి చెప్పాలిగా?" అంది అక్క.

అదీ పాయింటేగా మరి! అసలు ప్రేమ అనేది ఇప్పటివరకూ ఏకపక్షం గానే జరిగింది. ఇద్దరూ మంతనాలాడుకుని మరునాడు అది కమల్‌ని కలిసి ప్రేమలేఖ ఇచ్చేవిధంగా నిర్ణయించుకున్నారు.

నాకిదంతా గొప్ప తమాషాగా అనిపించి మర్నాటికోసం ఎదురుచూస్తూ గడిపాను.

మర్నాడు మేం నిద్ర లేచేసరికి నాన్న ఎవరితోనో మాట్లాడుతూ వుండటం వినిపించింది. నేను లేచి చిన్నక్కవైపు 'ఎవరు' అన్నట్లుగా చూశాను. అదీ తెలీదని సైగ చేసింది.

ఇద్దరం కలిసి ముందు గదిలోకి వెళ్ళాం. అక్కడ కమల్ వాళ్ళ నాన్న కనిపించాడు.

'ఇది అప్పుడే ఎప్పుడువెళ్ళి వాళ్ళతో సంగతి చెప్పేసిందబ్బా!' అనుకున్నాను.

నాన్నగారు ఆయనతో "చాలా సంతోషం... మీ అబ్బాయికూడా ఈ కాలం కుర్రాళ్ళలా కాదు. ఎన్నడూ ఆడపిల్లలున్న ఇల్లని కన్నెత్తి చూసిన పాపాన పోలేదు..." అంటున్నారు.

అప్పుడే సంబంధం నిశ్చయం అయిపోయిందా? అనుకుంటూ పెద్దక్క కోసం వెతికాను. అది వంటింట్లో కూర్చుని వెక్కివెక్కి ఏడుస్తోంది.

"ఎందుకే ఆ ఏడుపూ? ఏమైంది? నాన్నగారు కూడా వాళ్ళతో మంచిగా మాట్లాడుతున్నారు. కమల్‌ని పొగిడారు కూడా!" అన్నాను.

అది వెక్కిళ్ళమధ్య "వాళ్ళు ఇల్లు ఖాళీ చేసి కలకత్తా వెళ్ళిపోతున్నారుట" అంది.

"ఆ...!!" నేనూ, చిన్నక్కా నోళ్ళు తెరిచేశాం.

చిన్నక్క రంగంలోకి దూకుతూ "ఏం సమయం మించిపోలేదు. వెళ్ళి అతనికి ఉత్తరం యిచ్చేసిరా... బయల్దేరు... ఊ!" అని తొందరపెట్టింది.

పెద్దక్క కళ్ళు తుడుచుకుని నావైపు చూసి "నువ్వూ తోడు రావే"అంది.

"సరే!" అని నేనూ దానితో వెళ్ళాను.

మేం వెళ్ళేటప్పటికే సామాన్లతో రెడీగావున్న వ్యాన్ కదుల్తోంది.

కమల్ డ్రైవర్‌పక్కనే కూర్చుని వున్నాడు.

"అరుంధతీ... వెళ్ళొస్తా" అంది వాళ్ళమ్మ.

అక్క కమల్‌వైపు ఆర్తిగా చూసింది. ఆ చూపుని ఆర్తి అంటారని నాకు తర్వాత తనే చెప్పింది. కమల్ మమ్మల్ని చూసి నవ్వి చెయ్యి వూపాడు.

వ్యాన్ స్టార్ట్ అయిపోయింది.

అక్క చేతిలో ఉత్తరం అలాగే రెపరెపలాడుతూ వుండిపోయింది.

పిచ్చివాడు, అతనికి తెలియదు అక్క హృదయం ఎంతగా ఛిద్రం చేసిపోతున్నాడో. డ్రైవర్‌తో కబుర్లు చెబుతూ వెళ్ళిపోయాడు.

అక్క పిచ్చిగా వాళ్ళు ఖాళీచేసిన ఇంటిమెట్లమీద కూర్చుండిపోయింది. ఆ పక్కనే వాళ్లు పారేసిన చెత్తంతా గుట్టలా పడివుంది. అందులో అక్క స్వయంగా లేసుకుట్టిన తెల్లబట్ట! ఆరోజు కమల్‌కి ఇచ్చినది కూడా మసిబారి పడి వుంది.

అది చూడలేదు. దుఃఖంలో వుంది. నేను నెమ్మదిగా ఆ బట్టని పట్టుకెళ్ళి బావిలో పారేసి చేతులు దులుపుకున్నాను.

దాని దగ్గరకొచ్చి "పద... వెళ్దాం" అన్నాను.

మొదటిసారిగా దాన్ని చూస్తే చాలా జాలేసింది.

అది నా కడుపులో తలపెట్టుకుని కుమిలి కుమిలి ఏడ్చింది. అది పిచ్చి అనాలో... అమాయకత్వం అనాలో నాకు అర్థంకాలేదు.

ఆ ఉత్తరాన్ని అది పదిలంగా దాచుకుంది. అదే జీవితంలో అది చేసిన పెద్ద పొరపాటు.

వరుసగా కొన్నిరాత్రులు అది నిద్రపోలేదు. అతను కాలేజీకి వెళ్ళేటైంకీ, వచ్చే టైంకీ గుమ్మంలోకి వెళ్ళి నిలబడేది. ఎక్కడ సైకిల్ బెల్ మోగినా



లేచెళ్ళి ఆశగా చూసేది. అతను ఒక నిముషంపాటు కూర్చున్న కుర్చీని తడుముతూ కన్నీళ్ళు పెట్టుకునేది. అది పిచ్చిదైపోతుందేమోనని నాకు భయంవేసేది. బాగా చిక్కిపోయింది కూడానూ!

ఆ సమయంలో సుందరం మావయ్య తీసుకొచ్చిన పెళ్ళికొడుకు వచ్చి దాన్ని చూసుకున్నాడు.

"ఒకరికి మనసిచ్చి వేరొకరిచేత ఎలా తాళి కట్టించుకోనూ..." అని అక్క గన్నేరుపప్పు నూరుకు తినబోయింది. సమయానికి మా చిన్నక్క చూసి దాన్ని ఆపింది. అప్పట్నుంచీ మేం అందరం దాన్ని వేయికళ్ళతో కాపాడుతూ వచ్చాం.

లక్షన్నర కట్నంతో దాని పెళ్ళి సెటిలైపోయింది. పెళ్ళికొడుకు రైల్వేలో ఆఫీసర్.

అక్క ప్రతిఘటిస్తుందనుకొన్నాను. కాని నిర్లిప్తంగా చూసి "కమల్ కాకపోయినా నాకు ఎవరైనా ఒకటే... అతణ్ని తలుచుకుంటూ ఇతనితో గడిపేస్తాను" అంది.

అది కమల్‌ని ప్రేమించిందో లేక ప్రేమించాననే భావనని ప్రేమించిందో నాకు ఇప్పటికీ అర్థంకాలేదు.

వేసవి సెలవుల్లో దానిపెళ్ళి నిశ్చయం అయింది. దానికి కాబోయే భర్తపేరు శంకర్.

నేను బాగా ఆశ్చర్యపోయిన విషయం ఏమిటంటే అది తాంబూలాలు పుచ్చుకున్న రోజున గుడిలో శంకర్ పేరుమీద అర్చన చేయించడం!

ఈలోగా నాకు ఇంకో విషయం తెలిసి ఇంకా ఆశ్చర్యపోయాను.

మా సుమతక్క కూడా మెడలోతు ప్రేమలో కూరుకుపోయి వుంది. అది రోజూ టైప్ నేర్చుకోవడానికి వెళ్ళే ఇన్‌స్ట్రక్టర్‌తో.

ఇది పెద్దక్కలా మూగప్రేమ కాదు. ఇంకాస్త ముందుకెళ్ళి అతనితో సినిమాహాల్లో నాన్న కంటపడింది.

ఆరోజు నాన్న చిన్నక్క ఇంటికొచ్చాక పిలిచి "అతనెవరు?" అని అడిగాడు.

అది అబద్ధం చెప్పలేదు. "నేనూ, అతనూ ప్రేమించుకున్నాం నాన్నా..." అంది.

"ప్రేమించుకుని ఊరుకుంటారా? లేక పెళ్ళికూడా చేసుకుంటారా?" అని అడిగారు.

నేను ఆ ప్రశ్నకి విస్తుబోయాను. కానీ నాన్న ఎంత లోకానుభవంతో అడిగారో తర్వాత తెలిసింది.

చిన్నక్క ధైర్యంగా నాన్నముందు నిలబడి అతని మంచితనంగురించీ, చదువుసంధ్యలగురించీ చెప్పింది.

"అసలైనవి మర్చిపోయావు! అతని కులం, అంతస్థూ, తల్లిదండ్రుల గురించీ..." అన్నారు నాన్న.

అది చెప్పింది. అతను మా కులంకాదు. అతని తండ్రి చాలా ఆస్తిపరుడు. ఇతనికేం వుద్యోగం లేదు.

నాన్న అతణ్ని కలిసి తను మాట్లాడి పెద్దవాళ్ళని కలిసేవరకూ దాన్ని అతనితో తిరగవద్దని చెప్పారు. అందుకు అది అంగీకరించింది.

పెద్దక్క పెళ్ళిలో అతనితో నాన్న మాట్లాడారు. అతను బెదిరిపోయాడు. పెళ్ళివిషయం తన తండ్రితో మాట్లాడే ధైర్యం తనకి లేదన్నాడు. ఇంకా ముందుకెళ్ళి గుచ్చిగుచ్చి ప్రశ్నలేస్తే తనకి చిన్నప్పుడే కుదిరిన మేనరికం వుందన్నాడు.

"మరి మా అమ్మాయితో ఎందుకు తిరిగావు? అని నాన్న అడిగితే, "మీ అమ్మాయే నాతో తిరిగింది. పెళ్ళి చేసుకోమని అడుగుతుందని అనుకోలేదు" అన్నాడు.

నాన్న శాంతంగా "మీ పెద్దవాళ్ళతో మాట్లాడతాను. నీకు మా అమ్మాయిని చేసుకోవడం ఇష్టమేనా?' అని అడిగారు.

"మీ అమ్మాయంటే ఇష్టమే కానీ, మా నాన్న చంపేస్తాడు. చండశాసనుడు" అన్నాడు.

నాకు అప్పటికే అతని కేరక్టర్‌మీద విపరీతమైన అసహ్యం కలిగింది.

"మా అక్కతో సినిమాకెళ్ళినట్లు తెలిస్తే మీనాన్న చీల్చి చెండాడడా?" అని అడిగాను. అతను నేలచూపులు చూశాడు.

"నేను ఊరెళ్ళి ఏ సంగతీ ఉత్తరం రాస్తాను" అని జారుకున్నాడు.

పెద్దక్క పెళ్ళిలో అడుగడుగునా మగపెళ్ళివారి అలకలే! ఎంత చేసినా వారికి తృప్తిలేదు. టీ పంపిస్తే కాఫీ కావాలనీ, కాఫీ పంపిస్తే మజ్జిగ



కావాలనీ యాగీ చెయ్యడానికి ప్రత్యేకంగా ఓ మూకకి డబ్బిచ్చి తెచ్చుకున్నారేమో అనిపించింది. అలకపాన్పుమీద పెద్దబావ స్కూటర్‌కోసం మరో పదివేలు గుంజాడు. దాని అత్తగారూ, ఆడబిడ్డలూ వంతులవారీగా ఏడ్చి పెట్టుపోతలకని ఇంకో పాతికవేలుదాకా ఈడ్చారు.

నాకు పెద్దక్కని చూస్తే జాలేసింది.

డబ్బు అనేది అడుగున వుందని తెలిస్తే మునిసిపాలిటీ చెత్తవ్యాన్‌లో కూడా పీకలదాకా కూరుకుపోయి వెతుక్కునే ఈ రకాలతో ఇది జీవితాంతం ఎలా వేగుతుందా అనిపించింది.

పోట్లాటలతో, ఏడుపులతో సాగిన ఆ తంతు పెళ్ళిలా జరగలేదు. మొత్తం పూర్తయ్యేసరికి అందరి మొఖాలూ ఉబ్బి ఇంత లావున తయారయ్యాయి. అలిసిపోయిన ఆడపెళ్ళి వాళ్ళం ఎక్కడపడితే అక్కడ వాలిపోయాం. పడుకున్నది మిరపకాయల బస్తా పక్కనో, చింతపండు మూటమీదో కూడా తెలీడంలేదు. అటువంటి సమయంలో బావ అర్జెంట్‌గా శోభనం జరిపించెయ్యాలంటున్నాడని కబురొచ్చింది.

అక్క పాపం మంచినిద్రలో వుంది. దాన్ని లేపి తలంటుపోసి జడకుట్టాలని పెద్ద ముత్తయిదువెవరో గోలపెట్టింది. నాకైతే మేకపోతుని బలికి సిద్ధం చేస్తున్నట్లు అనిపించింది. దాన్ని లేపాలని గదిలోకి వెళ్ళిన నాకు అమాయకంగా బెంగాలీ నవలల్లో హీరోలాంటి వాడికోసం కలలుకన్న దాని మనసు గుర్తొచ్చింది. ఒక నిట్టూర్పు విడిచి దాన్ని నిద్రలేపి స్నానం చేయించాం. సగం నిద్రలోనే అది అలంకారాలు చేయించుకొని గదిలోకి వెళ్ళింది.

నేను ఎందుకైనా మంచిదని దానిగదికి దగ్గరగా పడుకున్నాను. అది అర్ధరాత్రి లేచి పరిగెత్తుకొచ్చేస్తుందని నాకెందుకో గాఢంగా అనిపించింది. లంకలో సీతని వదలి కాపలావున్న రాక్షసుల్లా అందరూ గురకలు పెట్టి నిద్రపోయారు.

నాకు నిద్రపడుతూ వుండగా నా పక్కన ఎవరో వచ్చి పడుకున్నట్లుగా అనిపించి "ఎవరూ?" అంటూ లేచి కూర్చున్నాను.

మా చిన్నక్క పడుకుని "నేనేలే!" అంది. అది ఎందుకో ఏడుస్తున్నట్లు నాకు అర్థమైంది. పెద్దక్కమీద బెంగేమో అనుకున్నాను. కాని అది వెక్కుతూ నా చెవిలో "కుమార్ నాకు ద్రోహం చేస్తాడంటావా?" అని అడిగింది.

"ద్రోహమంటే?" అన్నాను. ఒక మనిషి ఇంకో మనిషికి ఎలా ద్రోహం చెయ్యగలడో నా చిన్నమెదడుకి నిజంగా అర్థంకాలేదు. "అప్పుగా డబ్బేమైనా ఇచ్చావా?" అని అడిగాను.

అది గాఢంగా నిట్టూర్చి "అంతకన్నా విలువైందే యిచ్చాను" అని అంది.

నేను దానివైపు పైనుంచి కిందికి అనుమానంగా చూస్తూ "మెడలో గొలుసు కానీ చేతిగాజులు కానీ యిచ్చావా?" అన్నాను.

"ఛ! అదేంకాదు... అయినా నువ్వు చిన్నపిల్లవి నీకు అర్థంకాదులే.." అని నన్ను గట్టిగా కౌగలించుకుని ఏడ్చింది.

నేను దానిమీద చెయ్యేసి "అవేమీ ఇవ్వనప్పుడు నిన్ను నాన్నగారేం అనరు. నువ్వు ఏడవనవసరంలేదు" అన్నాను. అయినా అది కాసేపు ఏడ్చి పడుకుంది.

అది ఎందుకు ఏడ్చిందో కారణాలు వెతుకుతూ నేనూ జాగారం చేశాను.

తెల్లవారుఝామున "సుమతీ... సుమతీ...!" అన్న పెద్దక్క పిలుపు వినిపించి దిగ్గున లేచి కూర్చున్నాను.

పెద్దక్క హడావుడిగా వచ్చి "సుమతి ఏది?" అని అడిగింది.

నేను పక్కన పడుకున్న చిన్నక్కని చూపించాను. దాన్ని లేపి "సుమతీ..." అంటూ పట్టుకుని ఏడవటం మొదలుపెట్టింది.

నాకేం అర్థంకాలేదు. రాత్రి అది ఏడ్చింది. ఇప్పుడిది ఏడుస్తోంది.

"మీరు ఏడుపులాపి, అసలేం జరిగిందో చెప్పి ఏడవండి" అన్నాను.

పెద్దక్క చెప్పింది. అది గదిలోకి వెళ్ళాక బావ దాన్ని దగ్గరకు తీసుకుని సరసాలాడాడట. తన ముచ్చటలన్నీ తీరాక కబుర్లు మొదలుపెట్టి "అరుంధతీ! నువ్వు పెళ్ళికిముందు ఎవరినైనా ప్రేమించావా?" అని అడిగాడుట.

అక్క తెల్లబోయి చూసిందట.

"పర్లేదు. నిజంచెపితే నేనెంతో సంతోషిస్తాను. కట్టుకున్నవాడి దగ్గర దాపరికాలు వుండకూడదు. సర్వస్వం సమర్పించినట్లే అన్నీ విప్పి చెప్పాలి. ఊ... చెప్పాలి మరి..." అంటూ బలవంతం చేశాడుట.



మా అమాయకపు పక్షి నిజాయితీగా "నేను ఎదురింటి అబ్బాయిని ప్రేమించాను" అందట.

"మాట్లాడావా?" అడిగాడుట.

"ఆ... ఒక్కసారి" అందిట.

"మీ ఇంటికొచ్చాడా?" అన్నాడుట.

"ఆ... ఒక్కసారి" అందిట.

"అన్నీ ఒక్కసారే చేశాడా?" అడిగాడుట.

అది తలూపిందిట. అంతే దాన్ని లాగి చెంపమీద ఒక్కటిచ్చాడట.

ఇది బిత్తరపోతూ చూస్తే, "ఎంత ధైర్యమే... అన్నీ అయిపోయాక ఇదే మొదటిసారి అన్నట్టు అమాయకంగా గదిలోకి పాలగ్లాసు తీసుకుని వస్తావా? కులటా... పాతకీ..." అంటూ నోటికొచ్చినట్టల్లా తిట్టాడట.

"అయ్యో...! మాట్లాడాను అంతే! ఇంకేం జరగలేదు" అని యిది ఎంత చెప్పినా వినకుండా, "నాకు ఇందాక నువ్వు ఎదురు చెప్పకుండా అలవాటుగా నాతో వున్నప్పుడే అర్థమైంది నీకిది మొదటిసారి కాదని!" అని తనూ ఏడవడం మొదలుపెట్టాడట.

ఇలా తెల్లవార్లూ అది బతిమిలాడటం, అతను కొడుతూ తిడుతూ, హింసించడంతో గడిచిపోయిందట.

"సుమతీ! నువ్వుమాత్రం రేపు నీకు కుమార్‌తో పెళ్ళికాకుండా వేరొకడితో అయితే మాత్రం... ఆ సంగతి తను ఎంత బలవంతపెట్టినా చెప్పకు" అని చిన్నక్క చెయ్యి నెత్తిమీద పెట్టుకుని ప్రమాణం చేయించుకొంది.

శక్తిమతికి అక్కని కొట్టి బావ ఎందుకు ఏడుస్తున్నాడో చచ్చినా అర్థం కాలేదు. ఏడ్చే మొగవాణ్ణి చచ్చినా నమ్మకూడదు అనిమాత్రం అనిపించింది.

"మరెలా? రేపు నిన్ను తనతో తీసుకెళ్ళి ఏలుకుంటాడటా?" భయంగా అడిగింది చిన్నక్క.

నేను ఆవలిస్తూ, "ఇంకో పదివేలు ఎక్కువిస్తే మహారాజులా ఏలుకుంటాడు. కక్కుర్తి పక్షి" అన్నాను.

అదే నిజమైంది.

మర్నాడు నాన్నగారి ముందు బావ పంచాయితీపెట్టి అక్క శీలం గురించి నోటికొచ్చినట్టల్లా వాగాడు. నాన్న ఎంత నచ్చజెప్పినా వినలేదు. "మీ అమ్మాయి శీలవతి కాదు... నాకొద్దు.." అన్నాడు.

నాన్న కాళ్ళు పట్టుకున్నంత పనిచేసి ఇంకో ఇరవైవేలు ముట్టజెప్పేటట్టు ఒప్పందం చేసుకున్నాక, ఇష్టంలేనట్లుగా మొహంపెట్టి దానిని తనతో తీసుకెళ్ళాడు.

అక్కతోబాటు నేనూ వెళ్ళాను. ఆ ఇంట్లోకి అక్క గృహప్రవేశం చేస్తుంటే దానికేమోగాని నాకైతే చాలా ఏడుపొచ్చింది.

చాలా వాటాలున్న ఆ కాంపౌండులో గాలీ, వెలుతురూ సరిగ్గా రాని గూళ్ళంలాంటి రెండు గదుల కొంప అంది.

విశాలమైన ఇంట్లో పెరిగి వచ్చిన అక్క ఈ ఇంటిని తన ఇల్లుగా ఎలా భావించగలదూ! రేపట్నుంచి ఇక్కడ ఎలా మసలుతుందీ? అని బాధపడ్డాను. ఇంటిపేరునీ, ఇష్టాలనీ పుట్టింట్లోనే వదిలి ఆడపిల్ల కొత్త జీవితానికి అలవాటు పడాలన్నమాట. అంటే ఆడపిల్లకి రెండు జీవితాలు. వివాహపూర్వం జీవితానికి సమాధి కట్టి ఇంకో తనదికాని జీవితం కొత్త మనుషుల మధ్య కొత్త వాతావరణంలో ప్రారంభించాలి. పెళ్ళికి ముందు అమ్మాయిని తీసుకెళ్ళి 'ఇదిగో ఇది నువ్వు నివసించబోయే ఇల్లు... వీళ్ళు ఈ ఇంట్లో నీతో వుండే మనుషులు... నీకు నచ్చారా? ఇష్టమేనా?' అని అడగడానికి ఏర్పాటు చేయాల్సిన పెళ్ళిచూపులు మనవాళ్లు తప్పుగా ఆడపిల్ల ఇంట్లో ఏర్పాటు చేస్తున్నారు.

సంతకి తీసుకెళ్ళి పశువుని అమ్మేసి వస్తున్న ఫీలింగ్‌తో నేను నాన్నతో కలిసి మరునాడు ఇంటికి వచ్చాను.

నాన్న ఇంటిని అమ్మక తప్పని పరిస్థితి వచ్చింది. అమ్మేసి వచ్చిన డబ్బుని చిన్నక్కకీ, నాకూ పెళ్ళిళ్ళు చెయ్యడానికి బ్యాంక్‌లో వేశారు.

అక్కడే నాన్న పప్పులో కాలేశారు!

పెద్దక్క పెళ్ళికీ, చిన్నక్క పెళ్ళికీ మధ్యనున్న గ్యాప్‌లో ధరలు రెండుసార్లు పెరిగాయి. గ్యాస్‌ధరా, ఉల్లిపాయల ధరా, పెట్రోలు ధరతోపాటు



పెళ్ళికొడుకుల ధరకూడా పెరిగిపోయింది. అది తెలీని పిచ్చినాన్న మా ఇద్దరికీ చెరో లక్షన్నరా కట్నాలివ్వడానికి చాలనుకున్నాడు.

కుమార్ చిన్నక్కకి ఓ ఉత్తరం రాశాడు. అందులో 'సుమతీ... నిన్ను నేను మనస్ఫూర్తిగా ప్రేమించాను. ఎప్పటికీ ప్రేమిస్తూనే వుంటాను. కానీ పెళ్ళిచేసుకోలేను. మా నాన్న మేనరికం చేసుకోకపోతే ఆస్తిలో చిల్లిగవ్వకూడా ఇవ్వనన్నాడు. ఆస్థి లేకపోతే ఎలా? నాకు ఉద్యోగంకూడా లేదు కదా... అందుకే నన్ను మరిచిపో. ఎప్పటికీ మానసికంగా నీవాడు... కుమార్' అని వుంది.

సుమతక్క ఏడుస్తుందని అనుకొన్నాను కానీ అది ఏడవలేదు.

"సినిమాల్లో హీరోలు 'నాకు బ్లడ్‌కాన్సర్! నన్ను మర్చిపో లతా'లాంటి నిజాలు చెప్తుంటారు. అలాగే తనకు డబ్బు రోగం వుంది అని పెళ్ళికి ముందే చెప్పిన వీడూ మంచివాడేలే!" అని నేను వూరడించాను.

మంచిరోజు చూసి చిన్నక్క ప్రేమలేఖలన్నీ శుభ్రంగా తగులబెట్టేసి తలస్నానం చేసేసింది. నాన్న కుమార్ ప్రసక్తి తీసుకొస్తే-

"పదోరోజుకూడా అయిపోయింది. ఇక అతడ్ని మర్చిపోవడమే మంచిది నాన్నా! మీ ఇష్టమొచ్చిన సంబంధం చూడండి" అంది.

పెద్దక్క తిన్న దెబ్బవల్ల చిన్నక్కకి మెచ్యూరిటీ వచ్చింది. వాళ్ళిద్దర్నీ చూశాక నాకు వైరాగ్యం వచ్చింది. మెచ్యూరిటీకి అది పరాకాష్ఠ అనుకుంట!

నాన్న చిన్నక్కకి సంబంధాలు చూడటానికి వేట మొదలుపెట్టాడు.

పెద్దక్క కాపురం విషయానికొస్తే ఆ ఇంటిని లంకతో పోల్చటం పాపం! లంకా పట్టణం ఎంతో సుందరంగా వుండేదట. వీళ్ళ ఇల్లుమాత్రం రాక్షసులలాంటి మనుషులతో నిండిన నరకకూపంలా వుంటుంది. అత్తగారొక బ్రహ్మరాక్షసి. ఊళ్లోనే వున్న నలుగురు ఆడబిడ్డలూ మార్చి మార్చి వచ్చి దీనిచేత చాకిరీ చేయించుకొని ఆనందిస్తుంటారట. మా అక్కా బావా పడుకొనే గదికీ, అత్తగారు పడుకునే గదికీ మధ్యనున్న కర్టెన్ కిందికి వేయగానే వాళ్ళ అత్తగారికి బీపీ పెరిగిపోయి "నే చచ్చిపోతున్నానోయ్" అంటూ అరిచి గోల చేస్తుందట. ఆ కర్టెన్ ఎప్పుడూ పైకి ఎత్తిపెట్టే వుండాలట.

ఇంక బావగారి విషయానికొస్తే ఆయన మాటకిముందు "నేను ఆఫీసర్ని" అని చెప్పి ఆ తర్వాత ఇంకోమాట చెప్తాడు. కాఫీ బాలేక పోయినా, అక్క లేటుగా మంచినీళ్ళు అందించినా "నా గురించి ఏమను కుంటున్నావే? పైగా ఆఫీసర్ని. అయినా నువ్వు లెక్క చెయ్యడంలేదు. ఎంత పొగరూ?" అంటూ దాన్ని చేతిలో ఏది వుంటే అదిపెట్టి కొట్టేవాడట.

పెద్దక్క పరిస్థితి ఆలోచిస్తే గుండె బరువెక్కిపోతుంది. వయసులో వున్న ఆడబిడ్డ కొడుకులు ఎప్పుడూ ఇక్కడే వుంటారు. వాళ్ళకి అండర్‌వేర్‌ల దగ్గర్నుంచీ అన్నీ అక్కే ఉతకాలి. బావ వాళ్ళముందే అక్కతో సరసాలాడే వాడు. అక్క ఏమైనా అంటే "పెద్ద పతివ్రతలా సిగ్గు నటించకు" అనేవాడు.

ఆ ఇంటి వాతావరణం చూస్తుంటే జైళ్ళలో ఆడఖైదీలు ఇంతకన్నా హాయిగా వుంటారేమో అనిపించేది.

ఇంటినిండా ప్లాట్‌ఫార్మ్‌లా వచ్చే జనం... పోయే జనం... తెర అడ్డంకూడా లేని కాపురం... పేవ్‌మెంట్‌మీద ముష్టివాళ్లటైప్‌లో! వాళ్ళ అత్తగారికి కాణీ ఖర్చులేని వినోదం.

అక్కని అప్పుడప్పుడూ పుట్టింటికి తీసుకొచ్చి మోపెడన్ని అభియోగాలు మోపేవాడు. నాన్న ముందే ఒక్కోసారి చెయ్యి చేసుకునేవాడు.

నాన్నని చూస్తే ఆడిపిల్లల్ని కనేవాడికి భూదేవంత సహనం అవసరం అనిపించేది.

ఉన్న ముచ్చట్లు సరిపోవు అన్నట్లు దానికి నెల తప్పింది. మళ్ళీ నాన్నకి బోలెడు ఖర్చు.

నేనుమాత్రం సంతోషించాను. అది ఈ వంకతో పుట్టింట్లో కొన్నాళ్ళు స్వేచ్ఛావాయువులు పీల్చుకోవచ్చని. కానీ వారంలోమూడురోజులు బావగారొచ్చి ఇక్కడకూడా దాన్ని సతాయించుకుని తినే ఛాన్స్ వుందని అప్పుడు ఆలోచించలేదు.

పెద్దక్కకి బాబు పుట్టాడు.

'అమ్మయ్య' అనుకొన్నాం. మా అమ్మపోలికొచ్చి అందర్నీ ఆడపిల్లల్నే కంటుందేమోనన్న అనుమానంతో వాళ్ళ అత్తగారు శాపనార్థాలు పెట్టే అవకాశం తప్పిపోయినందుకు.



చిన్నక్కకి ఈ హడావుడిలోనే పెళ్ళిచూపులు జరిగాయి. ఈయనగారు చాలా మోడ్రన్ అని ఫీలైపోతూ ఏదో హోటల్‌లో అరేంజ్ చేయమన్నాడు. నాన్న అలాగే చేశారు. దాన్ని తీసుకొని డేటింగ్‌టైప్‌లో ఒక రోజంతా వుంచుకుని సాయంత్రం తీసుకొచ్చి దింపి వెళ్ళిపోయాడు. రిజల్ట్స్ ఇంకా డిక్లేర్ చెయ్యలేదు.

ఓ సైకిల్ కొనాలన్నా ఇలా ఒక రోజంతా వాడుకుని 'బావుంటే కొనుక్కుంటాం' అంటే షాపువాడు తంతాడు. కానీ ఆడపిల్లతండ్రి వూరుకోవాలి.

ఓ మూడురోజుల తర్వాత వాళ్ళ తరుపు మధ్యవర్తి కట్నకానుకల వివరాలతో మా ఇంటికొస్తే సంబంధం నిశ్చయం అయిందని మా నాన్న సంతోషించారు.

ఈయనగారు పెద్దాయన కన్నా మూడాకులు ఎక్కువే చదివినట్లు మూడులక్షలు కట్నంగా అడిగాడు. ఏమీ చెయ్యలేక నాన్న ఒప్పుకున్నాడు.

వెంటనే పెద్దబావ అగ్గిమీద గుగ్గిలం అయి పెద్దక్కని చావదన్ని పుట్టింటికి తరిమేశాడు. కారణం చిన్నబావ 'క్లర్క్' మాత్రమేనట. ఆయనేమో ఆఫీసర్. అలాంటివాడికి తనకన్నా డబుల్ కట్నం ఇవ్వడం ఆయన సహించలేక పోయాడు.

ఈ ఉపద్రవం నాన్న ఊహించనిది. ఆడపిల్లల తండ్రులందరూ ఇలాంటి విషయాలపట్ల జాగరూకులై వుండాలి. ఇంకో అల్లుడు రాగానే పెద్దల్లుళ్ళకి తన పెళ్ళిలో వాడిన కాళ్ళు తుడుచుకునే పట్టానుంచి పట్టు ఉత్తరీయం వరకూ అన్ని విషయాల్లో కంపారిజన్ వచ్చేస్తుంది.

చిన్నక్క పెళ్ళిలో పెద్దబావకి బట్టలకనీ, దానికనీ వంకచెప్పి నాన్న ఇంకో పదివేలు ముట్టజెప్పి శాంతింపజేశాడు.

పెద్దక్క దృష్టిలో చిన్నక్క చాలా అదృష్టవంతురాలు. ఎందుకంటే దీనికి అత్తా, ఆడబిడ్డలు ఎవరూ లేరు. పెళ్ళవుతూనే వెడికాపురం పెట్టొచ్చు.

కానీ పెళ్ళిలో చిన్నబావ తిక్క చూశాక 'ఈయనొక్కడు చాలు వాళ్ళందరి పెట్టు' అనిపించింది. ఆయనతో వంగివంగి మాట్లాడి నాన్నకి గూని వచ్చింది. చిన్నక్క శోభనం పెద్దహోటల్ రూం బుక్‌చేసి జరిపించారు.

మర్నాడు పెద్దక్క అడిగింది "ముందు జరిగిన ప్రేమాయణం సంగతేం అడగలేదు కదా!" అని.

చిన్నక్క నవ్వి "నీకు జరిగిన అనుభవం నేను మరిచిపోలేదు. నేను పెదవి విప్పలేదు. నేనూ చెప్తాను కావాలంటే... అని ఆయన రెండుమూడు ప్రేమలీలలు చెప్పాడు. ఫ్రాంక్‌గా వుండకపోతే నేను క్షమించను. వయసొచ్చాక ఎవరో ఒకర్ని తప్పక ప్రేమించకుండా వుంటామా... చెప్పేద్దూ...' అని బలవంతపెట్టినా నేను చెప్పలేదు" అంది.

దాని తెలివితేటలకి మేం ఇద్దరం మెచ్చుకున్నాం.

చిన్నబావ దాన్ని కాపురానికి తీసుకెళ్ళాక దాని దగ్గరనుంచి తను బావున్నట్లుగా వచ్చిన ఉత్తరం చూసి అంతా సజావుగా జరిగిపోతుందను కొని తృప్తిపడ్డాం.

ఇంతలో మొదటి పండగొచ్చింది.

నాన్నగారు ఇద్దరల్లుళ్ళనీ పండక్కి పిలిచారు. ఇద్దర్నీ సమానంగా చూస్తున్నా "ఎంతైనా పెద్దల్లుడంటే పెద్దపాలేరు బతుకేగా...!" అంటూ సణుగుతూనే పెద్దబావ మర్యాదలు చేయించుకున్నాడు. చిన్నబావ పెద్దబావముందు పెద్ద రసికుడిలా ఫోజులు కొడుతూ చిన్నక్క తలలోకి బుట్టెడు పూలు తేవడం, తను పెర్‌ఫ్యూమ్స్ స్ప్రే చేసుకోడం చేసేవాడు. తల్లి పెంపకంలో డాబుసరంటే ఏమిటో తెలీకుండా పెరిగిన పెద్దబావకి ఇవన్నీ చూస్తూ ఇన్‌ఫీరియార్టీ కాంప్లెక్స్ పెరిగిపోయి పెద్దక్కని చితకతన్నే వాడు.

మొత్తానికి పండగ ఘట్టం అయిందీ అని వూపిరి పీల్చుకోబోయే తరుణంలో భయంకరమైన సంఘటన ఒకటి జరిగింది.

'అందరం కలిసి సినిమా కెళదాం' అనే ప్రపోజల్ పెట్టాడు మా పెద్దబావ. ఆయనకి మావగారింటికొస్తే ఇలాంటి కోర్కెలు పిలకలేస్తాయి. తప్పేదేముంది? నాన్నగారు టిక్కెట్లు తెప్పించారు. చిన్నబావ "శక్తి కూడా రావాలి" అని డిమాండ్ చేశాడు. నాతో సరసాలాడడం తన రైట్ అనుకుంటాడాయన. ఎన్నోసార్లు అక్కడా ఇక్కడా తగలాలని ప్రయత్నించి నా చురుకలలాంటి చూపులకి జంకి వెనక్కి తగ్గుతాడు.

"నేను రాను" కరాఖండిగా చెప్పాను.



"ఎందుకు రావూ? శక్తి రాకపోతే ప్రోగ్రామ్ కాన్సిల్ చెయ్యాల్సిందే. బావగార్ని అడుగుతున్నానన్న మర్యాదకూడా లేదా?" అని గొడవ చేశాడు.

అంతా సవ్యంగా జరుగుతుంటే ఎందుకీ రసాభాసా అన్నట్లు నాన్నగారు "పోనీ వెళ్ళిరా తల్లీ!" అని నన్ను అర్థింపుగా చూశారు.

ఇద్దరు ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేశాక ఆయన చూపులలో అర్థింపూ, మాటల్లో వినయం తప్ప మరోగుణం కనిపించడంలేదు.

తప్పక నేనూ బయల్దేరాను.

ఆడవాళ్ళందర్నీ ఒక దగ్గర కూర్చోమని ఈ మగమహారాజులు పాన్‌షాప్ దగ్గర నిలబడి సిగరెట్లు వెలిగించుకొని వచ్చేపోయేవాళ్ళని చూడనారంభించారు.

మేం ముగ్గురం ఏదో లోకాభిరామాయణం మాట్లాడుకుంటుండగా, "హలో... సుమతీ" అన్న పలకరింపు వినిపించింది.

చూస్తే... కుమార్!

మా గుండెల్లో బాంబు పేలినట్లయింది.

"సుమతీ.. ఎంతకాలం అయిందీ నిన్ను చూసి! బావున్నావా?" అంటూ దగ్గరకొచ్చాడు.

చిన్నక్క కళ్ళు వెంటనే భయంభయంగా భర్తకోసం వెతికాయి.

ఆయన అక్కడ నిలబడి ఓ చుడీదార్ అమ్మాయిని అన్ని ఏంగిల్స్‌లో చూడటంలో బిజీగా వున్నాడు.

చిన్నక్క కుమార్‌వైపు చూడటంలేదు. కుమార్ మాత్రం "ఇదివరకటి కంటే బావున్నావు సుమతీ... పెళ్ళయిందా?" అన్నాడు.

చిన్నక్క కోపంగా "అయింది. నీతో మాట్లాడటం కూడా నాకు అసహ్యం. దయచెయ్యి, నీ మొహం నాకు చూపించకు" అంది.

"అలా అనకు సుమతీ, నీతో గడిపిన ప్రతిక్షణం నన్ను వెన్నాడుతోంది. నిన్నెంతగానో ప్రేమించి పొందలేకపోయిన అభాగ్యుణ్ని..." అంటూ దగ్గరకు రెండడుగులు వేశాడు.

చిన్నక్క ఏదో అనబోతుండగా "ఈయన ఎవరూ...?" అంటూ చిన్నబావ వచ్చాడు.

"ఈయన... ఈయన..." అని అది నీళ్లు నమిలింది.

నేను "మాకు తెలిసిన వాళ్ళబ్బాయి" అనేశాను. ఆ తర్వాత మా సుమతక్క భర్త" అని ఆయన్ని పరిచయం చేశాను.

ఇంతలో అనవసరంగా రంగప్రవేశం చేస్తూ ఇంకో గొట్టంగాడు "ఏరా కుమార్... ఫ్యామిలీతో సినిమాకొచ్చావా...?" అని పరామర్శించాడు.

కుమార్ జవాబిచ్చేలోగానే, ఆతడు సుమతక్కని చూసి "నమస్తే సుమతిగారు! మొత్తానికి మా కుమార్‌గాడు ప్రేమించిన పిల్లనే పెళ్ళి చేసుకున్నాడన్నమాట! నీకంత ధైర్యం ఎలా వచ్చిందిరా? సుమతిగారే నిన్ను మెడలువంచి పెళ్ళి చేసుకుని వుంటారు. ఔనా?" అని ఘుళ్ళున నవ్వి, మా అందరివైపూ చూసి ఆగిపోయాడు.

నేనూ పెద్దక్కా వూపిరి బిగపట్టి, రక్తం పాలిపోయిన మొహాలతో చూస్తుండిపోయాం.

చిన్నక్క భయంతో కళ్ళు మూసేసుకుంది.

చినబావ మొహం కోపంతో జేవురించి వుంది.

కుమార్ ఇబ్బందిగా అటూఇటూ చూసి వాగుతున్న ఫ్రెండ్‌చేతిమీద గట్టిగా గిల్లి, "వెళ్ళొస్తాను" అని, ఫ్రెండ్‌తోబాటు వేగంగా అక్కడినుండి వెళ్ళిపోయాడు.

పెద్దబావ మొహంలో గొప్ప వెలుగొచ్చింది. సినిమాను మించిన ఎంటర్‌టైన్‌మెంట్ దొరికిన ఉత్సాహం కనిపించిపోతోంది.

జరిగిన విషయం జీర్ణం చేసుకోలేక కాసేపు ఎవరం మాట్లాడుకోలేదు. మొదటగా పెద్దబావే మాట్లాడుతూ "సో... ఒకణ్ని ప్రేమించి ఇంకోడిచేత తాళి కట్టించుకోవడం మీ వంశాచారం అన్నమాట. పూర్ బ్రదర్... నువ్వూ నా జాబితాలోకి వచ్చావు. మా మరదలు నా భార్యకన్నా రెండాకులు ఎక్కువే చదివినట్లుగా కనిపిస్తోంది... కథ ఎందాకా నడిచిందో?" అన్నాడు.

చిన్నబావ పిడికిళ్లు బిగుసుకున్నాయి. చిన్నక్క తలవంచుకుని నిల్చుని వుంది.

చిన్నబావ దాని జడపట్టుకుని అందరూ చూస్తున్నారన్న ధ్యాసకూడా లేకుండా ఈడ్చుకెళ్ళి ఆటో ఎక్కించాడు.



మేమూ ఆ వెనకాలే బయల్దేరాం. పెద్దబావ దారిపొడుగునా పెద్దక్కనీ, చిన్నక్కనీ అసహ్యంగా మాట్లాడుతూనే వున్నాడు. నేను భరించలేక, "అభిమానం వుంటే వదిలెయ్యలేకపోయవూ? మళ్ళీ ఒక్కరోజు కూడా వదిలిపెట్టకుండా వెంట పడతావుగా!" అన్నాను.

"శక్తీ! బావగారితో అలాగేనే మాట్లాడటం..." అంది పెద్దక్క. ఎంతైనా దానిపేరు అరుంధతి కదా!

నేను దానివైపు ఛీత్కారంగా చూసి ఆటో దిగి డబ్బులిచ్చాను.

అందరం లోపలికి వెళ్లేసరికి అక్కడో పెద్దసీన్ జరుగుతోంది.

"నేను మొదటిరాత్రే చెప్పాను. ఫ్రాంక్‌గా వుండేవాళ్ళంటే నాకిష్టం. అలా లేనివాళ్ళంటే నాకు అసహ్యం అని. ఆరోజు చెప్పుంటే ఈ కుమార్‌గాడి విషయం నేను క్షమించేసి వుండేవాణ్ని. కానీ ఇది ఆ విషయం నా దగ్గర దాచి నన్ను మోసం చేసింది. ఎంత అడిగినా అబ్బే... అలాంటిదేం లేదు' అని అబద్ధాలాడింది. 'రంకు నేర్చింది బొంకు నేర్వదా' నా పిచ్చిగానీ... ఇక మాటలనవసరం... మీ అమ్మాయిని నేను తీసుకెళ్ళడం జరగనిపని... విడాకు లిచ్చేస్తాను. ఆ కుమార్‌గాడికో, ఇంకోడికో ఇచ్చి కట్టబెట్టండి. వస్తా!"అని చిన్నబావ బ్యాగ్ అందుకున్నాడు.

చిన్నక్క ఏడుస్తూ "నన్ను అన్యాయం చెయ్యకండి... క్షమించండీ" అని కాళ్ళు పట్టుకుంది.

"బాబూ... నీ తండ్రిలాంటివాణ్ని. నామాట విను... ప్లీజ్..." అంటూ నాన్నగారు ప్రాధేయపడ్డారు. ఆయన వినలేదు. విదిలించుకొని వెళ్ళి పోయాడు.

కోర్టులో కేసు వేశాడు.

చిన్నక్క విడాకులకి ఒప్పుకోలేదు. బోన్‌లో నిలబడి తనకే పాపమూ తెలీదనీ, ఆ భర్తే కావాలనీ కోరింది.

విడాకులు మంజూరు కాలేదు.

గత్యంతరంలేక చిన్నక్కని తనవెంట తీసుకెళ్ళాడు. అప్పటినుంచీ మా గడప తొక్కనివ్వడు. దాని సంగతులు మా చెవుల్న పడనివ్వడు.

ఆడపిల్ల పుట్టిందని తెలిసి "బాగానే వుందన్నమాట!" అని నాన్న సంతోష పడ్డాడు.

ఈలోగా మా పెద్దక్కకి ఇంకో ఇద్దరు మగపిల్లలు పుట్టారు. అదెప్పుడూ తొమ్మిది నెలలు పుట్టింట్లో, మూడునెలలు అత్తింట్లో వుంటుంది.

మా నాన్న ఇప్పుడు మూడో కూతురికి... అంటే... నాకు సంబంధాలు చూస్తున్నాడు. ఈ ఇద్దరు బావగార్లనీ, వాళ్ళ స్వభావాల్నీ చూశాక నాకు మగవాడంటే భయంకన్నా అసహ్యం ఎక్కువైంది. పెళ్ళి అంటే మృత్యు దండనతో సమానం అనిపిస్తోంది. మగవాడు అంటే పెద్దకొరడా పట్టుకొని ఝుళిపిస్తూ వస్తున్న యముడిలా కనిపిస్తున్నాడు. దానికితోడు ఈ పెళ్ళికొడుకులు డాక్టరైతే పది లక్షలూ... ఇంజనీర్ అయితే పదిహేనూ... ఆఫీసర్ అయితే తొమ్మిదీ... క్లర్క్ అయితే... మూడూ... ప్యూన్ అయితే... లక్షా అని రేట్లు నిర్ణయించేసుకుంటున్నారు.

"ఏదీ లేనివాడయితే... అసలు ఉద్యోగమే లేనివాడైతే కట్నం అవసరం లేదా?" ఆవేశంగా అడిగింది శక్తిమతి.

కథంతా విన్న ఇంద్రనీల్ చిన్నగా నవ్వి "ఉద్యోగం పురుషలక్షణం... అ లక్షణం లేనివాడిని అసలు పెళ్ళెవరు చేసుకుంటారూ?" అన్నాడు.

"నేను!" స్థిరంగా అంది శక్తిమతి.

"తన పురుష లక్షణం నాకు తాకట్టు పెడితే... అదీ ఓ ఐదేళ్ళు చాలు! ఐదేళ్లకోసం ఆ పురుషలక్షణం నాకు తాకట్టు పెట్టి ఇంటిపట్టునుండి ఓ ఇల్లాలు ఏమేం చేస్తుందో అవన్నీ చేస్తే... ఒక్కగర్భం... ప్రసవం తప్ప! నేను అతనికి భర్తపోస్ట్ ఇస్తాను. తిండీ, బట్టా, సెక్యూరిటీ అన్నీ ఇస్తాను. తను కట్నం తీసుకోనందుకు బాధపడక్కర్లేదు. అతనికి నెలనెలా జీతంలా జేబు ఖర్చుకూడా ఇస్తాను. అతను చెయ్యవలసినదల్లా...

"తన పురుషలక్షణం నీకోసం త్యాగం చెయ్యాలి అంతేనా?" అన్నాడు.

"ఔను!" అంది.

"మరి ఈ కాంట్రాక్ట్‌కి ఒప్పుకునేవాడెవడైనా మీకు కనిపించాడా?" అడిగాడు.

"కనిపించాడు. అతను ఇతరులకోసం, తనకి ఏం సంబంధం లేనివాళ్ళ కోసం కూడా రిస్క్ తీసుకుని ఏమైనా చెయ్యగలడు. అంత మంచి మనసు" అంది.



ఇంద్రనీల్ కనుబొమ్మలు చిట్లించి "అతనిగురించి మీకు వివరాలు తెలియక్కరలేదా?"అన్నాడు.

"అక్కర్లేదు! నేను చూసిన విషయాల్నే ఎక్కువగా నమ్ముతాను. ఐ లైక్ హిమ్" అంది.

"అతను అంగీకరిస్తాడనుకుంటున్నారా?" అడిగాడు.

ఆమె లేచి "నేను రేపుపొద్దుట ఈ గదిలోకి వచ్చేసరికి అతను 'గుడ్‌మార్నింగ్' అంటే అంగీకరించినట్లు, 'నమస్తే' అంటే లేనట్టు" అని బయటికి వెళ్ళిపోతూ "బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోండి ఇంద్రనీల్! మీరు నాకు నచ్చినంతమాత్రాన నేను మీకు నచ్చాలని రూలేం లేదు. మీరు ఒప్పుకోకపోయినా మనం ఫ్రెండ్స్‌గానే వుంటాం. గుడ్‌నైట్... నిద్రపోకుండా ఆలోచించండి" అనేసి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళినవైపు చూస్తూ అతను నవ్వుకున్నాడు.

'తాచుపాముని ఆలోచించకుండా పట్టుకున్న నాకన్నా ఈ అమ్మాయి ఎక్కువ రిస్కే తీసుకుంటోంది. ఒక అపరిచితుణ్ని మొదటి పరిచయంలోనే పెళ్ళి చేసుకోమని అడగడం ద్వారా!" అనుకున్నాడు.

శక్తి ఆలోచనలు ఇంకోవిధంగా వున్నాయి.

'పెళ్ళిచూపుల్లోకూడా ప్రథమపరిచయంలోనే కదా డిసైడ్ చేసుకునేది. వరుడి అటు మూడుతరాల వంశచరిత్రా, కులగోత్రాలూ తెలిసినంత మాత్రాన అతడినైజం ఎలా పట్టుకోవడం? దానికన్నా ఇది లాజికల్‌గానే వుంది. ఇతని మెంటాలిటె నేను కొంత స్టడీ చేశాను' అనుకుని తృప్తిపడింది.

ఆస్పత్రిలో బయట వరండాలో కూర్చున్న శక్తి మనసంతా ఆలోచనలతో గజిబిజిగా వుంది. ఆమెని అతను ఒప్పుకుంటాడా, లేదా? అన్న విషయం అతలాకుతలం చేస్తోంది. ఆమెకి ఎందుకో అతను నచ్చాడు.

తన కోసం ప్రాణాలొడ్డడం అన్న విషయం ఆమెని కదిలించకపోదానికి ఆమె అందరు ఆడపిల్లల్లో మినహాయింపేమీ కాదు. అతని రూపం, మాట్లాడేటప్పుడు నిష్కల్మషంగా కనిపించే కళ్ళు ఆమెని ఆకర్షించాయి. ముఖ్యంగా అతనికి ఎవరూ లేకపోవడం ఆమెకి బాగా నచ్చింది.

ఆస్పత్రి ఆవరణ బయట కనిపిస్తున్న మర్రిచెట్టు కింద చేరిన ఫకీరెవరో "గూడూ... చిన్నబోయేరా... రామచంద్రా..." అని పాడుతున్నాడు.

చేతికి వేసుకున్న నాలుగు మట్టిగాజుల్నీ పైకీ కిందకీ జరుపుకుంటూ ఆమె లీలగా వినిపిస్తూన్న ఆ పాట వినసాగింది. చలిగాలి రివ్వున కొడుతూంటే పైటకొంగు నిండా కప్పుకుని మునగదీసుకుని కూర్చుంది. లోపల గదిలో అంతగా చలి వుండదని తెలుసు. కానీ... పెళ్ళికాకముందే ఒక యువకుడితో ఒకేగదిలో వుండటం తప్పనుకునే పరిస్థితుల్లో ఆమె పెరగడంవల్ల ఆ ఊహని తోసిపుచ్చింది.

తెలతెలవారుతుండగా మర్రిచెట్టుమీద నిద్రపోతున్న పక్షులన్నీ నిద్ర లేచాయి.

పండక్కి ఇంటినిండా చుట్టాలొచ్చినంత సందడిగా వుంది మర్రిచెట్టు. ఆకు ఆకూ నోళ్ళు తెరిచి కూస్తున్నట్లుగా హడావుడిగా మారింది.

శక్తి లేచి చీరకుచ్చిళ్ళు సవరించుకుంది. ఆమెకి అతని గదివైపు అడుగు లేస్తుంటే కాళ్ళు తడబడ్డాయి. బహుశా సీతాదేవికి కూడా రాముడు హరివిల్లు ఎత్తేటప్పుడు ఇంతే టెన్షన్‌గా వుండివుంటుంది. కానీ ధైర్య పంతులు మాత్రమే కార్యాల్ని సాధించగలరని ఆమెకి తెలుసు. అతనూ రాత్రంతా జాగరణ చేసి ఈ విషయం గురించి ఆలోచిస్తాడని వూహిస్తూ ఆమె గదితలుపు తోసింది.

ఇంద్రనీల్ ఆదమరిచి నిద్రపోతూ కనిపించాడు. అతనిముఖం చాలా ప్రశాంతంగా వుంది.

శక్తి అతని దగ్గరగా వెళ్ళి "ఏవండీ..." అంది. అలా పిలిచినందుకు సిగ్గుపడి ఇంద్రనీల్‌గారూ..." అంది.

అతను కళ్ళు విప్పలేదు.

ఇంక గత్యంతరం లేక భుజంపట్టుకుని కుదుపుతూ "మిమ్మల్నే... లేవండి" అంది.

అతను కుడిచెయ్యి ఎత్తి ఆమెచేతిని పట్టుకుని "పిల్లలు లేచారా? లేవకపోతే ఓ ఐదు నిముషాలు నా పక్కన పడుకుందూ... వెధవ ఆఫీసు ఎప్పుడూ వుండేదే గదా!" అన్నాడు.



ఆమె విప్పారిన కళ్ళతో ఆశ్చర్యంగా "ఏయ్... ఏవిటా మాటలు?" అంది.

"రాత్రి నలిగిన మల్లెపూలు కైపుగా వాసన వేస్తున్నాయి కదూ! నా బుగ్గకి అంటిన కాటుకమరకలు నీ కొంగుతో తుడు" అన్నాడు.

"ఏవంటున్నారు... ముందు కళ్ళు తెరవండి!" అంటూ శక్తి జగ్గులోంచి చేతిలోకి నీళ్ళు తీసుకుని అతని కళ్ళమీద చల్లింది.

అతను వెంటనే కళ్ళు తెరిచి "ఏవైంది?" నా ముఖాన నీళ్ళు కొట్టిందెవరు?" అన్నాడు.

శక్తి చిరుకోపంగా "నేనే... ఏం కలత నిద్రయిందా?" అడిగింది.

"కలత కాదు. కల చెదిరింది. ఎంత నిరంకుశంగా తియ్యని కల చెదర గొట్టేశారో తెలుసా?" అన్నాడు.

"ఏవిటో అంత తియ్యటి కల?" తెలిసీ అడిగింది.

అతను కొద్దిగా పైకి జరిగి మోచేతి ఆసరాతో కూర్చుని "మనకి ఇద్దరు పిల్లలు పుట్టారుట! ఒకడేమో ఆదివారం జూకి వెళదామనీ, ఇంకొకడేమో హోటల్‌కి వెళదామని గొడవచేస్తున్నారట. నువ్వేమో కనకాంబరం రంగుచీర కట్టుకుని జడనిండా బంతిపూలు పెట్టుకుని తయారయ్యావుట!"

శక్తి చిరాగ్గా "కాదు! బంతిపూరంగు చీర కట్టుకుని, జడనిండా కనకాంబరాలు పెట్టుకుని వుంటాను" అంది.

"అదేలే... నేను స్కూటర్ స్టార్ట్ చెయ్యగానే నువ్వు అరే... మర్చేపోయాను. వంటింట్లో డబ్బాలో పాలకాయలూ, అరిసెలూ వున్నాయి. తీసుకొస్తే పిల్లలు తింటారు అన్నావు!"

"నేనలా మర్చిపోను. అన్నీ ముందురోజు రాత్రే సర్ది పెట్టుకుంటాను" అంది శక్తి.

"కానీ కలలో అలానే అన్నావు. అంతేకాదు. మీ నాయనమ్మ తద్దినానికి చేసిన గారెలుకూడా స్టీలు డబ్బాలో వున్నాయి తెస్తానన్నావు."

"ఛ! తద్దినం గారెలు డబ్బాలో దాచుకుని, పిల్లలకి జూలో పెట్టడమా? అన్నీ సన్నాసి ఊహలు" శక్తి చిరాకుపడింది.

"వెంటనే చిన్నాడు 'నాకు గారెలొద్దు... క్రీమ్ బిస్కట్స్ కావాలి' అంటూ కాళ్ళు బాదుతూ రాగం మొదలుపెట్టాడు. నువ్వు వాడి ముక్కుకారుతుంటే నీ కొంగుతో తుడిచి అలాగే కన్నా! అని వూరుకోబెట్టావు."

"ఛీ... నా కొంగుతోనా! ఛస్తే తుడవను" శక్తి వెలపరంగా కొంగుచివర వాసన చూస్తూ అంది.

"అబ్బా... కలలోనే కదా!" అన్నాడు.

"కలలో కూడా అలాంటి పనులు చేయను" కచ్చితంగా చెప్పింది.

"పిల్లలు దూరంగా ఆడుకుంటుంటే, మనం ఇద్దరం ఒకరి వొళ్ళో ఒకళ్ళం పడుకుని..."

"ఇంపాజిబులే! ఒకేసారి ఒకళ్ళఒళ్ళో ఒకళ్ళు పడుకోవడం జరగదు" అతని మాటలకి అడ్డుపడింది.

"ఏదోలే... నేనే నీ ఒళ్ళో పడుకుని కబుర్లు చెబుతుంటే నువ్వు తన్మయంగా వింటున్నావట."

"అంతమాత్రానికి జూ కెందుకూ? మన ఇంట్లో బెడ్‌రూం లేదా? పిల్లల్ని గాలికొదిలేసి నీ గాలికబుర్లు వినాలా?" విసుగ్గా అడిగింది.

ఇంద్రనీల్ కోపంగా లేచికూర్చుని "కొత్తగా పెళ్ళయినప్పుడు ఆ మాత్రం ముచ్చట్లు వుండవా?" అన్నాడు.

"కొత్తగా పెళ్ళయితే ఇద్దరు పిల్లలు ఎలా పుట్టారు? కలైనా కొంచెం అర్థం వుండాలి" చిరాకుపడింది.

"పెళ్ళయ్యి పదేళ్ళయింది. పిల్లలు కొత్తగా పుట్టారు..."

"కొత్తగా పుడితే దూరంగా పోయి ఎలా ఆడుకుంటారు?"

"పిల్లలుపుట్టి చాలా ఏళ్ళయింది. కొత్తగా జూకెళ్ళాం."

"కొత్తగా జూ కెళితే జూలో జంతువుల్ని చూడాలి కానీ నీ మొహం నేనూ, నా మొహం నువ్వూ చూడటం ఎందుకూ?" నవ్వాపుకుంటూ అడిగింది శక్తిమతి.

"ఇలా ప్రతిదానికీ "ఔనంటే... కాదంటావా?" బుంగమూతి పెట్టి అడిగాడు.

"కాదు!"



అతను ఆశగా చూశాడు.

ఆమె నాలిక కరుచుకుని "అనుకోకుండా కాదనేశాను చూశారా? అది నా స్వభావం" అంది.

అతను నవ్వి "ఆ తర్వాత ఇద్దరం పిల్లలతో ఇల్లు చేరేసరికి చాలా రాత్రయింది. ఇంటికొచ్చి చాలా అలసిపోయాం" అన్నాడు.

"మళ్ళీ తప్పు! ఇంటికి అలసిపోయి చేరివుంటాం" అంది.

అతను కొంటెగా కన్నుగీటి "కాదు... ఇంటికి చేరి అలసిపోయాం" అన్నాడు.

సహజంగా చాలా చురుకైన శక్తిమతికి అతని భావం అర్థం అవడానికి ముప్పైసెకన్లు పట్టింది. అది ఆమె పెరిగిన వాతావరణ ప్రభావం. అర్థం అవగానే ఆమె బుగ్గలు ఉదయిస్తున్న సూర్యుడిరంగులోకి మారాయి.

"నువ్వు నిద్రలేపుతుంటే నేను నీ నడుంచుట్టూ చేతిని వేసి ఇలా నా పైకి లాక్కున్నాను" అతను ఆమెని తన పైకి లాక్కున్నాడు.

అదాటుగా ఆమె అతని గుండెలపైన పడి "ఏయ్... ఏమిటిది?" అంది చిరుకోపంగా.

"ఇలాగే అరిచి కలని పాడుచేశావు! అందుకు పెనాల్టీగా ఇప్పుడు నిజం చేయాలి" అన్నాడు.

శక్తి లేచే ప్రయత్నం చెయ్యకుండా "అంటే... నా ప్రపోజల్‌కి అంగీకరించినట్లేనా?" అంది.

"నెవర్ సే నో టు గుడ్ థింగ్స్ అన్నారు పెద్దలు" అన్నాడు.

శక్తి అతని కళ్ళల్లోకి ఆశ్చర్యంగా చూస్తూ "నా షరతులన్నింటికీ ఇష్టపడే ఈ మాట అంటున్నారా?" అంది.

"నీ షరతులని కాదు, నిన్ను ఇష్టపడి ఒప్పుకుంటున్నాను..." అన్నాడు.

"థాంక్యూ" మనఃస్ఫూర్తిగా చెప్పింది.

"కానీ... నాకూ కొన్ని షరతులున్నాయి. అవి నువ్వు ఒప్పుకుంటేనే..." అన్నాడు.

"ఉద్యోగం చెయ్యడం... నామీద అధికారం చెలాయించడం తప్ప ఏవైనా సరే ఒప్పుకుంటాను" అంది.

అతను చిన్నగా నవ్వి "నెలలో ఓ వారం నాకు సెలవు కావాలి. ఊరెళ్ళి వస్తాను." అన్నాడు.

ఆమె విస్మయంగా "ఊరా!? నీకెవరూ లేరన్నావుగా!"అంది.

"అసలు ఎటువంటి ప్రశ్నలూ వేయకుండా ఈ షరతులకి ఒప్పుకోవాలి" అన్నాడు.

శక్తి అతనిమీదనుంచి లేచి, పెదవి మునపంటితో బిగపట్టి ఆలోచనలో పడింది.

"మిగతా మూడు వారాలూ ఓ హౌస్‌వైఫ్ ఏమేం చేసి ఉద్యోగం చేసే తన భర్తకు ఆనందం కలిగిస్తుందో అవన్నీ చేస్తాను. నిన్నేం అడగను. ప్రామిస్" అన్నాడు.

"మరి ఐదేళ్ళవరకూ నువ్వు ఉద్యోగం చెయ్యవని కాంట్రాక్ట్ రాసుకుందామా?" అడిగింది.

"నా జీతం మూడువేలుగా ఫిక్స్ చేసి ఐదేళ్ళవరకూ టెర్మినేట్ చెయ్యనని ఎగ్రిమెంట్ రాయి" అన్నాడు.

ఆమె ఆలోచనగా చూసి "ఒకవేళ నువ్వు నన్ను హింసిస్తే, ఏ కారణంగానైనా నిన్ను నేను భరించలేకపోతే..." అడిగింది.

ఇంద్రనీల్ తన చేతివేళ్ళు ముడుస్తూ "ఒకవేళ ఈ ఐదేళ్ళలో నాకు భయంకరమైన రోగాలేమైనా వచ్చినా, లేక నిన్ను మానసికంగా కానీ, శారీరకంగా కానీ బాధించినా, ఇవేమీ కాకుండా నీకు మరొకవ్యక్తిమీద మనసు కలిగినా కానీ నన్ను నువ్వు వదిలేయవచ్చని కూడా రాసుకుందాం. విడాకులకి కూడా ఈజీ అవుతుంది" అన్నాడు.

ఆ చివరి మాటలకి శక్తి చలించి, కన్నీళ్ళతో చూసింది.

"దారుణంగా ప్రవర్తించే మనుషుల్నీ, ఈ వివాహవ్యవస్థనీ చూసి ఇలా మారిపోయాను ఇంద్రనీల్. ఇంకా పెళ్ళిపీటలు ఎక్కకముందే విడాకులగురించి మాట్లాడుకోవాల్సి వస్తోంది" అంది.

"ఐ కెన్ అండర్‌స్టాండ్" అతను ఆమెచేతిని స్నేహంగా నొక్కి వదిలాడు.

శక్తి తనచేతిని వెనక్కి తీసుకునే ప్రయత్నం చెయ్యలేదు. అతని స్పర్శ ఎంతో హాయిగా వుండటాన్ని గమనించింది.



"మరి నా ఉద్యోగం ఎప్పటినుంచీ మొదలుపెట్టమంటారు మేడం?" కవ్వింపుగా అడిగాడు.

"ఈరోజే ఇంట్లో చెప్తాను. నాన్న నా మాట కాదనరు" అంది.

"పెళ్ళికి ఈరోజు మంచిరోజే అనుకుంటా. కానిచ్చేద్దామా?" హుషారుగా అడిగాడు.

అతని తొందరకి ఆమె నవ్వి "మొదటి పరిచయమే స్నేహంగా మారి ఆ కలయికే పెళ్ళిదాకా దారితీయడం విచిత్రంగా లేదూ!" అంది.

"నా అంత అందగాడూ, తెలివైనవాడూ ఇంకోడు మళ్ళీ దొరకడని అంత త్వరగా తెలుసుకున్నందుకు నిన్ను అభినందించాలి" అన్నాడు.

"కాదు! నా అంత ప్రయోజకురాలు నీకు తారసపడినందుకూ, నువ్వు నా కోరిక కాదనకుండా వెంటనే ఒప్పుకున్నందుకూ నిన్ను అభినందించాలి" అంది.

"సరే కానీ... మన పెళ్ళిలో మంగళసూత్రం నేను నీకు కట్టాలో, లేక నువ్వు నాకు కట్టాలో త్వరగా డిసైడ్ చేయడం మంచిది. అక్కడ కూడా ఇలా మనం పోట్లాడుకుంటూ కూర్చుంటే వచ్చినవాళ్ళు ఆకలికి శోషొచ్చి పడిపోతారు" అన్నాడు.

శక్తి కాసేపు ఆలోచించి "నువ్వే కట్టు. ఆ మూడుతులాల చైనూ, మంగళసూత్రాలతో నువ్వు ఎక్కడికైనా పరారైపోతే నాకు కష్టం" అంది.

అతను తేలిగ్గా నవ్వేసి "నీకు మనుషులమీద నమ్మకం చాలా తక్కువన్న సంగతి నాకర్థం అయింది శక్తీ! నువ్వు పోగొట్టుకున్న నమ్మకాన్ని తిరిగి తెచ్చి ఇచ్చే బాధ్యత నాది" అన్నాడు.

"సరే కానీ ముందు డాక్టర్ బిల్ కట్టేసి వస్తాను. మనం మా ఇంటికి వెళదాం" అంది.

అతను తల వూపాడు.

డాక్టర్ మాలతి ఇంద్రనీల్‌కి ఏవో మందులు రాసి ఇస్తూ "అతనికి కాస్త స్క్రూ లూజ్ అనుకుంటాను. లేకుంటే ఎవరైనా అలాంటి సాహసాలు చేస్తారా?" అంది.

"అవును! ఇప్పుడు ఇంకో సాహసం చెయ్యబోతున్నాడు"అంది శక్తి.

"ఏమిటీ? సింహం నోట్లో తలపెట్టబోతున్నాడా?" అడిగింది మాలతి.

"కాదు, ఈ శక్తి మెడలో తాళి కట్టబోతున్నాడు" అని చిన్నగా నవ్వింది.

"వాట్!? నిజంగానా? కంగ్రాట్స్" శక్తిచేతిని పట్టుకుని ఊపేస్తూ "అదీ అలా చెప్పు. ఇదంతా అమ్మగారి ప్రేమ మహిమ అన్నమాట. ఎన్నాళ్లనుంచీ..." కుతూహలంగా అడిగింది మాలతి.

"నిన్న నీ నర్సింగ్‌హోంలో ఎడ్మిట్ చేసినప్పటినుంచీ... మా ప్రేమ వయసు పన్నెండుగంటల ఇరవై నిముషాల నలభై సెకండ్లు" వాచీ చూస్తూ చెప్పింది శక్తి.

"నువ్వు అన్నింట్లోనూ ఫాస్టేగా" మెచ్చుకోలుగా అంది మాలతి.

"వస్తాను. నీ సహాయానికి థాంక్స్" అని శక్తి లేచింది.

ఆమె గదిలోంచి బయటికి వెళుతుండగా, మాలతి "శక్తీ... నీ హబ్బీ చాలా హేండ్సమ్‌గా వున్నాడు" అరిచింది.

"వన్స్ ఎగైన్ థాంక్స్!" అని వెళ్ళిపోయింది.

❖ ❖ ❖

"నిర్ణయం తీసుకున్నాక అమలుచేయడంలో ఆలస్యం చెయ్యడం నాకు ఇష్టం వుండదు. అందుకే ఈరోజే అతణ్ణి వెంటబెట్టుకుని వచ్చాను నాన్నా!" అంది శక్తి.

వంటింటి గుమ్మందగ్గిర కూర్చుని తోటకూర తరుగుతున్న అరుంధతి నోరంతా తెరిచి ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయింది.

ఇంద్రనీల్ అటూ ఇటూ చూసి తనే ఓ స్టూల్ జరుపుకుని కూర్చున్నాడు.

గోపాలరావు గంభీరంగా ఆలోచిస్తూ వుండిపోయాడు.

"ఇంతకీ అతనికి ఏం ఉద్యోగం? ఎంత సంపాదిస్తాడూ? మన కులమేనా? ఇంటి పేరూ, గోత్రం ఏమిటి? వాళ్ళ నాన్నగారిది ఏ వూరూ? వెనకా ముందూ ఏమైనా వుందా?" అరుంధతి ఆపకుండా ప్రశ్నలు మొదలుపెట్టింది.

శక్తిమతి వాడిగా "అవన్నీ చూసి చేసిన మీ కాపురాలు ఏమంత సౌఖ్యంగా ఏడిశాయని ఈ వివరాలన్నీ అతడ్ని అడగడం అక్కా?" అంది.

అరుంధతి చర్రున కత్తిపీట ముడిచి పక్కకితోసి "అయితే మగాడైతే చాలంటావా?" అంది.



"చిన్న సవరణ. అర్థంచేసుకునే మగాడైతే చాలు" అంది.

"అయ్యో! పెద్దవాళ్ళతో ఒక్కమాటైనా సంప్రదించకుండా ఇలా నీ నిర్ణయాలు నువ్వే తీసేసుకుంటావా? మీ పెద్దబావనైనా అడగొద్దూ... నాన్నగారు ఇంకా వున్నారన్న విషయం అయినా గుర్తుందా నీకూ?" అని అరిచింది అరుంధతి.

గోపాలరావు మాట్లాడకుండా వెళ్ళి లైట్ స్విచ్ వేశాడు. ట్యూబ్‌లైట్ వెలగలేదు. వెలిగి మళ్ళీ వెంటనే ఆరిపోసాగింది.

"లూజ్ కనెక్షన్ అనుకుంటాను. ఉండండి నేను చూస్తాను" అని ఇంద్రనీల్ స్టూలుమీద ఎక్కి సరిచేశాడు.

లైటు వెలిగింది.

ఆయన గోడకి తగిలించిన శ్రీరామా అండ్‌కో వారి తెలుగు కేలండర్ చేతిలోకి తీసుకుని "పంచమి బుధవారం... శ్రవణా నక్షత్రం బావుందమ్మా. వినాయకుడి గుడిలో కానిద్దామా?" అన్నాడు.

"నాన్నా!" శక్తికళ్ళు ఆనందంతో మెరిశాయి.

ఇంద్రనీల్ వైపు తిరిగి 'నే చెప్పలేదూ. నా నిర్ణయం పట్ల మా నాన్నకు నమ్మకం ఎక్కువనీ" అన్నట్లు చూసింది.

అరుంధతి రుసరుసలాడుతూ "బావుంది వరస. ఇంటి పెద్దల్లుడూ, పెద్ద కూతురూ మీకు తోటకూరలో పురుగులతో సమానం" అంది.

"బాబూ... నీ పేరైనా తెలుసుకోవచ్చా?" అడిగాడు గోపాలరావు.

"ఇంద్రనీల్" వినయంగా చెప్పాడు.

"మంచి పేరు. నీకు మా శక్తిగురించి ఈపాటికి తెలిసే వుంటుంది. అయినా నా బాధ్యతగా మళ్ళీ చెప్తున్నాను. దాని మనసు కాకినాడ కాజా లాంటిది. లోపలంతా అమృతమే. బయటికి మాత్రం మనుషుల తెలివి తక్కువతనంపట్ల అంతులేని అసహనం చూపిస్తుంది. అర్థంచేసుకుని మసలుకో" అని వినయంగా ఒంగి అతని చేతులు పట్టుకున్నాడు.

"అలాగేనండీ! ఇంకొకమాట. మీరు నాతో అలా ఒంగి మాట్లాడ నక్కర్లేదు. నేను మీ అల్లుడిని కాదు. ఈ నిముషంనుంచీ మీ కొడుకు ననుకోండి" అన్నాడు.

గోపాలరావుగారి కళ్ళల్లో తడి రెపరెపలాడింది.

"ఇప్పటిదాకా అల్లుళ్ళ మాటలకి చాలాసార్లు కంటతడిపెట్టాను బాబూ! కానీ ఈరోజు ఆనందంవల్ల కళ్ళు చెమరుస్తున్నాయి" అని భుజం మీదున్న తుండుతో తుడుచుకున్నాడు.

అరుంధతి అక్కసుగా "పోనీ జాతీ, మతం అయినా మనవేనా?" అడిగింది.

శక్తి చురుగ్గా ఏదో అనేలోగానే, ఇంద్రనీల్ నవ్వి "మతం... హిందూమతం, జాతి భారతీయత" అన్నాడు.

అరుంధతి విసవిసా లోపలికి వెళ్ళిపోయింది.

"నిన్న పెళ్ళిచూపులకని తెచ్చిన కారప్పూసా, లడ్డూ ప్లేట్లో పెట్టుకురా తల్లీ" చెప్పాడు గోపాలరావు.

శక్తి లోపలికి వెళ్ళింది.

గోపాలరావు మాట్లాడదామని అతనివైపు చూసేసరికి అతను స్టూలుమీద బయటకు పొడుచుకు వస్తున్న మేకుని సుత్తితో అణగకొడుతూ కనిపించాడు.

అది చూసి ఆయన తృప్తిగా నిట్టూర్చారు.

❖ ❖ ❖

అరుంధతి భర్త శంకర్ కట్నంలేకుండా మరదలి పెళ్ళి జరుగుతోందని తెలిసి హుటాహుటీ బయల్దేరి వచ్చాడు. అతనికి ఇంద్రనీల్ పేరెత్తితే కంపరంగా వుంది. ఇప్పటి మార్కెట్ రేట్లని బట్టి శక్తిమతికి ఏ రెండులక్షలో కట్నం ఇస్తే తనూ తక్కువైన తన కట్నం డబ్బుగురించి పేచీ పెట్టవచ్చని అతని వూహ!

కానీ ఇంద్రనీల్ నిరుద్యోగి అని తెలుసుకున్నాక అతని మనసు కాస్త శాంతించింది.

"అలా చెప్పండి. తాడూ బొంగరం లేని అనామకుడిని ఎవర్నో పిలిచి పిల్లనిస్తున్నారా? అప్పుడే అనుకున్నాను. ఎంత తలమాసినవాడైనా కట్నం లేకుండా చేసుకోడే అని" అన్నాడు హేళనగా.

"అవును... తలమాసినవాడెవడూ కట్నం లేకుండా చేసుకోడు" వ్యంగ్యంగా అంది శక్తి.



గోపాలరావు ఓపిక పట్టమని కూతురికి సైగ చేశాడు.

శంకర్ శక్తిని ఏమీ అనలేక కాఫీ అందిస్తున్న అరుంధతిని "చూసుకోకుండా ఇస్తావేం? కప్పు కిందంతా నీళ్ళు కారుతున్నాయి" అంటూ చెంప చెళ్ళుమనిపించాడు.

గోపాలరావు ఆ దెబ్బ తన హృదయంమీదే పడినంతగా విలవిలలాడాడు. ఆ నిముషంలోనే మనసులో బలంగా "వీడికి ఓ ఆడపిల్లని పుట్టించి, ఆ బాధ అర్థం అయ్యేట్లు చెయ్యి స్వామీ!" అని భగవంతుడ్ని వేడుకున్నాడు. మరునిముషంలో తనదెంత కసాయికోరికో తెలుసుకుని చెంపలు వాయించుకున్నాడు.

"ఏమిటీ చెంపలు వాయించుకుంటున్నారూ?" అడిగాడు గర్వంగా చూస్తూ శంకర్.

"ఆడపిల్లని కన్నందుకు నాయినా!"అన్నాడు.

మనసులో మాత్రం 'ఆడపిల్ల తండ్రికి మాటా, చూపూ, వినికిడీ మందగించటం ఎంత అదృష్టం' అనుకున్నాడు.

శంకర్ కాసేపు తననితాను పొగుడుకుని "నా స్థాయికి తగ్గవాడు కాకపోయినా, కాస్త నాలుగంకెలు సంపాదించేపాటివాణ్ని నే చూడక పోదునా? ఎందుకింత తొందరపడ్డారూ?" అని మామగారిని అడిగాడు.

శక్తి వాడిగా "నేను కోరుకునే మనిషి గుణాలూ, మగతనం అతనికి వున్నాయనే నా అభిప్రాయం. చీటికీ మాటికీ ఆడదాన్ని హింసించి ఆనందంపొందే పైశాచికత్వం వున్నవాడు ఎంతటివాడైనా నేను కోరుకోను" అంది.

"చూశావా నీ చెల్లెలి కూతలు? ఇంకా ఏం మర్యాదలు మిగిలిపోయాయని ఇక్కడ నిలబడ్డావు? పద" అంటూ శంకర్ అరుంధతిమీద కేకలు వేశాడు.

గోపాలరావు అడ్డుపడి అల్లుడి కాళ్ళూ, గెడ్డం పట్టుకుని బతిమాలి ఆపాడు.

సాయంత్రం ఇంద్రనీల్ వచ్చాడు.

శంకర్‌కి పరిచయం చేయగానే అతణ్ని కిందనుంచి మీదకి ఒకసారి చూసి "పాపం... నిన్ను చూస్తే జాలేస్తోంది బ్రదర్! ఆడదాని సంపాదన మీద ఆధారపడి బతకడంకంటే అధమం లేదు" అన్నాడు.

"ఔను! ఆడపిల్ల తెచ్చే కట్నం మీద ఆశపడడం అధమాధమం!" నవ్వుతూ అన్నాడు ఇంద్రనీల్.

శంకర్ గతుక్కుమన్నాడు. కాసేపు తన గొప్పలు చెప్పుకున్నాడు. ఆఫీస్‌లో తన స్టాఫ్‌కి తనపేరు చెప్తే ఎంత హడలో వర్ణించాడు.

మాట్లాడుతున్నంతసేపూ మామగార్ని చూసి సిగరెట్టు తెప్పించమనీ, వక్కపొడి తెప్పించమనీ పురమాయిస్తూనే వున్నాడు.

మధ్యాహ్నం భోజనాలయ్యాక మామగారిచేత సినిమా టిక్కెట్లు తెప్పించుకొని భార్యని తీసుకుని సినిమాకెళ్ళాడు.

వాళ్ళు వెళ్ళాక అరుంధతి పిల్లలకి అన్నం పెడుతూ శక్తి "చూశావుగా ఈయన సుపీరియారిటీ కాంప్లెక్స్! ఇంక రేపు రెండో ఆయన దిగబడతాడు. ఆయన ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ చూద్దూగాని" అంది.

ఇంద్రనీల్ నవ్వి "పెళ్ళిగురించి నువ్వు ఎందుకు ఇలాంటి నిర్ణయం తీసుకున్నావో అర్థం అవుతోంది" అన్నాడు.

శక్తి చురుగ్గా "అవుతోందా? పూర్తిగా అర్థం అయిపోతుంది రేపటికల్లా..." అంది.

గోపాలరావు రెండో అల్లుణ్ని, కూతుర్నీ వెంటపెట్టుకు తీసుకురావడానికి స్వయంగా వెళ్ళాడు.

ఏం బతిమాలాడో, భంగపడ్డాడో కానీ మరునాటికల్లా తీసుకు రాగలిగాడు.

చిన్నల్లుడు ఆటో దిగుతూనే గీజర్ లేక తనకి స్నానానికి ఎంత ఇబ్బందిగా వుందో, ఇంట్లో వీసీఆర్‌కోసం ఎంతగా గొడవపెడుతున్నారో ఏకరువు పెడుతూ లోపలికి వచ్చాడు.

చిక్కి సగమైన సుమతి కూతుర్ని ఎత్తుకుని భర్త వెనకాల వినయంగా లోపలికి వచ్చింది. ఇదివరకటి హుషారు మచ్చుకైనా కనిపించడంలేదు.

శక్తిమతి ఎదురెళ్ళి అక్కని కౌగిలించుకుని "ఎంత చిక్కిపోయావే" అంది.



"ఔను! మా ఇంట్లో అన్నం వండుకొని తినం. అందుకే మీ అక్క అలా చెక్కబొమ్మలా చిక్కిపోయింది" అంటూ మండిపడ్డాడు చిన్నల్లుడు గిరి.

అతన్ని శాంతింపజేయడానికి గోపాలరావుకి తలప్రాణం తోకలోకి వచ్చింది.

గిరిని చూశాక ఇంద్రనీల్‌కి శంకర్ మంచితనం కొట్టొచ్చినట్లు కనిపించింది. కనీసం అతను మాటలు దులిపేసుకుని మళ్ళీ మామూలుగా అందరితో కలిసిపోతాడు.

కానీ గిరి ప్రతిదానికీ సిమెంట్‌లో నీళ్ళు పడ్డట్లు గట్టిగా బిగుసుకు పోతుంటాడు. అతను తినడూ, ఇంకోళ్ళని తిననివ్వడు. ప్రతిదానికీ అలకే! 'ఆ' అంటే తప్పూ, 'ఊ' అంటే తప్పును.

"మళ్ళీ నెల తప్పింది మీ కూతురికి. ఈసారి ఆడపిల్ల పుడితే విడాకులే!" బెదిరించాడు మావగార్ని.

"మగపిల్లలుండడం అదృష్టమయ్యా! నన్ను చూడు... పుట్టమన్నా ఆడపిల్ల పుట్టదు" శంకర్ గొప్పగా చెప్పాడు.

"మీ అక్కని చూసి నేర్చుకో దేభ్యం మొహమా" అంటూ సుమతిని తిట్టిపోశాడు గిరి.

ప్రతివిషయంలో శంకర్‌తో పోల్చుకుని తనకి ఏదో అమర్యాద జరిగి పోతోందని గొడవ చేసేస్తున్నాడు.

ఇంద్రనీల్ సంగతి పట్టించుకునే వాళ్ళే లేరు.

మర్నాడు పెళ్ళి అనగా శక్తీ, ఇంద్రనీల్ వెళ్ళి సన్నాయివాళ్ళనీ, ఫోటోగ్రాఫర్నీ మాట్లాడారు. పాలకి ఆర్డరిచ్చారు. కూరలబస్తా మోసు కొచ్చారు.

వంటవాళ్ళని వెంటబెట్టుకొచ్చారు.

ఇంటెడు నీళ్ళూ నింపారు.

పెద్దల్లుడూ, చిన్నల్లుడూ కాఫీలూ, ఫలహారాలూ ఠంచనుగా చేస్తూ, పేకాటేసుకుని కూర్చున్నారు.

'జలుబు లోకరికీ, తుమ్ములొకరికీ' అని ఏ అల్లుడు డబ్బులు పోగొట్టుకున్నా మావగారి జేబుకే దెబ్బ!

మొత్తం పెళ్ళి పనులయ్యాక శక్తి ఇంద్రనీల్‌కి ఓ ప్యాకెట్ అందిం "ఇందులో నాకు నచ్చినవి ఓ రెండు జతలబట్టలున్నాయి. ప్రస్తుతాని సర్దుకో. తర్వాత నీ ఇష్టం వచ్చినవి కొంటాను" అంది.

ఇంద్రనీల్ అవిచూసి "వాహ్! నీ టేస్టూ, నా టేస్టూ ఒకటే. నన్ను కొనుక్కోమన్నా ఇవే కొనుక్కునేవాణ్ణి" అన్నాడు

"నిజంగానా? ఇది నా పెళ్ళిచీర" శక్తి ఎర్రఅంచు చందనం రంగ పట్టుచీర చూపించింది.

"అరె... నన్ను కొనమన్నా ఇదే కొనేవాడ్ని" అన్నాడు. "నేను మాత్ర ఇది చచ్చినా కొనుక్కునేదాన్ని కాదు. ఇది మానాన్న కొన్నారు" అంది

"కాఫీలు... కాఫీలు..." బిజీగా పేకాడుతున్న శక్తి బావలు కేకల పెట్టారు.

"వీళ్ళు రాకపోతే మన పెళ్ళి ఆగిపోతుందేమోనన్నట్లు మా నాన వూరికే ముందు పిలిచి కూర్చున్నారు. చాకిరీ చెయ్యలేక ఛస్తున్నాను శక్తి విసుక్కొంది.

"ఉష్! గట్టిగా అరవకు. బావుండదు" అని ఇంద్రనీల్ వంటింట్లో వెళ్ళి సుమతిని అడిగి కాఫీలు పట్టుకెళ్ళాడు.

గిరి కాఫీ అందుకుంటూనే "ఛీ! ఇదేం పనోయ్! తప్పుకదూ. అల్లు పరువు తీస్తున్నావు" అని విసుక్కున్నాడు.

"ఓసారి మా ఆఫీస్‌లో అటెండర్ పెళ్ళికెళ్ళాను. అతనుకూడా సూ కావాలనీ, ఒంటెమీదే వూరేగుతాననీ పట్టుబడితే అలాగే కానిచ్చార ఆడపెళ్లివారు. అలా వుండాలి పెళ్లికొడుకు హోదా అంటే" అన్నాడ శంకర్.

"ఆ మావగారెవరో అదృష్టవంతుడు! ఆయన వీపుమీదెకి ఊరేగుతాననలేదు ఆ పెళ్ళికొడుకు" అన్నాడు ఇంద్రనీల్.

"అబ్బో... చతురుడివేనే" నవ్వాడు గిరి. గోపాలరావు మాత్ర ఇంద్రనీల్‌కి కళ్ళతోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

రాత్రి పక్కలసమస్య మొదలయింది. మావగారింటికొచ్చినప్పుడు గ ఏర్పాటు లేకపోతే ఎలా? అని మొండిపట్టు పట్టారు అల్లుళ్ళు.



హాల్లో ఒకళ్లకీ, పడకగదిలో ఒకళ్ళకీ ఏర్పాటుచేసి గోపాలరావుకి వరండాలో మంచంవేసి చాప, బొంతా పట్టుకుని పెరట్లోకి వెళ్ళింది శక్తి.

"రావోయ్ పెళ్ళికూతురా..."అన్నాడు ఇంద్రనీల్.

"ఈ చాప నేను వేసుకుంటాను. నువ్వు బొంతమీద పడుకో. మళ్ళీ తెల్లవారుఝామునే లేవాలి. పాలవాడొస్తాడు" అంది.

"అది సరేకానీ... మీ బావలు మన పెళ్ళయ్యాక కూడా వుంటారా?" అడిగాడు.

"ఏం?" అంది.

"అబ్బే! ఫస్ట్‌నైట్ కూడా ఇలా ఎగుడూ దిగుడూ గతుకుల నేలమీదే ఏమోననీ..." నసిగాడు.

శక్తి పక్కలు వేస్తున్నదల్లా ఆగి, సీరియస్‌గా చూసింది.

ఇంద్రనీల్ ఆమె కళ్ళలోకి భయంగా చూసి "ఇక్కడ మాత్రం ఏం తక్కువలే శక్తీ! నిండా లైట్లు పెట్టినట్లు నక్షత్రాలూ... నెలవంక, సూరీడు సిరిగల దొరలే కాదులే... పూరిగుడిసెల్లో, పేదముంగిట్లో వెలిగేటి దీపాలులే...!" అని రాగం తీశాడు.

శక్తి చిరునవ్వు నవ్వి "అటువంటి సమస్య నీకు రాదు. పెళ్ళవగానే మన యింటికి వెళ్ళిపోదాం" అంది.

"ఎప్పుడు ఇల్లు చూశావు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఓ వారం క్రితమే! ఆ ఇంటివాళ్ళకి కూడా పెళ్ళికిముందే ఇల్లు చూసుకోవడం చాలా ఆశ్చర్యం కలిగించింది" అంది.

"వంటగదీ అదీ నేను వచ్చి చూసుకోకుండానే సెటిల్ చేసేశావా?" అడిగాడు.

శక్తి ఫక్కున నవ్వేసింది.

"గుప్పెడు మల్లెలు రువ్వినట్లు ఎంత హాయిగా నవ్వుతావు శక్తీ" అన్నాడు.

"కాదు... రాళ్ళు రువ్వినట్లు నవ్వుతాను. జీవితాంతం భరించాలి" మొండిగా అంది.

"పళ్ళున్న చెట్టుకేగా రాళ్ళు! కానీ..." అన్నాడు పక్క సరిచేసుకుంటూ.

"పొద్దుట లేవాలి. పాలవాడొస్తాడు" గుర్తుచేసింది శక్తి.

"లేవక ఛస్తానా? ఎవరి పెళ్ళి మరీ" అని పడుకుని "ఈ దుప్పటి కప్పి వెళతావా?" అడిగాడు.

"నేనా?" ఆశ్చర్యంగా అడిగింది.

"కాదు. పక్కింటి అమ్మాయిని అడిగాను" వెక్కిరింతగా అన్నాడు.

"సరే... సరే... ఎందుకంత అలకా?" శక్తి నవ్వుతూ వచ్చి దుప్పటి తీసి మెడదాకా కప్పింది. ఆమెచేతిని అలాగే పట్టుకుని పైకి లాక్కున్నాడు. అదాటుగా అతనిమీద పడేసరికి ఆమెనుదురు అతని పెదవులకి తగిలింది.

"నుదుటిమీది ముద్దు పాపిట పిందె" అన్నాడు.

శక్తి లేవబోతుంటే చెంపలు ఆమె నోటికి ఆనించి "చెంపకి పెదవులు ఆనితే చెంపస్వరాలు, పెదవులకి పెదవులు ప్రేమ తాంబూలాలు... చూడు ఎలా పండుతాయో!" అంటూ ఆమె లేత పై పెదవిని తన నోటిలోకి తీసుకుని మునిపంట చిన్నగా నొక్కి వదిలాడు.

శక్తి చిన్నగా అరిచింది.

"చూశావా ఎలా పండిందో ఎర్రగా" నవ్వుతూ అన్నాడు.

ఆ తొలిస్పర్శకీ, పులకింతకీ ఆమె పలుకురాని పైడిబొమ్మే అయింది. ఆమెలోని సర్వశక్తులూ అతను పీల్చేసినట్లు అచేతనంగా వుండిపోయింది.

"బావుందా?" నవ్వుతూ అడిగాడు.

శక్తికళ్ళు అతనికళ్ళతో కలుసుకున్నాయి.

ఇంతకాలం నేను "మొగుడంటే పులుసూ, కూరా, మల్లెమొగ్గలూ, పట్టుచీరలూ, కీచులాటలూ, రాజీపడటాలూ అనుకున్నాను. చాలా వుందే" అన్నట్లు చూసింది.

'ఇప్పుడేం చూశావు? ఇంకా చాలావుంది" అన్నట్లు అతను కళ్ళతో జవాబిచ్చాడు.

ఆమె చప్పున సిగ్గుపడి అక్కడినుంచి లేచి తన పక్కమీదకి వెళ్ళి పోయింది.

"మొత్తం సిగ్గంతా ఈ రాత్రి ఖర్చు చెయ్యి. రేపటికి ఏమీ మిగల్చకు. గుడ్‌నైట్!" ఆవలిస్తూ అన్నాడు.



"గుడ్‌నైట్" అప్పటికే సిగ్గుతో దుప్పటి ముసుగేసిన ఆమె లోపలినుంచే చెప్పింది.

పెద్దబావా, చిన్నబావల అలకలతో గోపాలరావు బతిమిలాటలతో శక్తీ, ఇంద్రనీల్‌ల పెళ్ళి ఆర్భాటంగా, హంగామాగా జరిగిపోయింది.

"చీర చెరంగులు ముడియిడి
కూరిమి చిటికెనలు పట్టి,
కొనగూరి చితా దారం జోతిని గడునిం
పొరగ మ్రొక్కించి రప్పుడాలిన్ మగనిన్..."

అన్నపద్యం తలుచుకుంటూ అరుంధతీ నక్షత్రానికి మొక్కారు దంపతులు.

శక్తి, ఇంద్రనీల్ చెవిలో "అరుంధతికి సరిగ్గా దణ్ణం పెట్టుకో. మనమధ్య పోట్లాటలు రాకూడదని" అంది.

"వశిష్టులవారు ఎంత అనుకూలురు కాకపోతే అరుంధతికి పతివ్రతగా ఇంత పేరొస్తుంది" అన్నాడు గుసగుసగా.

శక్తి మూతి తిప్పేసింది.

ఆ రాత్రి...

"ఈ రోజుకి పెరట్లో పడుకుందామండీ... మా చెల్లెలికీ, మరిదికీ గది కావాలి" అంది అరుంధతి శంకర్‌తో.

"నోర్ముయ్! వెర్రిమొహమా! నేనేమైనా పెద్దపాలేరునా పెరట్లో పడుకోవడానికీ? ఇంతకీ అరిశలూ, సున్నుండలూ బావున్నాయి. స్వగృహా పుడ్సా?" అడిగాడు ఫలహారం కానిస్తూ.

"అయ్యయ్యో.. అవన్నీ వాళ్ళకండీ" కంగారుపడింది అరుంధతి.

అతను కీచుగా నవ్వి "అందుకే నిన్ను ముద్దుగా పిచ్చిముండా అంటాను. వాళ్ళకి స్వీట్లు తినటానికి తీరికెక్కడుంటుందే?" అన్నాడు.

అరుంధతి అసహాయంగా చూస్తూ నిలబడింది.

సుమతి కూడా శంకర్‌తో "పదండి.... బయట నాన్నతోపాటే వరండాలో సర్దుకుందాం. ఈరోజు వాళ్ళని వసారాలోనో, పెరట్లోనో పడుకోమంటే బావుండదు" అంది.

"పెళ్ళయి ఇన్నేళ్ళయినా మీ పెద్దబావకైతే రూం యిస్తారు కానీ నన్ను మాత్రం దొడ్లో పడుకోమంటావా? నేనంటే మీకు ఎంత అలుసూ? చూపిస్తా నా తడాఖా" అంటూ గిరి గదిలోవున్న సామాన్లన్నీ చిందరవందర చేస్తూ వీరంగం చేశాడు.

గోపాలరావు లోపలికెళ్ళి అతని గెడ్డం పట్టుకుని శాంతింపచేశాడు.

ఈలోగా లోపల్నుంచి శక్తీ, ఇంద్రనీల్‌లు చిన్న సూట్‌కేస్‌తో వచ్చారు.

"మీకు ఎవరికీ మావల్ల యిబ్బంది లేదు. మేం మా ఇంటికి వెళ్ళిపోతున్నాం" చెప్పింది శక్తి.

"ఇంత రాత్రా?" అడిగింది అరుంధతి.

"ఔను. రాత్రి అనేగా మీ భర్తలకి సమస్యగా మారిందీ విషయం. అందుకే పరిష్కారం నేను ముందే ఆలోచించి పెట్టుకున్నాను" అంది.

సుమతి శక్తిమతిని దగ్గరగా తీసుకుని కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"వెళ్ళొస్తాం నాన్నా" శక్తి, ఇంద్రనీల్‌లు గోపాలరావు కాళ్ళకి నమస్కరించి ఇంట్లోంచి వెళ్ళిపోయారు.

అరుంధతి వెనకాలే వెళ్ళి ఓ ప్యాకెట్ అందిస్తూ స్వీట్లూ, అగరుబత్తీల ప్యాకెట్టూ, మల్లెపూలూ" అంది.

శక్తి నవ్వి "థాంక్స్ అక్కా" అని అందుకుని ఆటోలో ఎక్కి కూర్చుంది.

ఇంద్రనీల్‌కూడా ఎక్కాక ఆటో వాళ్ళ కొత్తఇంటివైపు వుల్లాసంగా దూసుకు పోయింది.

❖ ❖ ❖

"కుడికాలు ముందుపెట్టు" శక్తి తాళంతీస్తూ ఇంద్రనీల్‌కి చెప్పింది.

ఇద్దరూ కుడికాలు ముందు లోపలికి పెట్టి అడుగుపెట్టారు. లోపలంతా చీకటి. ఏమీ కనిపించడంలేదు.

"లైటెయ్యి" అంది శక్తి.

ఇంద్రనీల్ గోడలన్నీ చేత్తో రాస్తూ "ఎక్కడా కనపడందే..." అన్నాడు.

"నన్ను కాదు! గోడని తడుము" శక్తి విసుగ్గా అరిచింది.

"ఓ... అది నువ్వా?" శక్తి వంటిమీదనుంచి చెయ్యితీసి గోడని తడిమి "దొరికింది"అన్నాడు.



"లైటు వెయ్యి. ఇంకా ఆలస్యం ఏమిటి మరి?" అంది శక్తి.

"స్విచ్ వేశాను. కానీ వెలగలేదు" అన్నాడు.

"ఏం? కరెంట్ లేదా?"

"కాదు... బల్బు లేదు" తాపీగా చెప్పాడు.

శక్తి చిరాగ్గా "ఛీ! ఇంటివాళ్ళు అదికూడా మన ఖర్చే అనుకున్నారా?" అంది.

"ఇప్పుడేం చేద్దాం?" చీకటిలోనే ఇంద్రనీల్ అడిగాడు.

"ఇంత రాత్రివేళ వాళ్ళని లేపితే బావుండదు కానీ సూట్‌కేస్‌లోంచి ఓ జంపఖానా తీసి పరు. మనమే ఎడ్జస్ట్ అయిపోదాం" అంది.

"ఇంత చీకట్లో ఫస్ట్ నైటా..." నసిగాడు.

"చెప్పినట్లు చెయ్యి" అరిచింది.

ఇంద్రనీల్ ఆమె చెప్పినట్లే చేసి "ఇంక పడుకుందామా?" అన్నాడు.

శక్తి ఆవలిస్తూ "వారంనుంచీ ఈ పెళ్ళిపనులవల్ల పూర్తిగా అలసిపోయాను" అంది.

అతను చీకట్లో ఆమె దగ్గరగా జరుగుతూ "మీ అక్క యిచ్చిన పూలు పెట్టుకో... జడ ఏదీ?" అడిగాడు.

శక్తి విసుగ్గా "కన్ను పొడుచుకున్నా కానరాని చీకట్లో ఇప్పుడు నా జడ కావల్సి వచ్చిందా నీకు?" అనరిచింది.

"సరే... వద్దులే.. నా చేతికి చుట్టుకుంటాను. మంచి వాసన వస్తున్నాయి. శక్తీ... నీ బుగ్గలు ఎంత మృదువుగా వున్నాయీ..." వేలితో రాస్తూ అన్నాడు.

"అవి నా అరికాళ్ళు కానీ... తెల్లారాక విపులంగా చూద్దువుగాని... ఇప్పుడు పడుకో" అంది.

అతను మాటలకోసం వెతుక్కుంటూ "ఇది... ఇది మన ఫస్ట్‌నైటా?" అన్నాడు.

"బ్రహ్మాండమైన ఓపెనింగ్" కస్సుమన్నట్లు చెప్పింది.

"ఆశావాది ప్రతి విషయంలో అవకాశం వెతుక్కుంటాడు. చీకటైతే మాత్రం ఏమిటి?" ఆమెకు దగ్గరగా జరుగుతూ అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

అతను చీకట్లో ఆమెని తడుముతూ "అబ్బా! మరీ అంత మోటు సరసమా?" అని అరిచాడు.

"సరసమా? నేనేం చేశాను?" శక్తి ఆవలించి అడిగింది.

"చేతిమీద అంత గట్టిగా గిచ్చావేంటీ? చూడు... ఎలా చురుక్కుమంటోందో?" వూదుకుంటూ అన్నాడు.

"చురుక్కుమనటం ట్యూబ్‌లైట్ వెలుతురులో చూసినా కనపడదు కానీ... నేనేం గిచ్చలేదు."

"ఆ! మరి ఎవరు గిచ్చారూ?" కంగారుగా అడిగాడు.

"ఏ తేలో, మండ్రగబ్బో కుట్టివుంటుంది" ఆమె మాట పూర్తి అయ్యేలోగానే అతను గావుకేక పెట్టి "అమ్మో... ఇప్పుడు నేనేం చెయ్యాలి?" అడిగాడు.

"నాకు మంత్రం వచ్చు. విషం పైకెక్కకుండా ఆపుతానుగానీ... మాట్లాడకుండా పడుకోవాలి మరి!"

"సరే..." బుద్ధిగా పడుకున్నాడు.

శక్తి అతనిచెయ్యి పట్టుకుని మెత్తగా రాస్తూ ఏదో మంత్రం చదివింది. "దిగిందా...?" అడిగింది.

నెప్పి చాలావరకూ తగ్గినట్లే అనిపించి "ఊ" అని మూలిగాడు.

"మాట్లాడితే విషం గబగబా ఎక్కేస్తుంది. మాట్లాడకుండా పడుకో" అంది.

అతను "ఊ" అనడానికికూడా జంకి మెదలకుండా పడుకున్నాడు.

"మొదటిరాత్రే మొగుణ్ని మోసం చేసేయాల్సొచ్చింది" అనుకుంటూ శక్తికూడా ఇంకోవైపుకి తిరిగి పడుకుంది.

అలసిపోయిన ఆ ఇద్దరూ అతి త్వరగా నిద్రలోకి జారిపోయారు.

❖ ❖ ❖

తూరుపుదిశ నుంచి వచ్చిన వేటగాడు గురిచూసి బాణం విసిరినట్లు సూర్యకిరణం ఒకటి సూటిగా వచ్చి మొహంమీద పడేసరికి శక్తి కళ్ళు తెరిచింది.



గదంతా తట్టుకోలేనంత వెలుగ్గా వుంది. గబుక్కున కళ్ళు మూసేసుకుని మళ్ళీ వెలుతురికి అలవాటు పడుతూ నెమ్మదిగా కళ్లు తెరిచింది.

కళ్ళు తెరవగానే ఎదురుగా కాసంత బొట్టు పెట్టుకుని, పండిన తలతో పెద్ద ముత్తయిదువలా మామ్మగారు కనిపించారు. ఆవిడ పక్కనే విభూతి కట్లతో నంబియార్‌లా తాతగారు దర్శనం యిచ్చారు. వాళ్ళని చూసి అదాటుగా లేవబోయింది కానీ వీలుకాలేదు.

ఇంద్రనీల్ ఆమె నడుంచుట్టూ చేయివేసి, కాళ్ళతో కాళ్ళని మెలిపెట్టి ఆమెని కదలలేనిస్థితిలో వుంచాడు.

శక్తికి చచ్చేటంత సిగ్గేసింది. కసుక్కున అతని చేతిమీద గిచ్చి "లే... లేచి కూర్చో... వాళ్ళు వచ్చారు" అంది.

"ఇంత పొద్దుటే తలుపు తియ్యవద్దని వాళ్ళతో చెప్పు" కదలకుండానే చెప్పాడు.

"తలుపులు వేస్తే కదా బాబూ నువ్వు తియ్యడానికీ!" మామ్మగారు ఘొళ్ళున నవ్వుతూ అంది.

ఆ నవ్వుకి, తను ఏ చెట్టుకిందో పడుకుని వుండగా, ఆ చెట్టుకొమ్మ ఫెళఫెళమని విరిగిపడుతుందేమోనన్న భ్రాంతితో అమాంతం లేచి కూర్చున్నాడు.

శక్తికూడా లేచి, స్థానభ్రంశం అయిన చీర సర్దుకుంటూ "రాత్రి చాలా ఆలస్యంగా వచ్చాము. లైట్లు లేవు. అందుకే... తలుపులసంగతి చూసుకోలేదు" అని నసిగింది.

"కొత్తల్లో అవన్నీ ఏం చూసుకుంటార్లే..." తాతగారు శ్లేషగా అంటూ మామ్మగారివైపు చూశారు.

ఆవిడ అమాంతం సిగ్గుపడి మొహం అంతా సొట్టలు పడేసుకుంది.

శక్తి ఇంద్రనీల్‌తో "మొహం కడుక్కో... సామానులు తెచ్చుకుని వంట మొదలుపెట్టొచ్చు" అంది.

"ముందు ఇంట్లోకి బల్బులు కొని తేవాలి" విసుగ్గా అన్నాడు.

శక్తి క్రీగంట అతను చేతిని వూదుకోవటం చూసి నవ్వుకుంది.

"అదిగోనమ్మా బావి... మీరు కొనుక్కునేవరకూ మా తాడూ, చేదా వాడుకోండి" ధారాళంగా దానం చేస్తున్నట్టు అంది మామ్మగారు.

ఇంద్రనీల్ బ్రష్ తీసుకుని బాత్‌రూంలోకి వెళ్ళి, అక్కడనుంచి "శక్తీ... శక్తీ..." అని అరిచాడు.

"ఏమిటీ?" శక్తి అటు వెళ్ళింది.

"ఈ తలుపుకి బాత్‌రూం లేదు" అరిచాడు.

శక్తి చిరాగ్గా "ముందు సరిగా మాట్లాడటం నేర్చుకో. ఈ బాత్‌రూంకి తలుపు లేదు అనాలి" అంది.

"అబ్బ... నేను సరిగానే అంటున్నాను. ఈ తలుపుకి బాత్‌రూం లేదు. కావలిస్తే చూడు" అతను తలుపు తీసి చూపించాడు.

అటుపక్క ఓపెన్‌గా పెరడు వుంది.

"ఇదేమిటి? ఈ తలుపుతీస్తే బాత్‌రూం వస్తుందా అంటే అవునన్నారే?" విస్మయంగా చూస్తూ అంది శక్తి.

మామ్మగారు వచ్చి "పెరట్లో నిమ్మచెట్టుకీ, అరటిచెట్టుకీ నీళ్ళందుతాయని ఈ వాటాలోవాళ్ళకి అలా ఏర్పాటు చేశాం. మరుగుదొడ్డి అటుచివర వుంది. అదిమాత్రం నాకూ, మీకూ, మీనాక్షి వాళ్ళకి కామన్" అంది.

శక్తి కోపంగా "చూడండీ... తలుపు లేకపోతే చీర అడ్డు పెట్టుకుని అవసరం గడుపుకుంటాం. కానీ అసలు స్నానాలగదే లేకపోతే బంగన బయలుగా ఎలా చేస్తాం? కనీసం దడైనా కట్టించాలిగా?" అంది.

"అలాగేనమ్మా! అడ్వాన్స్‌గా ఓ అయిదువేలు పారేయ్! రేపీపాటికి కట్టించనూ..." అన్నాడు తాతగారు.

శక్తి లోపలికి వెళ్ళి బ్యాగ్ తెరిచి విసురుగా డబ్బు తీసి లెక్కపెడుతుంటే ఇంద్రనీల్ వచ్చి "ఆవేశపడకు. అటువైపు ఎవరూ రారంటున్నారు కదా... అడ్జస్ట్ అయిపోదాం" అన్నాడు.

శక్తి చురుగ్గా చూసి "డబ్బు వ్యవహారాలు నీకు సంబంధించినవి కావు. నీ పని నీవు చూస్కుంటే మంచిది" అంది.

అతను తలవంచుకుని వెళ్ళిపోయాడు.

శక్తి డబ్బును తాతగారి చేతిలోపెట్టి "రేపు ఈపాటికల్లా బాత్‌రూం కట్టిస్తానన్నారు. ఆ పని చూడండి" అని హెచ్చరించింది.

"ఆ! అలాగే...రంగనాయకీ! అమ్మాయికీ, అబ్బాయికీ మంచి కాఫీ పెట్టి పట్రా" అంటూ ఆయన హుషారుగా డబ్బులు జేబులో కుక్కుకున్నాడు.



మామ్మగారు ఆ పని చూడటానికి తమ వాటాలోకి వెళ్ళింది.

తాతగారు ఇంద్రనీల్‌తో "బాబూ! మీకు న్యూస్‌పేపర్ చదివే అలవాటు వుందా?" అని అడిగాడు.

శక్తి విసవిసా వచ్చి "మాకు న్యూస్ పేపరున్నా, రేడియో వున్నా, టీ.వీ.కలర్‌ది అయినా... ఎవరితో కలసి పంచుకునే అలవాటు లేదు" అంది.

ఆయన చిన్నబుచ్చుకుని కండువా ఓసారి దులిపి వేసుకుని "ఆ గుండ్రాయి చూశావా... అది మేం కుంకుడుకాయలు కొట్టుకునేది. అది మీరు వాడకూడదు. అలాగే ఆ మూల నేలలోకి దిగేసిన రుబ్బురోలు కూడా!" అన్నాడు. ఇంట్లోకి వెళుతూ "పంచుకోవడం తెలీని పిల్లమూక. ఎలా బతుకుతారో ఏమో!" అని గొణిగాడు.

ఇంద్రనీల్ మొహం తుడుచుకుంటూ లోపలికి వచ్చి "మొదటిలోనే అంత గట్టిగా మాట్లాడకుండా వుండాల్సింది" అన్నాడు.

"నీకు తెలియదు. ఎవర్ని ఎక్కడ వుంచాలో అక్కడే వుంచాలి" గట్టిగా చెప్పింది శక్తి.

అతను ఆమెను ఓసారి చూసి "సరే... నేను బావి దగ్గరకెళ్ళి నీళ్ళు తోడి తెస్తాను. స్నానాలుచేసి బజారుకి పోవాలిగా" అన్నాడు.

"ముఖ్యంగా తాడూ, బొక్కెనా కొనాలి. వేరేవాళ్ళవి వాడటం నాకు యిష్టం వుండదు" అంది.

ఇంద్రనీల్ బావిదగ్గర నీళ్ళు తోడుతుండటం చూసి మాసిన గడ్డంతో, నీరుకావిరంగు పంచెతో వున్న ఒక వ్యక్తి అటు వచ్చాడు.

"మీరేనా ఈ వాటాలో దిగిందీ?" అన్నాడు.

"అవును" అన్నాడు నీళ్ళు తోడుతూనే ఇంద్రనీల్.

"మీ ఆవిడ ఉద్యోగం చేస్తుందటగా!" అన్నాడు.

"అవును."

"మా ఆవిడ కూడా. నాపేరు సదానందం. మీ పేరు?"

"ఇంద్రనీల్."

"మేం అవతల పక్కవాటాలో వుంటాం. నన్ను అందరూ మీనాక్షి మొగుడంటారు. ఎందుకంటే, మా మీనాక్షి డబ్బు సంపాదిస్తుంది కదా!

అందుకూ! డబ్బుకే గానీ మనిషికి విలువ లేదీలోకంలో. నేనంటే వేలిముద్ర గాణ్ని. మరి మీరో?" అన్నాడు.

"నేను గ్రాడ్యుయేట్" చెప్పాడు ఇంద్రనీల్.

"మరి చక్కగా ఏ ఫ్యాన్‌కింద కూర్చునే ఉద్యోగమో చేసుకోవచ్చుగా?" ఉచితసలహా పారేశాడతను.

ఇంద్రనీల్‌కి తెలుసు తను రేపటినుంచీ ఇలాంటివి అనేక ప్రశ్నలు ఎదుర్కోవలసి వస్తుందని. అందుకు అతను సంసిద్ధుడై వున్నాడు.

"నాకు ఉద్యోగగండం వుంది" అన్నాడు.

"ఆ!" నోరు తెరచి అలాగే వుండిపోయాడు సదానందం.

"అవును. జలగండంలాగే ఇదీనూ. ఓ ప్రముఖ జ్యోతిష్కుడు చెప్పాడు. నోరు మూయచ్చు" అని బకెట్‌తో నీళ్ళు పట్టుకుని తమ పోర్షన్‌వైపు వెళ్ళిపోయాడు ఇంద్రనీల్.

"మళ్ళీ కలుస్తాను ఇంద్రనీల్‌గారూ! ఏమిటో... ఎంత మంచిపేరున్నా ఏంలాభం? రేపటినుంచీ శక్తిగారి మొగుడంటారు పాపం!" అని సదానందం అనటం అతనికి వినపడింది.

❖ ❖ ❖

శక్తి మంచంమీద బోర్లాపడుకుని ఇంగ్లీష్ మ్యాగజైన్ చదువుతూ "ఏదో మాడుతున్న వాసన వస్తోంది" అని అరిచింది.

వంటగదిలో పోపు వేయిస్తున్న ఇంద్రనీల్ "ఆ... మాడబోయింది. ఆపేశానులే... నువ్వు చదువుకో" అన్నాడు.

ఇంతలో తలుపుమీద టకటకా... కొట్టిన చప్పుడైంది.

శక్తి తలెత్తి చూసింది.

ఆకుపచ్చరంగు వెలిసిన నేతచీరలో, తలంటుకున్న జుట్టుని చివర్న ముడేసి, నుదుట తిలకంబొట్టూ, దానిమీద విభూదీ, కింద కుంకుమ బొట్టూ పెట్టుకుని, చిరునవ్వే ఆభరణంలా మొహమంతా పులుముకుని ఒక స్త్రీ తలుపుదగ్గర నిలబడి వుంది. ఆమెచేతిలో చిన్న స్టీలుభరిణ వుంది.

"లోపలికి రండి" అప్రయత్నంగా ఆమెని మన్నించింది శక్తి.



"నాపేరు మీనాక్షి. వెనకాలవైపున వుంటున్నాం. సంగీతం టీచర్‌గా రామకృష్ణా మఠంవారి స్కూల్లో పనిచేస్తున్నాను. ఇద్దరుపిల్లలు. ఒకరు ఆడా, ఒకరు మొగా" అని గడగడా చెప్పింది.

"నాపేరు శక్తిమతి" చెప్పింది శక్తి.

"బ్యాంక్‌లో ఉద్యోగమటగా! అదృష్టవంతులు" అంది మీనాక్షి.

శక్తి చిన్నగా నవ్వి "ఇంద్రనీల్... కాఫీ పట్రా" అంది.

మీనాక్షి లోపలికి చూస్తూ "ఎవరున్నారు లోపలా?" అంది.

"మా ఆయన" అంది శక్తి.

మీనాక్షి అప్రయత్నంగా గుండెలమీద చెయ్యేసుకుని "అమ్మో! ఆయన్నా మీరు కాఫీ తెమ్మన్నదీ? ఆయన ఏవీ అనుకోరా?" అంది.

"కాఫీనేగా తెమ్మన్నదీ. అందులో తప్పేంవుందీ?" నవ్వుతూ అడిగింది శక్తి.

"అయ్యబాబోయ్... మా ఆయనైతే కాఫీ తెమ్మనడం కాదు. అక్కడ పెట్టాను తీసుకోండి అన్నా తప్పు పడతాడు. అన్నింటికి అలిగి, "నేనేం సంపాదించడం లేదనేగా నీకింత అలుసూ!" అని సాధించి చంపుతారు" అంది.

ఇంద్రనీల్ రెండు కప్పులతో కాఫీ తెచ్చాడు.

అతడ్ని చూడగానే మీనాక్షి ఠక్కున లేచి నిలబడి "నమస్కారం అన్నయ్యగారూ" అంది.

'ఆడవాళ్లు యిలా మగవాళ్ళని చూడగానే భయపడిపోయి వరసలు కలపడం ఎందుకో' అనుకుని శక్తి నవ్వుకుంది.

"నమస్తే! ఈ చెల్లెమ్మ ఎవరూ...?" శక్తిని అడిగాడు.

"వెనుకవైపు వాటాలో వుంటారట. మీనాక్షిగారు" అంది శక్తి.

"ఓ... సదానందంగారి భార్యా మీరు?" అన్నాడు.

"ఆ సదానందంగారు నీకు చిన్నప్పటినుంచీ తెలుసా?" శక్తి నడుంమీద చేతులు పెట్టుకుని కనుబొమలు చిట్లించి అడిగింది.

"అబ్బే! నీళ్ళు తోడుతున్నప్పుడు వచ్చి మాట్లాడారు. అంతే..." అన్నాడు.

"మరి ఆవిడ తన పేరు మీనాక్షి, వెనక వాటాలో వుంటాను... అని చెప్పాక కూడా 'సదానందంగారి భార్య' అనే డిగ్రీ ఎందుకూ? ఆ బిరుదువల్ల అదనంగా ఏదైనా లాభం చేకూరిందా నీకు? మనుషుల్లో ఈ జాడ్యం ఎప్పుడు పోతుందో? ఎదురుగుండా వున్నవాళ్ల మీదకంటే వాళ్ళు ఎవరికో తోడికోడలనో, మేనల్లుడనో లేక ఒక వేలువిడిచిన చుట్టమనో గుర్తింపు ఇవ్వడం అలవాటయిపోయింది" కటువుగా అనేసింది శక్తి.

ఇంద్రనీల్ అటూ యిటూ చూసి "కాఫీ చల్లారిపోతుంది శక్తీ..." అన్నాడు.

మీనాక్షి ఈ పరిస్థితికి తట్టుకు నిలబడలేకా, జీర్ణించుకోలేకా, నానా అవస్థా పడుతూ ఇంద్రనీల్‌వైపు జాలిగా చూసింది.

ఇంద్రనీల్ నవ్వుతూ కాఫీ అందించాడు.

మీనాక్షి కాఫీ తాగి, ఏ అవసరం వచ్చినా సంకోచించకుండా తనని అడగమని శక్తికి చెప్పి వెళ్ళిపోయింది.

"వంట అయిపోయింది" ఇంద్రనీల్ వంటింట్లోంచి వచ్చి శక్తికి చెప్పాడు.

"అయిపోయింది కాదు. పూర్తయింది అనాలి" అంది ఆమె.

ఇంద్రనీల్ పెరట్లోంచి రెండు అరటిఆకులు తీసుకొచ్చి కడిగి పరిచాడు.

శక్తి మోకాళ్ళమీద గెడ్డం ఆనించుకుని కూర్చుని, అతని చర్యలు గమనించసాగింది.

"దోసకాయ పప్పులో కొత్తిమీర వేసి నిమ్మకాయ పిండితే బాలమురళీ కృష్ణ ర్యాప్‌సాంగ్ పాడినట్లు రంజుగా వుంటుంది" అన్నాడు.

శక్తి అది వూహించుకుని పకపకా నవ్వింది.

"చారులో చారెడు మెంతులు వేశాను. చాలాయో, లేదో?" అన్నాడు.

ఆమె భయంగా "చారెడు మెంతులా?" అంది.

"ఏం చాలవా?" అడిగాడు.

ఆమె ఏమీ అనలేక అలాగే చూస్తుండిపోయింది.

అతను వడ్డిస్తూ "ఏదో కొత్త. చేతనయినట్లు చేశాను. రేపటినుంచీ నేర్చుకుంటాను. ఏమీ అనుకోకు... సర్దుకో" అన్నాడు.



ఆమె మాట్లాడకుండా కలుపుకుని తినసాగింది.

అతనుకూడా ముద్ద నోట్లో పెట్టుకుని "శక్తీ... అసలు పప్పులో ఉప్పులేదు. చెప్పవేం!" అన్నాడు.

"ఈ రోజుకి సర్దుకోమన్నావుగా... రేపటినుంచీ కరెక్ట్‌గా చేస్తానన్నావుగా" అంది.

"అవును" అతను నవ్వేశాడు.

"కాదు! ఈరోజు సాయంత్రంనుంచే నేర్చుకో" అంది.

అలా ఎందుకు అందో చారు నోట్లో పెట్టుకున్నాక అతనికి అర్థం అయింది.

వాళ్ళు భోజనాలు పూర్తిచేశాక అక్కడంతా శుభ్రం చేస్తుండగా మామ్మగారు నవనవలాడే లేత సొరకాయ పట్టుకుని "అమ్మాయ్ శక్తీ..." అంటూ లోపలికి వచ్చింది.

"రండి మామ్మగారూ..." అన్నాడు ఇంద్రనీల్.

మామ్మగారు వచ్చి స్టూల్‌మీద కూర్చుంటూ "ఎవరో తాతగారికి నాలుగు సొరకాయలు యిచ్చి పంపారట. ఒకటి మీకు తెచ్చాను. దీన్ని అంటుపులుసు పెట్టి వండితే భలే పసందుగా వుంటుందిలే" అంది.

"అవును మామ్మగారు. సాయంత్రం వండుతాను" ఇంద్రనీల్ అందుకుంటూ అన్నాడు.

శక్తి వెంటనే "నీకు తెలుసా దాన్ని వండటం?" అని అడిగింది.

"తెలీదు. మామ్మగారు ఇప్పుడు నేర్పిస్తారుగా" అన్నాడు.

"దానికేం భాగ్యం నాయినా!" మామ్మగారు ఎంతో ఆసక్తిగా చెప్పడానికి తయారయిపోయింది.

శక్తి బ్యాగ్ అందుకుంటూ "నేను ఓసారి తారా వాళ్ళింటికెళ్ళొస్తాను" అని బయటికి వెళ్ళిపోయింది.

"మీరు చెప్పండి మామ్మగారూ..." ఇంద్రనీల్ పుస్తకం, పెన్నూ తెచ్చుకుని కూర్చున్నాడు.

❖ ❖ ❖

"రాత్రంతా అలా వ్యర్థంగా గడిచిపోయిందా?" తార బుగ్గన చెయ్యేసుకుని ఆశ్చర్యంగా అడిగింది.

శక్తి స్నేహితురాలి మొహంలోకి చూడలేక తలవంచుకుని కూర్చుంది.

"అలా ఎందుకు చేశావు? ఎన్ని రాత్రులు ఆపాలనుకుంటున్నావు?" తార గట్టిగా అడిగింది.

శక్తి నెమ్మదిగా తలెత్తింది. ఆమెలో గాంభీర్యం స్థానే దైన్యం, బింకం స్థానే భయం కదలాడాయి.

"తారా! నాకు మగవాడంటే... భయం..." అంది.

"బాగానే వుంది వరస! మరి పెళ్ళెందుకు చేసుకున్నావు?" తార కోపంగా అడిగింది.

"నాన్న వేధింపు తప్పించుకోవాలనీ!"

"మరి నీ బోడి కండిషన్లన్నింటికీ ఒప్పుకుని నిన్ను మనఃస్ఫూర్తిగా కోరుకుని చేసుకున్న అతని సంగతేంటీ? ఇంత స్వార్థపరురాలివనుకోలేను" చిరచిర్లాడింది తార.

"అతను నామీద ఆధిపత్యం చూపిస్తే నేను తట్టుకోలేను" మొండిగా అంది శక్తి.

"మీద చెయ్యి వెయ్యగానే అధికారం చూపిస్తాడనా నీ భయం?" నవ్వుతూ అడిగింది తార.

శక్తి ఔననీ, కాదనీ జవాబివ్వలేక "ఏమో! నాకు తెలియదు..." అంది.

తార దగ్గరగా వచ్చి ఆమె భుజంమీద చెయ్యివేసి, "దాంపత్యంలోని మాధుర్యం ఆ కలయికవల్లే నీకు అవగతమౌతుంది. ఇన్ని జంటలు పొద్దుగూకులూ పోట్లాడుకుంటూ, మళ్లీ ఒక గూట్లోనే కలిసి ఎందుకు కాపురం చేయాలనుకుంటాయీ? అని నువ్వు ఎప్పుడూ విసుక్కుంటావే... అదెందుకో నీకు అర్థం అవుతుంది" అంది.

శక్తి మొహం చిట్లించి "అందరిలో ఒకరుగా మేము కూడా అలా అయిపోతామూ? నేను చచ్చినా అలా సర్దుకోను. అతను నా వ్యక్తిత్వాన్ని గౌరవించకపోయినా, మగవాడిననే అహం చూపించినా నేను భరించలేను" అంది.



తార నవ్వి "నువ్వేది భరించలేవో... ఏది సహించలేవో కాలం చెపుతుంది. ముందు అనవసరమైన అనుమానాలు మాని హాయిగా కాపురం చేసుకో. మల్లెమొగ్గలు మాల కట్టిపెట్టాను. ఇంటికెళ్ళి స్నానం చేసి పెట్టుకో. అడిగానని అనుకోకు... నీకు తెల్లచీర వుందా?" అంది.

శక్తి మొహం ఎర్రబడింది. "ఎందుకే అవన్నీ?" అంది.

"కన్నతల్లి జడ అల్లుతూ మొగుడ్ని ఎలా అల్లుకుపోవాలో చెపుతుంది. అక్కలు తలలో పూలు తురుముతూ మధురోహలు గుబాళించే మార్గాలు చెబుతారు. వరుసకు అత్తలు సరసపు మెలకువలు నేర్పుతారు. పిన్నిలు, పెద్దమ్మలు ముద్దు ముచ్చట్లతో వన్నెలకు చిన్నెలు కూరుస్తారు. పండు ముత్తయిదువులు కడుపు తొందరగా పండాలని దీవించి పంపుతారు.

అందుకే ఆ ముచ్చట్లకి అంతమంది తోడవుతారు. తెల్లచీర... ఏ రాతాలేని పరిశుద్ధమైన కాయితంలాంటి నీ మనసుని అతనిముందు పరుస్తుంది. అతను దానిమీద అనురాగం అనే సిరాతో వలపు సంతకం చేస్తాడు. ఆ కాంట్రాక్టుకి సాక్షులు పంచభూతాలు. మీకు మాత్రమే తెలిసిన మీరు మాత్రమే పంచుకున్న మధురక్షణాలు. నీ జడలో మల్లెలు.... పరిమళించుకున్న మీ సంసార బంధానికి గుర్తులు. నీ కంటికాటుక అతని బుగ్గన దిష్టిచుక్కై వెలవాలి. అతని పంటిగుర్తులు నీ పెదవులలోని మధువుని తాగి వాటి వాడిని తగ్గిస్తాయి. ఈ రుసరుసలు రేపట్నుంచీ 'హుష్... కాకీ!' అయిపోతాయి" అని కిలకిలా నవ్వింది.

"ఏమైనా నీకు చాలా ఓర్పే తారా! పగలంతా ఆఫీసులో చాకిరీ, సాయంత్రం ఇంటికొచ్చినప్పటినుంచీ చాకిరీ. శ్రీధర్ కోపతాపాలూ, ఇంటికొస్తూ పోతూ వుండేవారికి మర్యాదలూ అన్నీ చిరునవ్వుతో చేసుకుపోతావు. అంతేకానీ శ్రీధర్‌తో ఎదురుతిరిగి నీలాగే నేనూ సంపాదిస్తున్నానుగా. ఇవన్నీ నేను ఒక్కదాన్నే ఎందుకు చేసుకోవాలీ? అని అడగవు! నీది గొప్పతనమో, పిరికితనమో నాకు అర్థంకాదు" అంది శక్తి.

"ఇద్దరం సై అంటే సై అని పోట్లాడుకుంటే, రోజూ ఇంట్లో రభసే! ఆ గొడవలో పిల్లల గతేమిటీ? రెండుచేతులూ కలిస్తేనేగా చప్పట్ల మోత వినిపించేది! ఒక చెయ్యి తగ్గిపోతే పోలా?" అంది.

"నీలా నేను సర్దుకుపోలేను" తల విదిలిస్తూ అంది శక్తి.

"సరే... చీకటి పడుతోంది. వెంటనే ఇంటికి వెళ్ళి స్నానంచేసి నేన చెప్పినట్టు తయారవు. చేతులు కలిస్తే చప్పట్లు.... పెదవులు కలిస్తే ముచ్చట్లు... అని మానెయ్యాలని చూడకు" అంది.

శక్తి నవ్వి బయల్దేరబోతూ, "ఏమిటో... అంతా కొత్తగా... కా బెరుకుగా వుందే" అంది.

"పోనీ నేను సాయం రానా?" కొంటెగా అడిగింది తార.

"ఇది ఒకరు సహాయం చేసే విషయం కాదుగా! నేనే కష్టపడతానులే" అంది దిగులుగా.

తార పెద్దగా నవ్వి "పరీక్షకెళ్ళే విద్యార్థిలా ఆ మొహం ఏమిటీ? శ నీ పేరని మర్చిపోయావా? ఆల్ ది బెస్ట్" అంది.

"థాంక్యూ! శక్తి బ్యాగ్ తీసుకుని ఇంటిదారి పట్టింది.

ఏదియో అపూర్వ మధురరక్తి స్ఫురియించు కాని అర్థమ్ము కా భావగీతమ్ములని..." అన్న కవిభావనలా శక్తి కనులు చంచలంగా తిరుగాడసాగాయి.

ఇంద్రనీల్ ఆమె భుజాలని పట్టి తనవైపు తిప్పుకున్నాడు.

"నిన్నటిలా తేలుచేత కరిపిస్తావా?" నవ్వుతూ అడిగాడు.

ఆమె కళ్ళల్లో ఆశ్చర్యం!

అతను నవ్వి ఆమె పాపిటిలో ముద్దుపెట్టాడు.

"ఝాన్సీలక్ష్మికి భయమా?" ఆట పట్టించాడు.

"భయం అని ఎవరన్నారూ?" రోషంగా అడిగింది.

"ఇవి!" వణుకుతున్న ఆమె అధరాల్ని తన వేలితో రాస్తూ చెప్పాడు.

అప్రయత్నంగా ఆమె కనురెప్పలు వాలిపోయాయి.

అతని పెదవుల వెచ్చని స్పర్శ యమునా నదీతీరాన వినిపించి వేణుగానమై ఆమె ఎదసవ్వడిని రాగరంజితం చేసింది.

తల అటూ ఇటూ తిప్పి ఆమె అలరింపు మొదలుపెట్టింది.

చేతుల ముద్రలు శృంగార వేదికని ఆవిష్కరించాయి. నాలుగుపాదా లయ విన్యాసాలు జగతిన మరోకొత్త నాట్యతరంగమై వెల్లివిరిశాయి.



విరించ సవరించ వాణి సిగలోంచి జారిన మల్లె ఒకటి ఆమె పెదవి అంచున సంతుష్టితో కూడిన చిరునగవై వెలిసింది.

పెళ్ళితంతు పూర్తవగానే కొత్త దంపతులచేత బిందెలో మట్టెలూ, ఉంగరం వేసి ఇద్దరూ ఒకేసారి చేతులుపెట్టి వాటిని బైటికి తీయించే ఆట ఆడిస్తారు.

మొదట పెళ్ళికూతురు భయంగా బిందెని తాకుతుంది. రెండవసారి అడుగువరకూ గాలిస్తుంది. మూడోసారి అతని చెయ్యి లోపల తాకగానే గుప్పెటని విడదీసి అందులోని వస్తువులని సొంతం చేసుకుంటుంది. పైకి మాత్రం చుట్టూ వున్నవారికి అమాయకమైన ఆమె ముఖమే కనిపిస్తుంటుంది. ఆటలో ఆత్రం అతనిదైనా... ప్రతిసారీ గెలుపు ఆమెదే! ఊరికే పెట్టలేదు పెద్దలా ముచ్చట్లు. అవన్నీ చెప్పక చెప్పే శృంగారపు తొలిపాఠాలు.

❖ ❖ ❖

శక్తి పెదవుల మీదకి ఆపుకోవాలన్నా ఆగని చిరునవ్వు దూసుకు వస్తోంది. తెల్లవారాక ఇంద్రనీల్‌వైపు చూడాలంటేనే చాలా సిగ్గేసింది. అతని చెయ్యి తాకినా, భుజం తగిలినా ఇంతకుముందు లేని తియ్యని జలదరింపు. ఆఫీస్‌కి లీవ్‌పెట్టి ఇంట్లో వుండాలనే అనిపించింది. కానీ తను మూడేరోజులు లీవ్ పెట్టి ఆ తరువాత ఎక్స్‌టెండ్ చేయడం అందరూ గమనిస్తారేమోనని సిగ్గుతో బయల్దేరి వచ్చేసింది.

తనేదో ఒక్కరోజులో మారిపోయినట్లూ, ఆ మార్పేదో తనలో ఇతరులకి కొట్టవచ్చినట్లుగా ఇబ్బందైన భావన.

చెంపలమీదకి జారుతున్న ముంగురులని సవరించుకునే నెపంతో బుగ్గలమీద ముద్రించుకుపోయిన అతని నఖక్షతాలని స్పర్శిస్తోంది. గుండెలమీద సడి చేస్తూ తనలో అలజడి కలిగిస్తున్న మంగళసూత్రాల్ని మాటిమాటికీ తొంగి చూసుకుంటోంది. చేతికి పచ్చగా మెరుస్తున్న గాజులు, కాలివేళ్ళకి కొత్తగా తొడిగిన మట్టెలూ... అన్నీ ఆమెకు అతడిని పదేపదే గుర్తుచేస్తున్నాయి. పక్కకి తిరగబోతుంటే నడుంనెప్పిగా అనిపించింది. 'అబ్బా... ఎంత మొరటు... అస్సలు నిదానమే లేదు'

మురిపెంగా విసుక్కుంది. చేతిమీద ఎర్రని గాటు... రాత్రి చిట్లిన గాజు తాలూకుది.

కాంపౌండ్ బయట బాదంచెట్టుమీద కూర్చున్న కోకిల ఒకటి ఏదో ముంచుకుపోతున్నట్టు ఒకటే కూత! ప్రాణం తీసేస్తుంది బాబూ! శక్తి కొంగుతో విసురుకుంటూ చుట్టూ చూసింది.

అందరూ ఎవరి పనుల్లో వారున్నారు. వీళ్ళెవరికీ నాకున్నలాంటి బాధలేదా? తన ఆలోచనకి తనకే నవ్వొచ్చింది. ఏమిటో... ఫోన్ మోగినప్పుడల్లా ఉలికిపాటు! ఇంద్రనీల్ తనకి ఫోన్ చేసి వుండలేకపోతున్నాను. వచ్చెయ్యమంటే ఎంత బావుణ్ణు!' అనుకొంది.

లంచ్‌టైంలో తార వచ్చి "దేవిగారికి ఆకలిదప్పులులాంటివి గుర్తొస్తున్నాయా... లేక అతని ధ్యాసేనా?" అంది.

శక్తి మౌనంగా లంచ్ బాక్స్ బైటికి తీసి ఆమెతో నడిచింది.

"ఏమిటే ఆ మౌనం? అసలు ఎంత హుషారుగా వుండాలీ... ఔను ఈ రోజేం తెచ్చావు?" అడిగింది తార.

"తెలీదు" నిర్లిప్తంగా జవాబిచ్చింది.

"అదేం? వంట నువ్వు చెయ్యలేదా?"

"నేనెందుకు చేస్తాను?" విసుగ్గా అడిగింది.

తార వెటకారంగా "శక్తిమతీదేవి వంటచెయ్యదు కదూ! సరే మీ శ్రీవారి శాకపాకలేమిటో కాస్త రుచి చూపించు" అంది.

శక్తి పరమ విసుగ్గా బాక్స్ మూత తెరిచింది.

వెంటనే ఆమె కళ్లు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. చటుక్కున ఆ రెండు వస్తువుల్నీ దాచేసి చీటీమాత్రం తీసి చదివింది.

"వీటిని చూశాకైనా నేను గుర్తుకురాలేదా? వస్తే... హాఫ్‌డే లీవ్‌పెట్టి వచ్చెయ్యి. లేదా.. ఇవి పక్కకి జరిపేసి దిబ్బరొట్టె, ఆవకాయ నంజుకొని తినెయ్. నీ నీల్!"

కోయిల కూతలో మార్పొచ్చింది. ఇంతసేపటికి తాళం కుదిరినట్టు లయగా ఆగి ఆగి కూస్తోంది. శక్తి ఎర్రబడిన ముఖంతో తారవైపు చూసి "అర్జెంటుగా ఇంటికెళ్ళాలి" అంది.



"ఏమైందీ? ప్రాబ్లమా?" తార ఆదుర్దాగా అడిగింది.

"వెళ్ళకపోతే ప్రాబ్లెమ్" చెప్పి మేనేజర్ క్యాబిన్‌లోకి వెళ్ళింది శక్తి.

ఈ తెగిన హుక్కూ... చిట్లిన గాజు ముక్కా... లంచ్‌బాక్స్‌లో పెట్టి పంపించి పెద్ద రొమాంటిక్ హీరోవయిపోయాననుకుంటున్నావా?" చిరుకోపంగా అడిగింది శక్తి.

ఇంద్రనీల్ ఆమె నడుంఒంపుని సవరిస్తూ "నువ్వు వస్తావని నాకు తెలుసు" అన్నాడు.

"ఎలా?" ఆపుకోలేక అడిగింది.

"ఇంతకుముందు అమ్మాయిలకి ఈత నేర్పించేవాడిని. మొదటిరోజు స్విమ్మింగ్ డ్రెస్ వేసుకోవడానికి తెగ ఇబ్బంది పడేవారు. రెండోరోజునుంచీ నేనేం నేర్పాల్సినది వుండేది కాదు" అన్నాడు.

"ఛీ... ఫో!" శక్తి అతని బుగ్గమీద గట్టిగా గిల్లింది.

"అక్కడొద్దు... దేవుడు వీపులూ... గుండెలు పెట్టింది ఇలా ఎవరికీ కనిపించకుండా గిల్లుకోవడానికే!" సీరియస్‌గా చెప్పాడు.

శక్తి ఇంక మాట్లాడలేదు. అతడిని మాట్లాడనీయలేదు.

మీనాక్షి వాళ్ళ వాటాలోనుంచి ఆపకుండా సదానందం పిల్లల్ని తిడుతున్న తిట్లు వినిపిస్తున్నాయి. ట్రాన్సిస్టర్‌లో చాయాగీత్ వింటున్న శక్తికి ఈ గొడవకి చాలా చిరాగ్గా వుంది.

మీనాక్షి సన్నగా ఏడుస్తున్న ధ్వని వినిపిస్తోంది.

పేపర్ చదువుతున్న ఇంద్రనీల్ లేచి బకెట్లో బట్టలు వేసుకుని "నేను బావిదగ్గర బట్టలుతుక్కుని వస్తాను" అని బయల్దేరాడు.

శక్తి విసుగ్గా "ఇంత రాత్రి ఉతక్కపోతే ఏం కొంపలు ముంచుకు పోవులే!" అంది.

"ఇంక ఇప్పుడు చేసే పనేముంది కనుక..." అంటూ వెళ్ళిపోయాడు.

శక్తికి అతను బండకేసి బట్టలు బాదడం వినిపించసాగింది. అది ఎందుకో అర్థంఅయి ఆమె పెదవుల మీద సన్నని హాసరేఖ పరుచుకుంది. అతను ఆ గొడవ విని భరించలేకపోతున్నాడు.

"అగ్రహారం సంబంధం చేసుకుని వుంటే పౌరోహిత్యం చేసైనా ఆ పేరిశాస్త్రి నన్ను పోషించేవాడు" మీనాక్షి అరిచింది.

"చేసుకుని చావలేకపోయావా మరీ! నేనూ కరణంగారి మనవరాల్ని పెళ్ళాడితే నాలుగెకరాలు ఇచ్చుండేవారు. కౌలుకిచ్చుకుని కాలిమీద కాలేసుకుని దర్జాగా బతికేవాణ్ని."

"మీ మొహానికి నాలుగెకరాలు. నా రాత ఇట్లా మండిపోయి ఆ పేరిశాస్త్రిని కాదన్నాను కానీ..."

"మళ్లీ అదే కూత!"

ధభీ ధభీమని చప్పుడు.

"ఓర్నాయనోయ్... చంపేస్తున్నాడు... రక్షించండి" మీనాక్షి కేకలు.

"చావవే... పీడా పోతుందీ!"

"వచ్చే జన్మలో మాత్రం ఇట్లాంటి మొగుడొద్దురా భగవంతుడా! యాయవారం చేసుకునే వాడైనా పర్లేదు."

"ఆ మాటే అనద్దంటే..." మళ్ళీ వీపుమీద దరువుల్లు, మీనాక్షి శోకం.

శక్తి బయటికి వచ్చి చూసింది.

మామ్మగారు, తాతగారూ తమలపాకులు సున్నం రాసుకుని వేసుకుంటూ వసారాలో కూర్చుని వున్నారు.

"ఏవిటండీ ఈ గోలా? తనతో సమానంగా వున్న చెట్టంత మనిషిని పట్టుకుని అతను గొడ్డుని బాదినట్లు బాదడం ఏమిటి? అప్పుడే ఊహ తెలుస్తున్న పిల్లలకెలా వుంటుందీ?" అంది వాళ్ళతో శక్తి.

ఇంద్రనీల్ అటొచ్చి తాడుమీద బట్టలు ఆరేస్తూ "ఆవిడమాత్రం అన్నిసార్లు ఆ అగ్రహారం సంబంధం సంగతి చెప్పడం ఎందుకూ? ఆ మాట వినగానే ఆయన శివాలెత్తుతున్నాడుగా...?" అన్నాడు.

"అంటే ఏవిటి నీ ఉద్దేశం? ఆవిడ దెబ్బలు తింటూ నోర్మూసుకుని పడివుండాలా? ఆ మాత్రం కూడా తన ఖర్మకి తను విచారించకూడదా?" శక్తి అతనిమీద విరుచుకుపడింది.

తాతగారు గాభరాగా "వాళ్ళకి అది రోజూ అలవాటే. మధ్యలో మీరు కీచులాడుకోకండి. అసలే కొత్త దంపతులు" అన్నారు.

"అదికాదు తాతగారూ! ఈయనగారు ఆయనగారిని వెనకేసుకు రావడం బావుందా?" ఎరుపెక్కిన కళ్ళతో అడిగింది శక్తి.



"ఆవిణ్ని ఆయన కొట్టడం అన్న విషయం అగ్రహారం సంబంధం, అదేవిటీ... పేరిశాస్త్రి మాటెత్తితేనే కదా! లేకపోతే ఆయనకంత కోపం వచ్చేదే కాదుగదా?"

"అంటే... కొట్టడం చాలా ఒప్పనా మీ అభిప్రాయం?" శక్తి నడుంమీద చేతులు పెట్టేసి పోట్లాటకి సిద్ధమవుతున్నట్లుగా అడిగింది.

"పేరిశాస్త్రి పేరెత్తడం కరెక్టా?"

"నిక్షేపంలా! పేరిశాస్త్రిని చేసుకుని వుంటే నిజంగా ఇంతకన్నా బావుండేదేమో!"

"ఏ బిర్లాగారి అమ్మాయినో చేసుకుని వుంటే నేనూ ఇలా బట్టలు వుతుక్కుంటూ వుండక్కర్లేదు. సొంత విమానం కొనుక్కుని తిరిగేవాణ్ని అంటే నువ్వు భరించగలవా?"

"బిర్లాగారి అమ్మాయి నాలా సముద్రంలో దూకడానికి వస్తేకదా నీ కళ్ళబడటానికి?"

"పడిందే అనుకో!"

"నువ్వు వాటేసుకోగానే అమ్మాయి బాడీగార్డులు నీ చేతులు, కాళ్ళు విరగ గొట్టేవారు. అప్పుడు నువ్వు కామాక్షీదేవి ఆలయందగ్గర బల్లమీద పడుకుని అడుక్కోవలసి వచ్చేది."

"అబ్బబ్బా! మీరు ఊర్కోండర్రా!" మామ్మగారు శక్తి దగ్గరికొచ్చి "అవేం మాటలమ్మా! కాళ్ళపారాణి ఇంకా ఆరనేలేదు. మొగుణ్ని పట్టుకొని అంతలేసి మాటలంటావా?" అంది.

శక్తి చిరాగ్గా "పందరోజుల పండగదాకా ఆగి అనాలా?" అంది.

ఇంద్రనీల్ మామ్మగారితో "వాదనాపటిమ లేనిచోటే దూషణొస్తుంది మామ్మగారూ" అన్నాడు.

"అబ్బో- నీకుంది వాదనాపటిమ. పగలల్లా చాకిరీచేసి డబ్బు సంపాదించి, సాయంత్రం ఇంటికొచ్చినప్పటినుంచీ అలసిపోయేంత పనిచేసిన భార్యమీద తిని కూర్చుని జులుం చేసేవాణ్ని వెనకేసుకొస్తావా?" అంది.

"పగలల్లా ఇంట్లో కూర్చుని ఏమీతోచక తన్నుకుంటున్నవాడికి తెలుస్తుంది భార్యతో ఎందుకు గొడవపడ్డాడో?' అన్నాడు ఇంద్రనీల్.

"ఓహో... కానీ ఖర్చులేని ఎంటర్‌టైన్‌మెంటన్నమాట..." వ్యంగ్యంగా అంది శక్తి.

శక్తిమతి, ఇంద్రనీల్ గొడవపడుతుండగానే సదానందం ధుమధుమ లాడుతూ భుజంమీద కండువా దులిపివేసుకుంటూ వాళ్ళముందునుంచే గేటు తెరుచుకుని బయటికి వెళ్ళిపోయాడు.

మీనాక్షి వెనకనుంచి "ఏవండీ... ఏవండీ... మీకు ఇష్టమని తోటకూర పులుసు వండాను. ఒక్కముద్ద తినివెళ్ళండీ..." అంటూ జారిన సిగని చుట్టుకుంటూ వచ్చింది.

శక్తి మీనాక్షి దగ్గరకెళ్ళి "ఒక్కపూట ఆయన తినకపోతే ఏవీ కొంప మునిగిపోదుగానీ... నువ్వూ, పిల్లలూ తిని పడుకోండి" అంది.

మీనాక్షి కళ్ళనీళ్ళు పెట్టుకుని "పొద్దుట వుట్టి చారు పెట్టానని సరిగ్గా తినలేదుట. ఈ పూట పాపిష్టిదాన్ని తగాదా వేసుకుని తరిమేశాను" అంది.

ఇంద్రనీల్ బకెట్ పట్టుకుని వెళుతూ "ఏదైనా పేరిశాస్త్రి విషయం ఎత్తకుండా వుండాల్సింది" అన్నాడు.

"మళ్ళీ అదేమాట... అంటే అంత పౌరుషం పొడుచుకురావాలా?" శక్తి అడ్డు తగిలింది.

"నీకు తెలీదు. మధ్యలో అడ్డురాకు. ఆవిడతో మాట్లాడనీ."

"నీకు తెలుసా పేరిశాస్త్రి విషయం?"

"మధ్యలో నీ గోలేమిటి?"

"అసలు నీకెందుకు ఈ మధ్యవర్తిత్వం?"

మీనాక్షి బిత్తరబోయి చూస్తూ నిలబడింది.

శక్తికీ, ఇంద్రనీల్‌కీ మాటా మాటా పెరిగిపోతోంది.

"నీ పేరులో రెండోసగం నీకు లేదని ఇప్పుడే తెలిసింది నాకు" అక్కసుగా అన్నాడు.

"వుంటే నిన్నెందుకు చేసుకుంటానూ?" అంది శక్తిమతి.

"కట్నం ఇచ్చి ఏ ఇంజనీర్నో కొనుక్కోవలసింది"

"కట్నం ఇచ్చేదాన్నో, అద్దెకి తెచ్చుకునేదాన్నో..." ఉక్రోషంతో ఆమె ముక్కుపుటాలు అదిరిపడుతున్నాయి.



ఇంతలో సదానందం లోపలికి వచ్చాడు. భార్యకి సైగచేసి "వీళ్ళు ఎందుకు గొడవ పడుతున్నారు?" అన్నాడు.

"అర్థం అయి చావడంలేదు. మన విషయమేనేమో... సరే పదండి అన్నం తిందురుగాని."

మీనాక్షి వెనకాలే సదానందం ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

శక్తికి నీరసం వచ్చింది.

ఇంద్రనీల్‌కి ఆయాసం వచ్చింది.

తాతగారు చెంబుతో మంచినీళ్ళు తెచ్చి ఇంద్రనీల్‌కి అందిస్తూ "బావుందర్రా! కాంపౌండ్ మీరొచ్చాక సందడిగా మారింది" అన్నారు.

"అలిసిపోయి వుంటారుగానీ, వెళ్ళి అన్నాలు తినండి మంచం ఎక్కుదురు గాని" అంది మామ్మగారు.

ఓ గంట తరువాత "ఈ కార్యక్రమం ఏమిటో బాగానే వున్నట్లుంది. అసలు టైమే తెలియలేదు" అన్నాడు ఇంద్రనీల్.

శక్తి ఉడుక్కుంటూ "ఆ సదానందాన్ని అంత వెనకేసుకొచ్చావేం? ఫ్రీగా బీడీ పీకలిచ్చాడా?" అంది.

ఇంద్రనీల్ నవ్వి ఆమె జడ సవరిస్తూ "పేరిశాస్త్రిని చేసుకోవలసింది అని ఆవిడ అనకుండా వుండాల్సింది..." అన్నాడు.

"మళ్ళీ అదే కూత! చెయ్యి తీయ్..." అరిచింది శక్తి.

"సర్లే... వాళ్ళ గొడవ మనకెందుకూ? దగ్గరకి రా" అతను ఆమెని బలంగా తనవైపుకి తిప్పుకున్నాడు.

శక్తి మౌనంగా మారింది.

ఇంద్రనీల్ ఆమెని తమకంగా ముద్దాడుతూ వుండగా "మీనాక్షిదేం తప్పుకాదు. సదానందందే తప్పు" అంది.

అతను ఆమె పెదవులను తన పెదవులతో మూసేశాడు.

ఆమె తియ్యగా మూల్గింది.

అతను ఆమె ముఖాన్ని రెండుచేతుల మధ్యకి తీసుకుని కళ్ళలోకి చూశాడు.

మత్తుగా ఆమెకళ్ళు వాలిపోయాయి.

"అసలావిడ... పేరిశాస్త్రి పేరు ఎత్తకుండా వుండాల్సింది" అన్నాడు.

ఆమెకి అతను అన్నది మొదట అర్థంకాలేదు. అర్థంకాగానే కళ్ళు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి. వెంటనే కోపం వచ్చింది.

"ఛీ... పో" అంది.

"పోనా?" కొంటెగా అడిగాడు.

"ఒద్దులే" అంది.

గుండెల్నిండా ఊపిరి పీల్చుకుని వదిలినట్లుగా పిల్లగాలి వచ్చింది.

❖ ❖ ❖

బ్యాంక్ దగ్గరకొచ్చిన తండ్రిని చూడగానే చాలా సంతోషం కలిగింది శక్తికి.

"నాన్నా! బావున్నావా?" అంది ఆప్యాయంగా.

"ముసలాడ్ని, నా సంగతికేంగానీ... నీ కొత్తకాపురం ఎలా వుందీ? అల్లుడుగారెలా వున్నారూ?" అడిగాడు గోపాలరావు.

"ఇంటికి రండి చూద్దురుగాని" నవ్వింది.

ఈ నవ్వులోని సంతృప్తి ఆయన తండ్రి హృదయం అర్థం చేసుకుంది. కనపడని దేవుడికి వినపడనంత నెమ్మదిగా కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

శక్తి, గోపాలరావూ బస్‌లో కూర్చున్నాక ఆయన పెద్దకూతురి ఆర్థిక సమస్యలగురించీ, చిన్న కూతురి పురిటి ఖర్చుల గురించీ మాట్లాడాడు.

"వేరే ఇంట్లో వున్నంత మాత్రాన నేను పరాయిదాన్నయిపోయానా నాన్నా? నీ ఇంట్లోనే మేం వుంటే అద్దె లేకుండా సుఖపడిపోతున్నామని బావలు నిన్ను చంపుకుతింటారని ఆలోచించి యిలా వచ్చేశాను" అంది.

"ఇన్నాళ్ళూ వాళ్ళ పురుళ్ళూ అవీ ఇంట్లో ఆడదిక్కుగా నువ్వు వున్నావని చూసుకున్నాను. ఇంక నా వల్లకాదమ్మా! మరి చిన్నబావ ఈసారి ఇక్కడికే పంపించే ఉద్దేశంలో వున్నట్లు మాట్లాడాడు" అన్నాడు.

"కుదరదు అని చెప్పెయ్యి. ఆయన మగపిల్లాడు పుట్టేవరకూ కంటూ పోతే ఎన్ని పురుళ్ళని పోస్తావూ?" కోపంగా అంది.

"పెద్ద అమ్మాయికి నాలుగు పురుళ్ళు పోశారు. మాకు ఒక్కటికూడా చెయ్యరా అంటాడేమో!"



"మొదట్లో అలిగి ఆయన పంపకపోతే అది మన తప్పవుతుందా?"

"అరిటాకూ ముల్లూ సామెతమ్మా ఆడపిల్లల తండ్రుల పరిస్థితి" భారంగా అన్నాడాయన.

ఇద్దరూ ఇలా మాట్లాడుకుంటూ ఇల్లు చేరారు.

"ఇదేనా అమ్మా ఇల్లు?" అడిగాడు గోపాలరావు.

శక్తికి కూడా అదే అనుమానం వచ్చేలా వుంది అక్కడి పరిస్థితి.

మీనాక్షి పిల్లలిద్దరూ ఒంటికీ, మొహానికీ మసి మరకలతో బొత్తెడు కాయితాలూ చింపి పోగులు పెట్టుకుని, జిగురూ, రంగులతో ఏదో చేస్తున్నారు అదీ మంచం నడిమధ్యన కూర్చుని.

శక్తి తండ్రివైపు చూసి "వెనకింటి వాళ్ళ పిల్లలు..." అని "అంకుల్ ఏరీ?" అంది గట్టిగా పిల్లలతో.

వాళ్ళు వినిపించుకోనంత హడావుడిగా వున్నారు.

ఇంద్రనీల్ లోపల్నుంచి కళ్ళు మూసుకుని నడుస్తూ వచ్చి "ఎవరూ వచ్చిందీ?" అన్నాడు.

"నేనే... శక్తిని. ఇంటి పరిస్థితేమిటి ఇలా వుంది?" అరిచింది.

"కనబడటంలేదు" కళ్ళు మూసుకునే అన్నాడు.

"ఏం! కళ్ళు పోయాయా?" కసిరినట్లు అడిగింది.

"కుంకుడుకాయ రసం కంట్లో పడింది."

"కుంకుడుకాయలతో తలంటుపోసుకున్నావా?"

"నేను కాదు... ఎదురింట్లో ఆవిడా..."

"ఆ! ఎదురింటి ఆవిడకి తలంటుపోశావా?" శక్తి వీలైనంతగా నోరు తెరిచి అడిగింది.

"అబ్బా...ఊరికే అడ్డుపడకు. ఆవిడచేత తలంటుపోయించుకోవడం లేదని వాళ్ళ పిల్లాడ్ని చావబాదుతుంటే నేను మందలించి, పిల్లాడికి మంచి మాటలతో నచ్చజెప్పి తలంటుపోశాను. ఆవిడ ఎంత సంతోషించిందో తెలుసా శక్తీ" ఆనందంగా అన్నాడు.

"మరి వీళ్ళ సంగతేమిటి?" మంచం నడుమెక్కి కూర్చుని ఈ కాయితాలూ, జిగురుతో వీళ్ళేం చేస్తున్నారూ?"

"నేనే... గాలిపటాలు చేయడం నేర్పిస్తానన్నాను."

శక్తి విసుగ్గా పిల్లలతో "పోండి... మీ ఇంటికిపోండి... ఇవన్నీ పట్టుకు పొండి. మళ్లీ ఇక్కడ కనిపించారంటే వీపులు చీరేస్తాను" అని అరిచింది.

వాళ్ళు బిక్కమొహాలేసుకుని పారిపోయారు.

"పిల్లలు పరబ్రహ్మ స్వరూపాలు. అలా కసరకూడదు" చెప్పాడు ఇంద్రనీల్.

"అసలు బ్రహ్మ అయినా సరే, నా ఇల్లు కంగాళీ చేసిపెడితే వూరుకునేది లేదు గానీ ముందు కళ్ళు తెరు. మీ మావగారొచ్చారు" అంది.

ఇంద్రనీల్ చటుక్కున కళ్ళు తెరిచి "బావున్నారా?" అన్నాడు.

గోపాలరావు చిరునవ్వు నవ్వి "ఎలా వుంది కొత్తకాపురం?" అడిగాడు.

"మోచేతి దెబ్బలా వుంది" చెప్పాడు ఇంద్రనీల్.

శక్తి కస్సుమని "ఆ మాట నేను అనాలి. ఇల్లు నీమీద వదిలి వెళితే యిలా అందర్నీ చేర్చి అనాథశరణాలయం చేస్తావా?" అని అరిచింది.

"మరి నేను అనాథనేగా!" వెంటనే అన్నాడు.

గోపాలరావు ఉలిక్కిపడి "శక్తీ! ఏమిటమ్మా ఆ దూకుడూ? ఇరుగూ పొరుగూ అన్నాక ఆ మాత్రం సాయం చేసుకోవాలి" అన్నాడు.

మామ్మగారు బయటే నిలబడి "బాబూ... మంచం నేయడానికి సాయం వస్తానన్నావు. చెయ్యి తీరుబడి అయిందా?" అని అరిచింది.

"ఆ... ఇదిగో మా మావగారికి కాఫీ యిచ్చి వచ్చేస్తాను మామ్మగారూ" అన్నాడు ఇంద్రనీల్.

శక్తి వెక్కిరింతగా "మా నాన్నకి నేను కాఫీ యిస్తానుగానీ నువ్వెళ్ళి మామ్మగారికీ, వెనకింటి అన్నయ్యగారికీ సాయం చేసిరా..." అంది.

అతను పట్టించుకోలేదు. మావగారితో ఆరోగ్యం ఎలా వుంది? ఆయిల్ పుల్లింగ్ చేయమన్నాను చేస్తున్నారా? పొద్దుటపూట బద్ధకించకుండా వాకింగ్ చేయండి" అన్నాడు.

గోపాలరావు నవ్వి, అన్నీ చేసి ఇంకా ఎన్నాళ్ళు బతకమని నాయనా? వయసు అయిపోవడంలా?" అన్నాడు.

కిటికీలోనుంచి మీనాక్షి పిల్లలు ఇంద్రనీల్ని బయటకి రమ్మని రకరకాల సైగలు చేస్తున్నారు.



శక్తి కాఫీ కప్పుతో ఇవతలికి రాగానే చూసి "బాబోయ్ శక్తి! చంపేస్తుంది" అని పరుగెత్తిపోయారు.

శక్తి ఎర్రబడిన మొహంతో అతనివంక చూసింది.

"రాత్రికి ఉలవచారు పెడతాను. భోంచేసి వెళ్ళండి" మావగారితో చెప్పాడు.

"వద్దు నాయనా... రాత్రిళ్ళు భోంచేయను. నిన్నూ అమ్మాయినీ పండక్కి పిలుద్దామని వచ్చాను" అన్నాడాయన.

అతను నవ్వి "నేను గాంధీ జయంతి, స్వాతంత్ర్య దినోత్సవం తప్ప ఏ పండగలూ చేసుకోనండి. కాబట్టి నాకు యివన్నీ పండుగలు కావు" అన్నాడు.

"ఏదో నా ముచ్చటకి!" అన్నాడాయన.

"మీ ముచ్చట్లన్నీ మీ అల్లుళ్ళు ఈపాటికే తీర్చి వుంటారే" నవ్వాడు ఇంద్రనీల్.

"వాళ్ళ దారి వేరు. నిన్ను మాత్రం నిజంగానే ముచ్చటపడి పిలుస్తున్నాను" అన్నాడాయన.

"లేదండీ. నేను ఊరెళుతున్నాను. ఊళ్ళో వుంటే వచ్చేవాడిని" అన్నాడు.

"ఏ ఊరూ? నాతో చెప్పనేలేదే?" వింతగా చూస్తూ అడిగింది శక్తి.

"అవి మాత్రమే నీ నోట్లోంచి రాకూడని ప్రశ్నలు. ఎగ్రిమెంట్ మర్చిపోయావా?" చిరునవ్వుతోనే వాడిగా అడిగాడు.

శక్తి దెబ్బతిన్నట్లు చూసింది.

గోపాలరావు ఇరకాటంలో పడినట్లు ఇద్దర్నీ మార్చిమార్చి చూశాడు.

శక్తికి అతని కండీషన్ గుర్తుకురానేలేదు. నెలరోజులూ అంత వేగంగా గడిచిపోయాయి. ఎక్కడికి వెళుతున్నాడో, ఎందుకు వెళుతున్నాడో అడగకూడదు.

ఆమె పై పెదవిని పంటితో బిగపట్టి అనేక ప్రశ్నలని బైటికి రాకుండా అణిచేసింది.

గోపాలరావు కాసేపు కూర్చుని అ కబురూ, ఈ కబురూ చెప్పి వెళ్ళొస్తానని బయల్దేరాడు.

తండ్రిని సాగనంపడానికి గేటుదాకా వచ్చిన శక్తితో "అబ్బాయి అందరి లాంటి వాడు కాదు. నువ్వు మొదటినుంచీ అక్కలకన్నా అదృష్టవంత రాలివి. అ అదృష్టాన్ని కాపాడుకో తల్లీ" అన్నాడు.

శక్తి నిర్లిప్తంగా "అదృష్టం కాదు, ఆలోచన! ఆలోచించి ప్రతి అడుగు వేస్తాను. నా సామర్థ్యంమీద నాకు నమ్మకం ఎక్కువ" అంది.

ఆయన ఇంకేమీ తర్కించకుండా "జాగ్రత్త" అని వెళ్ళిపోయాడు.

'కొత్త కాపురం కొత్తగా నేర్చుకున్న కారు డ్రైవింగ్‌తో సమానం. చాలా జాగ్రత్త అవసరం. గేరు మార్చినప్పుడు పక్కవాళ్ళకి భయం వెయ్యకూడదు. కానీ స్టీరింగ్ నా చేతిలో వుండగా, బ్రేక్‌మాత్రం తను వేశాడేమిటి?' అనుకొంది శక్తి.

❖ ❖ ❖

శక్తి ఇంటికి వచ్చేటప్పటికే వాకిట్లో జనం గుమికూడి వున్నారు. మామ్మగారు చేతులు తిప్పుతూ ఏదో అంటోంది. మీనాక్షి కూతురు ఏడుస్తుంటే ఎదురింటావిడ సముదాయిస్తోంది.

శక్తి గాభరాగా "ఏం జరిగింది మామ్మగారూ?" అంది.

"ఎక్కడినుండి వచ్చిందో పిచ్చికుక్క ఆ పిల్లదాన్ని చటుక్కున కరిచి పోయిందమ్మా!" అంది మామ్మగారు.

శక్తి పాప కాలు చూస్తూ "మీనాక్షి లేదా?" అంది.

"ఈ మధ్య ఎవరింటికో సంగీతం పాఠాలు చెప్పడానికి సాయంత్రం కూడా వెళ్తోందిగా" అంది ఎదురింటావిడ.

"మరి... మరి మా ఆయనా..." అని చుట్టూ చూసింది.

"ఇంద్రనీల్ కర్ర తీసుకుని దాన్ని చంపడానికి వెళ్ళాడు. ఇప్పటికి అవతల వీధిలో నలుగుర్ని కరిచిందట" అందావిడ.

శక్తి "మరి పాపని డాక్టర్ దగ్గరకి..." అంటూ చుట్టూ చూసేసరికి అరుగుమీద బీడీ కాల్చుకుంటూ తీరిగ్గా కూర్చున్న సదానందం కనిపించాడు.

ఆమె నిటారుగా అయింది. కళ్ళు తీక్షణంగా మారాయి. స్వరం కరకుగా మార్చి "మీరంతా హడావుడి పడుతున్నారేం? తండ్రి వున్నాడుగా. ఆయనకి చెప్పండి" అంది.



"సరిపోయింది" మూతి తిప్పింది మామ్మగారు.

శక్తి పాప రెక్క పట్టుకుని సదానందం దగ్గరికి తీసుకెళ్ళి "కరిచింది పిచ్చికుక్కట! చాలా ప్రమాదం. వెంటనే డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళండి" అంది.

సదానందం బీడీ పీలుస్తూ "మీనాక్షి లేదుగా. డబ్బులో" అన్నాడు.

"సంపాదించి ఇచ్చేస్తాను అని చెప్పండి. రేపు పొద్దుటే కష్టపడి ఏ కూలో నాలో చేసి అప్పు తీర్చేయచ్చు" తేలిగ్గా అంది.

అతను ఆమెవంక వింతగా చూసి "నేనా?" అన్నాడు.

"నిక్షేపంగా మీరే...! రాళ్ళు కొట్టచ్చు, బస్‌స్టాపుల్లో మూటలు మోయచ్చు. ఏ వంటకైనా అసిస్టెంటుగా కూరలు తరగడానికి వెళ్ళచ్చు. ఏమైనా చేయచ్చు" అంది.

అతను విసురుగా లేచి "నాకు అలవాటు లేదు. మీనాక్షి వచ్చి చూసుకుంటుంది" అన్నాడు.

"మీనాక్షికేనా కూతురు. మీకు కాదా?" తీవ్రంగా అడిగింది శక్తి.

"మీకు అనవసరం" సదానందం కోపంగా అన్నాడు.

"అదే నేనూ చెబుతున్నాను. మాకు అనవసరం. మామ్మగారూ, అక్కయ్యగారూ మీరంతా మీ పనులు చూసుకోండి. తండ్రి వున్నాడుగా, పిల్లదాని సంగతి అతనే చూసుకుంటాడు" అని విసవిసా తన ఇంట్లోకి పోయింది.

ఇంద్రనీల్ ఇంట్లోకి వస్తూ "మీనాక్షిగారు వచ్చేసరికి చాలా రాత్రయి పోతుంది శక్తీ" అన్నాడు.

"అవును" మొహం కడుక్కుంటూ జవాబిచ్చింది.

"ఓ నూట యాభై వుంటే ఇవ్వు. పాపని డాక్టర్ దగ్గరకి తీసుకెళతాను" అన్నాడు.

"నువ్వెందుకు తీసుకెళ్ళాలి? అనాధ కాదుగా. ముప్పూటలా తిని కూర్చునే తండ్రి వున్నాడుగా" అంది.

ఇంద్రనీల్ విసుక్కుంటూ "నీ ధోరణి నాకు అర్థంకాదు. నన్నేమో ఉద్యోగం చెయ్యవద్దని కండీషన్ పెట్టావు. అతన్నేమో ఏదో ఒక పని చేసుకోమంటు న్నావు" అన్నాడు.

శక్తి బొట్టు పెట్టుకుంటున్నదల్లా ఆగి, "మా బావల్లా నువ్వా సంపాదిస్తున్నాననే అధికారం, ఆధిపత్యం నామీద చూపే మార్గం లేకుండా నిన్ను నా కింది ఎంప్లాయీగా చేర్చుకున్నాను. కానీ ఆ సదానందం కానీ సంపాయించకపోయినా మీనాక్షిని వంగదీసి గుద్ది ఆధిపత్యం నిరూపించుకుంటూనే వున్నాడుగా? ఇంకెందుకు అతణ్ని మేపడం?" అంది.

"సరే. నా జీతం పారెయ్. డబ్బు అవసరంపడింది" అన్నాడు ఇంద్రనీల్.

శక్తి మాట్లాడలేక కోపం దిగమింగుకుంటూ, అలమరాలోంచి డబ్బు తీసి లెక్కపెట్టి "ఇవిగో మూడువేలు... ముట్టినట్లు రసీదుమీద సంతకం పెట్టు" అంది.

అతను ఆమె చెప్పినట్లే చేసి హడావుడిగా వెళ్ళిపోయాడు.

శక్తి ఆ పూట భోంచెయ్యలేదు.

మీనాక్షి ఇంటికొచ్చాక ఇంద్రనీల్ దగ్గరకి వచ్చి "దేవుడు నీ రూపంలో వచ్చాడని" పొగిడి, కాసేపు ఏడ్చి వెళ్ళిపోయింది.

'తేరగా వచ్చాయని కన్నీళ్ళు కార్చడంతప్ప ఇంట్లోని పనికిరాని సామాన్లు రిపేరు చేసుకునేది లేదు' అనుకుంది శక్తి. ఆమెకయితే సదానందాన్ని వరుసగా వారంరోజులు పస్తు పడుకోబెట్టి, అన్నం కావాలంటే పని చెయ్యాల్సిందే అనే పాఠం నేర్పాలని వుంది. మీనాక్షి పతివ్రత వేషాలు చూస్తే ఆమెకి ఒళ్ళుమంట.

పడకోబోయేముందు ఇంద్రనీల్ "నీకు ఇబ్బంది లేకుండా పచ్చడులూ పొడులూ చేసిపెట్టాను. ఈ నాలుగురోజులూ పొద్దుట పాలు పోయించు కోవడం మర్చిపోకు" అన్నాడు.

ఆమెకి మనసంతా మంటగా వుంది. అతనివైపు కాకుండా గోడవైపు తిరిగి పడుకుంది.

కాసేపయ్యాక "నాకన్నా దగ్గరవాళ్లు ఎవరైనా వున్నారా?" అంది.

"లేరు. ఈ మంచంమీద పట్టరు కూడా" అన్నాడు.

ఆమె అతనివైపు తిరిగి "ఇక్కడని కాదు. అసలు ఎక్కడైనా వున్నారా?" అంది.



"ఎక్కడో వుంటే దగ్గరగా అని ఎందుకంటా?" అన్నాడు.

"అదికాదు... మానసికంగా" అంది.

ఇంద్రనీల్ నవ్వి "డబ్బులిచ్చి ఎంప్లాయిమెంట్ ఇచ్చేవాళ్ళు మనసుల్ని శాసించలేరు. శరీరాల్నే తప్ప" అన్నాడు.

ఆమె చటుక్కున గోడవైపుకి తిరిగింది. తన కన్నీళ్ళు అతను చూడటం ఆమెకి ఇష్టంలేదు.

తెల్లవారుజామున అతను నిద్రలేపి వెళ్ళొస్తానని చెప్తుంటే, "ఎప్పు డొస్తావో తెలుసుకోవచ్చా?" అని అడిగింది.

"శుక్రవారం పొద్దుటే నీ ముందుంటాను. భోజనం విషయం అశ్రద్ధ చేయకు" అని ఆమె బుగ్గమీద ముద్దుపెట్టుకుని వెళ్ళిపోయాడు.

శక్తికి అతను వెళ్ళాక ఇల్లంతా బావురుమంటున్నట్లూ, ఆనందం అంతా గంతులేస్తూ అతని చిటికెనవేలు పట్టుకుని వెళ్ళిపోయినట్లూ అనిపించింది. 'ఛీ! అతను లేకుండా పాతికేళ్ళు లేనా?' అనుకుంటూ లేచి పనిలో పడింది. కానీ కూర తరుగుతుంటే వేలు తెగింది. నీళ్ళు తొలుపుకుంటుంటే కాళ్ళమీద చింది చురుక్కుమన్నాయి. ఏవిటో పని అలవాటు తప్పిపోయినట్లు అంతా కొత్తగా వుంది.

తార లంచ్‌టైమ్‌లో "శక్తీ! ఓ ఐదు వందలు సర్దగలవా?" అని అడిగింది.

"ఇస్తాను కానీ ఎందుకే?" అంది.

"మా ఆడబిడ్డ కొడుకు పుట్టినరోజు. వాచీ కొంటానని ఈయన వాగ్దానం చేశారుట. చేతిలో ఏగానీ లేకుండా అయ్యగారు మాట లిచ్చేస్తారు" భారంగా అంది.

శక్తి చిరాగ్గా "తారా! ఈ ఖర్చు అవసరమా? నీ కొడుక్కి సైకిల్ కొనడానికి ఆర్నెల్లనుంచీ ఆలోచిస్తున్నావు. నీ ఆడబిడ్డ కొడుకు అదీ వేలెడు లేదు. వాడికి వాచీ ఎందుకు? అయినా అది నీ పూచీకాదు. డబ్బు లేకపోతే అప్పుచేసి కొనిచ్చుకుంటాడు. మళ్ళీ తీర్చుకుంటాడు అని నువ్వు వూర్కోవచ్చుగా" అంది.

"నీకు తెలీదు. ఆయన ఆ విసుగంతా నామీదా, పిల్లలమీదా చూపించి ఇల్లు రణరంగంగా మారుస్తాడు. ఆ విసుగు భరించడం నావల్లకాదు. పిల్లలు మాటామంతీ లేకుండా బిక్కచచ్చిపోతారు" అంది.

"సంపాదించని సదానందానికీ, తనకోసం మాత్రమే సంపాదించుకునే శ్రీధర్‌కీ తేడా ఏవిటంటే... స్వార్థం! సదానందానికి సోమరితనంతప్ప స్వార్థంలేదు" కోపంగా అంది శక్తి.

తార మౌనంగా తలదించుకుంది. అలా మౌనంగా లేకపోతే అతను "ఇష్టం లేకపోతే పో" అనేస్తాడు. ఇద్దరు పిల్లలతో ఒంటరిగా పోయి ఎక్కడ బతుకుతుంది? బతకలేక కాదు. బతకనివ్వరీ జనం. వయసులో వున్న స్త్రీ అనేసరికి ఎక్కడలేని కుతూహలం. దానికితోడు శాడిజం.

"సారీ! ఏమీ అనుకోకు" డబ్బు అందిస్తూ అంది శక్తి.

"నాకు తెలుసు నువ్వు ఎందుకు చిరాకు పడుతున్నావో? కానీ నీకు తెలీదు ఇలా భరించాల్సిన పరిస్థితులు ఎందుకు వస్తాయో! పిల్లలకి వయసు వస్తుంది. ఆ రోజు వాళ్ళకి తండ్రి అవసరం తోచి 'అమ్మా! ఇలా మమ్మల్ని ఎందుకు తండ్రిలేనివాళ్ళని చేశావు?' అంటే ఏం జవాబు చెప్పాలి? పైగా శ్రీధర్ చేసేలాంటి పనులు చెయ్యని మగవాడు నూటికి ఒక్కడుంటాడేమో! భార్యలమీద విసుక్కోవడం, కాస్త సమస్య రాగానే ఆమెమీదకి తోసెయ్యడం, దులుపుకొని తిరుగుతూ తన సుఖం తను చూసుకోవడం... ఆ జాతి లక్షణాలుగా మార్చుకుంటున్నారు. ఈ కారణంగా ఎంతమంది భర్తల్ని వదిలేయాలో చెప్పు!" అంది తార.

"వదిలేయమనటం లేదు. కాస్త సంస్కరించమంటున్నాను. ఆదివారం వస్తే, వుట్టిరోజుల్లో చేసింది సరిపోనట్లు పిండీ గుండై ఇల్లు సర్దడం, అతిథులకి మర్యాదలు చేయడం మానేసి, పిల్లల్ని తీసుకుని ఏ జూ పార్కుకో పోయి సాయంకాలానికి రా. నీకంటూ కొంత సమయం కేటాయించుకొని పుస్తకాలు చదవడమో. టీవీ చూడటమో చెయ్యి. లేదా శుభ్రంగా తలుపేసుకుని నిద్రపో. ఏం? నీ మొగుడు భోజనం కాగానే గురకలు పెట్టి మధ్యాహ్నాలు నిద్రపోడూ? ఆ సమయంలో అతని బంధువులొస్తే నువ్వే లేచి ఎందుకు టీ పెట్టి ఇవ్వాలి? అతనెందుకు నిన్ను లేపకుండా ఆ పనులు చేసుకోలేడూ?" లాయర్లా అడిగింది శక్తి.



తార పెదవులపై ఓ శుష్క మందహాసం మెరిసి మాయమైంది.

"నాకు ఆర్థికస్వాతంత్ర్యం వుంది అన్నమాట వుట్టిమాట. నేను సంపాదించే డబ్బుమీద నాకు ఏ మాత్రం స్వాతంత్ర్యం లేదు. ఓ హౌస్ వైఫ్‌కీ నాకూ తేడా ఏమిటంటే... ఆవిడకి ఇంటిపనులు మాత్రమే వుంటాయి. నాకు ఇంట్లోనూ బయటా కూడా చాకిరీ వుంటుంది" అంది.

"మరి భర్తవల్ల ఏమిటి లాభం? నువ్వు పెళ్ళి చేసుకోకుండా వుండి వుంటే ఇంత బాధ్యత వుండేది కాదు. పైగా బోలెడు స్వేచ్ఛ!" అంది శక్తి.

"మెటర్నటీ లీవులు!" నవ్వుతూ చెప్పింది తార.

ఆ నవ్వులో జీవం లేకపోవడం చూసి నిట్టూర్చింది శక్తి.

రోడ్డుమీద వందలాది తారలు! మెడలో డిస్కోదారాలతో, చేతిలో టిఫిన్ డబ్బాలతో ప్రతి బస్టాప్‌లోనూ, కళ్ళనిండా బస్ రాకకై ఆతృత నింపుకుని ఎదురుచూపులతో వడిలిపోతుంటారు. బస్‌లో ఇనపకమ్మీలకీ, కరడు కట్టిన పురుషాహంకారానికీ తమ శరీరాలు ఒరుసుకుపోతుంటే, ఒళ్ళు అప్పజెప్పి, ఇవ్వవలసిన బాకీలకీ, వచ్చిన డబ్బులకీ సమన్వయం కుదరక లెక్కల్లో మునిగి తేలుతూ ఇల్లుచేరతారు. గుమ్మంలో ఆడుకునే పసికందులని చూడగానే 'రేపటినుంచీ ఈ ఉద్యోగం మానేసి కలో, గంజో తాగితేనో!' అనే ఆలోచన స్మశాన వైరాగ్యంగా మనసులో మెరుస్తుంది. మళ్ళీ ఏ రాత్రో ఇంటికొచ్చి అన్నం పెట్టమని అథార్టీ చేసి, తన హక్కుల్ని బలవంతంగా పొందే భర్తల్ని చూడగానే, గానుగెద్దు జీవితం నీకు తప్పదన్న నగ్నసత్యం బట్టలు విప్పుకు ఎగురు తుంది. మళ్ళీ పొద్దుటే తెగిన చెప్పులకి పిన్నీసులు పెట్టుకుంటూ, బస్సు రాకకై ఎదురుచూస్తూ ఆత్రంగా, ఆశగా, ఆర్తిగా పరుగులు మొదలు.

శక్తిమతికి ఇంటికి వేలాడుతున్న తాళంకప్ప చూడగానే ఇంద్రనీల్ గుర్తొచ్చాడు.

'శక్తీ... మధ్యాహ్నం నీకోసం చిరోటాలు చేశాను. అవేంటా అని కంగారు పడుతున్నావా? వనితలో చదివి చేశాను. కాఫీరాగం, కానడా కలిపి పాడి నట్లుంటుంది. మధ్యలో మాల్‌కోసడిలా నీకోసం మాల్టోవా

కలిపాను. కాదంటే కాదంబరిలా కాఫీనే ఇస్తాను' ఇలా క్షణం పూరు కోకుండా పూదరగొట్టేవాడు.

'ఎంతమంది భార్యలు భర్తరాగానే సాధింపులూ, అనారోగ్యాలూ కాకుండా ఇలా సరదాగా మాట్లాడతారూ' అనుకుంది శక్తి.

"ఈరోజు మామ్మగారికీ తాతగారికీ భేటీ! ఎదురింటావిడకు మళ్ళీ కాలనీలో కెప్టెన్సీ."

"మీనాక్షి వాళ్ళాయన మీద మళ్ళీ పేరిశాస్త్రి అస్త్రం"

"పక్కింటావిడ వేర్పాటు వాదనకి మామ్మగారి తోడ్పాటు."

"పెరిగిన బీడీ ధరమీద సదానందం నిరసన!"

ఇలా పేపర్లో హెడ్డింగుల్లా సరదాగా ఇరుగుపొరుగు కబుర్లు అందిస్తాడు.

శక్తికి వంట చేసుకోవాలనీ, ఏమీ తినాలనీ అనిపించలేదు. స్నానం చేసొచ్చి నేతచీర కట్టుకుని మంచంమీద వాలిపోయింది.

దుప్పటిలోంచి ఇంద్రనీల్ వాడే షేవింగ్‌లోషన్ వాసనొస్తోంది. అప్రయత్నంగా ముక్కు దగ్గరగా పెట్టి, గుండెలనిండా పీల్చింది. అతను పడుకునే జాగా ఖాళీగా...

ఆమె గుండెల్నిండా శూన్యం నిండినట్లనిపించింది.

'చల్ల చల్లగా సాగే గోదావరిలా శాంత గోదారిలా...

నిలువెల్లా నిండుగా పలికించాడూ... పులకించే గుండెనే దోచాడూ... ఎవరమ్మా ఇతగాడు? ఎవరమ్మా?'

తలుపు చప్పుడయింది.

శక్తికి ఒక్కక్షణంసేపు తలుపు తీయగానే ఇంద్రనీల్ అయితే బాగుండు అనిపించింది. అదురుతున్న గుండెలతో నెమ్మదిగా తలుపు తీసింది.

మీనాక్షి నిండుగా నవ్వుతూ నిలబడి వుంది.

"శక్తీ! భోజనం చేశావా?" అడిగింది.

"ఆ.. లేదు... చేస్తాను" తడబడింది శక్తి.

"అన్నయ్య అంటూనే వున్నాడు. తను లేకపోతే నువ్వు అన్నం తినవనీ, ఏం తింటావూ అసలు వండుకోనిదే" అంటూ ఆమె చేతిలోని క్యారియర్ విప్పదీసి అందులోంచి చిక్కుడుకాయ కూరా, సాంబారూ, అన్నం తీసి



కంచంలో వడ్డించింది. "ఎందుకు మీనాక్షీ నీకు శ్రమ?" మొహమాటంగా అంది శక్తి.

"మా అన్నయ్య అలా ఎప్పుడైనా శ్రమని అనుకుంటాడా? అర్ధరాత్రైనా ఏ అవసరం పడినా పిలిస్తే పరిగెత్తుకు వస్తాడు. ఆయన లేకుంటే ఆయన పెళ్ళాన్ని మేం ఈ మాత్రం చూసుకోవద్దూ" ఆప్యాయంగా అంది.

"నువ్వు లేకపోయినా నీ మంచితనం ఆ లోటు భర్తీ చేసింది నీల్" అనుకుంది శక్తి.

శక్తికి ఆ మాటా ఈ మాటా చెబుతూ వడ్డించి కడుపునిండా పెట్టింది మీనాక్షి.

"మొత్తానికి మీ అన్నయ్య డ్యూటీ నువ్వు చేశావు" అంది శక్తి.

"ఇంకోటి మాత్రం నావల్లకాదు వదినమ్మా!" కిసుక్కున నవ్వింది మీనాక్షి.

ఆమె భావం అర్థమై శక్తి సిగ్గుపడింది.

"అన్నయ్య ఏ వూరెళ్ళాడూ?" గిన్నెలు సర్దుతూ మీనాక్షి అడిగింది.

మళ్ళీ శక్తి మనసంతా వ్యాకులమైపోయింది. కొత్తగా పెళ్ళయినప్పుడు భర్త కనుమరుగైతే భార్య ఆరాలు తీస్తుంది. కానీ తనా భాగ్యానికి నోచుకోలేదు. అతనికి ఎవరున్నారో, ఎవరు లేరో కూడా తెలీదు. అసలు రాకపోతే?

ఆమె గుండె గుభిల్లుమంది.

తనెలా బతుకుతుందీ? ఈ స్త్రీవాదం, స్వేచ్ఛా, స్వాతంత్ర్యం అన్నీ జానేదో... అతను లేకుండా తను ఎలా వుండగలదు?

"నిన్ను చూడకుండా ఎక్కువరోజులు వుండలేడులే... ఎల్లుండి తిరుగుటపాలో రాడూ! నే వస్తా... తలుపేసుకో. భయం అయితే చెప్పు నేనిక్కడే పడుకుంటా" అంది.

"వద్దు. నాకేం భయంలేదు. థాంక్స్ మీనాక్షీ" అని ఆమెని పంపి తలుపేసుకుంది శక్తి.

'నువ్వు లేనప్పుడు నీ వియోగంలోని బాధ తెలిస్తే, నువ్వు వున్నప్పుడు నీ సామీప్యంలోని సౌఖ్యం యింకా బాగా అర్థమవుతుంది' అనుకుంది.

❖ ❖ ❖

"రా... రా...నాన్నా! శక్తి వచ్చింది" అంది ఆనందంగా సుమతి.

శక్తి తనతో తెచ్చిన పండ్లూ, బిస్కెట్లూ వున్న బుట్ట అక్కకి అందిస్తూ "ఏంటక్కా... ఇలా అయిపోయావేంటీ? వంట్లో ఎలా వుందీ?" అంది.

సుమతి చాలా నీరసంగా, చెక్కిళ్లు లోనికి పీక్కుపోయి కన్పిస్తోంది. కళ్ళుకూడా గాజుగుడ్డలా నిర్జీవంగా వున్నాయి.

లోపలనుంచి తండ్రి వచ్చి, "అలా వుండక ఇంకెలా వుంటుంది? డాక్టర్ చెప్పింది అస్సలు రక్తం లేదని. ఈ పరిస్థితిలో ప్రెగ్నెన్సీ మంచిది కాదనికూడా చెప్పింది. పైగా మళ్ళీ ఆడపిల్ల పుడితే భర్త వూర్కోడనే మనోవ్యధ ఒకటీ" అన్నాడు.

శక్తి అసహనంగా "నీకే ఓపిక లేదు. ఈ స్థితిలో మరో జీవిని మోస్తావా? ఆ పుట్టేవాళ్ళు మాత్రం ఏమంత ఆరోగ్యంగా వుంటారనీ? పద... మాలతి దగ్గరికి వెళ్లి తీయించేసుకుందువుగాని" అంది.

"ఆయన వూర్కోడు" బేలగా అంది సుమతి.

"తీయించామని చెప్పక్కర్లేదు. పోయింది అందాం" అన్నాడు తండ్రి.

"అబద్ధం ఎందుకు నాన్నా? ఆయనకి తన కొడుకు ఎంత ముఖ్యమో నీకు నీ బిడ్డప్రాణం అంత ముఖ్యం కాదా? అన్నింటికీ అంత భయపడ్డా వెందుకూ? వదిలి పెట్టేస్తాడనా? వదిలెయ్యమను... అంతగా అయితే ఇక్కడే వుండిపోతుంది" అని విరుచుకుపడింది శక్తి.

"అలా అంటే ఇంకోపెళ్ళి చేసుకోవడానికి సిద్ధంగా వున్నాడు మీ బావ" బాధగా అంది సుమతి.

శక్తి అక్కవైపు జాలిగా చూసింది.

నాలుగురోజులు పెంచిన పిల్లిపిల్ల దూరం అయితేనే బెంగపడతాం. అలాంటిది తాళి కట్టించుకొని తననే నమ్మి వచ్చి కాపురం చేసే ఆడదాన్ని ఎన్నేళ్ళయినా సరే అవకాశం వస్తే వదిలేద్దాం అని చూసే ఈ టైపు మగాళ్ళని ఏం చేస్తే వాళ్ళకి బుద్ధి వస్తుందీ?

"ఏం వదిలెయ్యడు... అంతా బెదిరింపు" అంది.

సుమతి కొంగు నోట్లో కుక్కుకొని వెక్కిళ్ళు పడుతూ "నీకు తెలీదు... ఈ మధ్య ఇంటికికూడా సరిగ్గా రావడంలేదు. ఎవర్తోనో తిరుగుతున్నాడని విన్నాను" అంది.



"ఇలాంటివన్నీ చూస్తేకానీ నమ్మకూడదు. అదిగో పులి అంటే ఇదిగో తోక అని వదంతి పుట్టిస్తారు" అంది అక్కని వూరడిస్తూ శక్తి.

"నేనూ ఓసారి యిద్దరూ కలిసి ఆటోలో ఎక్కడం చూశాను" అంది సుమతి.

ఆమె ఇంకేం మాట్లాడలేనట్లు చూసింది.

గోపాలరావు మనవరాలిని ఒళ్ళోకి తీసుకుని విచారంగా కూర్చుని కనిపించాడు.

"ఇంక లాభంలేదు! నువ్వు రేపు మాలతి దగ్గరకి నడవాల్సిందే! ఈ పిల్లచాలు. చక్కగా పెంచి పెద్ద చెయ్యి" అంది శక్తి.

"కానీ..." భయంగా చూసింది సుమతి.

"ఇప్పుడు తలమీద పెట్టుకుంటున్నాడనా, రేపు తంతాడని భయపడ టానికి! నే చెప్పినట్లు విను" అంది శక్తి.

సుమతి తండ్రివైపు చూసింది.

"శక్తి చెప్పింది సరిగ్గానే వుంది" అన్నాడాయన.

"రేపు సాయంత్రం నేను ఇదే సమయానికి వస్తాను. ఓ చీరా, జాకెట్టూ, దుప్పటీ బుట్టలో పెట్టుకుని రెడీగా వుండు. నేను ఇప్పుడే మాలతికి ఫోన్ చేసి మాట్లాడ్తాను" అంది శక్తి.

శక్తి వచ్చేటప్పుడు అంత నీరసంలోనూ లేచి బొట్టుపెట్టడం మర్చి పోలేదు సుమతి.

'ఈ పసుపుకుంకాల దగ్గరే ఎక్స్‌ప్లాయిట్ అవుతున్నారీ ఆడవాళ్ళు' అనుకుంది శక్తి.

❖ ❖ ❖

శక్తి బావిదగ్గర కుంకుడుకాయలు కొడుతుంటే వచ్చింది మీనాక్షి.

"శక్తీ... నేను ముట్టుకోకూడదు కానీ, నా బక్కెట్లో కాసిని నీళ్ళు తోడి పొయ్యి" అంది.

ప్రతినెలా మీనాక్షి చేసే ఈ ఎగ్జిబిషన్ శక్తికి ఒళ్ళుమంట. ఆ సమయంలో ఇంద్రనీల్ వెళ్ళి వంటసాయం చేసొచ్చి శక్తిచేత తిట్లు తిన్నాడు కూడానూ.

మామ్మగారికి అక్కర్లేని గొడవలు వుండవు. పూజసామాన్లు చింతపండు వేసి పరపరా తోముతూ "శక్తీ... నువ్వు ఆ మూడురోజులూ ఈ చేద ముట్టుకోకు. నీకు నమ్మకం లేకపోయినా మాకోసం" అంది.

ఆమె మాట్లాడకుండా మీనాక్షికి నీళ్ళుతోడి పోసింది.

మామ్మగారి చేతిలో ఆ దేవుళ్ళవీపులు పెచ్చురేగిపోతున్నాయి. ఉప్పూ చింతపండూ ఇంకాస్త వేసి రుద్దుతూ వాళ్ళ మిలమిలలు చూసి మురిసిపోతోంది.

"ఏం శక్తీ... అస్సలు నువ్వు ఇంట్లోకి చేరాకా ఒక్కసారీ కూర్చోలేదే?" మీనాక్షి విడ్డూరంగా చూస్తూ అడిగింది.

"అవును... నేనూ గమనించలేదేమిటి చెప్మా!" మామ్మగారు చింతపండు చెయ్యి బుగ్గన పెట్టుకుని ఆశ్చర్యపడింది.

శక్తి కుంకుడుకాయలు గిన్నెలోకి ఎత్తుతూ తలెత్తి చూసింది. వాళ్ళిద్దరూ కుతూహలంగా తనవంకే చూస్తున్నారు. ఆమెకికూడా సందేహం వచ్చింది. బావిపళ్ళెంమీద సెటిలై వేళ్ళు ముడుస్తూ "పన్నెండు, పదమూడు, పధ్నాలుగు... అమ్మో! పదిరోజులు మించేపోయాయి. నేనూ గమనించలేదు మామ్మగారూ" అంది.

"ఆ...!!" మామ్మగారు నోరు యింకా పెద్దగా తెరిచి ఆశ్చర్యపోయింది.

"ఇంకేం? నీళ్ళోసుకున్నావన్నమాట" మీనాక్షి సంబరంగా అరిచింది.

"మా తల్లే... మా తల్లే..." మామ్మగారు దగ్గరకొచ్చి మెటికలు విరిచి ముద్దు పెట్టుకుంది.

"కానీ మామ్మగారూ... ఇది అదేనా?" దిగులుగా అడిగింది శక్తి.

"అదేనే పిచ్చితల్లీ...ముఖం చూడు నిమ్మపండులా నిగనిగలాడుతోంది" అంది మామ్మగారు.

"మరి మొదటి బిడ్డ అప్పుడే వద్దు..."

ఇంకో బిడ్డ అసలే వద్దు...

అంటున్నారు కదా!" శక్తి సందేహంగా అంది.

"అంటారే తల్లీ! అప్పటివాళ్ళు కడుపునిండా కంటే అన్నపూర్ణ అన్నారు. ఇప్పటివాళ్ళు గొడ్రాలిగా వుండు అవార్డులిస్తాం అంటున్నారు" మామ్మగారు అక్కసుగా అంది.



"కొంచెం ఆగాల్సింది" అంది శక్తి.

"ఇప్పుడు అనుకొని ఏం లాభం? అప్పుడు వుండాలి ఆ తెలివి..." వేళాకోళం చేసింది మీనాక్షి.

"నే చెపితే విన్నాడా?" విసుగ్గా అంది శక్తి.

"ఏం చెప్పావు?" అడిగింది మీనాక్షి.

శక్తి చెప్పబోయి ఆగిపోయి "నయమే చెప్పాను కాదు... ఛీ... పాడు" అంటూ లోపలికి వచ్చేసింది.

మీనాక్షీ, మామ్మగారు నవ్వడం ఆమెకి వినిపిస్తూనే వుంది.

❖ ❖ ❖

"రావయ్యా... రా... ముందు ఈ చక్కెర నోట్లో వేసుకో. ఆ తరువాత తియ్యని కబురు విందువుగాని" మామ్మగారు ఇంద్రనీల్‌కి ఎదురెళ్ళి నానా హైరానా పడిపోతూ, ఆనందంతో దొర్లిపోతూ, గుప్పెడు చక్కెర అతని నోట్లో పోసింది.

"ఎందుకూ?" ఉక్కిరిబిక్కిరౌతూ అడిగాడు.

"ఆ...! పక్కింట్లో ఆవు చూడి కట్టింది" అందావిడ.

"ఓహ్! వెరీగుడ్" సంతోషంగా అన్నాడు ఇంద్రనీల్.

ఆవిడ నుదురు కొట్టుకుని "అబ్బా! పక్కింట్లో అయితే నీకెందుకు చెప్తానూ? నీ యింటిలోనే నీ సొంతపెళ్ళాం నిన్ను తండ్రిని చేస్తోంది" అంది.

"ఆ!" అని ఇంద్రనీల్ ఆవిణ్ని అమాంతం ఎత్తేశాడు.

లోపల్నుంచొస్తున్న తాతగారు, "తండ్రిని చేస్తున్నది మీ ఆవిడ... మా ఆవిడ కాదు! దాన్ని వదిలిపెట్టు" అన్నాడు.

"నెమ్మది నాయనా... వదిలిపెట్టమన్నారని అమాంతం వదిలెయ్యకు" భయంగా అరిచిందావిడ.

ఇంద్రనీల్ ఆవిణ్ని నెమ్మదిగా దింపి "శక్తి ఏదీ?" అన్నాడు.

"బ్యాంక్‌లో వుంటుంది వెళ్ళు" అందావిడ.

బ్యాంక్‌లో...

"ఏమిటీ అంత కంగారుగా అడుగుతున్నారూ? శక్తి ఈవేళ సెలవు పెట్టింది. వాళ్ళ నాన్నగారింటికి వెళ్ళింది అనుకుంట!" అంది తార.

ఇంద్రనీల్ ఆమె వాక్యం పూర్తవగానే "థాంక్స్" అంటూ పరుగులాంటి నడకతో బయటికి వచ్చి ఆటో ఎక్కి గోపాలరావుగారింటికి పోనిచ్చాడు.

ఇంటికి పెద్దతాళం కప్ప వేళ్ళాడుతోంది.

ఉస్సూరుమని నిట్టూరుస్తూ నిలబడి వుండగా, పక్కింటావిడ వచ్చి మీరు శక్తిమతి భర్తకదూ?" అంది.

అతను నీరసంగా తలవూపాడు.

"శక్తీవాళ్ళు మాలతీ నర్సింగ్‌హోంకి వెళ్ళారు. తాళంచెవి యిచ్చారు. కావాలా?" అంది.

"అక్కర్లేదు. థాంక్స్" అని మళ్ళీ హుషారుగా ఇంద్రనీల్ మాలతీ నర్సింగ్‌హోంకి వెళ్ళాడు.

నర్సింగ్‌హోంనిండా పేషెంట్లు బిలబిలలాడుతూ వున్నారు.

మాలతి అటుగా వస్తూ ఇంద్రనీల్‌ని గుర్తుపట్టి "హాయ్..." అంది.

ఇంద్రనీల్ కూడా "హాయ్..." అని "శక్తి వచ్చిందా డాక్టర్?" అన్నాడు.

"శక్తి వచ్చిందిగా... ఆ అబార్షన్ ఇప్పుడే చేశాను" అని చెప్పి నర్స్ పిలవగానే "ఎక్స్‌క్యూజ్‌మీ, ఇప్పుడే వస్తా" అంటూ అటు వెళ్ళిపోయింది మాలతి.

ఆమె మాటలకు ఇంద్రనీల్ తను నిలబడ్డ భూమి పాతాళంలోకి కుంగిపోతున్నట్లుగా అనిపించింది.

"ఆ మధురమైన విషయం విన్నప్పటినుంచీ ఎన్ని గాలిమేడలు కట్టుకున్నాడూ! తనకంటూ ఎవరూ లేని ప్రపంచంలో తను సృష్టించిన ఓ బుల్లిప్రాణి! తన రక్తం... తన అంశ జన్మించి 'నాన్నా!' అని పిలుస్తుందని ఆశ పడ్డాడు. రంగుల కలల్లో తేలిపోయాడు. స్వర్గం చేతికి అందినంతగా మురిసిపోయాడు. కానీ... శక్తి... ఇలా చేసిందేమిటీ? ఎవరు నేర్పిన బుద్ధి ఇదీ? మాతృత్వాన్ని కాలదన్నుకునేంత మూర్ఖురాలా ఆమె? ఎంత మొండిగా చేసినా తనేం అనలేదే. కానీ ఇంత ముఖ్యమైన విషయం కూడా తనతో సంప్రదించకుండా స్వయం నిర్ణయం తీసుకుంటుందా! ఆ ప్రాణిమీద తనకి హక్కేం లేదా?

అతని గుప్పిళ్ళు బిగుసుకున్నాయి. దవడ కండరం బిగుసుకుంది. రక్తం చిందుతుందా అన్నంతగా ముఖం ఎర్రబడింది.



ఎదురుగా వున్న క్యాలండర్‌లో గులాబీమొగ్గలాంటి చిన్నారి బోసి నవ్వులు కురిపిస్తున్నాడు.

'A tiny baby sweet and new,
can make the biggest dream come true!'

ఎంత ముచ్చటైన వాక్యం!

అతని చెవులకి పరిచితమైన అడుగుల శబ్దం అయింది.

"నీల్... ఎప్పుడొచ్చావు?" శక్తికంఠం వినిపించింది.

నెమ్మదిగా ఆమెవైపు తిరిగాడు.

ఎర్రని చీరలో అప్పుడే మర్డర్ చేసొచ్చి అమాయకంగా నవ్వుతున్నట్లు కనిపించింది. ఏ మాత్రం గిల్టీ ఫీలింగ్ లేకుండా స్మార్ట్‌గా వుంది.

"ఊరునుంచి నాకేం తెచ్చావు?" అని ఇంద్రనీల్‌ని అడిగింది శక్తిమతి.

ఇంద్రనీల్ ఆపుకోలేనట్లు బలంగా ఈడ్చి చెంపదెబ్బ కొట్టాడు.

అనుకోని ఆ చర్యకి విస్తుపోతూ "నీల్... నీకు మతిపోయిందా?" అంది అతి కష్టంమీద.

ఆమె చెంప ఎర్రగా కందిపోయింది.

"ఔను... మతిపోయింది. నువ్వు చేసిన పనికి! ఛీ... నువ్వు మనిషివి కాదు. పశువ్వి. నరహంతకివి" ఆవేశంగా అన్నాడు.

"నేనేం చేశాను?" ఆమె కళ్ళు విప్పార్చి భయంగా అడిగింది.

"ఏం చెయ్యలేదూ... నిజం చెప్పు... ఇంకా రూపం రాని ఓ పసివాడిని దారుణంగా హత్య చెయ్యలేదూ!" అరిచాడు.

శక్తి ఇబ్బందిగా చుట్టూ చూస్తూ "గట్టిగా అరవకు. అదంతా ఎందుకు చెయ్యాల్సి వచ్చిందో ఇంటికి వెళ్ళాక చెప్తాను" అంది.

"అసలు నీతో ఇంటికి ఎవడొస్తాడు కనుక" కసిగా చూస్తూ అన్నాడు.

"నీకు పిచ్చెక్కిందా? పెద్దప్రాణం దక్కాలంటే అబార్షన్ చెయ్యక తప్పలేదు మరి! అయినా దానికీ నీకూ ఏం సంబంధం?" అంది ఆశ్చర్యంగా శక్తి.

"లేదా? సంబంధం లేదా?" ఆమెని పట్టి వూపేస్తూ అడిగాడు ఇంద్రనీల్.

అప్పుడే లోపల్నుంచి వస్తున్న మాలతి "అదేమిటి... ఆమెని వదలండి. ఆమె పొట్టి మనిషికూడా కాదు. నౌ షీజ్ ప్రెగ్నెంట్!" అంది.

ఇంద్రనీల్ కన్‌ఫ్యూజ్ అయిపోతూ "మరి ఇందాక అబార్షన్ చేశానన్నారూ!" అన్నాడు.

"అదా..." గుండెలనిండా గాలి పీల్చుకుని వదిలింది శక్తి.

"ఆ అబార్షన్ నాకుకాదు. సుమతక్కకి"

"పేషెంట్ చాలా ఎనిమిక్‌గా వుంటే నేను రికమెండ్ చేశాను. కాన్పు కష్టం అయి ఆమె ప్రాణానికి ప్రమాదం ఏర్పడే స్థితిలో అలాంటి నిర్ణయం తీసుకోవలసి వచ్చింది" వివరించింది మాలతి.

జరిగింది అర్థం అయ్యాక ఇంద్రనీల్ తలెత్తి శక్తివైపు చూడలేక పోయాడు. చిన్నమాట అంటేనే పడని శక్తి ఇలా ఇంతమంది ముందు తను చెయ్యి చేసుకోవటం అస్సలు భరించదని అతడికి తెలుసు. ఎంతో మధురంగా జరగాల్సిన ఈ సంఘటన ఇలా ఇంత అసహ్యంగా జరగటం అతనికి మింగుడు పడటంలేదు. తనచేతులవైపు చూసుకున్నాడు. ఎంత దారుణమైన పనిచేశాయి ఈ చేతులు? నెమ్మదిగా ఆ రెండింటిని దగ్గరికి చేర్చి జోడించాడు.

శక్తి విస్మయంగా చూసింది.

"సృష్టి అనేది స్త్రీ మాత్రమే చెయ్యగలదు! అందుకే ఆమె భగవంతుడికి ప్రతిరూపం అని నేను నమ్ముతాను. అటువంటి దేవతని ఇంతటి అపురూప క్షణాల్లో కొట్టినందుకు నేను చాలా పశ్చాత్తాపపడుతున్నాను. వీలైతే నన్ను క్షమించు" అన్నాడు.

శక్తి ఏమీ మాట్లాడకముందే అతను అక్కడనుంచి కదిలి వెళ్ళిపోయాడు.

మాలతి వచ్చి శక్తి భుజంమీద చెయ్యివేసి "ఫీలవుతున్నావా?" అంది.

"అయ్యే పరిస్థితి తప్పిపోయినందుకు ఆనందంగా ఫీలవుతున్నాను" అంది.

"అదేం?"

"అవును మాలతీ! ఇతనికి పిల్లలంటే ఇంత మక్కువని తెలీక నేనూ అబార్షన్ చేయించేసుకుందాం అనుకున్నాను. అలాచేసి వుంటే బహుశా



అతను నన్ను జీవితంలో క్షమించేవాడు కాదేమో!" అంటూ వుంటే శక్తికళ్ళల్లో నీరు నిండాయి.

మాలతి నవ్వి, "వెరీగుడ్! భార్యాభర్తలిద్దరూ ఒక అభిప్రాయానికి వచ్చారు. వెంటనే యింటికి వెళ్ళు... పాపం ఎంతగా ఫీలవుతున్నాడో?" అంది.

శక్తి తండ్రికి చెప్పి యింటికి బయలుదేరింది.

❖ ❖ ❖

"తనే వస్తాడు. ఎంతసేపలా ఎదురు చూస్తావు? వెళ్ళి పడుకో" అన్నారు తాతగారు.

అయినా శక్తి అలాగే అరుగుమీద కూర్చుని అతనికోసం ఎదురు చూడసాగింది.

మీనాక్షి సదానందంల గొడవ చాలాసేపు వినబడి మాటుమణిగి పోయింది.

మామ్మగారు మిగిలిపోయిన అన్నం వాకిట్లో పడుకునే కుక్కకి పెట్టడానికి వచ్చినప్పుడు "శక్తీ... యింకా పడుకోలేదూ? అసలే వట్టి మనిషివి కూడా కాదు. ఇంత రాత్రిదాకా మేలుకొంటే నీ ఆరోగ్యం ఏం కాను?" అంది.

శక్తి దిగులుగా అలాగే కూర్చుని ఆలోచించింది. 'నేను ఒక్కమాట కూడా అనలేదు. అయినా ఎక్కడికి వెళ్ళిపోయాడూ? కొంపదీసి వదిలిపెట్టి పోలేదు కదా!' అనుకుంది. వెన్నెల్లో మంగళసూత్రాలు మెరుస్తున్నాయి. మెదడుకీ, హృదయానికీ మధ్యన లక్ష్మణరేఖ గీస్తున్నట్లు... ఊగుతున్నాయి.

గేట్ కిర్... ర్... మంది.

ఉలిక్కిపడి చూసింది శక్తి.

ఇంద్రనీల్ వస్తున్నాడు. కానీ మామూలుగా కాదు. తూలుతూ వస్తున్నాడు. అతని చేతిలో పేపర్‌లో చుట్టిన ఒక బాటిల్ వుంది.

శక్తి తనకళ్ళని తనే నమ్మలేకపోయింది.

ఇంద్రనీల్ తాగాడా? అంతేగాకుండా ఇంటికి కూడా తెచ్చుకున్నాడా? ఇప్పుడు తనేం చెయ్యాలి? అతణ్ని వూచిపుచ్చుకు కొట్టాలా? తిట్టాలా?

ఏడవాలా? లేక బతిమాలాలా? ఈ పరిస్థితి ఆమె వూహించనిది. అందుకే అలా చిత్తరువులా నిశ్శబ్దంగా చూస్తూ వుండిపోయింది. తను శక్తిని చూసి "శక్తీ... షాలా తప్పయిపోయింది... శమించు!" అని చెంపలు వేసుకున్నాడు.

ఆమె భయంగా చుట్టూ చూసి "సరే లోపలికి పద..." అని తన ఇంటివైపు వెళ్ళబోయింది.

"అటుకాదు... మామ్మగారినీ, తాతగారినీ పిలు... మీనాక్షినీ సదానందాన్నీ కూడా... అందరి ముందూ శమించానని సెప్పు! నువ్వు సెప్పకపోతే నేను బస్సెక్కి పాకిస్తాన్ వెళ్ళిపోతా..." అన్నాడు.

"సరే... సరే..." అంటూ అతడిచెయ్యి తన భుజంమీద వేసుకుని ఇంట్లోకి తీసుకెళుతూ 'హూ! తాగుబోతు మొగుళ్ళని ఈ సాధ్వీమణులు ఎలా భరిస్తారో అనుకున్నాను. సో సింపుల్! నాదాకా వస్తే కానీ తెలియలేదు' అనుకుంది.

ఇంద్రనీల్ ఇంట్లోకి వచ్చి షూ ఒకటి విప్పి పైకి ఎగరేసి "శక్తీ! నా రెండోకాలు నీకు కనబడితే కాస్త షూ విప్పిపెట్టు" అన్నాడు.

శక్తి తలుపులు వేసి అతని ప్రవర్తన చూస్తూ నిలబడింది.

"శక్తీ! ఈరోజు షాలా ఆనందంగా వుంది. నాకు ఆడపిల్ల పుడితే షర్మిలాటాగోర్ అని పేరు పెడ్తా. మగపిల్లాడు పుడ్తే రవీంద్రనాథ్ టాగూర్ అని పెడ్తా" అన్నాడు. ఆ తర్వాత తను కూడా తెచ్చుకున్న బాటిల్ ఓపెన్ చేసుకుని "ప్లీజ్... ఎక్స్‌యూజ్ మీ..." అన్నాడు.

"పర్లేదు... నాకూ చాలా ఆనందంగా వుంది. ఈ ఆనందాన్ని ఇద్దరం షేర్ చేసుకుందాం. ఇటివ్వు" అతని చేతిలోంచి సీసా అందుకుంది శక్తి.

"ఒద్దు...షాలా షేదుగా వుంటుంది. యాక్... థూ!" మొహం అంతా వెగటుగా పెట్టి చెప్పాడు.

"నువ్వు తాగినప్పుడు నేనెందుకు తాగలేనూ?" అంటూ శక్తి సీసా ఎత్తి గటగటా తాగేసింది.

"ఏయ్... తప్పు!" నోటిమీద కొట్టుకున్నాడు.



శక్తి సీసా విసిరేసి పెద్దగా నవ్వింది. "మధ్యాహ్నం బిల్‌క్లింటన్ ఫోన్‌చేసి వైట్‌హౌస్ ఎంప్టీగా వుంది, వచ్చెయ్యమన్నాడు. పోయిరమ్మంటావా?" అంది.

"షా!" ముక్కుమీద వేలేసుకున్నాడు.

"పాకిస్తాన్ ప్రధానమంత్రికి షాదీ పక్కా అయిందిట. మనందర్నీ ఎంగేజ్‌మెంట్‌కి రమ్మన్నాడు. ఎవరో రచయిత్రి ఈ త్యాగం చేస్తోంది పాపం" అంది.

"శక్తీ... గురూగారు ఆజన్మ బ్రహ్మచారి. అలా మాట్లాడకు" అన్నాడు.

శక్తి విరగబడి నవ్వి "జన్మనించీ అందరూ బ్రహ్మాషారులే... మధ్యలోనే కదా బ్రహ్మచర్యం పోయేది... హ... హ... హ" అని నవ్వింది.

ఇంద్రనీల్ కూడా నవ్వుతూ రెండో షూకూడా విప్పి విసిరేశాడు.

శక్తి దిండ్లుతీసి విసిరేసింది.

అతను మంచం మొత్తం వెనక్కి తిప్పేశాడు.

అందులో ఓ చాపవేస్తూ "నవ్వుల నదిలో పువ్వుల పడవా నడిచే..." అని పాడింది శక్తి.

"కాదు... లాహిరి లాహిరి పాడు" అన్నాడు.

ఆమె పక్కనే వున్న చీపురు అందుకుని తెడ్డులా తోస్తూ "లాహిరి... లాహిరి... లాహిరిలో..." అని పాడుతుంటే అతనూ అందుకున్నాడు.

"ఓహో జగమే సోలెనులే... తాగి తూలెనులే..."

"పగలే వూయలా... జగమే వెన్నెలా..." పాడింది.

"షా... తప్పు... అలాకాదు" అన్నాడు.

"నా ఇష్టం" అంది.

"నేను ఒప్పుకోను" అరిచాడు.

శక్తి కోపంగా ఈడ్చికొట్టింది అతని చెంపమీద.

ఇంద్రనీల్ వెంటనే "షెయ్యి కందిపోయిందా సఖీ... అయ్యో... ఎంత దెబ్బ కొట్టావు?" అన్నాడు.

"నిషాలో తెలీలేదు. లేకపోతే ఇంకాస్త జాగ్రత్తగా కొట్టేదాన్ని" అంది.

ఇంద్రనీల్ శక్తిని అలాగే కౌగిలిలో పొదువుకుంటూ "లిమ్కా తాగితేనే అంత నిషా వచ్చిందా?" అన్నాడు.

"నీకు రాగా లేనిది నాకెందుకు రాదూ?" అతని షర్టుగుండీలు విప్పి గుండెలమీద గిచ్చుతూ అంది.

"సారీ!" ఆమె చెవిలో చెప్పాడు.

"అది చెప్పడానికి తాగుడు డ్రామా ఎందుకో? శక్తి అంత అమాయకు రాలనుకున్నావా? లిమ్కాకీ, విస్కీకీ తేడా తెలుసుకోకపోవడానికి" అంది.

అతను ఆమెకురులలో మొహం దాచేసుకున్నాడు. కాసేపయ్యాక "మంచం తిరగేస్తే నిజంగా షిప్‌లా వుంది కదూ?" అన్నాడు.

"టైటానిక్‌లా వుంది. కానీ సీ సిక్‌నెస్ వస్తోంది" మొహం వెగటుగా పెట్టి చెప్పిందామె.

"అది సీ సిక్‌నెస్ కాదు తరంగగృహాలు" అన్నాడు.

"అంటే?"

"వేవిళ్ళు. అచ్చు తెలుగులోకి ట్రాన్స్‌లేట్ చేశా!" చెప్పాడు.

శక్తి నవ్వుతూ అతని మొహాన్ని దగ్గరకు తీసుకుని నుదుటిమీద ముద్దు పెట్టుకుంది. మనసంతా తృప్తితోనిండి పొర్లిపోతున్నట్టనిపించింది.

❖ ❖ ❖

"శక్తీ... బావున్నావా?"

ఆ పలకరింపుకి తల ఎత్తి కౌంటర్ అవతల వున్న వ్యక్తిని చూసింది శక్తి.

ఆమె పెద్ద బావ శంకర్ నిలబడి వున్నాడు.

"ఆ! ఇలా వచ్చారేమిటి బావా?" విస్మయంగా అడిగింది.

"నిన్ను చూడాలనిపించింది" అన్నాడు.

అందులో శ్లేష ఏమైనా వుందేమోనని అతని ముఖంలోకి గుచ్చిగుచ్చి చూసింది.

అతను మామూలుగానే "మీ ఇంటికెళ్ళాను. మీ ఆయన వున్నాడు. ఇరుగు పొరుగు అమ్మలక్కలనుకుంటా... అందరూ చేరి చింతకాయలు దంచుకుంటున్నారు. భార్యకి ఈ సమయంలో పులుపు తినాలపిస్తుందని తాపత్రయపడుతున్నట్లున్నాడు పాపం! ఎంతైనా అదృష్టవంతురాలివి శక్తీ... తల్లితోడులాంటి భర్త దొరికాడు" అని నవ్వాడు.



ఆమె ముఖం ఎర్రబడింది. పక్క సీట్లోని క్లర్క్ చూడటం గమనించింది.

"బావా ఇది బ్యాంక్. ఇంటిదగ్గర మాట్లాడుకుందాం" కటువుగా అంది.

"ఇంటిదగ్గర దొరకవుకాబట్టి ఇక్కడికి వచ్చి చూశాను. మునుపటికన్నా రంగు తేలి బానే వున్నావు. ఇంద్రనీల్ వంట బావుంటుంది అన్నమాట" అన్నాడు.

శక్తి విసురుగా లేచి బయటికి వచ్చింది.

ఆమె విసురుని చూసి శంకర్ కాస్త జంకి "ఏదో మీ అక్క చూసి రమ్మంటే వచ్చాను. చూశానుగా పోతా..." అన్నాడు.

"పోకపోతే వాచ్‌మెన్‌ని పిలిచి బయటికి పంపించాల్సి వస్తుంది" అంది.

"ఎందుకంత కోపం? లేని మాటలేమైనా అన్నానా? నీ మొగుడు అలా ఆడాళ్ళతో కలిసిమెలిసి ఆడంగిలా వుండటం అబద్ధమా? కడుపుతో వుండటం తప్ప మిగతావన్నీ నీకు ఓ పెళ్ళాంలా చేయడం అబద్ధమా? చేస్తే చేశాడు కానీ... ఇటువంటివి మా ఇంటా వంటా లేవు. మీ అక్కకి మాత్రం వంటపట్టించకు! దాన్ని కలవాలని ప్రయత్నించకు. ఛీ... చెప్పుకుంటే సిగ్గుచేటు..." అని హేళనగా చూసి వెళ్ళిపోయాడు.

శక్తికి ఒక్కనిముషం ఏం చెయ్యాలో పాలుపోలేదు.

'అతణ్ని వెనక్కి పిలిచి తిట్టడమా, ఇంటికివెళ్ళి ఇంద్రనీల్‌మీద విరుచుకుపడటమా, లేక అవమానభారంతో తలదించుకోవటమా?' అని ఆలోచించింది.

ఆ రోజంతా ఆమె చాలా అన్యమనస్కంగా గడిపింది. అందరూ తనవంక అదోలా చూస్తున్నట్లు ఆమెకి అనిపించసాగింది.

శక్తి ఇంటికి వెళ్ళేసరికి ఇంద్రనీల్ లేదు. ఎదురింటావిడ చెల్లెలికి ఫిట్స్ వస్తే హాస్పిటల్‌కి తీసుకెళ్ళాడని తెలిసింది.

ఆమె కాఫీ కూడా తాగకుండా అతనికోసం ఎదురుచూస్తూ గడిపింది.

ఇంద్రనీల్ చాలా అలిసిపోయి రాత్రికి ఇంటికొచ్చాడు.

"అయ్యాయా పరోపకారాలూ?" శక్తి వ్యంగ్యంగా అడిగింది.

"పాపం... సడెన్‌గా విరుచుకుపడిపోయింది శక్తీ! వాళ్ళంతా చాలా కంగారు పడిపోయారు" అన్నాడు.

"సడెన్‌గా కాక ముందుగా చెప్పి పడిపోతుందా? అదిసరే... వాళ్ళ యింట్లో ఎవరూ మగవాళ్లు లేరా? అన్నింటికీ నువ్వే ఎందుకు పూసుకు తిరుగుతావు?" కోపంగా అడిగింది.

శక్తికి కోపంలో ఒళ్ళు తెలీలేదు.

"అంతా నా ఖర్మ! మా పెద్దబావ వచ్చేటప్పటికి నువ్వు ఆడవాళ్ళతో కలిసి చింతకాయలు దంచుతున్నావట. ఎవరైనా చూస్తే ఏమైనా అనుకుంటారని కూడా లేదా నీకు?" అని అరిచింది.

"చింతకాయలు దంచడం అనేది అంత చెడ్డపనేం కాదే! అందులో అతను అంత వెక్కిరించడానికీ, నువ్వు గింజుకోవడానికీ. పేపర్ చదవటం, గడ్డం గీసుకోవడం, తన పొట్టకి వేళకి ఇంత తినడం, ఇస్త్రీ బట్టలేసుకుని బయట తిరగడం యివన్నీ మగపనులని, వంట చెయ్యడం, అంట్లు తోమడం, బట్టలుతకడం ఇవన్నీ ఆడపనులనీ అందరిలాగే నువ్వు మనసులో నమ్ముతున్నావన్న మాట!

ఒక ఆడది ఏ దిక్కూ లేకపోతే చచ్చిపోయేదాకా కూడా ఒంటరిగా వుంటూ, తన వంట తను వండుకుని తింటూ జీవితం గడుపుతుంది!

అదే ఓ మగవాడు భార్యపోగానే ఇంత వుడకేసే దిక్కుకోసం మళ్ళీ పెళ్ళాడతాడు. కాటికి కాళ్ళు చాచుకున్న ముసలాడు కూడా పనిమనిషి అయితే నికరంగా చెయ్యదు అని పెళ్ళాడడానికే సుముఖత చూపిస్తాడు. అది పురుషాధిక్యతా, అహం అని వాళ్ళు భావిస్తారేమో కానీ... అది ఒక అశక్తత! హేండీకాప్ అని నేను భావిస్తాను.

నువ్వు ఓ పెద్ద స్త్రీవాదిలా 'నేను సంపాదిస్తాను. నువ్వు యింట్లో వుండు' అన్నావు. నేను నువ్వు చెప్పినట్లే వున్నాను. మళ్ళీ యిప్పుడీ ద్వంద్వ ప్రవృత్తి ఎందుకూ?

నీ భర్తగురించి చాలా హుందాగా నలుగురూ అనుకోవాలని నీ తాపత్రయమా?



అయితే నాకు నీ పెద్దబావకన్నా, చిన్నబావకన్నా మంచిపేరుంది ఇంటి దగ్గర. వాళ్ళ చుట్టుపక్కలవాళ్ళని ఓసారి వాళ్ళగురించి ఎంక్వైరీ చేసి చూడు.

ఇంకొక మాట. పరోపకారం చెయ్యడం నా రక్తంలో ప్రవహిస్తున్న గుణం! దాన్ని చూసే నువ్వు ఆకర్షితురాలివై నన్ను పెళ్ళి చేసుకోమని అడిగావని మరిచిపోవద్దు!"

అతను అంత కరుకుగా మాట్లాడటం ఆమె ఇదివరకు ఎన్నడూ చూడలేదు. అలాగే నిలబడిపోయి, అతను అన్నదాంట్లో నిజాన్ని గ్రహించ డానికి ప్రయత్నించింది.

ఇంద్రనీల్ వంటింట్లోకి వెళ్లి ఆమెకోసం పండ్లరసం తీసుకువచ్చాడు.

అదే అతనిలో శక్తికి నచ్చే గుణం!

ఎంత హాట్‌మూడ్‌లో వున్నా, ఎంతకోపం వచ్చినా ఏ పనీ మానడు. అన్నీ సక్రమంగా చేస్తాడు. ఫలానా పని మూడ్ బాలేదని మానేశాడు అనేమాట వుండదు. అందరిలాగే తనూ అతను 'ఈ పనులు చేయటంపట్ల చులకన భావం చూపిస్తోందా?' అని ఆలోచించింది.

పెద్దబావనీ, చిన్నబావనీ ఎంతగా అసహ్యించుకుందీ... అలాంటిది పెద్దబావ హేళన చేశాడని తనూ ఇంద్రనీల్‌ని అవమానపరిచింది.

ఏమైంది తన వ్యక్తిత్వం? ఆలోచనా శక్తీ!

ఒంటరిగా వున్నప్పుడూ, నలుగురిముందూ ఒకేలాంటి ఆలోచనతో, అభిప్రాయంతో స్థిరంగా ప్రవర్తించడమే వ్యక్తిత్వం అయితే, ఇంద్రనీల్‌ది చాలా గొప్ప వ్యక్తిత్వం!

ఆమెకి మనసంతా గిల్టీ ఫీలింగ్‌తో నిండిపోయింది. కానీ ఆ విషయం బయటకు చెప్పుకోడానికి ఏదో అడ్డుపడుతోంది.

అహం అనేది దారంతో పడే చిక్కులాంటిది. పూలు మాలకడుతున్న పుడు మధ్యలో ఈ చిక్కులొస్తే పూలు తెగి కింద పడిపోతాయి. అందుకే దాన్ని చిక్కు అన్నారు.

పూలలాంటి అనుభవాల్ని ఈ చిక్కులు చిందరవందర చేస్తాయి!

అతను గంభీరంగా పడుకుని పుస్తకం చదువుకుంటున్నాడు. రోజూలాగే శక్తిని కబుర్లతో వూదరగొట్టడంలేదు.

ఆమెకి అతనితో మాట్లాడాలనివున్నా ఏం మాట్లాడాలో వెతుక్కోవలసిన పరిస్థితి. దగ్గరవాళ్ళతో అప్పుడప్పుడూ ఏర్పడే ఈ స్థితి కాలం చిన్నదైనా, అంగిట్లో ముల్లు గుచ్చుకున్నంత బాధగా వుంటుంది.

అతని పక్కనే పడుకుని పై కప్పుని చూస్తూ "రేపు చెకప్‌కి వెళ్ళాలి డాక్టర్ దగ్గరకి" అంది.

అతను మాట్లాడలేదు.

"కడుపులో నెప్పిగా వుంది... అబ్బా!" అంది కడుపు పట్టుకుని.

అతను చటుక్కున పుస్తకం పారేసి ఆమెవైపు తిరిగాడు.

"ఎక్కడా..." అన్నాడు కంగారుగా.

"ఇంకా పుట్టని పిల్లాడిమీద అప్పుడే ఎంత ప్రేమో!" అంది.

"విత్తనం వేసిన రైతుకి తెలుస్తుంది ఆ తృప్తి..." జవాబుచెప్పి మళ్ళీ పుస్తకం చేతిలోకి తీసుకున్నాడు.

ఇంక ఆమె ఆగలేనట్లు అతనివైపు తిరిగి అతని గుండెలమీద తల వాల్చింది.

అప్రయత్నంగా అతని కుడిచెయ్యి ఆమె తలమీదపడి ఆమె తల నిమరసాగింది.

'నేను చాలా ఫూలిష్‌గా బిహేవ్ చేశాను. అతను అలా అనగానే నాకు చిన్నతనం అనిపించింది. కానీ యిప్పుడు ఆలోచిస్తే అదంతా ఎంత తప్పో తెలుస్తోంది. ఇంకెప్పుడూ అలా అరవను' అనాలనుకున్న ఆమె ఏమీ మాట్లాడలేకపోయింది.

కానీ అతని చెయ్యి ఆమె చెక్కిలిమీదకి జారగానే వెచ్చగా తగిలింది కన్నీటిబొట్టు. దానిని తుడిచే ఆ చెయ్యి "నేను ఏమీ అనుకోలేదులే. బాధపడకు" అని ఆమె హృదయానికి సంకేతం పంపించింది.

వారి ఉచ్ఛ్వాసనిశ్వాసాలు ఏకమై గదిలోని నిశ్శబ్దాన్ని పారదోలే పనిలో పడ్డాయి!

తెల్లవారుఝామున శక్తికి ఎప్పుడు మెలకువ వచ్చినా, అతను తన మెడవంపులో తలపెట్టుకుని, పొట్టచుట్టూ చెయ్యివేసి పడుకుని కనిపిస్తాడు.



ఆ ముఖంలో సంతృప్తి రాజ్యాలేలే భూపతులకూ, భోగాలనుభవించే శ్రీమంతులకీ కూడా వుండదనిపిస్తుంది.

ఆమె మొట్టమొదటి దినచర్య అతని నుదురుమీద పడుతున్న జుట్టుని వెనక్కి తోసి అక్కడ ముద్దు పెట్టుకోవడం.

❖ ❖ ❖

"మళ్ళీ ఫస్ట్ వస్తోంది" బాధగా అంది తారతో శక్తి.

చపాతీ తుంపుకుని తింటున్న తార "నాలా బాకీలు, బాధ్యతలూ వున్నవాళ్ళు దిగులుపడాలిగాని, నీకెందుకీ ఫస్ట్ తారీకు బెంగ?" అంది.

శక్తి డబ్బాలోని పెరుగన్నం స్పూన్‌తో అటూ యిటూ కదిపి డబ్బా మూత పెట్టేసింది.

"అదేం? తినవా?" తార అడిగింది.

"అతను మళ్ళీ ఊరికి వెళతాడు. ఆ సమయం దగ్గరపడుతూ వుంటే నాకు అన్నం నోటికి పోదు. ఏ పనీ చెయ్యబుద్ధికాదు తారా! నా ప్రాపర్టీని ఎవరో బలవంతంగా నానుంచి నాలుగురోజులు లాగేసుకుంటున్నట్లు అనిపిస్తుంది తెలుసా?" స్వల్పంగా వణుకుతున్న కంఠస్వరంతో చెప్పింది శక్తి.

"ప్రాపర్టీ!" నవ్వింది తార.

"ఆడది మీ ఆస్తిలో భాగమా... ఆమెకి స్వేచ్ఛనివ్వరా... ఆమెకి తను ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించే హక్కు లేదా అని ఓ వర్గం స్త్రీలు విరుచుకుపడు తున్నారు. వివాహ బంధంవల్ల పురుషుడికి ఆ స్వేచ్ఛ లేదు. పాపం అతను ఆడదాని ఇష్టాలకి, నోటికి తలవంచాల్సిందే. ఎక్కడో కరాఖండీగా వుండే నా మొగుడిలాంటి వాడు తప్ప. అసలు తప్పు ఎక్కడుందో అర్థంకావడంలేదు శక్తీ! ఈ వివాహం అనే చట్రంలో ఇరుక్కోగానే 'నీ ఇష్టం... నా ఇష్టం కలిసి మన ఇష్టాలుగా' మారాలనే నిబంధనలు ఎందుకూ? ఒక రూంలో ఇద్దరు రూంమేట్స్ కొన్ని సంవత్సరాలు అవసరార్థమై కలిసి వుంటారు. ఆ తర్వాత కూడా జీవితంలో స్నేహితులు గానే మసలుతారు. కలిసున్న సమయంలో నీ అభిరుచులూ, నీ స్నేహితులూ, నీ వ్యాపకాలూ అన్నీ నా ఇష్టప్రకారమే వుండాలి అను అనుకోరుగా! మరి భార్యాభర్తలనగానే మొదటి రోజునుంచే ఈ విషయాల

మీద ఇన్ని తగాదాలూ, వివాదాలూ, వాటికై రచ్చకెక్కడాలూ, రాజీ పడటాలూ, విడాకులు తీసుకోవడాలూ ఎందుకూ?" నిలదీస్తున్నట్లుగా అడిగింది తార.

"అభద్రతా భావం" వెంటనే జవాబిచ్చింది శక్తి.

"అంటే?" వివరణ ఇవ్వమన్నట్లుగా చూసింది తార.

"రూం మేట్స్‌కి మధ్యన 'వీళ్ళు మనకన్నా వేరే వ్యక్తులకి ప్రాముఖ్యత నిస్తున్నారేమో, రేపు ఒకవేళ మనని వదిలిపోతారేమో' అనే అనిశ్చితస్థితి వుండదు. భార్యాభర్తలకి ఒకరిమీద ఒకరికి అనురాగం పెరిగేకొద్దీ అవతల వారి ఎటన్షన్ పూర్తిగా తమమీదే వుండాలనే స్వార్థం పెరుగుతుంది. అదే ఈర్ష్యగా మారి ఆ తర్వాత గొడవలకి దారితీస్తుంది" అంది.

"అటువంటి ఈర్ష్యా, పొసెసివ్‌నెస్ నీ అక్కలమీద నీ బావలు చూపించి నప్పుడు నువ్వు మండిపడ్డావు. ఖండించావు గుర్తుందా?" అడిగింది.

"అది ఈర్ష్యకాదు, అనుమానం" అంది శక్తి.

"ఇప్పుడు ఈ నాలుగురోజులూ ఇంద్రనీల్ ఎక్కడికి వెళుతున్నాడో, ఎవరి దగ్గర వుంటున్నాడో అన్న నీ బాధ అనుమానం కాదా? గుండెలమీద చెయ్యేసుకుని చెప్పు" అంది తార.

"చెప్పలేను. ఈ నాలుగు రోజులూ అతను వెళతాడు అన్న బాధ మిగతా నెలంతా నన్ను నిశ్చింతగా వుండనీయడంలేదు. ఆరోజు నేను ఆ కండిషన్‌కి ఒప్పుకోకుండా వుండాల్సింది తారా! శ్రీధర్, నువ్వూ ఎన్ని గొడవలు పడినా, అతను నీకు చెప్పకుండా పేకాటకు వెళ్ళడు కదా? నీ భర్త ఎక్కడున్నాడు? అంటే నువ్వు చెప్పగలిగే స్థితిలో వున్నావు కదా. అదే నాకు లేనిది. నాతో ఇంత దగ్గరగా వుండే అతను ఈ విషయం ఎందుకు దాస్తున్నాడో, అడగకూడదని ఎందుకు కండిషన్ పెట్టాడో నాకు తల బద్దలు కొట్టుకున్నా అర్థంకావడంలేదు. ఈ విషయమై ఆలోచిస్తుంటేనే అసలు నాకు నిద్ర పట్టడంలేదు" కన్నీళ్ళతో అంది శక్తి.

"ఏమోనమ్మా! నాకుమాత్రం ఎన్ని సమస్యలున్నా వేళకి తిండి సహిస్తుంది. కంటినిండా నిద్రపడుతుంది. చిన్నగీత ముందు పెద్దగీతలా నా కష్టాలన్నీ ఒక్క రోజులో చిన్నగా మారిపోతుంటాయి. నిన్న ఆడబిడ్డ



వచ్చి సాధించిపోయిందే అని బాధపడేలోగానే అత్తగారికి సీరియస్ అని టెలిగ్రాం వస్తుంది. పోవడానికీ, రావడానికీ డబ్బు చూసుకోవడం, ఆ తర్వాత నా లీవ్ సమస్యా, తెచ్చాక ఆవిడకి చాకిరీ... వీటిముందు ఆడబిడ్డ సమస్యా స్వల్పంగా కనిపిస్తుంది. అసలు ఆలోచించడానికి వ్యవధి వుండదు. ఈలోగా ఈ సమస్యకన్నా మరో పెద్ద సమస్య నా పతిదేవుడు ఎలాగూ తెస్తాడు. దాంతో అత్తగారి సమస్య ప్రాముఖ్యత తగ్గిపోయి దానిగురించి ఆలోచించడం ప్రారంభిస్తాను. వీటన్నింటినీ డామినేట్ చేస్తూ పిల్లల ఆరోగ్యాలూ, చదువులూ, ఆర్థిక లోపం వుండనే వుంటాయి" అంది.

"నేను గోరంతలు కొండంతలు చేసుకుంటున్నాననేగా నీ ఉద్దేశం?" అడిగింది శక్తి.

తార సానుభూతిగా చూసి "ఏమో! నీ స్థానంలో వుంటే నేనూ ఇలాగే ఆలోచించి మనసు పాడుచేసుకునేదాన్నే అనుకుంటా. మనిషికీ, సమస్యకీ అనాదిగా వస్తున్న ఈ అవినాభావసంబంధం ఎవరూ విడదీయలేనిది" అంది.

"నేను అనవసరంగా ఈ విషయం గురించి ఎక్కువగా ఆలోచిస్తున్నానేమో తారా!" తనకి తను నచ్చచెప్పుకుంటున్నట్లుగా అంది శక్తి.

తార మాట్లాడలేదు. ఎవరి సమస్యలు వారికి పెద్దవే అని ఆమెకి తెలుసు. లేకపోతే భర్తలు గురకపెట్టడం, భార్యలు మోడ్రన్‌డ్రస్‌లు వేసుకోవడంలాంటి విషయాలమీద విడాకులు ఎందుకు తీసుకుంటారూ? లాయర్లకి ఇవ్వడానికి డబ్బు లెక్కువయ్యా లేక తిన్నది అరక్కనా? ఏదైనా భరించలేకపోవడం సమస్యేగా. అందులో కొంచెం భరించడం, ఎక్కువ భరించడం అన్న తూనికలూ, కొలతలూ ఏం వుంటాయి?

మరునాడు ఇంద్రనీల్ వెళుతూ శక్తికి మందులూ అవీ జాగ్రత్తగా వేసుకోమని మరీమరీ చెప్పాడు. అది చాలదన్నట్లు మీనాక్షిని పిలిచి వేళకి మందులు వేసుకుంటోందా, అన్నం తింటోందా అని కనిపెట్టి చూడమన్నాడు.

శక్తిమాత్రం చాలా దిగులుగా అన్నింటికీ తల ఊపింది.

"మధ్యలో ఫోన్ చెయ్యండి" అంది.

"వీలు కాదేమో... ట్రై చేస్తాలే" అన్నాడు.

"ఫోన్ అనేది ఇప్పుడు మానవసంచారం వున్న ప్రతిచోటా వుంటోంది" నిష్ఠూరంగా అంది.

"వస్తాను... ఆరోగ్యం జాగ్రత్త" ఆమె చెక్కిలి నిమిరి వెళ్ళిపోయాడు.

డాక్టర్ ఇచ్చిన డ్యూ డేట్స్‌కి యింకా పదిహేను రోజులు టైం వుంది. శక్తి లీవ్ తీసేసుకోవడంతో ఇంట్లో వుండటంవల్ల అసలు తోచడం లేదు. అస్తమానం అతనిగురించే ఆలోచించసాగింది.

మామ్మగారి ఇంట్లోంచి గట్టిగా మాటలూ, సన్నగా ఏడుపూ వినపడ్డాయి.

శక్తి భారంగా అడుగులేస్తూ వాకిలిదాకా వెళ్ళి నిలబడింది.

మామ్మగారు వరండాలో చాపమీద కూర్చున్న ఓ అమ్మాయిని ఓదారుస్తూ "ఊర్కోమ్మా, ఊర్కో... మాయదారి వెధవ... మనం ఇంతకాలం కనుక్కోలేకపోయాం... తప్పు మనది" అంటోంది.

పడక కుర్చీలో కూర్చున్న తాతగారు ముక్కునిండా నశ్యం పట్టించి "అయినా ఈ భాగోతం మూడేళ్ళుగా సాగుతుంటే నువ్వేం చేశావే? ఇల్లనే మండపానికి ఇల్లాలు మూలస్థంభంలాంటిది. నీకు ఇంట్లో జరుగుతున్న విషయాలుకూడా పట్టవా? పోనీ అంటే చదువూ, సంధ్యాలేని మొద్దువు కూడా కాదు" అని మందలిస్తున్నాడు.

"అది అసలే ఏడుస్తోంది. మీరు సాధించడం మాని జరగాల్సినది చూడండీ" అంది మామ్మగారు.

"ఇంకేం వుంది చూడటానికి? లాయర్ని కలిసి మాట్లాడతాను. బినామీ కేసు పెడితే కాళ్ళబేరానికొస్తాడు" కోపంగా అన్నాడాయన.

"అంతకన్నా వేరే మార్గం లేదా తాతయ్యా" ఆ అమ్మాయి దుఃఖంవల్ల జీరపోయిన గొంతుతో అడిగింది.

మామ్మగారి దృష్టి వాకిట్లో ద్వారబంధానికి ఆనుకుని నిలబడ్డ శక్తిమీద పడింది.

"శక్తీ... ఇటు రామ్మా... చదువుకుని, ఉద్యోగం చేస్తున్నదానివీ, కాస్త సలహా చెప్పు" అంది.



పిలవకుండా వచ్చి కలుగజేసుకోవడం మర్యాద కాదని దూరంగా నిల్చున్న శక్తి వెంటనే వచ్చి "ఎవరీ అమ్మాయి మామ్మగారూ!" అని అడిగింది.

ఆ అమ్మాయి కళ్ళు తుడుచుకుని శక్తివంక ఓ క్షణం చూసి తలదించుకుంది.

"నా మనవరాలమ్మా... తల్లీదండ్రీలేని పిల్ల. ఈ కడుపులో పెట్టుకుని పెంచాను. ఉన్నంతలో బాగా ఖర్చుపెట్టి మంచి సంబంధమే అనుకొని పెళ్ళిచేశాను. పెళ్ళయి మూడేళ్లయింది. దీనికి ఏడాదిన్నర కూతురుకూడా వుంది. ఇప్పుడు తెలిసిందట దీని మొగుడికి ఇంకో పెళ్ళాం, అక్కడ ఇద్దరు పిల్లలూ వున్నారని. నిలదీస్తే ఒప్పుకుని 'ఏం చేస్తావ్?' అంటున్నాడట. మా ప్రారబ్ధం ఇలా తగలబడింది. ఏం చెయ్యమంటావో చెప్పు తల్లీ!" మామ్మగారు శోకాలు పెట్టింది.

"శోకాలు పెడితే దాని తలరాత మారుతుందా? దీనికితోడు ఓ పిల్లకూడా పుట్టింది. ఇంతకాలం ఇది కళ్ళు మూసుకుని వుండిపోయింది. మొద్దు... మొద్దాని" తాతగారు బీపీ పెరగడంవల్లనేమో వుద్రేకంగా అరుస్తున్నారు.

శక్తి ఆయన దగ్గరికెళ్ళి "మీరు ఉద్రేకపడకండి. సమస్య వచ్చినప్పుడు కాస్త ఓర్పు పట్టి నిదానంగా ఆలోచిస్తే పరిష్కారం తట్టకపోదు" అంది.

"సమస్య నీదైతే నేనూ ఇదేమాట చెప్తానమ్మా" ఆయన కస్సుమన్నాడు.

"మీకు మతిపోయిందా? ఆ అమ్మాయిమీద విసుక్కుంటారేమిటి? ఏదో మాట సాయానికి వచ్చింది పాపం" అంది మామ్మగారు.

"శ్రీదేవీ... పాప లేచినట్లుంది ముందు దానిసంగతి చూడు" అని ఆ అమ్మాయిని లోపలికి పంపించాడాయన.

ఆ అమ్మాయి ఎంతో సిగ్గుపడుతున్నట్లుగా, చెయ్యని తప్పుకు శిక్ష అనుభవిస్తున్నదానిలా తలవంచుకు కూర్చున్నదల్లా తాతగారి మాటలకు లేచి లోపలికి వెళ్ళింది.

"మగవాడు లక్ష కారణాలను చెప్పి బయటికి వెళ్ళొస్తాడు. ఏం పనో అనుకుంటాం కానీ ఇలా ఇంకో సంసారం వుండివుంటుందనే వూహ

వస్తుందా అమ్మా. ఈయనదంతా విపరీతం కానీ" అంది పైటతో కళ్ళొత్తుకుంటూ మామ్మగారు.

ఈ వయసులో ఆ వృద్ధ దంపతులకి వచ్చిన కష్టానికి శక్తి మనసంతా భారమైంది. కానీ లోపల్నుంచి శ్రీదేవి వెక్కిళ్ళు పెట్టడం వినిపించగానే ఆమె గురించిన ఆలోచనలు మనసును పిండేశాయి. భర్త తనని వదిలి ఇంకో స్త్రీ దగ్గరకి వెళ్ళడం ఈమె స్త్రీత్వాన్ని కించపరచడమేగా! మొదటే ఆ పెళ్ళయివుంటే ఆ స్త్రీనీ, ఈ స్త్రీనీ కూడా అతను వంచించినట్లే! మామ్మగారు అన్నట్లు భర్త లేటుగా వచ్చినా, చెప్పకుండా ఎక్కడికైనా వెళ్ళినా ఇటువంటి అనుమానాలు ఎందుకు వస్తాయి? ఆ అమ్మాయి కనుక్కోలేకపోయింది. అంటే అది ఆ అమ్మయి తప్పు ఎలాగవుతుంది? ఇంట్లో వుండే ఆడది భర్తగురించి ఏమని వాకబు చేస్తుంది?

"కేసు పెడితే వాడికి జైలుశిక్ష పడుతుంది. మూడు చెరువుల నీళ్ళు తాగిస్తాను" తాతగారు మనవరాలి మొగుణ్ని ఉద్దేశించి నానా తిట్లు తిడుతున్నారు.

"వాడు జైల్లో కూర్చుంటే దీని జీవితం, ఆ పసిదాని జీవితం బాగుపడతాయటండీ?" నుదురు కొట్టుకుని అంది మామ్మగారు.

ఇంకా లోకం సరిగ్గా తెలీనట్లు అమాయకంగా కనిపిస్తున్న శ్రీదేవికి అప్పుడే ఓ పిల్లా! రేపు ఆమె భవిష్యత్తు ఏమిటీ? అతను చెప్పినట్లు విని రెండోభార్యగా అతని చిత్తం వచ్చినప్పుడు వచ్చిపోతుంటే కాపురం చేసుకోవడమా? లేక వాణ్ని జైల్లో పెట్టించి ఒంటరిబతుకు గడపటమా?

"అతడ్ని పిలిచి ఓసారి మాట్లాడి చూడండి" అంది శక్తి.

"తెగించినవాడికి ఏమిటమ్మా మాటలు? నువ్వు నాకు వద్దే వద్దు అని తన్ని తగలేశాకేగా అది మాకీ విషయం చెప్పింది. పాపం బిడ్డ... అప్పటిదాకా ఓర్చుకుంది" అంది మామ్మగారు.

"ఈ వయసులో మాకీ కష్టం ఏమిటి చెప్పు? దాని ఈడువాళ్ళందరూ చక్కగా కాపురాలు చేసుకుంటూంటే, ఇది వుసూరుమని మా కళ్ళెదుట తిరుగుతుంటే ఎలా భరించాలి? తిండీ, బట్టా అంటే ఇస్తాము. సంసారం ఎలా సమకూర్చగలం?"



ప్రాక్టికల్‌గా ఆలోచించి బాధపడ్డారు ముసలాయన.

'విడాకులు' ఆడదాని కోరికమీదే ఇస్తారు. కానీ ఎప్పుడూ ముల్లూ, అరిటాకూ సామెతే! విడాకులు తీసుకున్న నెలలోనే మగవాడికి ఇంకోపెళ్ళి అవుతుంది. కానీ ఆడదానికి ఇక జీవితంలోకి మరో పురుషుడి ఆగమనం అంటేనే భయం ఏర్పడిపోతుంది. పైగా పిల్లలుంటే మగవాడికి అప్పగించాలని అందరూ గొంతులు చించుకుంటున్నారు. స్త్రీ ఈ విషయంలో మాత్రం ఎంతవరకూ సంతోషంగా వుండగలదు? పిల్లలూ, పెంపకం, వాళ్ళ రోగాలూ, భవిష్యత్తు అన్నది ఆమె జీవితంలో ముఖ్యమైన భాగంగా అనుకుంటుంది. ఇందుకు భిన్నంగా ఆలోచించి పిల్లల్ని వదులుకోవడానికి సిద్ధపడతారు.

పాపని హృదయానికి హత్తుకుని నిలబడ్డ శ్రీదేవిని ఒకవేళ కోర్టుతీర్పు చెబితే, బిడ్డని అతనికి యిచ్చేసి గతాన్ని తుడిచేసి, మళ్ళీ జీవనస్రవంతిలో కలిసిపోగలదా? ఈ బలహీనతలూ, ప్రేమించే గుణాలే స్త్రీని అనాదిగా ఈ సంసారం అనే ఉక్కు చట్రంలో బిగించి పెడుతున్నాయి.

శక్తి కాసేపు ధైర్యం చెప్పి తన వాటాలోకి వచ్చేసింది.

సాయంత్రం కూతుర్ని చూసిపోదామని గోపాలరావు వచ్చాడు.

"రా...నాన్నా..." శక్తి ఆనందంగా ఆహ్వానించింది.

"ఇంద్రనీల్ లేడు. ఒక్కదానివీ ఎలా వుంటావో అన్న ఆలోచన నన్ను నిలవనీయలేదమ్మా!" అన్నాడు.

శక్తికి తండ్రిమాటలు ఏదో తెలియని భయాన్ని కలుగజేశాయి.

'అతను ఒక్కరోజు లేకపోతేనే నువ్వెలా బతుకుతావో అంటున్న ఈ తండ్రి... ఒకవేళ రేపు నిజంగా ఏదైనా అయి... అతను రాకపోతే...!!'

తన అర్థంలేని భయాలకీ, ఆలోచనలకీ ఓ రూపం కల్పిస్తూ శ్రీదేవి సమస్య ఆమెని మనశ్శాంతికి దూరం చేసింది.

రాత్రి మామ్మగారు వచ్చి తలుపులు బాది "తాతగారు హైబీపీ వచ్చి పడిపోయారు. హార్ట్ ఎటాకేమో భయంగా వుందమ్మా... సమయానికి ఇంద్రనీల్‌కూడా లేడు ఎలా?" అంది.

"మా నాన్నని పంపించి ఆటో తెప్పిస్తాను" అని శక్తి గోపాలరావుని లేపి సంగతిచెప్పి ఆటోకోసం పంపించింది.

తాతగారిని హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు. డాక్టర్ హార్ట్ ఎటాకేననీ, సమయానికి తీసుకురాబట్టి తిప్పుకున్నారనీ చెప్పాడు.

"నన్ను ఏం చేసి పోదామనుకున్నావు నా దేవుడోయ్" అని మామ్మగారు శోకాలు పెట్టింది.

శక్తి మామ్మగారిని ఓదారుస్తూ కూర్చుంది.

"నువ్వు ఇంటికెళ్ళమ్మా! రాత్రికి నేను వుంటాను" అన్నాడు గోపాలరావు.

శక్తికి తాతగారి ప్లేస్‌లో తండ్రి కనిపించి మనసంతా భారమైంది. ఇద్దరి కూతుళ్ళ జీవితాలూ ఓటి కుండలే! సంతోషం అనేది ఎక్కువసేపు నిల్వ వుండదు. ఒక్క తన జీవితమే బాగుందనీ, ఇంద్రనీల్ తన అదృష్టం కొద్దీ దొరికాడనీ ఆ ముసలిప్రాణం ఆనందంగా కాలం వెళ్ళబుచ్చుతోంది. ఇక్కడ కూడా జరగరానికి ఏదైనా జరిగితే... ఆమెకి ఎందుకో దుఃఖం ముంచుకువచ్చి "నాన్నా..." అంది ఆయన చెయ్యి పట్టుకుని.

"ఏం పర్లేదు. అంతా సర్దుకుంటుంది. తనని నమ్ముకున్నవాళ్ళని భగవంతుడు అన్యాయం చెయ్యడు" ఎన్నో దెబ్బలు తిన్న తర్వాత కూడా ఆయన ధీమాగా చెప్పాడు. ఆ నమ్మకమే మనిషిని ముందుకి నడిపిస్తోంది.

శక్తి కళ్ళు తుడుచుకుని బయటికి వచ్చేసింది. ఇంటిదగ్గర శ్రీదేవి పాపని ఎత్తుకుని ఆత్రంగా ఎదురుచూస్తూ కనపడింది.

"తాతగారికి ఎలా వుందండీ?" ఆందోళనగా అడిగింది.

దీనికంతటికీ తనే కారణం అన్న పశ్చాత్తాపభావం వల్లనేమో ఆమె ముఖం దించుకుని అడిగింది.

శక్తికి ఒక్కక్షణం ఆ అమ్మాయిని దగ్గరగా తీసుకుని 'నీవల్ల ఏం కాదమ్మా! అనాదిగా వస్తున్న ఈ మగ దౌష్ట్యంవల్లా, మన సహనంవల్లా ఇలా జరుగుతోంది. సంగతి తెలీగానే అతడ్ని గదిలోపెట్టి నాలుగు తన్నాల్సింది. నిన్ను మోసం చేసే హక్కు ఎవరిచ్చారని నలుగురిలో పెట్టి నిలదీయవలసింది. కానీ నువ్వు ఏడుస్తూ కాళ్ళు పట్టుకుని వుంటావు. బిడ్డని ఎత్తుకుని, మనసుని చంపుకుని పరాధీనా, పరాజితలా పుట్టింటికి వచ్చావు. ఇక్కడ ఈ వృద్ధులకి బరువయ్యానని, దిగులుతో కుచించుకు పోతున్నావు. అవసరంలేదు. నీ కాళ్ళమీద నిలబడి ఎవరికీ బరువు



కాకుండా నీ బిడ్డని నువ్వు పెంచుకునే మార్గాలు వున్నాయి. అలాగని నీ భర్త నిన్ను వదిలిపెట్టకూడదు. బిడ్డ పోషణభారం అతనూ వహించాల్సి వుంటుంది. నీకింకా వయసుంది. ఏం మించిపోలేదు. ఒక తోడు దొరికితే హాయిగా అన్ని సుఖాలూ అనుభవించు. ఎవరో చేసిన తప్పుకి నీ పండంటి జీవితాన్ని బలిపెట్టకు!' అని చెప్పాలని పించింది.

అయినా నిగ్రహించుకుని "నేను ఈ రాత్రి నీతోనే పడుకుంటాను" అంది.

శ్రీదేవి అంత ఇష్టపూర్తిగా స్పందించలేదు!

"ఒద్దండీ... నేను వుండగలను" అంది.

"కానీ నాకు భయం! మంత్స్ నిండాయి కదా. ఏ క్షణానైనా నెప్పులు రావచ్చు" తను ఆమెమీద ఆధారపడినట్లుగా మాట్లాడింది తెలివిగా శక్తి.

ఆమెకి ఎందుకో ఈ పరిస్థితుల్లో ఆ పిల్లని ఒంటరిగా వదలాలనిపించ లేదు. ఈ సమయంలోనే పిచ్చిపిచ్చి ఆలోచనలు వచ్చి ఏ అఘాయిత్యాలైనా చేసేయాలనిపిస్తుంది.

శ్రీదేవి ఇంక పెద్దగా తర్కించలేదు.

ఆ రాత్రి శక్తికి కంటిమీద కునుకులేదు. శ్రీదేవి కాస్త కదిలినా వెనకే లేచి కూర్చుని కాపలా కాసింది.

తెల్లవారుఝామున నిద్ర పడుతుండగా పాప ఏడుపు వినిపించి కళ్ళు తెరిచింది.

పాప శక్తి పక్కన కూర్చుని ఏడుస్తోంది. "శ్రీదేవీ... శ్రీదేవీ..." అని పిలిచింది శక్తి.

శ్రీదేవి జాడలేదు!

శక్తి లేచి ఏడుస్తున్న పాపని ఎత్తుకుని లోపలికి నడిచింది. వంటింటి తలుపులు వేసున్నాయి. శక్తి అనుమానంగా తలుపులు కొడుతూ... "శ్రీదేవీ.." అని పిలిచింది.

లోపల ఏదో అలికిడి అయింది.

పెరట్లోంచి శక్తి కిటికీతలుపులు తోసింది. అవి గడియవేసి లేకపోవడం మూలాన వెంటనే తెరుచుకున్నాయి. లోపలి దృశ్యం ఆమెని ఒక్కక్షణం అచేతనురాల్ని చేసింది.

శ్రీదేవి స్టూల్‌మీద నిలబడి పై దూలానికి ఉరి వేసుకుంటోంది.

"శ్రీదేవీ!" అని బిగ్గరగా కేకలు వేసింది.

శ్రీదేవి తలతిప్పి చూసింది కానీ తన ప్రయత్నం మానలేదు. మెడని ముడిలోకి దూర్చుకుంటోంది.

శక్తి చంకలో పాప గుక్కపెట్టి ఏడుస్తోంది.

"శ్రీదేవీ... ఆగు... ఏమిటా పని? పాప ఏడుస్తోంది చూడు" అని అరిచింది శక్తి.

శ్రీదేవి కూడా ఏడుస్తోంది. శక్తి అరుపులు పట్టించుకోలేదు.

శక్తి మెదడు చురుగ్గా పనిచేసింది.

"శ్రీదేవీ... పాపని కూడా నీతో పంపిస్తున్నాను. తీసుకెళ్ళు... ఇక్కడ ఎవరు చూస్తారు పాపం?" అంది.

శ్రీదేవి అటు చూసింది.

పెరట్లో బావిగట్టుమీద పాప కూర్చుని ఏడుస్తోంది. ఏ నిమిషానైనా బ్యాలెన్స్ అవుట్ అయితే జారిపోయేట్లుగా వుంది.

శ్రీదేవి మొహంలో కలవరం కనిపించింది.

"పాపని అక్కడనుంచి తీయండి" అని అరిచింది.

శక్తి దూరంగా నిలబడి "పాప ఏమైతే నీకెందుకులే... నీ సంగతి నువ్వు చూసుకుంటున్నావుగా, కానీ" అంది.

"ఒద్దు... పాపని ఎత్తుకోండి... అయ్యో పడిపోతుంది... మీకు దండం పెడతాను" శ్రీదేవి చేతులు జోడించి బతిమాలింది.

పాప వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తోంది. కాసేపటికి లేచి బావిగట్టుమీద నిలబడే ప్రయత్నం మొదలుపెట్టింది.

శ్రీదేవి ఇక ఆగలేక "పాపా..." అని అరుస్తూ మెడలోని చీరముడిని తీసిపారేసి కిందికి దూకి తలుపువైపు పరిగెత్తింది.

శ్రీదేవి ఏడుస్తూ పరిగెత్తుకొచ్చేసరికి అక్కడ పాప లేదు!

"పాపా... నా తల్లీ... నా చేతులారా నిన్ను పొట్టన బెట్టుకున్నాకదమ్మా" అని బావిలోకి తొంగిచూస్తూ గుండెలు బాదుకుంటూ ఏడ్చింది.

వెనకనుంచి భుజంమీద చెయ్యిపడింది.



శ్రీదేవి ఏడుస్తూ వెనక్కి తిరిగితే శక్తిచేతుల్లోంచి పాప ఒక్క వుదుటున తల్లివైపు దూకింది.

"పాపా... నా వరాలతల్లీ!" అని శ్రీదేవి పాపని గుండెలకి హత్తుకుని ఆపకుండా ముద్దులు పెట్టుకుంది.

"నీ పాపని ఎవరిమీద నమ్మకంతో వదిలిపోవాలనుకుంటున్నావు శ్రీదేవీ?" అడిగింది శక్తి.

ఆమె జవాబివ్వకుండా పొగిలిపొగిలి ఏడుస్తూ పాపని ఇంకా దగ్గరకి తీసుకుంది.

"మనకి ఎవరో ఏదో ఇవ్వడంలేదన్న బాధకొద్దీ మనవాళ్ళకి మనం అన్యాయం చేయడం నేరం! నువ్వు ఏ అఘాయిత్యం అయినా చేసుకుంటే ఆ ముసలి ప్రాణాలు ఎలా ఓర్చుకుంటాయనుకున్నావు? ఈ పాప బాధ్యతని నెత్తిమీద వేసుకునే వయసా వాళ్ళది? మహా అయితే ఇంకో పదో పన్నెండేళ్ళో బతుకుతారు. ఆ తర్వాత నీ కూతురి గతేమిటి? ఈడొచ్చిన పిల్ల ఒంటరిగా వుంటే, దాని బతుకు చినిగిన కాయితంలా... ఎంగిలాకులా..."

"ఒద్దు! అలా అనొద్దు. నేను వినలేను" అరిచింది శ్రీదేవి.

"వినడానికి ఇంత కటువుగా వుంటే మరి దాని భవిష్యత్తుని అలా తయారుచేద్దామని ఎందుకు అనుకున్నావు?" ఇంకా గట్టిగా అడిగింది శక్తి.

"ఏం చెయ్యాలో నాకు పాలుపోలేదు" నిస్సహాయంగా అంది శ్రీదేవి.

"ఏం చెయ్యాలో తెలీకపోతే ఆత్మహత్యలు చేసుకోవడమేనా? మొగుడు వదిలిపెట్టాడు కానీ నీకేమీ ఒళ్ళంతా చచ్చుబడిపోయి పెరాల్సిస్ రాలేదుగా. కళ్ళూ, కాళ్ళూ, చేతులూ అన్నీ దిట్టంగా వున్నాయిగా. నీ బతుకు నువ్వు బతకలేవా? నాలుగిళ్ళలో పాచిపని చేసుకున్నా హాయిగా బతకొచ్చే. ఓహో! మొగుడి ఇంట్లో తన్నులు తింటూ ముష్టిదాన్లా పడున్నా పరువుగా బతుకుతున్నట్లు కానీ, పాచిపని, వంటపనీ పరాయి ఇళ్ళల్లో చేయడం నామోషీ కదూ!" వ్యంగ్యంగా అంది.

శ్రీదేవి తల అడ్డంగా ఊపుతూ "అదేం కాదక్కా... నాకు ఏదీ నామోషీ కాదు. తాతయ్యా, అమ్మమ్మలకి భారం కాకుండా వుంటే నాకు అంతే

చాలు! నీ కాళ్ళు పట్టుకుంటాను. నాకేదైనా పనిచూపించు. నా పాపకీ నాకూ కడుపు నింపే మార్గం చూడు" అంది.

శక్తి తృప్తిగా చూసింది. ఆమెకి తెలుసు ఇంక శ్రీదేవి ఆత్మహత్యగురించి ఆలోచించదు. ఆ బలహీన క్షణాన్ని జయిస్తే ఇంకోసారి దాని జోలికి పోదు. ఇనుము వేడిగా వున్నప్పుడే సమ్మెటతో కొట్టినట్లు ఏడుస్తున్నప్పుడే ఆత్మాభిమానాన్ని రేకెత్తించే మాటలు వాడాలి. ఆమెవల్ల చాలా పనులు అవుతాయనీ, సాటివారికి ఉపయోగపడగలదనీ ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలి. పాకుడుపట్టిన నేలమీద జారకుండా నడవటం పెద్ద ఆర్ట్ కాదు... అవసరం.

పాప శ్రీదేవి దగ్గర ఆత్రంగా పాలుతాగుతూనే నిద్రపోయింది. ఆ పసిదాని ముఖంలో నిశ్చింతని చూస్తుంటే ఆ తల్లికి తను చేసింది ఎంతటి అనాలోచితమైన చర్యో అర్థం అవుతోంది. కన్నీళ్ళు చనుబాలై గుండె లోతుల్లోంచి ప్రవహించి ఆమె ఎదని తేలిక చేశాయి.

కృతజ్ఞత నిండిన స్వరంతో "అక్కా... నీ మేలు మరచిపోలేను. ఏం చేసి నీ రుణం తీర్చుకోను" అంది.

శక్తి శ్రీదేవి చేతిని గట్టిగా పట్టుకుని "నువ్వు ఏం చేస్తావంటే..." అని ఆగి గట్టిగా వూపిరి పీల్చి వదిలింది.

"ఏం చెయ్యను!" అని అడిగిన శ్రీదేవికి అప్పుడు తెలిసింది శక్తి నెప్పితో మెలికలు తిరుగుతోంది.

"నన్ను... నన్ను... అర్జెంటుగా..." అని ఆపైన మాట పూర్తిచేయలేక "అమ్మా" అని పెనుకేక పెట్టింది.

శ్రీదేవి గభాల్న పాపని కిందపడుకోబెట్టి, "అక్కా... ఉండు ఆటో పిలుస్తాను" అని వీధిలోకి పరిగెత్తింది. అంతలోనే సదానందం ఎదురయితే "శక్తి అక్కకి నెప్పులొస్తున్నాయి. గబుక్కున ఓ ఆటో పట్రండి" అని మళ్ళీ లోపలికి పరిగెత్తింది.

నడుంలోనుంచి పొత్తికడుపులోకి శూలంతో గుచ్చుతున్న ఫీలింగ్ రాగానే శక్తికి బాధతో కళ్ళు బైర్లు కమ్మాయి. ఆ మూసిన కనురెప్పల మాటున అమ్మరూపం గుర్తురాలేదు. ఇంద్రనీల్ బొమ్మ కదలాడింది.



'నీల్... నీల్.. ఈ సమయంలో నన్ను విడిచి ఎక్కడికెళ్ళావు?" అని ఆమెగుండె ఆక్రోశించింది.

సదానందం ఆటో తెచ్చాడు.

శ్రీదేవీ, అతనూ కలిసి శక్తిని ఆస్పత్రికి తీసుకెళ్ళారు.

మాలతికి కబురు అందగానే హుటాహుటీన శక్తిని చూసింది.

"మాలూ... నాకు ఎందుకో భయంగా వుంది" శక్తి చాలా పిరికిగా అంది.

"ఈ పని కూడా ఇంద్రనీల్ చేయగలిగితే ఎంత బావుండేదీ.." మాలతి ఆటపట్టిస్తూ అంది.

అంత బాధలోనూ శక్తి "నీల్... నీల్" అనే మూలిగింది. చేతికి నీడిల్ గుచ్చి డ్రిప్ పెట్టారు.

లేబర్‌రూం వాతావరణం ఆమెకి మరింత భయాల్ని కలుగజేస్తోంది. 'ఈ నెప్పులు భరించలేక ఒకవేళ నేను పోతేనో... అనిపించింది.' అంతలోనే బాబుకోసం ఎదురుచూసే ఇంద్రనీల్ గుర్తొచ్చాడు.

చెమటలు నుదుటినుంచి ధారగా కారుతుండగా ఓ చల్లని చెయ్యి ఆమెకి మలయమారుతమై తాకింది!

శక్తి ఆ చేతిని గట్టిగా పట్టుకుంది.

"గులాబీ రేకువంటి మృదుత్వంతో, మల్లెమొగ్గంత స్వచ్ఛంగా, జాబిలంత అందంగా వుండే మనబిడ్డకోసం ఈ నెప్పి ఓర్చాలి శక్తీ... గులాబీ కొమ్మ నాటేటప్పుడు నీకు ముళ్ళు గీసుకోలేదూ... ఇదీ అంతే!" ఎంతో అనునయంగా వచ్చాయి అతని నోటినుంచి ఆ వాక్యాలు.

శక్తి బరువుగా మూసుకుపోతున్న కనులు తెరిచి అతడ్ని చూసింది.

అతను ముందుకు వంగి ఆమె నుదిటిపై ప్రేమగా చుంబించాడు.

"నీల్... నువ్వు ఇక్కడే వుంటావు కదూ?' అతి కష్టంమీద అడిగింది శక్తి.

"అందుకేగా ఇంత ఆత్రంగా పరిగెత్తుకొచ్చానూ... నీవు మొదటిసారి నెప్పితో అరిచినప్పుడే నాకు వినపడింది శక్తీ!" అతని గొంతునిండా పొంగి పొర్లుతున్న ప్రేమ.

"నీల్... ఇదంతా చూస్తుంటే నీకు ఏమనిపిస్తోంది?" కొద్దిగా సిగ్గుగా, కొద్దిగా జంకుగా ఇంకొంచెం కుతూహలంగా అడిగింది. అక్కడి వాతావరణం అంత భయంకరంగా... వెగటుగా వుంది.

"నువ్వు ఏమన్నా సహించి జీవితాంతం కృతజ్ఞతగా పడివుండాలని అనిపిస్తోంది" అతని నిజాయితీ కంట్లో చెమరింపై మెరిసింది.

అంత బాధలోనూ శక్తి పెదవి అంచున ఓ చిరునవ్వు మంచుముత్యమై అరసెకను మెరిసి మాయమైంది.

"నీల్... నేను భరించలేను... నావల్లకాదు" ఆపుకోలేని బాధతో అరిచింది.

"పెరట్లో పూసే పువ్వులనీ, చెంగున గెంతే కుందేలుపిల్లల్నీ గుర్తుచేసుకో శక్తీ... అవన్నీ ఇవ్వలేనంత ఆనందాన్ని ఇంకా కొద్దిసేపట్లో పసికూనని ఎత్తుకుని పొందబోతున్నావు" ఆమెతలని తన కడుపు దగ్గరగా హత్తుకున్నాడు.

"ఆ... అమ్మా..." శక్తి అరుపులకి గదిగోడలు ప్రతిధ్వనించాయి.

"కే... ర్..." మన్న పసివాడి రాగం భూపాలమై జగతిని వెలుగుతో నింపింది.

ఇంద్రనీల్ బలంగా వూపిరి పీల్చి వదిలాడు. అతని కళ్ళల్లో వెయ్యి మతాబుల వెలుగు!

మాలతి పడివాడ్ని చేతుల్లోకి తీసుకుని ఇంద్రనీల్‌కి చూపిస్తూ "కన్నది శక్తికాదు. మీరే అన్నా నమ్మేట్లుంది మీ మొహం! ముందు చెమటలు తుడుచుకోండి" అంది.

ఇంద్రనీల్ ఆత్రంగా బాబుని అందుకోబోయాడు.

"నో... నో... వాష్ చెయ్యాలి" చెప్పింది మాలతి.

"ఒక్కసారి ఆ నులి వెచ్చదనాన్ని అనుభవించనీయండి డాక్టర్. ఈ అపురూప క్షణం మళ్ళీ రాదు" బాబుని క్లాత్‌తోబాటు అందుకుని చెక్కిలికి ఆ పసివాడి అరికాళ్లు ఆనించుకున్నాడు ఇంద్రనీల్.

ఆ తర్వాత శక్తివైపు చూసి "తొలి పితృత్వం అనుభూతి నీకేం తెలుసు? ఎంత మధురంగా వుందో తెలుసా?" అన్నాడు.



శక్తి రెండుకళ్లనిండా ఇద్దర్నీ చూసుకుంది. ఆమెకి అప్పటిదాకా పడిన బాధంతా చేత్తో తీసేసినట్లుగా పోయింది.

ఇంద్రనీల్ పొందుతున్న ఆనందానికి కారణం తనేనన్న భావన ఆమె మనసుని గాల్లో తేలిపోయేట్లు చేసింది.

"బాబుని చూడు... అచ్చు నాలాగే నవ్వుతున్నాడు" శక్తికి చూపిస్తూ అన్నాడు.

శక్తికి నిజంగానే బాబునవ్వు ఇంద్రనీల్ నవ్వంత నిష్కల్మషంగా అనిపించింది.

"నీల్... థాంక్యూ" అతని చేతిని అందుకుని దానిమీద ముద్దుపెట్టింది.

మాలతి బాబుని అందుకుంటూ "భర్తల్ని లేబర్ రూంలలోకి ఎలౌ చేస్తే డెలివరీలు ఈజీ అయ్యేట్లున్నాయే" అనుకుంది.

శక్తిని ఆస్పత్రినుంచి గోపాలరావు ఇంటికి తీసుకెళ్ళాడు. అరుంధతి వచ్చింది కాని శంకర్ రాలేదు. గిరి సుమతిని తీసుకొని వచ్చాడు.

"పురుడుకూడా నువ్వే పోసినట్లున్నావూ" వ్యంగ్యంగా ఇంద్రనీల్‌ని అడిగాడు గిరి.

"ఔను! ఈ భూమి మీదకి రాగానే నా బాబు కళ్ళు మొట్టమొదటిసారిగా నన్నే చూశాయి" గర్వంగా చెప్పాడు ఇంద్రనీల్.

శక్తి బాలింత అందంతో మెరిసిపోతోంది.

తార వచ్చి చూసింది. "బాబు అచ్చు నీల్ పోలికే" అంది.

అరుంధతి వారి దగ్గరకొచ్చి "ఈ విచిత్రం ఎక్కడా చూడలేదమ్మా! పిల్లాడికి నీళ్ళుకూడా మమ్మల్ని పోయనీయడంలేదు. ప్రపంచంలో ఇతనొక్కడే పిల్లాడ్ని కన్నాడా అన్నట్లు చేస్తున్నాడు" అంది.

"అది శక్తి అదృష్టం" మనఃస్ఫూర్తిగా చెప్పింది తార.

"ఏమ్మా తారా? మగాళ్ళు ఇలాంటి పనులు చేయడం నువ్వు ఎప్పుడైనా చూశావా?" నిష్ఠూరంగా అడిగింది అరుంధతి.

"పసివాడ్ని ఎత్తుకోవడంకూడా 'రాదు' అని గర్వంగా చెప్పుకుంటారు మగవాళ్లు. అది గొప్పకాదు. అశక్తత. మార్పు ఎప్పుడూ కొత్తగానూ వింతగానూ వుండి విమర్శకి లోనవుతుంది" చెప్పింది తార.

ఆమెకి షేవింగ్ చేసుకున్న తర్వాత ఆ రేజర్, సబ్బు నీళ్ళూ నిర్లక్ష్యంగా టేబుల్‌మీద వదిలేసి వెళ్ళే భర్త గుర్తొచ్చాడు. తన పెళ్ళయిన "పదహారేళ్ళలో ఆమె ఒక్కసారి కూడా శ్రీధర్‌చేత స్నానం చేశాక తుడుచుకున్న తువ్వాలు బైట ఆరేయించలేకపోయింది. వుండలా చుట్టి మంచంమీద గిరాటేస్తాడు. పక్కంతా తడిగా అయి ఆ తర్వాత ముచ్చుకంపు కొడుతుంది. ఇవన్నీ చెయ్యడం రాక చేసే పనులా? అశక్తతా? కాదు... మాయరోగాలు!

ఇంద్రనీల్ బాబుకి స్నానం చేయించి తీసుకొచ్చి, సిద్ధంగా పెట్టిన కుంపటిలో నిప్పులు ఎగదోసి సాంబ్రాణి పొగవేశాడు.

శక్తి తాంబూలం వేసుకున్న ఎర్రని పెదిమలతో నవ్వుతూ ఇదంతా వేడుకగా చూస్తూ కూర్చుంది.

తారకి ఆ పరిమళాలు, సాంబ్రాణి ధూపంవల్ల కాదు... అవి వారి అనురాగ సుమసౌరభాలు అనిపించింది.

తార కాసేపు కూర్చుని "ఇంటికి వైజాగ్‌నుంచి పెద్దబావగారూ వాళ్లూ వస్తారు. వెళ్లి కూరగాయలవీ వున్నాయో లేవో చూసుకోవాలి" అని లేచింది.

"అదేమిటీ? ఇంత హఠాత్తుగా పిల్లల పరీక్షలటైంలో ఎందుకు వస్తున్నట్లు?" అడిగింది శక్తి.

"వాళ్ళ అమ్మాయికి ఇక్కడ పెళ్లి చూపులట."

"అది ఆపకూడనంత ప్రమాదం ఏం కాదుగా! నీ పిల్లాడికి సెవెన్త్ కామన్ ఎగ్జామ్. ఇంటినిండా సంతలా చుట్టాలొస్తే ఎలా చదువుకుంటాడూ? పరిస్థితి వివరించి పదిరోజులు ఆగమనలేకపోయావా?" రవ్వంత కోపంగా అడిగింది శక్తి.

'అమ్మో! మా అన్నయ్యవాళ్ళు రావటం నీకు యిష్టంలేదా?' అంటూ ఆయన చేసే గొడవ నీకు అర్థం కాదులే శక్తీ. ఈ గొడవకన్నా ఆ గొడవే బెటర్!" అంది తార.

"ఆ గొడవ నీకు పూడ్చలేని నష్టాన్ని చేస్తుంది తారా! శ్రీధర్‌కి అర్థమయ్యేటట్లు చెప్పుకోవడం కాస్త ప్రయత్నిస్తే అసాధ్యం అని అనుకోను" అంది.

తార నవ్వి "అందరూ ఇంద్రనీల్‌లే వుండరు శక్తీ. నువ్వు చెప్పేదంతా తేలికైతే మీ పెద్దక్క ఇంకా బెల్ట్ దెబ్బలు ఎందుకు తింటుంది? మీ చిన్నక్క సూయిసైడ్ చేసుకోవడం సుఖం అని ఎందుకంటుంది?" అంది.



శక్తి ఆలోచనగా తలవూపింది.

తార వెళ్ళిపోయింది.

ఆ రాత్రి సుమతి శక్తిదగ్గర కూర్చుని చాలాసేపు ఏడ్చింది. "మగపిల్లాడ్ని ఈ సంవత్సరం కనకపోతే ఇంకో పెళ్లి చేసుకుంటారట ఆయన. అదేమైనా నాచేతుల్లో పనా?" అంది.

అరుంధతి చెల్లెల్ని వూరడిస్తూ "కోపం కొద్దీ అంటాడు. తగ్గాక మనమే బతిమాలుకోవాలి. అన్నింటికీ కాపురాలు వదిలేసుకుంటామా?" అంది.

సుమతి ఉక్రోషంగా "బావ నిన్ను రాత్రి చితకతన్ని ఓ కొత్తచీర నీ మొహాన కొడితే అన్నీ మర్చిపోయి మురిసిపోతావు. ఆత్మాభిమానం అనేది వుంటే ఎంత బాధో నీకేం తెలుసు?" అంది.

"ఆత్మాభిమానమా?" అడిగింది అరుంధతి.

"ఔను!" ముక్కులు ఎగబీలుస్తూ అంది సుమతి.

అరుంధతి ఆ నిముషంలో హిమాలయాలనుంచి వచ్చిన సర్వసంగ పరిత్యాగి అసెంబ్లీలో పదవులకోసం కుక్కలతక్కెడలా పోట్లాడుకుంటున్న మంత్రుల్ని చూసినట్లు చూసింది.

"ఆత్మాభిమానం నాకూ, నా ముగ్గురుపిల్లలకూ అన్నం పెడుతుందంటే? వాళ్ళకి చదువులకీ, బట్టలకీ నెలకి ఎంత అవుతుందో తెలుసా? అవన్నీ ఆయన్ని వదిలేసి వచ్చి నాన్ననెత్తిన వెయ్యనా? లేక నేను నాలుగిళ్ళల్లో పాచిపనులు చేసి సినిమాలోల్లా నా బిడ్డల్ని ఇంజనీర్లని, ఆఫీసర్లని చెయ్యనా? ఉల్లిపాయ కారం నూరి అన్నం వండిపెడితే పూటకి నూరు రూపాయలవుతోంది. ఒకడికి రాళ్ళుకొట్టేపని, ఇంకోడికి హోటల్లో బల్లలు తుడిచే పనీ అప్పజెప్పనా? నేను ఆయన్ని ఆత్మాభిమానం లేక భరిస్తున్నాననుకున్నావా?" అరుంధతి లేచి వెళ్ళి పెట్టెలోంచి ఎర్రని చీర తుంపులు తెచ్చి చూపించి, "మొన్న పండక్కి ఇన్‌స్టాల్‌మెంట్లవాడి దగ్గర మోజుపడి కొనుక్కున్నాను. బావ 'ఎర్రచీరా?' అంటూ యిలా ముక్కలు ముక్కలు చేశాడు. ఎందుకో తెలుసా?"

"ఎరుపు అంటే భయమా?" వేళాకోళంగా అడిగింది శక్తి.

"కాదు. ఆరోజు... ఎప్పుడో వచ్చీరాని వయసులో నేను కమల్‌కి రాసిన ఉత్తరంలో మన పెళ్ళికి ఎర్రని జరీబుటా వున్న చీర కొనుక్కుని

బెంగాలీ పద్ధతిలో కట్టుకుని నీకోసం ఎదురు చూస్తాను" అని రాశానట! ఆ విషయం ఆ ఉత్తరాన్ని చూపించి మరీ గుర్తుచేసి ఎర్రని వాతలు దేలేట్లే నా వీపు చిట్లగొట్టాడు. 'నీ మొదటి ప్రియుడు ఎక్కడైనా కలిసి ఎర్రచీరలో రమ్మన్నాడా?' అని వారంరోజులు నరకం చూపించాడు."

"ఆ ఉత్తరం యింకా ఎందుకు దాచుకున్నావే?" విసుగ్గా అడిగింది శక్తి.

"అప్పటి అమాయకత్వంలో నేను రుక్మిణీ కళ్యాణం అట్టలోపల దాచాను. ఈయనకి అక్కర్లేనిది లేదుగా. అది చూశాడు. అప్పటినుంచీ నన్ను ఏ కారణం లేకుండా కొట్టాలంటే అది బయటికి తీస్తుంటాడు" అని అరుంధతి కళ్ళు ఒత్తుకుంది.

"సారీ అక్కా... నిన్ను బాధపెట్టాలని కాదు. సర్దుకుపోవాలంటే కోపం వచ్చి అలా అన్నాను. ఇంటికొచ్చి పరాయిఆడదాని ఒళ్ళూ, జడా, నడకా, నవ్వూ నా చెవిలో వర్ణిస్తూ పక్కమీద దగ్గరకి తీసుకుంటే ఎలా భరించ మంటావు? ఆ మగాణ్ణి అంత దగ్గరగా సహించగలవా? అతను చేసేది శృంగారమా? అత్యాచారమా?" ఆక్రోశంగా అడిగింది సుమతి.

"ఇంత నరకాన్ని ఎలా భరిస్తున్నారే?" గుండెలమీద చెయ్యి వేసుకుని భయంగా అడిగింది శక్తి.

సుమతి గొంతు తగ్గించి "నువ్వు ఆ కమల్‌తో, నేను ఆ కుమార్‌తో ఎలాగోలా ఒప్పించి లేచిపోయినా బావుండేది" అంది అరుంధతితో.

కళ్ళు తుడుచుకుంటున్న అరుంధతి ఘళ్ళున నవ్వి "మన అదృష్టాలు యిలా పైవాడు రాసిపెట్టి వుంటే... ఆ కమల్‌గాడూ, కుమార్‌గాడూ కూడా యింకోరకంగా చెండుకుతినేవారేమో!" అది.

శక్తి బరువుగా నిట్టూర్చి "ప్రేమంటే పార్టనర్‌లో అన్నీ ప్లస్‌పాయింట్లే చూడగలగడం... పెళ్లి అంటే పార్టనర్‌లో అన్నీ మైనస్ పాయింట్లే కనిపించడం అనుకుంటాను" అంది.

మరునాడు బారసాల చేసి బాబుకి సుమంత్ అని పేరు పెట్టారు.

"నా లుంగీలూ, నీ చీరలూ నట్టింట్లో వూగాలని తెగ ఉత్సాహపడిపోతు న్నాయి... ఇక పద..." అన్నాడు ఇంద్రనీల్ శక్తితో.



అతను ఉయ్యాలవేసి బాబుని వూపటంగురించి మాట్లాడుతున్నాడని అర్థమై నవ్వేసింది శక్తి.

సాయంత్రానికి వాళ్ళు వాళ్ళయింటికి వచ్చేశారు.

బామ్మగారూ, మీనాక్షి ఎదురొచ్చి దిష్టితీసి లోపలికి తీసుకెళ్ళారు.

తాతగారు ఇంకా మంచంమీదే వున్నారు. శక్తి బాబుని తీసుకెళ్ళి చూపిస్తే ఆశీర్వదించి "ఆడపిల్లకానందుకు సంతోషం" అన్నారు. ఆయన వేదన తెలిసిన శక్తి ఏమీ అనలేదు.

శ్రీదేవి లేదు. మీనాక్షి పనిచేసే స్కూల్లోనే క్రష్ వుందట. అందులో పనిచేస్తోందట. శక్తికి చాలా సంతోషం వేసింది. కాసేపయ్యాక పాపని ఎత్తుకొని వచ్చిన ఆమెలో శక్తికి ఏదో కొత్తదనం కనిపించింది. బహుశా అది తన జీవనాధారం తను చూసుకున్న ఆత్మవిశ్వాసం కావచ్చు.

"అక్కా..." అంటూ ప్రేమగా వచ్చి కౌగిలించుకుంది. బాబుని ముద్దు పెట్టుకుంది.

ఇంద్రనీల్ తమతో తెచ్చిన లడ్డూ, చక్కెలాలూ అందరికీ పంచిపెట్టాడు.

ఆ రాత్రి వెన్నెల పుచ్చపువ్వులా వుంది.

కిటికీ తలుపు తెరిచి పెడితే వెన్నెల పక్కనిండా ఒలికి చల్లని సెగలు పుట్టిస్తోంది.

ఇంద్రనీల్ పుస్తకం పట్టుకుని పడుకున్నాడే కానీ చదవడంలేదు. శక్తి బాబుని ఎత్తుకుని పాలివ్వడం చూస్తున్నాడు.

ఆమె కపోలాలు పాలరాతితో చెక్కినట్లు నిగారింపుతో మెరుస్తున్నాయి. పెదవులు సంతృప్తితో కూడి విచ్చుకుని వున్నాయి. మాతృత్వంవల్ల ఒనగూడిన ఓ మాత్రం పుష్టిదనం కూడా అందాన్నే ఇస్తోంది.

బాబుని పడుకోబెట్టి అతనివైపు తిరిగి "ఏమిటి చూస్తున్నావు?" అంది.

ఇంద్రనీల్ మాట్లాడలేదు. ఎత్తుగా వున్న ఆమె నడుం కిందభాగాన్ని చెయ్యేసి నిమిరాడు.

శక్తి బుగ్గలు సిగ్గుతో ఎర్రబడ్డాయి. అంతలోనే కళ్లు కోపంగా పెట్టి "ఇంకచాలు ఈ పిల్లల ఫ్యాక్టరీ. నావల్లకాదు. దూరంగా వుండు" అంది.

"ఉండాలనే వుంది. కానీ వాడు ఊర్కోవడం లేదు..." ఆకాశంలోని చంద్రుణ్ని వేలుపెట్టి చూపించాడు.

"అదికాదు నీల్... ఖర్చులు పెరిగాయి. రేపటినుంచీ బాబుకి పాలడబ్బాలూ... అవీ..." అని శక్తి చెబుతూంటే...

"వాట్? పాలడబ్బాలా?" అతను అదిరిపడ్డాడు.

"ఎందుకూ? నీ దగ్గర సరిపోతూనే వున్నాయిగా? తల్లిపాలు బిడ్డకి ఎంత శ్రేష్టమో తెలుసా?"

శక్తి అతని తలమీద చిన్న మొట్టికాయ వేసి "చాల్లే... నాకు ఉద్యోగం సద్యోగం లేదనుకున్నావా? ఇంట్లో బిడ్డకు పాలిచ్చుకుంటూ కూర్చుంటే కంచంలోకి తిండెలా వస్తుందనుకున్నావ్?" అంది.

అతను ఆమెకు వివరిస్తున్నట్లు మొహంపెట్టి "చూడు... మూడునెలల వరకూ ఇస్తావుగా... ఆ తర్వాత ఘనాహారం మొదలుపెడదాం. ఆ తరువాత అంతగా అయితే నేను -ఎటూ ఖాళీనే కాబట్టీ..."

"నువ్విస్తావా?" నవ్వుతూ అడిగింది.

"ఇవ్వలేననేగా నీ దబాయింపు. నేను వాణ్ని తీసుకొచ్చి ఆఫీసులో లంచ్‌రూంలో నీచేత పాలిప్పిస్తాను" అన్నాడు.

"మై...గాడ్!" భయంగా "నిజంగా చేస్తావా? ఇప్పటికే జనం ఏడిపిస్తున్నది చాలదా?" అంది.

అతని కళ్ళల్లో అంతులేని చిరాకు కనపడింది.

"తల్లి బిడ్డకి పాలివ్వడానికి ఏర్పాట్లు చెయ్యలేని యాజమాన్యం అందుకు ఏడవాలి కానీ... ఇప్పించే ఏర్పాటు మనం చేసుకుంటే అందుకు ఏడిపించటం ఎందుకూ? ఒకవేళ ఎవడైనా వేళాకోళం చేస్తే "ఏం నాయనా, నువ్వు తల్లిపాలు తాగకుండానే పెరిగావా? ఎంత దురదృష్ట వంతుడివీ? అని అడుగుతాను" అన్నాడు.

ఆమె ఆ లాజిక్‌కి తల వంచినట్లుగా మౌనంగా వుండిపోయింది.

అతను ఆమెని దగ్గరకి తీసుకుని తన ముఖాన్ని ఆమె మెడవంపులో దాచుకున్నాడు.

"చాలా ఎదురుచూశావా నాకోసం?" కళ్ళు అరమోడ్పులవుతుంటే అదోలాంటి సుషుప్తిలో అడిగింది.



నీల్ ఆమె చెక్కిళ్లమీద సుతారంగా పెదవులతో రాసి, కళ్ళల్లోకి చూస్తూ చెప్పాడు. "జీవితం అంతా ఎదురుచూడమన్నా నేను బాధపడను. ధారగా కురిసే వెన్నెల్లో నీ సౌందర్యాన్ని వెతుకుతూ నేను నీకై తపస్సు చేస్తుంటాను. దేవుడు ప్రత్యక్షమై 'ఆకాశంలో నక్షత్రాలన్ని రోజులు ఇంకా నువ్వు తపస్సు చేయాలి! అప్పుడు నీ ప్రియురాలు కనిపిస్తుంది' అని చెబితే... 'అంత త్వరగానా కరుణామయా... కృతజ్ఞతలు!' అని చెప్పేసి నేను మళ్ళీ నీ గురించి స్వప్నాలలో మునిగిపోతాను. వాస్తవానికీ స్వప్నానికీ నాకు పెద్ద తేడాలేదు. నువ్వు ఎప్పుడూ నాతోనే వుంటావు!" అన్నాడు.

'పరువంపు మంకెన... విరివంపు నవంపు
వాతెర చంద్రంపు వాన గురియ...'

అన్న ఆముక్తమాల్యదలో పద్యం ఆమెకి గుర్తొచ్చింది.

ఆమెకు అతని కన్నుల్లో ప్రశాంతత అంటే చాలా ఇష్టం. అతని ప్రతిచర్యలో ఎంతో నిదానం... నిర్మలత్వం. ఆశగా... ఆత్రంగా... ఆబగా కాదు... ఆహ్లాదంగా, లాలనగా అనురాగంగా ఆమెని అలరిస్తాడు.

'నీకు సంతోషాన్ని ఇవ్వలేని ఈ తనువు వ్యర్థం!' అని ఆమెకి అనిపించే టట్లు చేయడం అతని నేర్పు. ప్రతిసారీ వింతగా... ప్రతిసారీ కొత్తగా... ఇంతకన్నా శృంగారానికి కావల్సిన అర్హతలేమున్నాయి? ... ఆ తర్వాత కూడా ఆమెని వదిలిపెట్టలేనట్లు, అపురూపంగా పొదువుకొని పడుకుంటాడు.

ఆ కళ్ళల్లో ఎంతో నిశ్చింత! ప్రపంచాన్ని గెలిచిన రారాజులా!

ఆమె అతని కళ్ళమీద అతనికి మెలకువ రానంత మృదువుగా చుంబిస్తూ అనుకుంది. 'నాకు మాత్రం నీ అంత నిశ్చింత లేదు. కల పూర్తికాకముందే మెలకువ వస్తే అలుక! గోరింటాకు పెట్టుకోగానే నీకు కోరిక పుడితే అలుక! నేను వద్దనగానే నువ్వు నన్ను వదిలేస్తే అలుక! మళ్ళీ నిన్ను నా వైపు తిప్పుకోగానే నువ్వు అల్లరిగా నవ్వితే అలుక! నిద్రలో నే కదిలితే... మగతలో నువ్వు జోకొడితే... ఇంకేం వరాలు కావాలి? ఈ జన్మకిలా చాలిక!

❖ ❖ ❖

శక్తి బ్యాంక్‌కి వెళ్ళడం మొదలయింది. ఇంద్రనీల్‌కి బాబు ఆలనా పాలనతో నిముషం తీరికుండటంలేదు. మధ్యాహ్నం లంచ్‌టైంకి శక్తి బ్యాంక్‌కి తీసుకెళ్ళి బాబుకి పాలు ఇప్పించడం మరిచిపోడు. నాలుగు రోజులు ఇదో వింతగా, విశేషంగా చెప్పుకున్నా, తర్వాత అందరికీ అలవాటైపోయింది.

ఇంద్రనీల్ బాబుని ఎత్తుకుని దూరంగా కనిపించగానే మేనేజర్, "శక్తీ... మీ వారొస్తున్నారు... వెళ్ళు" అనేస్తున్నాడు.

బాబు కొత్తకొత్త అల్లర్లు నేర్చుకుంటున్నాడు. కాంపౌండ్‌లో అందరికీ ప్రాణం అయిపోయాడు.

మీనాక్షి పిల్లలు బడినుంచి రాగానే బాబుతో ఆడుకోవడానికి వచ్చేస్తారు. శ్రీదేవి కూతురు మైత్రీ కూడా బాబుతో ఆడుతోంది.

"శక్తీ... ఊరెళ్తున్నాను. ఇదివరకులా కాదు... బాబుని మంచంమీద ఒక్కణ్ణీ వదిలెయ్యడానికి వీలులేదు.. కింద పడిపోతాడు. ఎలా చూసు కుంటావో ఏమో!" అన్నాడు ఓరోజు ఇంద్రనీల్.

శక్తి మొహం వెలవెలబోయింది. బాబుమీద ప్రేమకూడా అతని ప్రయాణాన్ని ఆపలేకపోవడం ఆమెకి జీర్ణం కాలేదు. నెలతిరిగేసరికి ఠంచన్‌గా వెళ్ళిపోతాడు. ఏమిటో అంత బలమైన పాశం?

"నీల్! బ్యాంక్ ఎగ్జామ్స్ వున్నాయి. చదువుకోవాలి. ఈ సమయంలో కూడా నువ్వు వెళ్ళాలా?" వూర్కోలేక అడిగేసింది.

"నాలుగు రోజులేగా!" అతను ప్రయాణానికి సిద్ధమౌతూ తేలిగ్గా తీసి పారేశాడు.

ఆమె బరువుగా నిట్టూర్చింది.

అతను బాబుని ఎత్తుకుని ముద్దులు పెట్టుకుని శక్తికి మరీమరీ జాగ్రత్తలు చెప్పి వెళ్ళిపోయాడు.

శక్తి లీవ్‌పెట్టి ఇంట్లోనే వుండి బాబుని చూసుకుంటూ చదువుకోడానికి ప్రయత్నించింది. తండ్రికోసం వెదుక్కుంటూ బాబు గుక్కపెట్టి ఏడుస్తు న్నాడు. వాడికి అతని దగ్గర అంత చేరిక మరి! ఆమెకి వాడిని వూర్కో పెట్టడం అలవికాని పనైపోయింది. ఆ రోజంతా వాడితో గడిచిపోయి



ఏమీ చదువుకోలేకపోయింది. ఇంద్రనీల్‌మీద చాలాకోపం వచ్చింది. ఈసారి రాగానే ఏం జరిగినా సరే... ఎక్కడికి వెళుతున్నాడో కనుక్కుని తాడో పేడో తేల్చుకోవాలి అనుకుంది.

సాయంత్రం చల్లగాలికి పెరట్లో బాబుని ఎత్తుకుని తిరుగుతుంటే... ఇంటముందు ఒక ఆటో వచ్చి ఆగింది. అందులోంచి ఒక యువకుడు దిగి లోపలికి వచ్చి శక్తిని "శ్రీదేవి వుందా అండీ" అని అడిగాడు.

"ఉంది... మీరూ?" అని ప్రశ్నార్థకంగా చూసింది శక్తి.

"నేను ఆమె భర్తని" అన్నాడు.

శక్తి విస్మయంగా చూసింది.

ఇంతలో మామ్మగారు బయటికి వచ్చి అతణ్ని గుర్తుపట్టి "మూర్తీ! రా బాబూ... రా..." అని ఆనందంగా ఆహ్వానించింది.

శ్రీదేవి కూడా పాపని ఎత్తుకుని వరండాలోకి వచ్చి అతణ్ని చూసి "మీరా?" అంది.

"శ్రీదేవీ! పాప బావుందా?"అతను ఆమె దగ్గరకి వచ్చి పాపకోసం చేతులు జాపాడు.

శ్రీదేవి ఠక్కున అడుగు వెనక్కి వేసింది.

"దూరంగా వుండండి. పాపని తాకొద్దు. దానికి తండ్రిలేడు. ఏ రోజు మమ్మల్ని దిక్కులేని వాళ్ళల్లా ఇంట్లోంచి పొమ్మన్నారో ఆ రోజే మీకూ మాకూ చెల్లయిపోయింది" అంది.

"శ్రీదేవి... నువ్వేనా ఇలా మాట్లాడుతున్నది?" అతను ఆశ్చర్యంగా అడిగాడు.

శక్తికి కూడా శ్రీదేవి అంత ధైర్యంగా ఈ పరిస్థితిని ఎదుర్కోవటం ఆశ్చర్యంగానే వుంది.

మామ్మగారు మాత్రం "ఏవిటే ఆ మాటలు? బాబూ... ముందు నువ్వింట్లోకి రా... ఏవండీ... ఎవరొచ్చారో చూడండి" అని ఆత్రంగా లోపలికి వెళ్ళింది.

అతను శ్రీదేవి దగ్గరగా వెళ్ళి బతిమాలుతున్నట్లు "నీకేం లోటు చెయ్యను. కేసులూ అవీ వద్దు. పాపకి ఏ లోటూ రాకుండా పెంచుదాం...

ఇక్కడ నీకేం మర్యాదగా వుంది చెప్పు? అదే నా దగ్గరుంటే రేపు పాప పెద్దయినా ఏ సమస్యా వుండదు. పాపని ఇటివ్వు" అన్నాడు.

శ్రీదేవి గేటువైపు చూపిస్తూ "ముందు మర్యాదగా బైటికి నడు! నన్ను మోసం చేసి పెళ్ళిచేసుకుని ఇంకా మర్యాదగురించి మాట్లాడవచ్చావా? ఇప్పటిదాకా కేసువిషయం ఆలోచించలేదు. ఇప్పుడు పెడ్తాను. నా పాపని నేను పెంచుకోలేక కాదు. నీకు బుద్ధి రావడానికి! ఇంక ఒక్క నిముషం ఇక్కడ నిలబడినా నేనేం చేస్తానో నాకే తెలీదు" అని అరిచింది.

శక్తి ఆమె మనోధైర్యానికి విస్తుబోయి చూస్తుండిపోయింది.

ఈ గొడవకి తాతగారు బైటికి వచ్చారు.

అతను ఆయనతో, 'చూశారా! మీ మనవరాలి పొగరు? నేను పోనీ పాపం అని తీసుకెళదామని వస్తే..." అన్నాడు.

"శ్రీదేవీ కాస్త ఓపికపట్టు. ఏవిటా తొందరపాటు?" మామ్మగారు మందలిస్తూ అంది.

"నాది తొందరపాటు కాదు! బాగా ఆలోచించే అంటున్నాను. ఇతనికి నామీద అధికారం లేదు. నేను చట్టరీత్యా విడాకులు తీసుకుంటాను. రెండోభార్యగా జీవితాంతం ఇతని దయమీద బతకాల్సిన అవసరం నాకు లేదు" అంది శ్రీదేవి.

"వింటున్నారా?" అతను తాతగారి దగ్గరగా నడిచి అన్నాడు.

తాతగారు చేతికర్ర ఊతంతో ముందుకు వచ్చి, "ఏమిట్రా ఇంకా నీతో మాటలు? పో... పో... బయటికి. ఒక కుటుంబాన్ని వుంచుకుని మమ్మల్ని మోసంచేసి నా చిట్టితల్లి గొంతు కోసింది చాలక ఇంకా నోరు విప్పి మాట్లాడుతున్నావా? అది మంచిది కాబట్టి నిన్ను చెప్పుతీసుకుని కొట్టలేదు. సంతోషించు" అన్నాడు.

"ఏవండీ!" మామ్మగారు అడ్డుపడబోయింది.

"నువ్వు లోపలికి వెళ్ళు" గట్టిగా కసిరాడాయన.

శ్రీదేవిభర్త చేసేదేం లేక తాతగార్నీ, శ్రీదేవినీ నోటికొచ్చినట్లు తిడుతూ వెళ్ళిపోయాడు.

మామ్మగారు ఎందుకో మెట్లమీద కూర్చుని ఏడుస్తోంది.



శ్రీదేవి తాతగారిని చెయ్యిపట్టుకుని లోపలికి తీసుకెళ్ళింది.

శక్తి బాబుని తీసుకుని లోపలికి వచ్చేసింది. ఆమెకి వెంటనే వెళ్ళి శ్రీదేవిని గట్టిగా కౌగలించుకుని ముద్దు పెట్టుకోవాలనిపించింది. కానీ ఆపుకొంది. ఆమెకి వస్తున్న ఎనిమిదివందల రూపాయలే ఆమెకి ఎంత ఆత్మస్థైర్యాన్ని ఇస్తున్నాయి? ఆ ఆలోచలనతోనే ఎప్పటికో నిద్రపట్టేసింది.

తెల్లవారి బావి దగ్గర గిలక చప్పుడవుతుంటే శక్తికి మెలకువ వచ్చింది. ఇంద్రనీల్ లేడన్న విషయం పాలవాడి కేకతో గుర్తుకొచ్చింది. బద్ధకంగా లేచి గిన్నె తీసుకుని తలుపు తీసింది.

పాలు పోయించుకుని వెనక్కి తిరగబోతుంటే "శక్తీ... నాకు ఓ గ్లాసు పాలు బదులియ్యమ్మా! సాయంత్రం ఇచ్చేస్తాను" అంటూ మీనాక్షి గ్లాసు తీసుకొచ్చింది.

శక్తి మాట్లాడకుండా గిన్నెలో పాలు గ్లాసులో పోసింది.

"ఊరునించి మా మేనత్త కొడుకు వచ్చాడు. బందరులో పెద్ద మిఠాయి షాపుంది. తొక్కుడు లడ్లు తెచ్చాడు. వుండు తెచ్చిస్తాను" అంది.

శక్తి నవ్వి లోపలికి వచ్చేసింది.

కాసేపటికి మీనాక్షి కూతురిచేత తొక్కుడు లడ్లూ, గోధుమహల్వా పంపించింది.

సదానందం శక్తి వంట చేస్తుంటే వచ్చి ఓసారి అగ్గిపెట్టె ఇవ్వమ్మా" అన్నాడు.

శక్తి ఆశ్చర్యంగా "మీ ఇంట్లో లేదా?" అంది.

అతను మొహం మాడ్చుకుని "నాకు అసలు ఇంటికే వెళ్ళాలని లేదు. చూడు... వాడు... ఆ మీనాక్షిబావ వచ్చినప్పటినుంచీ ఒకటే ఇకఇకలూ... ఒకటే పకపకలూ! వాడికోసం ఈవిడగారు సెలవుపెట్టి మరీ గారెలూ, పులిహోరా చేస్తోంది" అన్నాడు.

"పోనీలెండి. ఎంతైనా బావ గదా? పాపం చాలా ఏళ్ళకి వచ్చినట్లున్నాడు" అంది శక్తి.

అతను కోపంగా "అదేంకాదు. బందరులో బాగా సంపాదిస్తున్నాడు. ఈ మధ్యనే పెద్దమేడ కట్టాడు. వచ్చేటప్పుడు దీనికోసం ఓ పట్టుచీరా, పిల్లవెధవలకి గుడ్డలూ తెచ్చాడు. అదీ దీని బడాయి" అని మండిపడ్డాడు.

"ఏం... మీకు తేలేదనా ఈ కోపం?" కవ్వించింది శక్తి.

"ఛీ... వాడు తెస్తేమాత్రం నేను తీసుకుంటానా?" ఉక్రోషంగా అని శక్తి చేతిలోని అగ్గిపెట్టె అందుకుని బీడీ వెలిగించుకున్నాడు.

ఆరోజంతా అతను అటూ, యిటూ తారట్లాడటం, మామ్మగారి వసారాలో కాసేపూ, శక్తి ఇంటిముందు కాసేపూ తచ్చాడటం గమనించి నవ్వుకుంది శక్తి.

సాయంత్రం మీనాక్షి పిల్లలూ, ఆమె బావా కొత్తబట్టలు వేసుకుని తయారయ్యారు. మీనాక్షీ కొప్పుచుట్టి చుట్టూ పూలు పెట్టుకుంది.

సదానందాన్ని పిలిచి "వంట చేసేశాను. మీరు పెట్టుకుతినండి... మేం వచ్చేసరికి ఆలస్యం అవుతుంది" అంది.

"ఎక్కడికి ఊరేగింపూ?" సదానందం అడిగేలోపే, ఆమె బావ "పద... పద... ఆటో పిలిచేశాను" అంటూ తొందరపెట్టి ఆమెనీ పిల్లల్నీ తీసుకు పోయాడు.

వాళ్ళు వెళ్ళిపోయాక సదానందం గొణుక్కుంటూ చాలాసేపు మీనాక్షిని తిట్టి తనూ ఎటో వెళ్ళిపోయాడు.

శక్తి బాబుకి పాలుపడదామని చూసేసరికి వాడికి ఒళ్ళు కాలిపోతోంది. ఆమెకి చాలా భయం వేసింది. కంగారుగా బాబుని భుజాన వేసుకుని మామ్మగారి వాకిట్లోకి వెళ్ళి "మామ్మగారూ... చూడండి. వీడి ఒళ్ళు పేలిపోతోంది. వాళ్ళ నాన్నకోసం బెంగ పెట్టుకోలేదు గదా!" అంది.

ఆవిడ బాబుని చూసి, "అజీర్తి జ్వరం అయివుంటుంది. నీకు అన్నిటికీ కంగారే" అంది.

శక్తికి కాళూ చెయ్యీ ఆడలేదు. అసలే ఇంద్రనీల్ వందసార్లు బాబుని గురించి జాగ్రత్తలు చెప్పి వెళ్లాడు.

"వాడి లంగోటీలు వేడినీళ్ళల్లో డెట్టాల్ వేసి నానపెట్టు. పాలసీసా ప్రతిసారీ స్టెరిలైజ్ చెయ్యి. చల్లగాలికి తిప్పకు..." ఇలా చెబుతూనే వెళ్ళాడు.

"నేను డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళి తీసుకొస్తాను. నాకు చాలా భయం వేస్తోంది" అంటూ బాబుని ఎత్తుకుని బయలుదేరింది.



ఆమెకి మీనాక్షివాళ్ళు ఎదురొచ్చారు.

మీనాక్షి చేతిలో, పిల్లలచేతుల్లో పెదపెద్ద ప్యాకెట్లున్నాయి.

"అత్తా... ఎన్ని బొమ్మలు కొన్నారో పెద్దనాన్న..." హుషారుగా చెప్పాడు మీనాక్షి కొడుకు.

శక్తి అవి వినే మూడ్‌లో లేదు. మీనాక్షికి బాబు జ్వరంసంగతి చెప్పి, వాళ్ళు దిగిన ఆటోలోనే దగ్గరగా వున్న ఆస్పత్రికి పోనియ్యమంది.

లేడీడాక్టర్ బాబుని పరీక్షచేసి "కంగారేంలేదు. మామూలు జ్వరమే. జలుబు తగ్గితే అదే తగ్గిపోతుంది. ఈ మెడిసిన్స్ వాడండి" అని రాసిచ్చింది.

అప్పటికి కానీ శక్తిమనసు కుదుటపడలేదు.

బాబుకూడా కాస్త నవ్వి ఆడుకోసాగాడు.

"థాంక్యూ డాక్టర్" అంది శక్తి.

నర్స్ లోపలికి వచ్చి "నిన్న అబార్షన్ కోసం వచ్చిన అమ్మాయి మళ్ళీ వచ్చింది డాక్టర్. ఈసారి వాళ్ళ ఆయన కూడా వచ్చాడు" అంది.

డాక్టర్ శక్తితో "ఎవరు అవివాహితలో, ఎవరు వివాహితలో తెలియడం లేదు. ఒకసారి పాపం కన్నెపిల్ల అని సాయంచేస్తే అదే అలవాటయి పోతుందని, నేను పెళ్ళయిన వాళ్ళకీ, అదీ వారి భర్త అంగీకారంతోతప్ప గర్భస్రావాలు చెయ్యనంటాను" అంది.

"అదే కరెక్ట్" అంది శక్తి.

"నేను వెళ్ళి మాట్లాడి, రేపు పొద్దుటే రమ్మని చెప్పి వస్తాను. ఈలోగా నర్స్ బాబు వెయిట్ నోట్ చేస్తుంది" అని చెప్పి ఆవిడ బయటికి వెళ్ళింది.

శక్తి బాబుని నర్స్‌కి అందించి, ఆ అబార్షన్ అమ్మాయిగురించే ఆలోచిస్తూ కిటికీ దగ్గరకి వచ్చింది పాపం ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో అనుకుంటూ.

బయట ఆటో ఎక్కుతున్న జంటని చూడగానే ఆమె నోటిలోంచి అప్రయత్నంగా ఒకకేక రాబోయి ఆగిపోయింది!

అతను ఇంద్రనీల్...!

ఆమె ఆరోజు మొదటిసారి ఇంద్రనీల్ కలిసినప్పుడు అతనితో మాట్లాడుతూ కనిపించిన అమ్మాయి.

వాళ్ళు ఎక్కగానే ఆటో రయ్యిన దూసుకుపోయింది.

డాక్టర్ లోపలికి వచ్చి "అయిందా?" అంది.

శక్తి విసురుగా వెళ్లి ఆవిడితో "ఇప్పుడు ఆటోలో వెళ్ళిన అమ్మాయీ... అబ్బాయీ... ఎవరు?" అంది.

ఆవిడ చిన్నగా నవ్వి "కొత్తగా పెళ్ళయిన జంట. ఇప్పుడిప్పుడే పిల్లలు వద్దనుకుంటున్నారట. ఆ అమ్మాయి నిన్న వచ్చి చెయ్యమని అడిగింది. నేను వాళ్ల ఆయన్ని తీసుకురమ్మన్నాను. ఈరోజు తీసుకువచ్చింది" అంది.

"అతని పేరేం చెప్పాడు?" వణికే గొంతును కంట్రోల్ చేసుకుంటూ అడిగింది శక్తి.

"అనీల్... ఎందుకూ!!"

ఏమీ మాట్లాడకుండా శక్తి ఆవిడకి ఫీజు ఇచ్చేసి బాబుని ఎత్తుకుని నిద్రలో నడుస్తున్నదానిలా బయటకి వచ్చేసింది.

ఆమెకి భూమీ, ఆకాశం అన్నీ రంగులరాట్నంలా గిర్రున తిరిగి పోతున్నట్లు అనిపించసాగాయి.

'అబార్షన్!!'

పదే... పదే... ఆ అమ్మాయి, ఇంద్రనీల్ ఆటోలోకి ఎక్కడం కళ్ళముందు ఆడుతోంది.

ఆరోజు తనని అబార్షన్ చేయించుకుందేమోనన్న అనుమానంతో అతను కొట్టడం గుర్తొస్తోంది.

ఏవిటిదంతా? ఎందుకింత డ్రామా ఆడాడు? లేక ఈ మధ్యేనా? ఉంటే తన దగ్గర ఎందుకు దాచినట్లు? డబ్బుకోసమా? తనమీద ప్రేమా, బాబుమీద మమకారం అంతా నటనా?

ఆమె తల వెయ్యి ప్రశ్నలతో పగిలిపోతున్నట్లుగా అనిపించింది. ఎలా ఇల్లు చేరిందో ఆమెకే తెలియదు.

నిద్రపోతున్న బాబుని మంచంమీద పడుకోబెట్టి, అలాగే లైటు వేసుకోకుండా కూర్చుండిపోయింది.

ఆ చీకట్లో మీనాక్షి ఇంట్లోంచి అరుపులు వినిపిస్తున్నాయి.

"ఒక్క రూపాయి సంపాదించి ఏనాడూ పిల్లలకి పిప్పరమెంట్లు కొనిపెట్టిన పాపాన పోలేదుగానీ... మా బావ తెచ్చినవి పారెయ్యడానికి



మాత్రం ఎక్కడలేని మగతనం పొడుచుకొచ్చేసింది" మీనాక్షి ఏడుస్తూ అంటోంది.

"పరాయి మగాడు కొనిపెడితే తీసుకోవడానికి సిగ్గులేదూ! ధూ... నీ జన్మ!" సదానందం మీనాక్షిని కొడుతున్న ధ్వని.

మీనాక్షి బావ కాబోలు "ఆడదాని మీద చెయ్యి చేసుకోవడంకాదు. చేవవుంటే సంపాదించి పోషించి చూపించు. నీకేం కన్ను వంకరా? కాలు వంకరా?"

"ముందు నువ్వు నా ఇంట్లోంచి బయటికి పోరా! భార్యాభర్తల గొడవలో తలదూర్చకు."

"నీ ఇల్లా? నువ్వేమైనా అద్దె కడుతున్నావా? ఆ మాటకొస్తే నువ్వే పో... నా ఇల్లు, నా యిష్టం. నా బంధువుల్ని అవమానించే హక్కు నీకు లేదు."

"ఏం కూశావే?"

"ఇంకొక్క దెబ్బ మీనాక్షి మీదపడ్డా నీ ఎముకలు సున్నంలోకి మిగలవు. వెనకా ముందూ లేనిదనుకుంటున్నావా? ముందు ఆమెజుట్టు వదిలిపెట్టు. పెద్ద మగాడివి బయలుదేరావు. బీడీ పీకలకి కూడా భార్యని దేబిరించుకునే ముఖం నువ్వూ!"

"ఏవే... వాడి మాటేనా నీదికూడా? నేను పోనా? ఇంకెప్పుడూ రాను మరి! మొగుడొదిలేసినదానిలా బతుకంతా బతకాలి."

"పో...సన్నాసుల్లో కలిసిపోయావని చెపుతాను. నువ్వుండి ఏం వుద్ధరిస్తున్నావని?"

"పోతున్నా..."

"పో..."

సదానందం బయటికొచ్చి పెద్ద గొంతుతో "ఎంతకి తెగించిందో అది చూశారా? ఆ బావని ఇంట్లోపెట్టుకుని కట్టుకున్న మొగుడిని వీధిలోకి నెట్టింది. సంసార్లు చేసే పనేనా ఇదీ?" అని అరుస్తున్నాడు.

తాతగారు కలగజేసుకుని "చాల్లే! మీనాక్షి సత్తెకాలపుదికాబట్టి ఇన్నాళ్ళుగా నిన్ను భరించింది. నీవల్ల ఒక్క సహాయమైనా వుందా?

ఒంటి రెక్కతో కాపురం ఈడ్చలేక ఆడపిల్ల ఎంత హైరానా పడుతోందో మాకు తెలుసు. వెళ్లి ఏదైనా పని చూసుకొచ్చి అప్పుడు మాట్లాడు" అన్నాడు.

"మీరంతా కలిసి చెప్పే న్యాయం ఇదా? పోతా... నే బతకలేనను కున్నారా? పోతా" అతను రంకెలు వేస్తూ వెళ్ళిపోయాడు.

శక్తికి అన్నీ వినబడుతూనే వున్నాయి కానీ కూర్చున్నచోటునుంచి లేవలేదు.

నిన్న ఇదే వేళకి శ్రీదేవి మూర్తిని 'ఛీ' కొట్టి 'నా బతుకు నేను బతక గలను... గెట్ అవుట్!' అంది.

ఈరోజు మీనాక్షి కాలికి పనికిరాని చెప్పు కంచెలో విసిరేసినట్లు సమాజానికి కూడా భయపడకుండా భర్తని ఇంట్లోంచి వెళ్ళగొట్టింది. ఇద్దరూ పెద్దగా చదువుకోని స్త్రీలే!

ఆడది ఎక్కడ కొట్టినా భరిస్తుంది. ఆత్మాభిమానంమీద కొడితే రెచ్చిపోయి ఆడపులి అయి రక్తం తాగుతుంది. అది మన భారతీయ చరిత్రలోనే వుంది. అందుకే దైవాన్ని ఒక స్త్రీగా చూడటం కూడా భారత దేశంలో తప్ప ఇతర దేశంలోనూ లేదు. మనం 'శక్తి'ని స్త్రీగా పరిగణిస్తాం. దుష్టసంహారం చేయాలంటే కాళీ అవతారంలో స్త్రీని వూహించుకుంటాం. సహనంగా భరించే భూమిని భూదేవిగా పిలిచి సహనానికి ప్రతీకగా ఎలా చూస్తామో, రౌద్రంగా ఘీంకరించే ఆదిశక్తిగా కూడా స్త్రీనే చెప్పుకుంటాం. భారతమాత అంటాం. భారతపిత అనం. అయినా ఈ పురుషుడు ఎందుకో మిడిసిపడుతూనే వున్నాడు. ఆమెని కాళ్ళకిందనుంచి లేవకుండా తొక్కిపెట్టాలనే చూస్తున్నాడు.

శక్తి మనసులో ఇంకొక స్త్రీతో తిరుగుతున్న చిన్నబావా... శ్రీదేవి భర్తా... తిరుగాడుతున్నారు.

వాళ్ళకి తనేం సలహా ఇచ్చిందీ? ఒదిలేసి 'మీ కాళ్ళమీద మీరు బతకండి' అంది. మరి తనిప్పుడేం చెయ్యాలీ?'

బాబు నిద్రలో అమాయకంగా నవ్వుతున్నాడు.

'నేనూ వాళ్ళకి చెప్పినదే చేస్తాను. అతనికి ఇంక నా మనసులో స్థానంలేదు' నిశ్చయంగా అనుకుంది.



ఎందుకిలా చేశాడూ... అని ఆమె ఎక్కువగా ఆలోచించదలుచు కోలేదు. ముందునించే సంబంధం వుండివుంటుంది. ఈలోగా నేను ఇచ్చిన మంచి ఆఫర్ వదులుకోలేక ఈ ఏర్పాటు చేశాడు. అందుకే కాంట్రాక్ట్‌లో ఆ నిబంధన పెట్టాడు. 'మగబుద్ధి!' నిలదీసి అడిగితే 'ఇద్దరికీ లోపం చెయ్యను' అంటాడు. ఇదేగా ఈ మధ్యనొచ్చే సినిమాల్లో చూపిస్తున్న నీతి. ఆ సినిమాలు తీసిన డైరెక్టర్లూ, నిర్మాతల అల్లుళ్ళు కూడా ఇలాగే 'ఒక ప్రియురాల్నీ, ఒక ఇల్లాల్ని మెయిన్‌టెయిన్ చేస్తాం మామా!' అంటే ఏం చేస్తారో మరి!

శక్తి ఎగ్రిమెంట్ పేపర్లు పెట్టెలోంచి తీసి బయటపెట్టింది. వాటితో ఇక పనైపోయింది. ఆరోజు పెళ్ళిపీటల మీదకి ఎక్కకముందే తనచేత విధి విడాకుల మాటలు ఎందుకు మాట్లాడించిందో ఆమెకి ఇప్పుడు అర్థమై నిట్టూర్చింది. 'శక్తి చాలా తెలివైనది' అనే అక్కలకీ, నాన్నకీ ఏం చెప్పుకోనూ? ఇదే ఆ రాత్రి చివరిగా ఆమె ఆలోచించినది.

❖ ❖ ❖

శక్తి వెళ్ళేసరికి తాతగారూ, మామ్మగారూ, శ్రీదేవీ భోంచేస్తున్నారు.

"రా శక్తీ... సమయానికి వచ్చావు. శక్తికి కూడా వడ్డించెయ్యవే!" అన్నారాయన.

శక్తి చెయ్యి చూపించి వారిస్తూ "వద్దు... ఒక ముఖ్యవిషయం చెప్పి పోదామని వచ్చాను. రేపు పొద్దుటే నేను ఇల్లు ఖాళీ చేస్తున్నాను" అంది.

తాతగారి చేతిలోంచి ముద్ద జారిపోయి కంచంలో పడిపోయింది. "ఎందుకమ్మా? ఏం ఇబ్బంది వచ్చిందీ?" అన్నాడు.

"ఇంటివల్ల ఏ యిబ్బందీ రాలేదు" అంది.

"ఇంద్రనీల్‌కి తెలుసా?" మామ్మగారు అడిగారు.

"తెలియాల్సిన అవసరంలేదు" వాడిగా అంది.

"అదేమిటి? ఏమైంది అసలు?" తాతగారు అడిగారు.

"మీకు ఇబ్బంది కలగనీయను. ఒక నెల అడ్వాన్స్ ఇచ్చే వెళతాను. వస్తాను" వచ్చినంత వేగంగానూ ఆమె వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది.

శ్రీదేవి చెయ్యి కడుక్కుని శక్తి వెనకాలే వెళ్ళింది.

"ఏమైందక్కా? ఏమిటీ నిర్ణయం? ఇంతకంటే మంచివాటా బ్యాంక్ దగ్గరగా దొరికిందా?" అంది.

శక్తి సామాన్లు సర్దుకుంటూ "ఒక్కదానికీ ఇల్లు దండగ. మా నాన్నతో కలిసే వుంటాను. పెద్దవయసులో ఆయన్ని కనిపెట్టుకుని వున్నట్లుగా వుంటుంది" అంది.

శ్రీదేవి కళ్ళు పెద్దవి చేసి "మరి బావగారో!" అంది.

శక్తి ఆమె కళ్ళలోకి చూసి "వదిలేస్తున్నాను" అంది.

"అయ్యో! అంత మాట అనకు!" గాభరాగా అంది శ్రీదేవి.

"ఏం? నువ్వు వదిలెయ్యలేదూ?" అడిగింది శక్తి.

"బావగారికీ, మా ఆయనకీ పోలికా? బావగారు దేవుడు" అంది శ్రీదేవి.

"ఔను! అందుకే ఇద్దరు భార్యలుండడం ఒక క్వాలిఫికేషన్ అనుకున్నాడు" శక్తి కసిగా చెప్పింది.

"ఛీ! నేను నమ్మను" అంది.

"దొరికేవరకూ నీ భర్తగురించి కూడా నమ్మలేదుగా! అంతే!" అంది శక్తి.

"అసలు ఎందుకొచ్చింది ఆ అనుమానం?" అడిగింది శక్తి.

"అనుమానం కాదు నమ్మకమే!"

ఆస్పత్రిలో చూసిందంతా చెప్పుకొచ్చింది శక్తి.

తెల్లవారనీయి... కనుక్కుందాం. నిజం తేల్చుకోకుండా ఇంత తొందర నిర్ణయాలు తీసుకోవడం ఎందుకూ?"

"శక్తికి భరించే శక్తి చాలా తక్కువ శ్రీదేవీ!"

"ఒకవేళ పొరపాటు పడ్డావేమో!"

"నీకంత అనుమానంగా వుంటే రేపు ఆ అమ్మాయికి అబార్షన్ అయిందో లేదో వెళ్ళి కనుక్కో."

"అయినా కూడా... కాస్త ఆగి చూడక్కా!"

శక్తి చివరగా తమ పెళ్ళిఫోటోల ఆల్బమ్ తీసుకుంటూ అంది. "ఏదైనా భరిస్తాను కానీ నమ్మకద్రోహాన్నీ, అబద్దాన్నీ భరించలేను శ్రీదేవీ! అతను నాముందు నిలబడి అబద్ధాలాడినా నమ్మేయాలనిపిస్తుంది. అంతగా ప్రేమించాను. ఆ ప్రేమకి పూర్తిగా ద్రోహం చేశాడు" అని నేలమీదకి జారి మోకాళ్ళమీద తల ఆన్చుకుని వెక్కివెక్కి ఏడ్చింది.



శ్రీదేవి ఆమె తల నిమురుతూ వుండిపోయింది.

❖ ❖ ❖

ఉదయం పదిగంటలవేళ శక్తి శ్రీదేవికి బాబుని అప్పగించి ఇంటి దగ్గరగా వున్న పబ్లిక్‌ఫోన్ బూత్‌కి వెళ్ళింది. సుశృతా నర్సింగ్‌హోంకి డయల్ చేసి రిసెప్షనిస్ట్‌ని డాక్టర్ నీరజకి ఫోన్ ఇవ్వమంది.

"ఎస్... డాక్టర్ నీరజా హియర్!" అని వినిపించగానే, "నమస్తే డాక్టర్! నా పేరు శక్తిమతి. నిన్న సాయంత్రం బాబుని తీసుకొచ్చాను" అంది.

"ఎస్. ఐ రిమెంబర్... ఎనీథింగ్ సీరియస్?" ఆవిడ కంగారుపడింది.

"నథింగ్ ... హీ ఈజ్ ఆల్‌రైట్. ఒక చిన్న ఇన్ఫర్‌మేషన్ కావాల్సి వచ్చి చేశాను. నిన్న సాయంత్రం నేను అక్కడ వుండగా అనీల్ అనే పేరుగల వ్యక్తి ఒక అమ్మాయిని తీసుకొచ్చి అబార్షన్ చేయమన్నాడు. ఆ అమ్మాయి వచ్చిందా? ఆ అమ్మాయి పేరేమిటీ?" అడిగింది.

"ఎస్! ఆ అమ్మాయి పేరు మాధవి. ఇందాకే అబార్షన్ అయింది. అతనూ ఇక్కడే వున్నాడు. మీకు తెలుసా?" అడిగింది ఆవిడ.

"ఔను! దూరపు బంధుత్వం వుంది. ఒకసారి పిలుస్తారా?" కష్టంమీద మాట్లాడగలిగింది శక్తి.

"వైనాట్? లైన్‌లో వుండండి" ఆవిడ పిలిపించడానికి బెల్ కొట్టడం వినిపించింది.

శక్తి నుదురంతా చిరుచెమటలు అలుముకుంటున్నాయి. చేతికి వున్న వాచీ ముల్లు టైంబాంబు ముల్లులా కనిపిస్తోంది. ఏ మూలో అతను ఇంద్రనీల్ కాకూడదని ఆశ.

"హలో!" ఆ స్వరం... దిగంతాల అవతలనుంచి వచ్చినా ఆమె గుర్తుపట్టగలదు. ఎవరు... ఎవరు మాట్లాడేదీ?" అని అడిగాడు.

"నేను... ఇంద్రనీల్" కళ్ళవెంట నీళ్లు కారిపోతుండగా అంది శక్తి.

"శక్తీ...!!!"

"మాధవికి అబార్షన్ దగ్గరుండి జరిపించావా? అన్ని పనులూ అయ్యాయా?" వ్యంగ్యంగా అడిగింది.

"శక్తీ... అదీ... అసలు ఏం జరిగిందంటే..."

"వద్దు ఇంద్రనీల్... నీ నోట్లోంచి ఒక్క అబద్ధం కూడా వినలేను. నా బాబు తండ్రి నయవంచకుడు అనుకుంటే వాడిని పెంచలేను. ప్లీజ్... మన కాంట్రాక్ట్ రద్దుచేసుకో. ఎగ్రిమెంట్ పేపర్ ప్రకారం నీతో కలిసి వుండటం నాకు ఇష్టంలేకపోతే మనం విడిపోవచ్చు. కాబట్టి... ఈ క్షణంనుంచీ విడిపోదాం. నీ సామానులు ఇంటివాళ్ళ దగ్గరనుంచి తీసుకో. నాతో మాట్లాడాలనీ, కలవాలనీ ప్రయత్నించకు. గుడ్‌బై! మగాడ్ని నమ్మినందుకు మహ బాగా బుద్ధిచెప్పావు. నా నమ్మకాలే నిజం అని నిరూపించినందుకు థాంక్స్" శక్తి ఫోన్ పెట్టేసింది.

❖ ❖ ❖

"అదీ జరిగింది... ఇంకా ఏం రుజువులు కావాలి?" తండ్రిని అడిగింది శక్తి.

నిద్రలోంచి మెలుకువ వచ్చేసరికి చుట్టూ పెనుమంటలు చుట్టుముట్టిన వాడిలా వెర్రిగా చూస్తూ కూర్చున్నాడు గోపాలరావు.

"అతడ్ని పిలిపించడం... సంజాయిషీలు అడగడం... మధ్యేమార్గాలు వెతకడం ఇవన్నీ నాకు యిష్టంలేదు నాన్నా! నన్ను ఇక్కడ వుండనిస్తావా లేదా? ఆ విషయం చెప్పు చాలు" అంది.

"కానీ ఇంద్రనీల్ గురించి నేను..." ఆయన గొంతు బాగా ముసలిదై పోయినట్లు వణికింది.

శక్తి ఆయన దగ్గరగా వెళ్ళి చిన్నపిల్లాడ్ని ఓదార్చినట్లు దగ్గరకు తీసుకుంది. ఆయన ముగ్గురు అల్లుళ్ళలోకీ ఇంద్రనీల్‌పై ఎంత నమ్మకం పెట్టుకున్నాడో ఆమెకి తెలుసు.

"హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్‌కి పెట్టుకున్నాను. తొందరలోనే వెళ్ళిపోదాం. అక్కడైతే ఎవరూ తెలియని చోటు. మీరు ప్రశాంతంగా వుంటారు" అంది.

ఆయన తల వూపాడు.



శక్తి మంచంమీద బోర్లా పడుకుని అనుకుంది. 'నన్ను ఎవరు ఓదారుస్తారు? ఇది తక్కువ దెబ్బా? ఎలా తట్టుకోను? నిన్నటివరకూ అన్నీ తానే అయిన మనిషి... ఈరోజునుంచీ అసలేమీకాదు అంటే ఎలా? పైగా ప్రతి నిముషం అతడ్ని గుర్తుచేయడానికి అతని ప్రతిరూపం తన ఎదురుగా వున్నాడు.'

బాబుని దగ్గరగా తీసుకుంది. వాడు నిద్రలో నవ్వుతున్నాడు. ఆ నవ్వు బుగ్గమీద చిన్నసొట్టతో అచ్చు ఇంద్రనీల్ నవ్వులాగే వుంది.

❖ ❖ ❖

"ఇంద్రనీల్ వచ్చాడు. ఒక్కసారి నీతో మాట్లాడాలంటున్నాడు" తార శక్తి ఇంటికి వచ్చి చెప్పింది.

"వద్దు తారా! నాకు అతనితో మాట్లాడాలనిలేదు. అతను చెప్పే అబద్ధాలు వినే ఓపికాలేదు. అతనికి నాతో ఆర్థికావసరం తప్ప మానసిక సంబంధంలేదు. అలాంటి వ్యక్తిని నమ్మినందుకు నాకు తగ్గ శిక్షే పడింది. అనుభవిస్తాను. అతణ్ని పొమ్మను. ఇంకెప్పుడూ రావద్దను" శక్తి అతనికి వినపడేంత గట్టిగా అరిచి చెప్పింది.

"శక్తీ! ఒక్కసారి అతను ఏం చెప్తాడో విను."

"తారా... ఇది నా స్వవిషయం. ప్లీజ్! నా నిర్ణయాలకీ, భావాలకీ విలువనియ్యి."

తార లేచి "నీ ప్రాణస్నేహితురాలినని నమ్మకం వుంటే... ఒక్కసారి ఆలోచించి చూడు" అని వేగంగా బయటికి వెళ్ళిపోయింది.

ఇంద్రనీల్ తారకి ఎదురొచ్చి ఆతృతగా "ఏమందీ?" అని అడిగాడు.

"లాభంలేదు. మొండిది" పెదవి విరిచి చెప్పింది తార.

"ఒక్కసారి బాబునిచూసి వెళ్ళిపోతానని అడిగారా?" ఆశగా అడిగాడు.

"మండిపడిపోతోంది. అడిగితే కొట్టేలా వుంది" చెప్పింది తార.

"మీ వంతు కృషి మీరు చేశారు. థాంక్స్! చీకటిపడుతోంది. ఒక్కరూ వెళ్ళగలరా? నేను వచ్చి దింపనా?" అడిగాడు.

తార బాధగా "ఇతరులగురించి ఎక్కువగా, మీగురించి తక్కువగా ఎందుకు ఆలోచించి బతుకును పాడుచేసుకుంటారు ఇంద్రనీల్?" అంది.

ఇంద్రనీల్ నవ్వి "ఒక పిల్లిని పాలూ, పెరుగుతో పెంచి, పొడుగు చేసి జంధ్యం వేసినా అది బ్రాహ్మణత్వం అలవరుచుకోదు. ఎలుక కనిపిస్తే పట్టి మింగకుండా బ్రహ్మకూడా ఆపలేడు. అదీ ప్రవృత్తి... నైజం" అన్నాడు.

"జరిగినదానికి మీరు విచారించడంలేదా? ఇంకా ఇంత మామూలుగా ఎలా మాట్లాడగలుగుతున్నారూ?"

"ఇప్పుడేం ముంచుకుపోయిందనీ? రేపు పొద్దుట ప్రళయం వచ్చి ప్రపంచం మునిగిపోతుందని ఎవరూ చెప్పలేదుగా... అందరం బాగానే వుంటాం. బాగానే వున్నప్పుడు విచారం ఎందుకూ? పదండి... మిమ్మల్ని దింపుతాను."

ఇంద్రనీల్, తారా వెళ్ళిపోవడం కిటికీలోంచి చూసి నిట్టూర్చాడు గోపాలరావు.

"కిటికీ తలుపు వేసేసెయ్ నాన్నా!" అంది శక్తి.

"ఏం చెప్పేవాడో... వినాల్సింది" గొణుక్కుంటున్నట్లుగా అన్నాడు గోపాలరావు.

"తప్పు చెయ్యకపోతే అరిచి గోలచేసైనా నిజంచెప్పి వుండేవాడు. ఇంత కామ్‌గా వెళ్ళిపోతాడా?" అంది ఉక్రోషంగా శక్తి.

❖ ❖ ❖

గాయం నిముషంలో అవుతుంది. మచ్చ మానడానికి చాలాకాలం పడుతుంది. శక్తికి హైదరాబాద్ వచ్చాక రోజులు ఇంకా భారంగా అనిపిస్తు న్నాయి. బాబు ఆలనా పాలనా తండ్రి ఈ వయసులో చూడలేడని ఒక ఆయాని పెట్టింది. ఆమెతో ప్రతిరోజూ గొడవే! పాలసీసాలు వేడినీళ్ళలో ఉడికించి శుభ్రపరచదు. నిర్లక్ష్యంగా బాబుని మట్టిలో వదిలేస్తుంది. ఫలితంగా ఎప్పుడూ బాబుకి ఏదో ఒక కంప్లైంట్.

"వున్న వూరునీ, సొంతవాళ్ళనే వదిలిపెట్టుకుని వచ్చాం. ఈ వూళ్ళో అన్నీ కొత్తే! పనివాళ్లు చూడబోతే మహా కరుకుగా వున్నారు. ఆటో అబ్బాయిని పలకరించినా, కండక్టర్ని చిల్లరడిగినా కొట్టినట్లు మాట్లాడ తారు. ఎప్పుడూ ట్రాఫిక్‌జామ్‌లు, నెలకోసారి బంద్‌లూ, కర్ఫ్యూలూ,



ధరలు ఆకాశాన్నంటు తున్నాయి. ఏమిటోనమ్మా ఈ భాగ్యనగరం..." విసుక్కున్నాడు గోపాలరావు.

బాబుకి బట్టలు మారుస్తూ శక్తి "ఫస్టునుంచి క్రెష్‌లో వేసేద్దాం నాన్నా"అంది.

"మన కళ్ళముందే ఇంత బాగా చూస్తున్నారీ ఆయాలు. ఇంక అక్కడ ఎలా చూస్తారో వేరే చెప్పాలా?" అన్నాడాయన.

శక్తి ఆలోచనగా చూసి "ఔను" అంది.

ఆమెకీ ఆయాతో అరవడం, ప్రతిరోజూ జగడం విసుగ్గానే వుంది. కానీ బాబు తండ్రిదగ్గర వున్నాడని మనఃశాంతిగా పని చేసుకోగలుగు తోంది. కానీ ఆయా చెప్పాపెట్టకుండా మానేసినప్పుడు మాత్రం తండ్రి చాలా అవస్థపడి పోతున్నాడు.

శక్తి ఆరోజంతా ఇవే ఆలోచనలతో అన్యమనస్కంగా గడిపింది. సాయంత్రం బస్‌కోసం బస్‌స్టాప్‌లో నిలబడి వుండగా, "ఈరోజు బస్ స్ట్రైక్... బస్సులు రావుట మేడం" అన్నాడు కొలీగ్ విశ్వనాథం స్కూటర్ ఆపి, కిందకి దిగుతూ.

"ఓహ్... ఇంతలోకే ఏమొచ్చిందిట" శక్తి విసుగ్గా అడిగింది.

"గేదె దారికి అడ్డంగా పేడ వేసిందని కూడా కావచ్చు. కారణం ఏమైతేనేం?" అతను నవ్వాడు.

శక్తి వాచీ చూసుకుంటూ "ఈరోజు త్వరగా వెళ్ళాలనుకున్నాను కూడా"అంది.

"తథాస్తు! పదండి.... నేను మీ ఇంటిదగ్గర డ్రాప్‌చేసి వెళతాను" అన్నాడు.

శక్తి ఇంకా ఆలోచిస్తూ కాలయాపన చెయ్యలేదు. "చాలా థాంక్స్" అని అతని వెనకాల స్కూటర్‌మీద కూర్చుంది.

విశ్వనాథ్‌కి ఆమె గుర్తులు చెబుతుంటే ఆమె ఇంటికి తీసుకెళ్ళాడు.

వాళ్ళు వెళ్ళేసరికి బాబు పెద్దగా ఏడుస్తున్నాడు. గోపాలరావు వాడ్ని వూరడించలేక సతమతమైపోతున్నాడు.

శక్తి పరుగులాంటి నడకతో ముందుకు వెళ్ళి తండ్రి చేతుల్లోంచి బాబుని అందుకుంది.

"ఏం చేసినా ఊరుకోవడంలేదు. చెవిపోటేమో!" అన్నాడాయన. ఇంతలో విశ్వనాథ్‌ని చూసి "కూర్చోండి" అన్నాడు.

విశ్వనాథ్ కూర్చోకుండా "ఎందుకైనా మంచిది. డాక్టర్ దగ్గరకి తీసుకెళదాం... పదండి" అన్నాడు.

కానీ బాబు శక్తి చేతుల్లోకి రాగానే ఏడుపు మానేసి ఆమె గొలుసుతో, ముఖానికున్న బొట్టుతో ఆడసాగాడు.

శక్తి అతనితో "ప్రతిరోజూ ఆయాదొక సమస్యగా మారింది. వస్తుందో, రాదో తెలీదు. వచ్చినా ఏ పనీ సక్రమంగా చెయ్యదు. ఈ టెన్షన్‌తో నాకు తల పగిలిపోయేట్లుగా వుంది" అంది.

విశ్వనాథ్ ఆ గదిలో గోడకేసి అన్వేషిస్తున్నట్లుగా చూశాడు. సాధారణంగా భార్యాభర్తల పెళ్ళిఫోటోలు గోడకో, టీవీస్టాండ్‌మీదో వుండటం పరిపాటి కదా!

శక్తి అతని భావం గ్రహించినట్లుగా "నేనూ, నాన్నగారూ, బాబూ ముగ్గురమే వుంటాం" అంది.

అతనేమీ అనలేదు. వాచీ చూసుకుని "డాక్టర్ దగ్గరకి తీసుకెళదాం అంటే సరే. లేకపోతే నేను బయలుదేరతాను. నాకోసం అమ్మా, పాపా ఎదురు చూస్తుంటారు" అన్నాడు.

ఆమె కళ్ళల్లో ఆశ్చర్యం కనిపించింది. కానీ వెంటనే సర్దుకుంది. అతనిదీ తన కేసేనా అనిపించింది. కాదేమో... వాళ్ళ ఆవిడ పుట్టింటికో, ఉద్యోగానికో వెళ్ళి వుండవచ్చుగా అనుకుంది.

"బాబుని ఇటిచ్చి ఆయనకి కాఫీ తీసుకురా శక్తీ..." అన్నాడు గోపాలరావు.

"ఒద్దండీ! అమ్మ నేను వెళ్ళేవరకూ తనూ కాఫీ తాగదు. వస్తాను" అతను శక్తి చేతుల్లోని బాబు బుగ్గ నిమిరి అన్నాడు.

"పోనీ మంచినీళ్ళయినా..." అంది శక్తి.

"నో... థాంక్స్... బై" అతను వెళ్ళిపోయాడు.

"మంచి మనిషిలా వున్నాడు" అన్నాడు గోపాలరావు.

ఆమె ఏ కామెంటూ చెయ్యలేదు. ఆమెకి మగాళ్ళమీద అంతత్వరగా సదభిప్రాయం ఏర్పరచుకోవడం ఇష్టంలేదు. తనకి లిఫ్టు యిచ్చిన మగాడి



మీద కృతజ్ఞతాభావంకన్నా, ఏదో తనే ఫేవర్ చేసిన ఫీలింగ్, అందరి ఆడవాళ్ళలాగే ఆమెకీ కలుగుతుంది. మగాడి చూపులూ, మాటలూ దయ చూడటమూ... అనే వేడికోలు అతనికే తెలీకుండా బతుకుతూ వుండటం ఒక కారణమే మరి! సూర్యుడు పడమర ఉదయించడం, మగాడు మనసులో కుత్సితం లేకుండా స్త్రీకి సహాయాలు చేయడం అసంభవాలు అని ఆమె ఉద్దేశం.

బాబు ఆమెని వదిలితే ఎక్కడ మళ్ళీ వెళ్ళిపోతుందో అన్నట్లు వదలకుండా పట్టుకున్నాడు.

ఎదురింటి ఆయన వాళ్ళ బాబుని ఎత్తుకుని షికారు వెళుతున్నాడు. శక్తికి ఇంద్రనీల్ గుర్తొచ్చాడు. ఆమె మనసు భారంగా మూలిగింది. తార రెండు ఉత్తరాలు రాసింది. వాటినిండా ఇంద్రనీల్ మంచితనం గురించే. ఆ అమ్మాయి సంగతి మాత్రం ఎంత అడిగినా అతను పెదవి విప్పలేదుట. ఒక ఉత్తరం శ్రీదేవికూడా రాసింది. ఇంద్రనీల్ ఇల్లు ఖాళీ చేసేసి వెళ్ళిపోయాడుట. ఎక్కడికని అడిగితే, "లోకమంతా విభుని మందిరం కాగా ఇల్లేది... తలుపేది చెల్లెలా!" అన్నాడట.

శక్తి బాబుని నిద్రపుచ్చి వంట ప్రయత్నంలో పడింది. తండ్రి ఆమెకి సాయంగా ఉల్లిపాయలు తరుగుతూ "పెద్దది సరే... చిన్నదైనా ఒక్క ఉత్తరంముక్క రాసిందికాదు చూడు" అన్నాడు.

ఆమెకి కూడా సుమతిమీదే బెంగ!

ఒట్టి అమాయకురాలు. మెతక స్వభావం. మళ్ళీ నెలతప్పిందిట. ఈసారైనా మగపిల్లాడు పుడితే బావుండు అనుకుంది.

అరుంధతి శక్తీవాళ్ళు హైదరాబాద్ వచ్చేసేముందు వచ్చి "నీకేం పొయ్యేకాలమే నిక్షేపంలాంటి సంసారం పాడుచేసుకున్నావు? ఏమైనా గొడవలొస్తే సర్దుకుపోవాలి గానీ..." అంది.

"నిక్షేపంలాంటి సంసారం అంటే ఏమిటో తెలుసుకుని నాకు విపులంగా రాయి. అప్పుడు చెప్తాను జవాబు" అంది ఆమె.

అరుంధతి తండ్రితో "అంతా నువ్వు చేసిన గారాబం. దాని జీవితం నిలువునా పాడయిపోతుంటే చూస్తూ వూర్కున్నావు. అసలు నీతో మాట్లాడటమే తప్పు" అని వెళ్ళిపోయింది.

ఆ తర్వాత మళ్ళీ వాళ్ళ సంగతులేవీ తెలియలేదు.

మరునాడుకూడా ఆయా రాలేదు. బాబుని తండ్రిమీద వదిలి వెళ్ళడం ఇష్టంలేక శక్తి బ్యాంక్‌కి వెళ్ళలేదు.

సాయంత్రం ఇంటిముందు స్కూటర్ ఆగితే వాకిట్లోకి వెళ్ళి చూసింది. విశ్వనాథ్ ఒక ముసలావిడనీ, ఐదేళ్ళ పిల్లని వెంటపెట్టుకుని గేట్ తీసుకుని వస్తున్నాడు.

శక్తి ఆశ్చర్యంగా ఎదురెళ్ళింది.

"ఇక్కడ పక్కనే వినాయకుడి గుడిలో స్వామీజీ వచ్చారని వచ్చాం. అమ్మని పరిచయం చేద్దామని తీసుకొచ్చాను" సంజాయిషీ ఇస్తున్నట్లు చెప్పాడు.

"రండి... కూర్చోండి" శక్తి ఆహ్వానించి అతనికి స్టూలూ, ఆవిడకీ, పాపకి గాడ్రెజ్ కుర్చీలూ వేసింది.

ఇంట్లో ఓ సోఫాసెట్ వుంటే బావుండేది అని ఆ నిముషంలో అనిపించింది. వంటింట్లో సరైన పోపులడబ్బా, పెనం లేవని తండ్రి ఎన్నోసార్లు అనడం గుర్తొచ్చింది.

ఏమిటో... ఇంటి విషయాలగురించి అస్సలు ఆసక్తే వుండటంలేదు అనుకుంది.

"బాబు నిద్రపోతున్నాడా?" ఆవిడ ఆప్యాయంగా అడిగింది. తెల్లచీర కట్టుకుని నుదుట నిలువుగా తిరుచూర్ణంతో నామం పెట్టుకుని వుందావిడ. చేతులకి, చెవులకీ ఏమీలేవు. మెడలో మాత్రం ఓ రుద్రాక్ష తాపళం వుంది.

"అవునండీ! ఇప్పుడే పడుకున్నాడు" అంది శక్తి. తర్వాత విశ్వనాథ్ కూతురి బుగ్గలు పట్టుకుని "ఏం చదువుతున్నావ్?" అంది.

"ఫస్ట్‌క్లాస్" కళ్లు చక్రాల్లా తిప్పి చెప్పిందా పిల్ల. ఫస్ట్ అంటే మరి గొప్పే కదా!

"పేరేమిటీ?" మళ్ళీ అడిగింది.

"సింధు."

"చాలా బావుంది. వుండు నీకు బిస్కెట్లు తెస్తాను" అని లోపలికెళ్ళి ఓ ప్లేట్లో బిస్కెట్లు, ఓ ప్లేట్లో ఏపిల్‌పండు కోసి ముక్కలు తెచ్చిపెట్టింది.



"ఎందుకివన్నీ? ఆఫీసుకి రాకపోతే బాబుకి ఎలా వుందో చూసి పోదామని వచ్చాను" విశ్వనాథ్ మొహమాటపడ్డాడు.

"అందుకే! ఈ మహానగరంలో మా గురించి ఆ మాత్రం పట్టించుకునే వారున్నందుకు" శక్తి నవ్వుతూ ప్లేట్ అందించింది.

విశ్వనాథ్ తల్లి "మీ ఆయన ఊళ్ళో వుండరా తల్లీ?" అని అడిగింది.

విశ్వనాథ్ యిబ్బందిగా "అమ్మా... ఎందుకా ఆరాలూ?" అన్నాడు.

శక్తి మామూలుగానే "ఇక్కడ మాత్రం ప్రస్తుతం లేరు" అంది.

ఆవిడ ఏదో అర్థమైనట్లుగా నిట్టూర్చి, "మా విశ్వం పరిస్థితే అన్నమాట. ఈ పెద్ద వయసులో నాకు వీడిదే చింత. అందుకే ఈ స్వామీజీలనీ, ఆశ్రమాలనీ పట్టుకు తిరుగుతుంటాను" అని ఇంకా ఏదో చెప్పబోయింది. వయసు మళ్ళిన వాళ్ళందరిలోనూ కనిపించే చాదస్తమే ఆవిడలోనూ కనిపించింది.

"ఇంక వెళదామా?" అసహనంగా లేచి నిలబడుతూ అన్నాడు విశ్వనాథ్.

"వుండండి. కాఫీ తెస్తాను. ఈలోగా కూరలకు వెళ్ళిన నాన్నగారు కూడా వచ్చేస్తారు" అని లోపలికి వెళ్ళింది ఆమె.

ఆమె పార్టీషన్ అడ్డుగా వున్న వంటింట్లో కాఫీ కలుపుతుంటే అతను సన్నగా, "ఆవిడ గురించి నీకెందుకూ? నా భార్యగురించి కూడా ఆవిడతో వెంటనే చెప్పాలా? అన్నీ చాదస్తం పనులు, ఏమైనా అంటే మళ్ళీ బాధ పడతావు" అని మందలించటం వినిపించింది.

"అయ్యో... అంత కానిమాట ఏమన్నారా? పాపం ఆడపిల్ల. బాబుతో ఇబ్బందులు పడుతోంది. చూసుకునే దిక్కులేదని నిన్నల్లా నువ్వేగా బాధపడ్డావు. మన ఇంట్లోనే రెండుగదులు యిస్తే, కాస్త పెద్దదిక్కుగా నేను వుంటాగా అని నా ఉద్దేశం" అందావిడ.

"మరి ఆ మాట చెప్పొచ్చుగా"

"నువ్వు చెప్పనిచ్చావా?"

అది విని శక్తి నవ్వుకుంటూ కాఫీలు పట్టుకుని బయటికి వచ్చింది.

"శక్తిమతిగారూ! అమ్మ అంటోందీ..." అని అతను చెప్పబోయాడు.

"నే చెప్తా నువ్వుండు. అమ్మాయ్... మా ఇంట్లో ఓ వాటా ఖాళీగా వుంది. నీకిష్టమైతే అందులో చేరిపో. ఇంక నీ బాబు గురించి ఏ దిగులూ లేకుండా నా మనవరాలితోబాటు వాడ్నీ చూసుకుంటాను" అందావిడ.

పూజలు చేయకుండానే వరాలిచ్చే దేవత ప్రత్యక్షమైనట్లు అబ్బురంగా చూసింది ఆవిడవైపు శక్తిమతి. ఆ నిముషంలో ఆవిడ నిలువెల్లా నగలతో దేదీప్యమానంగా వెలిగిపోయే సినిమాలో అమ్మవారిలా ఆమె మనో నేత్రానికి కనిపించింది.

"ఇంత మంచివాళ్ళు కూడా వుంటారా? అని ఆశ్చర్యం కలుగుతోంది. నేను కాదు... ఈ మాట మీనోట పలికించిన మా బాబు అదృష్టవంతుడు" ఆనందంగా అంది శక్తి.

ఇంతలో గోపాలరావు కూరలసంచితో వచ్చాడు.

శక్తిమతి తండ్రిని ఆవిడకి పరిచయం చేసి, బాబు ఏడుపు వినిపించి బెడ్‌రూంలోకి వెళ్ళింది.

విశ్వనాథ్ ద్వారా ఇంటి విషయం విని ఆయన సంతోషించాడు.

"మా అల్లుడు ఇక్కడ వుండడు. చాలా మంచిపిల్లాడు. పనిమీద బయట ఊళ్లో వుంటున్నాడు" అన్నాడు.

ఆ మూడు వాక్యాల్లో తండ్రికి ఇంద్రనీల్‌మీద ఇంకా మిగిలిన అభిమానాన్ని గుర్తించి, నుదురు చిట్లించుకుంది శక్తి.

బాబుని ఎత్తుకుని బయటికి వచ్చింది. ముసలావిడ బాబుని ముద్దు పెట్టుకుని "చందమామలా వున్నాడు. నీ పోలికలుకూడా కొన్ని వున్నాయి. కానీ ఈ బుగ్గమీద సొట్టమాత్రం..." అనగానే, "మా అల్లుడి పోలిక" అన్నాడు గోపాలరావు.

శక్తి తండ్రివంక వాడిగా చూసింది.

సింధు బాబుని ఎత్తుకుని "ఇప్పుడే బాబుని మాతో తీసుకుపోతాం ఆంటీ!" అంది.

"మీ నాన్నని అడిగి పదిరూపాయలు పట్రా ఇచ్చేస్తాను" అంది శక్తి.

సింధు అమాయకంగా తండ్రిని "నాన్నా... పదిరూపాయలియ్యి... ఊ... ఇయ్యి... బాబుని కొంటాను" అని మారాం చేస్తుంటే అందరూ నవ్వేశారు.



"ఇకనుంచీ అక్కడే వుంటాంలే అమ్మా!" అన్నాడు గోపాలరావు.

ఇల్లు వాళ్లు వున్న కాసేపూ సందడిగా వుండి, ఆ తర్వాత మళ్ళీ బావురు మంటూ నిశ్శబ్దంగా మిగిలిపోయింది.

గోపాలరావు బాబుతో కబుర్లు చెబుతుంటే బాబు కేకలు పెడుతున్నాడు.

'వీడుకూడా లేకపోతే నేను ఏమైపోయేదాన్నో కదా!' అనుకుంది కూరలు తరుగుతూ శక్తి.

❖ ❖ ❖

స్కూటర్ మీద వెళుతున్న ఇంద్రనీల్‌కి జనం ఓ చోట గుంపుగా చేరి వుండటం కనిపించి అప్రయత్నంగా స్కూటర్ ఆపి దిగాడు. తనూ వాళ్ళల్లో దారి చేసుకుని ముందుకి నడుస్తూ "ఏమైంది?" అడిగాడు ఒకతన్ని.

"ఏక్సిడెంట్. తాగి మోటర్ సైకిల్ నడుపుతున్నట్లున్నాడు పాపం" అన్నాడతను హేళనగా.

ఇంద్రనీల్ అతనివైపు అడుగులువేసి కిందపడి వున్న వ్యక్తిని పైకి లేప బోయాడు. అతనికి బాగా గాయాలయ్యాయి. నుదుటినుంచి రక్తం కారుతోంది. కానీ స్పృహ కోల్పోలేదు. అతను కళ్ళు తెరిచి... "ఇంద్రనీల్!" అన్నాడు.

ఇంద్రనీల్‌కూడా అతడ్ని గుర్తించి, "మీరా? పదండి... హాస్పిటల్‌కి పోదాం" అన్నాడు.

అతను ఆ బలహీనమైన స్థితిలో ఇంద్రనీల్ తనని చేతులమీద ఎత్తుకుని తీసుకెళుతుంటే, ఎందుకో కంటతడి పెట్టుకున్నాడు.

అతను... సుమతి భర్త.

❖ ❖ ❖

గిరి ఇచ్చిన ఎడ్రెస్ ప్రకారం సుమతి ఇల్లు వెతుక్కుంటూ వెళ్లాడు ఇంద్రనీల్.

సుమతి ఆ సమయంలో మిషన్‌మీద దుస్తులు కుడుతోంది. జుట్టు ముడివేసుకుని, పాత చిరుగుల చీర కట్టుకుని అశోకవనంలో సీతాదేవిలా వుంది. కానీ ఆ సీతమ్మకి భోజనం ఎలా వస్తుందీ? అన్న సమస్యలేదు. ఈవిడకి వుంది. ఆమెకి కాస్త దూరంలో నేలమీద కూర్చుని ఏడుస్తున్న పాప- బక్కచిక్కి పొట్ట వీపుకి అంటుకుపోయి వుంది.

ఇంద్రనీల్‌ని చూడగానే ఆమె మొదట ఆశ్చర్యపోయింది. ఆ తరువాత హడావుడి పడుతూ లేచి "రండి... రండి" అంది.

ఆమె చేతులకి వున్న మట్టిగాజుల్నీ, మెడలో వున్న పసుపుతాడునీ, ఇంట్లో తాండవిస్తున్న దారిద్ర్యాన్నీ అతను పరిశీలించాడు.

"ఇలా వచ్చారేం? మా అడ్రెస్ ఎలా తెలిసిందీ?" అని అడిగింది.

ఇంద్రనీల్ పాపని ఎత్తుకుని "మీ ఆయన ఇచ్చాడు" అన్నాడు.

ఆమె ముఖంలో ఆశ్చర్యం తారట్లాడింది. "మా ఆయనా?" అంది.

"మీ ఆయనకి యాక్సిడెంట్ అయింది వదినగారూ" అన్నాడు.

"ఆ!" ఆమె గాభరాగా చూసింది.

"ప్రాణానికేం ప్రమాదం లేదు" వెంటనే అన్నాడు.

ఆమె పైటకొంగు నోటికి అడ్డంగా పెట్టుకుని సన్నగా వెక్కిళ్ళు పెట్టి ఏడవసాగింది.

"హాస్పిటల్లో ఎడ్మిట్ చేశాను. చాలా రక్తం పోయింథి. నాది 'ఓ' గ్రూప్. యూనివర్సల్ డోనర్‌ని కాబట్టి నాది పనికొచ్చింది" అన్నాడు.

సుమతి కళ్ళు తుడుచుకుని, "ఇక్కడ ఆయన వుండకపోయినా, ఎక్కడో అక్కడ క్షేమంగా వుంటే అంతేచాలు. మీకు చాలా రుణపడ్డాను" అంది.

ఇంద్రనీల్ భృకుటి ముడివేసి "అదేమిటీ? ఆయన ఇక్కడ వుండక ఎక్కడ వుంటున్నాడూ?" అన్నాడు.

సుమతి తలవంచుకుంది.

"నన్ను చెల్లెలి మొగుడిగా కాదు. ఒక తోడబుట్టిన వాడిలా అనుకుని వివరంగా చెప్పండి" అన్నాడు.

సుమతి సన్నని గొంతుతో, మధ్యమధ్యలో ఏడుస్తూ గిరి సంగతులన్నీ చెప్పింది.

"మొదట వాళ్ళ ఆఫీసులో పనిచేసే అమ్మాయని చెప్పి ఇంటికి తీసుకొచ్చేవారు. కానీ అది అబద్ధం అని తర్వాత తెలిసింది. ఆఫీసు పని మీద రాజమండ్రి వెళ్ళినప్పుడు పరిచయం అయిందట. దాన్ని అంటు కున్నారు. అది వదిలి పెట్టకుండా అడ్రస్ పట్టుకుని ఈ వూరు వచ్చింది. పెళ్ళి చేసుకోమని పోరు పెట్టిందిట. నన్ను విడాకులు ఇమ్మని బలవంత



పెట్టారు. నేను ససేమిరా ఇవ్వనన్నాను. బతిమాలారు, కొట్టారు, హింసించారు. నేను లొంగలేదు. దాంతో ఇంటికి రావడం, డబ్బులు ఇవ్వడం మానేశారు. మొదటిసారి వచ్చిన ధైర్యంతో ఈ తడవ నేను వెళ్ళి ధైర్యంగా అబార్షన్ చేయించేసుకున్నాను. ఈ మిషన్‌మీద వచ్చే ఆదాయంతో ఎలాగో రోజులు వెళ్ళదీస్తున్నాను. ఆయన ముఖంచూసి కూడా చాలా రోజులయింది. కానీ... ఈ సంగతులేవీ మా నాన్నకి తెలియనీయకండి. లక్షలు పోసి కూతురిని నరకంలోకి పంపించానని తెలిస్తే ఆయన తట్టుకోలేరు" అంది.

"నెలకి ఎనిమిదివేలు సంపాదించే అతను మీకు ఏమీ ఇవ్వడం లేదా? అయినా మీరు నోరు మెదపకుండా వూరుకొంటున్నారా? మీ స్థానంలో మీ చెల్లెలు వున్నట్లయితే అపర కాళీరూపం చూపించి అతడ్ని ఏడు చెరువుల నీళ్ళు తాగించేది" అన్నాడు.

"ఏడ్చాను, మొత్తుకున్నాను. అంతకన్నా ఏం చెయ్యగలనూ?" నిస్సహాయంగా అంది సుమతి.

"అవి రెండూ వదిలేసి మిగతావి చాలా చేయచ్చు" చిన్నగా నవ్వి అన్నాడు.

"శక్తి మిమ్మల్ని వదిలేస్తే మీరేం చెయ్యగలిగారూ?" అడిగింది సుమతి.

ఇంద్రనీల్ నొచ్చుకోవడమో, కోపం తెచ్చుకోవడమో చేస్తాడనుకొన్న ఆమెకి విస్మయం కలిగిస్తూ అతను నవ్వి "కరెక్ట్ దారికి వచ్చారు. నేనూ అదే చెప్పాలనుకున్నాను."

స్త్రీ అంటే శక్తి స్వరూపిణి. ఆమెని మగాడు ఏం చెయ్యాలనుకున్నా ఈ రోజుల్లో ఆమె చక్రం ప్రయోగించినట్లు చట్టంతో కొడుతుంది. ఆమె అంగీకారం లేకుండా కలిసి కాపురం చేయడం, విడాకులు తీసుకోవడం రెండూ కష్టమే. కానీ...

ఆడది తలుచుకుంటే అతడ్ని ఏ విధంగానైనా కట్టి పడేయచ్చు. చూడండి... ప్రేమతోనో, సేవతోనో జయించడం మీ జాతికి దేవుడిచ్చిన వరాలు" అన్నాడు.

సుమతి విరక్తిగా నవ్వి "ఇంట్లో వుంటేగా అవన్నీ చెయ్యడానికి" అంది.

"ఇంక కొన్నిరోజులు ఇంటిపట్టునే వుంటారు. మంచం దిగరు. మీరు అతనికి కావలసిన మనోధైర్యం ఇస్తూ, చేదోడువాదోడుగా వుండాలి. పబ్లిక్‌గార్డెన్స్‌లో ప్రదర్శనకి పెట్టిన పూలమొక్కలకీ, పెరట్లో చల్లని నీడనిస్తూ తియ్యని ఫలాలిచ్చే పెరటిచెట్టుకీ అతనికి తేడా తెలిసిరావాలి! అందుకు మీరు శాయశక్తులా కృషి చేయాలి" అన్నాడు.

అతను చెప్పేది వింటూ వుంటే ఆమెకి భయం కలిగింది. "ఆయన మంచంమీదే వుండాల్సినంత ప్రమాదమైన స్థితా? ఏమైందీ? దాచకుండా చెప్పండి" అంది.

"చెప్తాను. కానీ ముందు నేను చెప్పినట్లుగా చేస్తానని ముందుగా మాటివ్వండి. అంతా మీ మంచికోసమే" అన్నాడు.

సుమతి కన్నీళ్ళతో "సముద్రంలో మునిగిపోతూ కనీసం గడ్డిపోచయినా సహాయానికి దొరకకపోతుందా అని వెతుకుతున్న పరిస్థితి నాది. మీమీద నాకు నమ్మకం వుంది" అంది.

"గడ్డిపోచే ఒక్కోసారి నాలుకల్ని చీల్చేస్తుంది. మరోసారి వజ్రాయుధంలా శత్రువుల్ని తరిమిగొట్టగలదు. చిన్నప్పుడు గడ్డిపరకతో అరచెయ్యి కోసుకుపోయేట్లు దెబ్బలుతిని నేర్చుకున్న చాణుక్యుడి కథ వినలేదా?" అన్నాడు.

"ఇంతకీ ఆయనకి ఏమైందీ? అంత ప్రమాదకరమైన జబ్బా?" భయంగా అడిగింది.

"ప్రమాదమంటే..." ఆలోచించి, "మరి ప్రమాదమేగా...!" అన్నాడు.

"సరిగ్గా చెప్పండి" అంది ఆతృతగా.

"సరే వినండి..." అతను చెప్పడం మొదలుపెట్టాడు.

❖ ❖ ❖

కొత్తఇల్లు ఊరికి దూరంగా వున్నా శక్తికి చాలా నచ్చింది. విశాలమైన పెరడునిండా రకరకాల పూలమొక్కలున్నాయి. వాటి మధ్యలో పసుపు కుంకాలతో కొలువున్న తులసికోట పిల్లలకి కథలు చెప్పే పేదరాశి పెద్దమ్మలా వుంది. విరగబూసిన జూకామందారం జడగంటల జడతో వయ్యారంగా నడిచే కోనసీమ కన్నెపిల్లలా వుంది.



మెలికలు తిరుగుతూ డాబామీదకి ఎక్కిన సన్నజాజి కాలేజీ బ్యూటీలా వయ్యారంగా వుంది. ఓ పక్కన ఒద్దికగా ఒంగి నిలబడ్డ బంతి, బొద్దుగా ముద్దుగుమ్మలా వుంది.

మాటిమాటికీ ఘళ్ళున నవ్వే చలాకీ పిల్లలా సువాసనలు వెదజల్లుతోంది మల్లెపందిరి. స్నిగ్ధంగా ముగ్ధలా ముడుచుకుని పూరిస్తున్నాయి గులాబీమొగ్గలు. కొయ్యబోతేనే గోళ్ళుకందేలా కవ్విస్తోంది గోరింటాకు పొద.

వంటింట్లో అమ్మ తిరగమోత వాసనలు పట్టించినట్లు, ఘుమఘుమలతో గుబురుల్లోంచి తన ఉనికిని చాటుతోంది మరువం. ఓసారి ఆ సువాసనలని ఆఘ్రాణిస్తే మరువ తరమా! వీటన్నింటికీ పెద్దన్నలా ప్రహరీ చుట్టూ కాపు కాస్తోంది బోగన్ విల్లా!

తులసికోట చుట్టూ సుద్దతో చుక్కల ముగ్గులు పెట్టి మురిసిపోయింది శక్తి.

"ఎన్నాళ్ళయిందో ఇల్లంతా ఇంత కళకళలాడి...!" అంది విభూది పండు పక్కన పెట్టుకుని వత్తులు చేస్తున్న పార్వతమ్మగారు. వెన్నెల్లో మెరుస్తున్న ముగ్గుల్ని చూసి ఆకాశంలో చుక్కలు బహుశా చిన్నబుచ్చుకొని వుంటాయి. చంద్రున్ని బుగ్గలు పొడిచి మేఘాలమాటుకి తీసుకుపోయాయి.

బాబుని ఎత్తుకుని డాబామీదకి వెళ్ళింది శక్తి. అక్కడ మడతమంచం మీద పడుకుని సింధుకి కథలు చెబుతున్న విశ్వనాథ్‌ని చూసి ఆగిపోయింది.

అతనూ ఆమెని చూసి చటుక్కున లేచి కూర్చుని "రండి... ఫర్వాలేదు" అన్నాడు.

ఆమె తటపటాయిస్తూనే ముందుకి నడిచింది.

"మీకు ఏం అసౌకర్యంగా లేదుగా ఇల్లు?" అడిగాడు.

"లేదు. స్వర్గంలా వుంది. ఎప్పుడైనా ఖాళీ చెయ్యమంటారేమోనని ఇప్పుడే దిగులుగా వుంది" అని నవ్వింది.

ఆ నవ్వుకి వంతపాడినట్లుగా ఆకులు గలగలా చప్పుడు చేశాయి.

"బాబుని ఎత్తుకుంటాను ఆంటీ...!" సింధు బతిమాలుతున్నట్లు అడిగింది.

"ఒద్దమ్మా... పడేస్తావు" అన్నాడు విశ్వనాథ్.

"కూర్చో. ఒళ్ళో పడుకోబెడతాను" చెప్పింది శక్తి.

బాబుని ఒళ్ళో పెట్టుకుని ముద్దులాడుతూ మురిసిపోయింది సింధు.

"రేపు బ్యాంక్‌కి వస్తున్నారా?" అడిగాడు విశ్వనాథ్.

"వస్తాను."

"మీతో ఒక విషయం చెప్పాలి. ఏమైనా అనుకుంటారేమోనని భయపడుతున్నాను" అన్నాడు.

ఆమెకి ఎందుకో గుండెలు దడదడలాడాయి.

మగాడు 'ఓ విషయం' అనగానే స్త్రీకి ఒళ్ళంతా కంగారు పాకడం అసంకల్పిత ప్రతీకార చర్య.

"చెప్పండి!" అని అతను చెప్పే విషయం ఎలాంటిదైనా విని తట్టుకోవ డానికి సిద్ధమైపోయి కూర్చుంది.

"నేనూ మీరూ ఒకే బ్యాంక్‌కి వెళ్ళాలి. నేను స్కూటర్‌మీదే వెళతాను. కానీ మిమ్మల్నికూడా నాతోబాటు తీసుకెళ్ళడం నాకు ఇష్టంలేదు. లోకం సంగతి మీకు తెలియనిది కాదు. అదిగో పులి అంటే ఇదిగో తోక అంటుంది. అందుకని మీరు ఏమీ అనుకోకుండా..."

"ఇంతాచేసి ఇది చెప్పడానికా ఇంత ఆలోచన?" నవ్వుతూ అడిగింది శక్తి. మళ్ళీ వెంటనే, "నా మనసులో మాటే మీరూ చెప్పారు. అసలు నేను మీ ఇంట్లో అద్దెకున్న విషయమే బయట పెట్టకపోతే ఇంకా మంచిది" అంది.

"ఉభయత్రా లాభదాయకం" అన్నాడు.

"లాభం మాటెలా వున్నా నష్టాన్ని నివారిస్తుంది" అన్నాడు.

శక్తి సింధు ఒడిలోంచి బాబుని ఎత్తుకుంటూ "కిందకి వెళతాను" అంది.

"కాసేపు చల్లగాలికి తిరుగుదామని వచ్చినట్లున్నారు. మీరే వుండండి. నేను కిందకి వెళతాను. ఇంకా భోజనం చెయ్యలేదు" అన్నాడు.



"విస్సూ... విస్సూ" అన్న పార్వతమ్మ పిలుపు వినిపించింది.

"అదిగో అమ్మకి ఆకలి అవుతున్నట్లుంది" అని నవ్వి సింధుచెయ్యి పట్టుకుని కిందకి వెళ్ళిపోయాడు.

శక్తి బాబుని నిద్రబుచ్చుతూ ఆకాశంవైపు చూసింది. కడవలతో వెలుగుని గుమ్మరిస్తున్న కామధేనువులా వున్నాడు చంద్రుడు.

తలలో మల్లెలు బరువుగా మూలిగాయి.

బాబు బుగ్గమీద పడ్డ సొట్ట ఇంద్రనీల్‌ని జ్ఞాపకం చేస్తోంది.

'ఎక్కడ పోగొట్టుకున్నాను ఆ అద్భుతమైన కాలం? ధారలుగా కురుస్తున్న ఈ వెన్నెల ఎడారిలో ఎంత దప్పికగా వుంది? ఎంత ఒంటరిగా వున్నాను! ఎందుకిలా చేశావూ?' ఆమె హృదయం ఆక్రోశించింది. ఒక కన్నీటిబొట్టు నేనున్నానంటూ ఆమెకి సాయం వచ్చింది.

క్రౌంచపక్షులు జంట లేకపోతే ఎందుకు మనలేవో ఆమెకి తెలిసినట్ల యింది. ఒంటరితనం శాపం... అనిపించింది.

❖ ❖ ❖

"నాకు ఇంత భయంకరమైన రోగం వుందన్న విషయం సుమతికి తెలుసా?" గిరి ఏడుస్తూ అడిగాడు.

ఇంద్రనీల్ ఆటోలో అతన్ని దగ్గరగా తీసుకుని, "ఇంకా నిర్ధారణ కాలేదు కనుక డాక్టర్ మీతో చెప్పద్దన్నాడు. కానీ నేనే మిగిలిన కాలమైనా మీ కుటుంబంతో మీరు మంచిగా మెలిగి, వాళ్ళకి మీ మంచిని కూడా కొంత గుర్తుగా మిగులుస్తారన్న ఉద్దేశంతో చెప్పాను" అన్నాడు.

గిరి వలవలా ఏడుస్తూ, "నాకు హెచ్.ఐ.వి. పాజిటివ్ వుందని సుమతికి తెలిస్తే నన్ను అసహ్యించుకుంటుంది. ఇంట్లోకి రానీయదు. ఇంతకాలం చెడుతిరుగుళ్ళు తిరిగినందుకు నన్ను కుక్కచావు చావ మంటుంది" అన్నాడు.

"అలా నీతో గడిపిన ప్రతి అమ్మాయీ అంటుందేమో కానీ, భార్య అనదు" అన్నాడు ఇంద్రనీల్.

ఆటో ఇంటిముందు ఆగింది.

సుమతి పాపని ఎత్తుకుని ఎదురు వచ్చింది.

ఇంద్రనీల్ డబ్బులిచ్చేసి వస్తుంటే, గిరి "సుమతీ... దూరంగా వుండు... పాపని కూడా దూరంగా తీసుకెళ్ళు... నాకు భయంకరమైన రోగం వచ్చింది" అన్నాడు.

"నాకు తెలుసు. మీకు ఏ రోగం వచ్చినా మీరు నా భర్తే. అలా మాట్లాడితే భరించలేను. రండి" అంటూ సుమతి చెయ్యిపట్టుకుని లోపలికి తీసుకెళ్ళింది.

ఇంద్రనీల్ సుమతికి సైగచేసి పాపని ఎత్తుకుని బయటికి వెళ్ళాడు.

"సుమతీ... నేను నీకు చాలా అన్యాయం చేశాను. ఇలా అర్ధాంతరంగా పోతున్నందుకు బాధగా వుంది. పోనీలే... నేను పోతేనైనా నువ్వు కాస్త మనశ్శాంతిగా వుంటావు. రోజుకో నరకం పెట్టిన దుర్మార్గుణ్ని. నీకూ, పాపకీ ఎప్పుడూ ప్రేమని పంచలేదు" అన్నాడు.

సుమతి అతని తల నిమిరి "మీకు ఏంకాదు. నా మాంగల్యం మీద నాకు నమ్మకం వుంది. నేను ఈరోజునుంచీ అరుంధతి వ్రతదీక్షతో సుమంగళీ వ్రతం చేస్తాను. మీరు మళ్ళీ ఇదివరకటిలా లేచి తిరుగుతారు. ఆఫీసుకి వెళతారు. మాతో ఆనందంగా కలిసి గడుపుతారని నా నమ్మకం" అంది.

"పిచ్చి సుమతీ! అది మహమ్మారి... ఆ రోగానికి మందే లేదు. చావుకోసం ఎదురుచూడటం కన్నా, ఇప్పుడే ప్రాణాలు తీసుకోవడం ఉత్తమం అనిపిస్తోంది" అన్నాడు.

సుమతి చటుక్కున అతని నోటికి తనచేయి అడ్డుపెట్టి "అంతలేసి మాటలనవద్దు. ఇంకా రిపోర్టు రానేలేదుగా, నేను సతీసావిత్రిలా ఆ యముడితో పోట్లాడైనా మిమ్ము దక్కించుకుంటాను" అంది.

గిరి కుమిలి కుమిలి ఏడుస్తూ "ఏ పాపమూ ఎరుగని నిన్ను లేనిపోని నిందలు వేసి ఏడిపించుకుని తిన్నాను. శీలవతివి కావంటూ విడిచి పెట్టేయాలని చూశాను. అందుకే ఇలా... పురుగులు పడిపోతున్నాను. నా పాపానికి ఇదే నాకు తగ్గ శిక్ష. నేను ఎక్కడికైనా పోయి దూరంగా చస్తాను. నీవూ, పాపా క్షేమంగా వుండటమే నాకు కావలసింది" అన్నాడు.



"నేను ఆనాటి సుమతిలా మిమ్మల్ని బుట్టలో పెట్టుకుని వేశ్యదగ్గరికి తీసుకెళ్ళే ఉదారత చూపించలేను గానీ... ఈనాటి సుమతిలా మిమ్మల్ని బుట్టలో పెట్టి ఆ ప్రాణాలు ఎవరూ తాకకుండా కాపాడుకుంటాను. చూస్తూ ఉండండి" అంది ధీమాగా.

"నీ పాదాలమీద పడటానికి కూడా అర్హత లేనివాడిని. నన్ను తాకకు... వెనుక వసారాలో పడి వుంటాను. అటు పాపనికూడా రానీయకు. పిచ్చితల్లి... దాన్ని ఎప్పుడూ ప్రేమగా దగ్గరకి కూడా తీసుకోలేదు. ఆడపిల్ల అంటూ ఛీత్కరించాను. ఆడది లేకపోతే అసలు నేనెలా ఈ భూమ్మీద కొచ్చానో ఒక్కసారి కూడా ఆలోచించలేకపోయాను" బాధగా అన్నాడు.

సుమతి అతడ్ని ఓదారుస్తూ కూర్చుంది.

ఇంద్రనీల్ వచ్చాక అతనితో సుమతి రహస్యంగా "నాటకం బానేవుంది కానీ... ఈ డిప్రెషన్‌లో ప్రాణం తీసుకుంటాడేమోనని భయంగా వుంది. ఇంక త్వరగా నాటకానికి తెరదించు" అంది.

"కాసేపుకూడా అతడు చేసిన పాపాలకి శిక్ష అనుభవించనియ్యరా? అందుకే అన్నారు మిమ్మల్ని..." అర్థోక్తిలో ఆపేశాడు.

"పనికిరాని ఆడవాళ్లనా?" అడిగింది సుమతి.

"కాదు... దేవతలని. దైవం ఎక్కడున్నాడో తెలీదు కాని తనకు మారుగా ప్రతిఇంట్లో ఒక ఇల్లాలిని వుంచిన అతనికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి" మనస్ఫూర్తిగా అన్నాడు.

"ఎంత చెడ్డా భర్తకదా! అతను అలా బాధపడుతుంటే చూడలేక పోతున్నాను" అంది.

ఇంద్రనీల్ గిరి దగ్గరికెళ్ళి "గిరీ... సాయంత్రం రిపోర్టులొస్తాయి. వాటిల్లో నీకు ఏ రోగమూ లేదనే రిజల్టు రావాలని భగవంతుడ్ని ప్రార్థించు. అంతకన్నా ఈ పరిస్థితుల్లో చేయగలిగింది ఏంలేదు. నీ భార్యచేసిన పుణ్యం.... ఆమె మంచితనం అడ్డుపడితే, అద్భుతం ఏదైనా జరిగి నీ ప్రాణం దక్కాలి. నీ స్థితి చూస్తే నాకూ బాధేస్తోంది. కాని ఈ స్థితికి కారకులెవరో ఆలోచించావా? స్వయంకృతాపరాధం కాదూ!

దేవతలాంటి భార్యని ఇంట్లో వుంచుకుని అడ్డమైన సరుకుకీ ఆశపడి చెడు తిరుగుళ్లు తిరిగావు. ఇంత సంపాదిస్తూ కూడా ఆమె తన పొట్టకోసం

అనేక పాట్లు పడేటట్లు చేశావు. అన్నిటికన్నా ఘోరాపరాధం ఆడపిల్లని కనద్దంటూ ఆంక్ష పెట్టావు. అక్కడ కొట్టింది నీకు స్త్రీ ఉసురు. స్త్రీ లేకపోతే ఈ సృష్టేలేదు. ఎన్నింటిని భరించీ, సహించీ నెగ్గుకొస్తోందో నువ్వు ఊహించనుకూడా లేవు. నువ్వు నిల్చున్న నేలని, సర్వసృష్టికీ మూలాన్ని స్త్రీరూపంగా తలచి పూజించే గడ్డపై పుట్టావు. చదువుకున్నవాడివి. నలుగురిలో తిరుగుతూ, నాగరీకంగా కనిపిస్తావు. నీలో యింత మూర్ఖత్వం నింపుకున్నదీ ఆ ముసుగులో నీ ఇష్టంవచ్చిన తప్పులు చెయ్యవచ్చనే కదూ?" అని అడిగాడు.

గిరి అప్పటికే చేతులమధ్యలో తలని దాచుకుని పశ్చాత్తాపంతో కుమిలిపోతూ కనిపించాడు.

"ఆడపిల్లని కన్నవాళ్ళు మనకి అప్పున్నవాళ్లు కాదు. వాళ్లని కాబూలీవాలా లా పట్టుకు వేధించటానికి! మన జీవితానికి సర్వసుఖాలూ ఇచ్చే కల్పతరువునే దానంచేసే దాతలు. వాళ్ళకి ఋణపడిపోయాం అని కృతజ్ఞత చూపాలి!" అన్నాడు వాడిగా ఇంద్రనీల్. అతని కళ్ళల్లో ఈ అల్లుళ్ళముందు చేయని నేరానికి శిక్ష అనుభవిస్తున్నట్లు తలవంచుకుని నిలబడే మావగారు కనిపించారు.

"ఈ జన్మకి సరిపడా పాపాలు చేశాను ఇంద్రనీల్. నిన్నుకూడా హేళన చేసి బాధపెట్టాను. అయినా నీ రక్తం నాకు దానం చేశావు. కనీసం నీ రక్తంలోని కొన్ని సుగుణాలైనా నాకు ఒంటబట్టే వుంటాయి. వచ్చే జన్మలో పాపాలు చేయను అని చెప్పడం అర్థంలేని పనైనా సరే అనాలనిపిస్తోంది" ఎదురుగా వున్న అమ్మవారి ఫోటోవైపు చూస్తూ అన్నాడు.

'ఇంక ఈ డోసు చాలు!' అన్నట్లుగా ఇంద్రనీల్ లేచి "వస్తా! సాయంత్రం రిపోర్ట్స్ తీసుకొస్తా.... అంతదాకా దైవధ్యానంలో మనసుని ప్రశాంతంగా వుంచుకోండి" అన్నాడు.

ఇంద్రనీల్ వెళ్ళిపోతుంటే సుమతి రెండుచేతులూ జోడించి దండం పెట్టింది.

అతను అనుకోకుండా ఆమె తలమీద చెయ్యివేసి మనసులో 'పిచ్చితల్లీ... ఎన్నేళ్ళుగా నరకం భరించావు' అనుకుని "వెళ్ళమ్మా... అతనికేం కావాలో చూడు!" అని వడివడిగా వెళ్ళిపోయాడు.



సాయంత్రందాకా గిరి తాను చచ్చిపోతే సుమతికి ఎక్కడెక్కడనుంచీ ఎంతెంత డబ్బు వస్తుందో లెక్కలు చెబుతూ, అవన్నీ వివరంగా డైరీలో రాస్తూ గడిపాడు.

"అబ్బా... మీరు చచ్చిపోరండీ... ఇవన్నీ ఇప్పుడొద్దు" భరించలేనట్లు అంది సుమతి.

"కనీసం ఈ పనైనా సక్రమంగా చేయనీ, నీకసలే లోకం తెలీదు" అన్నాడు గిరి.

అతను ముట్టుకోకుండా దూరంనుంచే సుమతినీ, పాపనీ కళ్ళనిండా చూసుకుంటూ కూర్చున్నాడు.

సాయంత్రం సుమతి తలారా స్నానం చేసి పట్టుచీర కట్టుకుని పూజ చేసింది. హారతి తీసుకుని భర్త దగ్గరకి వచ్చి "హారతి తీసుకోండి" అంది.

గిరి వణుకుతున్న చేతుల్తో హారతి తీసుకుని, "నాకు బతకాలని వుంది సుమతీ!" అని భోరుమన్నాడు.

'నా కడుపులో ప్రాణం పోసుకోవాలనుకున్న పసికందులు కూడా అలాగే అనుకుని వుంటాయి" అని నిట్టూర్చింది సుమతి.

"నువ్వు పూజించే ఆ దైవం నాకు జీవితాన్నిస్తే, మరో కొత్తజన్మ ఎత్తి నిన్నూ, పాపనీ నా కళ్ళల్లో పెట్టుకుని చూసుకుంటాను. నిన్ను బోలెడు సుఖపెట్టాలనుంది సుమతీ..." అని ఏడుస్తూనే అన్నాడు.

సుమతిమాత్రం మామూలుగానే వంట చేసింది.

గిరి ఇంద్రనీల్ రాకకోసం భయంతో, ఆతృతతో నిరీక్షిస్తూ కూర్చున్నాడు.

ఇంద్రనీల్ వచ్చాడు.

గిరి వాకిలిదాకా ఎదురెళ్ళి "ఏమైందీ? ఎందుకూ మౌనంగా వున్నావు? పాజిటివ్ అని వచ్చిందా? నేనింక బతకనా?" అని ఉద్విగ్నంగా ప్రశ్నించాడు.

"బతుకంటే ఏమిటో తెలిసిందిగా? ఇప్పుడు విను... నీకేం కాలేదు. నిక్షేపంగా వున్నావు. చిన్నచిన్న రోగాలేవో వున్నాయట. వాటికా డాక్టర్ మందులు రాసిచ్చాడు. నువ్వు ఇంకో అరవై ఏళ్లు నిండుగా బతుకుతావు.

ఈ బతుకు నీదికాదు. నీ భార్యాబిడ్డలది. వాళ్ళకోసం బతుకు, నీకోసం బతికిన బతుకు పర్యవసానం చూశావుగా" అన్నాడు.

"నిజంగానా! ఇంద్రనీల్ నువ్వు నా దేవుడివి" అమాంతం ఇంద్రనీల్‌ని కౌగలించుకుని అన్నాడు. ఆ తర్వాత పరిగెత్తుకుంటూ వెళ్ళి, ఆడుకుంటున్న పాపని ఎత్తుకుని ముద్దులు పెట్టుకుని "సుమతీ... సుమతీ... నీ పుణ్యం నన్ను రక్షించింది. నా ప్రాణానికేం ప్రమాదం లేదుట..." అని ఆనందభాష్పాలతో చెప్పాడు.

సుమతికి కూడా కళ్లు చెమర్చాయి. మృత్యువుదాకా వెళ్ళి తిరిగిరావడం అనేది అతను అనుభవించేశాడు. ఇది అతనికి నిజంగానే కొత్తజన్మ. ఈ జన్మనిచ్చింది మాత్రం ఇంద్రనీల్.

ఆమె ఆ పూట పరమాన్నం చేసి ఇంద్రనీల్‌ని బలవంతంగా భోజనానికి వుంచేసింది.

"అన్నదమ్ములు లేని లోటు తీర్చావు. నా ఇల్లు నిలబెట్టావు" అంది.

"నేను చేసే ఉద్యోగమే అదీ... హౌస్ కీపింగ్!" ఇంద్రనీల్ నవ్వాడు.

అతను సెలవు తీసుకుని వెళ్ళిపోతుంటే "నాలుగు రోజులుండి పోరాదా... నువ్వుంటే ఎంతో హాయిగా వుంది" అన్నాడు గిరి.

"ఇంకో ముఖ్యమైన పనుంది. అది కూడా పూర్తిచెయ్యాలి" అన్నాడు ఇంద్రనీల్.

"శక్తి ఎంత దురదృష్టవంతురాలు? నీవంటి వుత్తముడిని చెయ్యి జార్చుకుంది" అంది చెల్లెల్ని తలుచుకుని బాధగా సుమతి.

"ఆమె మాత్రమే కాదు... ఆమెని పోగొట్టుకున్న నేనూ దురదృష్ట వంతుడినే! వస్తా..." అని వెళ్ళిపోయాడు ఇంద్రనీల్.

గిరి అతను వెళ్ళినవైపు చూస్తూ నమస్కరించాడు.

❖ ❖ ❖

శక్తి బ్యాంక్‌నుంచి ఇంటికొచ్చేసరికి బాబుని ఎత్తుకుని ఆడిస్తూ కనిపించింది పార్వతమ్మ.

"బాబూ!" చేతులు జాపి పిలిచింది శక్తి.



వాడు శక్తిదగ్గరకి రావడానికి ఇష్టపడనట్లుగా ఆవిడ మెడని కావలించు కున్నాడు.

"ఏరా... నీకు మామ్మ వుంటే అమ్మ కూడా వద్దట్రా" నవ్వుతూ అంది శక్తి.

పార్వతమ్మ శక్తితో "మొహం, కాళ్ళూ చేతులూ కడుక్కునిరా, టిఫిన్ చేద్దువుగాని" అంది.

"ఎందుకు రోజూ శ్రమ పడతారూ? ఇదొక అదనపు బాధ్యత కాదూ!" అంది శక్తి.

"మా అబ్బాయికోసం ఎలాగూ చేస్తూనే వున్నాగా శక్తీ, అబ్బాయిలా నువ్వూ ఓ స్కూటీనో, టీవియస్సో కొనుక్కోకూడదూ! ఎంచక్కా బుర్రున ఆఫీసు వదలగానే వచ్చేయచ్చు" అంది పార్వతమ్మ.

"నేనూ అనుకుంటున్నాను కానీ నాకు నడపడం చేతకాదుగా!" అంది శక్తి ఆలోచనగా.

"అబ్బాయి నేర్పిస్తాడు. చురుకైన పిల్లవి. ఎంతలోకి వస్తుందీ?" అందావిడ.

విశ్వనాథ్ కూడా తల్లిని సపోర్ట్ చేస్తూ "వారంలో వచ్చేస్తుంది. సాయంత్రం ఓ గంట ఎదురుగుండా వున్న గ్రౌండ్‌లో నేర్చుకుంటే సరిపోతుంది" అన్నాడు.

అన్నప్రకారమే ఓ ఫ్రెండ్ టీవియస్ తీసుకొచ్చి రోజూ నేర్పించడం మొదలు పెట్టాడు.

మొదటిరోజు శక్తికి అతను నేర్పిస్తుంటే కాస్త యిబ్బందిగా అనిపించింది. రెండోరోజు అలవాటైపోయింది.

పార్వతమ్మ ద్వారా ఆమెకి అతని భార్య గాయత్రి విషయాలు కొన్ని తెలుస్తున్నాయి.

"గొప్పింటి పిల్ల. అబ్బురంగా పెరిగొచ్చిందని గారాబంగానే చూసే దాన్ని. వాడికీ గాయత్రంటే ప్రాణం. అలాంటిది ఆ పిల్ల అన్నింటికీ పేచీలే! వాడు ఎవరితో మాట్లాడినా అనుమానపడేది. నా కొడుకని చెప్పుకోవడం కాదుగానీ వాడు శ్రీరామచంద్రుడేనమ్మా. ఏనాడైనా నీతో

అవసరాన్ని మించి ఒక్కమాటైనా మాట్లాడాడా? అటువంటిది.... సింధు పుట్టాక విపరీతంగా ప్రవర్తించడం మొదలుపెట్టింది. మా తమ్ముడి కూతురు ఓసారి చూడటానికి వచ్చింది. గాయత్రి పుట్టింటికి వెళ్ళింది. మా చెల్లెలికి చాలా ప్రమాదంగా వుందని కబురొస్తే నేను శోకాలు పెడుతూ అటు పరుగెత్తాను. పాపం నా మేనకోడలు వంటచేసి బావ వస్తే వడ్డిస్తోందిట. ఇంతలో గాయత్రి వచ్చింది. 'ఒంటరిగా కులుకుతున్నారా? ఎన్నాళ్ళనుంచి సాగుతోందీ వ్యవహారం?' అంటూ దాన్ని అనరాని మాటలంటుంటే వీడు సహించలేక 'నోర్ముయ్' అంటూ ఒక్కదెబ్బ వేశాడట. దాంతో రెచ్చిపోయి, వాళ్లనాన్నని పిలిపించి పంచాయితీ పెట్టించింది.

నన్ను వదిలేసి వాణ్ని ఇల్లరికం రమ్మన్నారు. వీడు ఒప్పుకోలేదు. దాంతో మాటామాటా పెరిగిపోయింది. 'నా పాపని నాకు ఇచ్చెయ్... అన్నాడు వీడు. 'తీసుకో... నా కూతురికి ఇంకో పెళ్ళి చెయ్యాలంటే అనవసరమైన అడ్డంకి' అంటూ ఆ పసిదాన్ని నా ఒడిలో పడేసి కూతుర్ని తీసుకుపోయాడమ్మా' ఆ తండ్రి" అని ఆవిడ కన్నీళ్ళు పెట్టుకుంది.

కడుపున పుట్టినబిడ్డని కూడా వదిలేసుకోగలిగిందా ఆమె! అని శక్తికి ఆశ్చర్యం వేసింది.

విశ్వనాథ్‌లో ఆమెకి పట్టుకుందామన్నా లోపం కనిపించలేదు. మరి గాయత్రికి విడిచిపెట్టేంతగా ఎందుకు మనసు విరిగిపోయిందో!

మనసు విరిగిపోతేనే విడిచిపెట్టేస్తారా? తనకి ఇంద్రనీల్ గుర్తుకిరాని రోజు వుందా? మనసు నిలదీసింది. తనూ గాయత్రిలాగే... అన్న ఆలోచన వచ్చినా 'ఛీ! ఆమెలా నిరాధారంగా నేనేం అనుమానించలేదు. అతను రెడ్‌హాండెడ్‌గా నాకు చిక్కాడు...!' అని సర్ది చెప్పుకుంది.

శక్తికి డ్రైవింగ్ నేర్పడమే కాదు. కొత్తబండి కొని, లైసెన్స్‌కి అప్లయ్ చేయించడం వరకూ అన్నీ విశ్వనాథే చూసుకున్నాడు. ఇప్పుడామెకి అతనితో కాస్త చనువు పెరిగింది. తనకి ఎన్నో విధాల సాయపడుతున్న ఆ తల్లీ కొడుకులకి ఏదైనా ప్రజెంట్ చెయ్యాలనిపించింది. ఓ మంచి జరీచీర కొంది. విశ్వనాథ్‌కోసం ఓ మూడు అరలున్న హాట్‌ప్యాక్ కొంది.



అతను రోజూ మామూలు స్టీలుక్యారేజీ తీసుకురావడం ఆమె గమనించింది.

పార్వతమ్మకి చీరపెట్టి కాళ్ళకి నమస్కారం పెట్టింది.

"ఎందుకమ్మా... ఇవన్నీ పెడితేనే ప్రేమ వున్నట్లా?" పొంగిపోతూనే అడిగిందావిడ.

"ఏదో నా సంతోషం" అంది శక్తి.

గోపాలరావు ఆవిడతో "శక్తి జీవితం బాగుపడాలని దీవించండమ్మా" అన్నాడు.

"ఏం? నా జీవితానికేం అయిందీ?" కస్సుమంది శక్తి.

ఆయన మాట్లాడకుండా అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

ఆయన బాధ తెలిసిన పార్వతమ్మ నిట్టూర్చింది.

విశ్వనాథ్ మేడమీద వున్నాడని తెలిసి శక్తికూడా గిఫ్ట్‌ప్యాక్ పట్టుకుని మేడపైకి వెళ్ళింది.

విశ్వనాథ్ సిగరెట్ కాలుస్తూ పచార్లు చేస్తున్నాడు.

"హాయ్... ఏకాంతానికి భంగం కలిగించానా?" నవ్వుతూ పలకరించింది శక్తి.

అతను ఆమెని చూసి మౌనంగా వూరుకున్నాడు.

"ఏదో సీరియస్‌గా ఆలోచిస్తున్నట్లున్నారు?" అంది.

అతను మాట్లాడలేదు.

"నేను వెళ్ళి కాసేపయ్యాక మళ్ళీ రానా?" అడిగింది.

విశ్వనాథ్ మూడ్ బాగోలేదని శక్తికి అర్థమైంది.

"బాధ దాచుకుంటే పెరుగుతుంది. పంచుకుంటే తరుగుతుంది" అంది అనునయంగా.

అతను సిగరెట్ పారేసి, ఆకాశంవైపు చూస్తూ "ఈరోజు మా పెళ్ళిరోజు" అన్నాడు.

శక్తి కళ్ళు పెద్దవిచేసి 'అలాగా' అన్నట్లు చూసింది.

"తనకి నేను గుర్తురాకపోతే సరే! పసిది ఆ సింధు కూడా గుర్తురాదా?" మధనగా అన్నాడు.

"ఇది మీ పర్సనల్ అనుకోండి. అయినా ఫ్రెండ్‌గా అడుగుతున్నాను. ఐదేళ్ళనుంచీ ఇద్దరూ వేరే పెళ్ళిళ్ళు చేసుకోవడంలాంటివి చెయ్యలేదంటే ఇంకా మీ మనసులో ఏమూలో కలవాలన్న తలంపు వుందనే నా అభిప్రాయం. ఒకసారి ఈగో పక్కనపెట్టి పలకరించకూడదూ... అదీ ఇలాంటి అకేషన్‌లో అయితే ఇంకా బాగుంటుంది" అంది.

అతను బరువుగా నిట్టూర్చాడు.

"ఈ ఐదేళ్ళలో చాలాసార్లు ఆ ప్రయత్నం చేశాను. పాపని తీసుకెళ్ళి చూపించానుకూడా. అమ్మని వదిలేసి రమ్మంటుంది. ఈ వయసులో నిరాధారంగా ఆవిడని ఎలా వదిలేస్తాను చెప్పు? పాప కావాలంటే ఓసారి వాళ్ళింట్లో వదిలిపెట్టి వచ్చాను. దానికి తెల్లారేటప్పటికే అమ్మమీద బెంగతో జ్వరం వచ్చింది. తీసుకొచ్చి దింపి నానా మాటలూ అని పోయారు. ఇంకా ఏం ప్రయత్నం చెయ్యనూ... నా మొహం" అన్నాడు.

శక్తి దగ్గరకెళ్ళి "ఈ సాయంత్రం మళ్ళీ ఓసారి ఫ్రెష్‌గా ప్రయత్నం చెయ్యండి. మీరు ఒంటరిగా ఈ డాబామీద అనుభవిస్తున్న బాధలాంటిదే ఆమెకూడా అక్కడ అనుభవిస్తూ వుంటుందని నా నమ్మకం. అందులోనూ ఇలాంటి రోజులు మరవాలనుకున్నా మరపుకి రావు" అంది.

"ఆల్‌రైట్... నీ మాటమీద వెళ్ళి చూస్తాను" అన్నాడు.

"థాంక్యూ... ఆ! విశ్వం, నీకోసం ఈ గిఫ్ట్ తెచ్చాను తీసుకో!" అందించింది.

"ఎందుకు శక్తీ! అంతకన్నా విలువైన స్నేహాన్ని ఇస్తూనే వున్నావుగా..." అంటూ అందుకున్నాడు.

విశ్వనాథ్ వెళ్ళిపోయాక శక్తి ఒంటరిగా డాబామీద మిగిలిపోయింది. ఆమెకి తన పెళ్ళిరోజు గుర్తొచ్చింది. ఇంద్రనీల్‌తో గిల్లికజ్జాలూ, అలకలూ, సరసాలూ, సాధింపులూ, పోట్లాటలూ, రాజీపడటాలూ... ఇవేమీ లేకుండా నిస్సారంగా బతకడం ఎంత బాధాకరం? సారంలేని ఈ బతుకుని ఏమంటారో గానీ... ఆ జీవితాన్ని మాత్రం 'సంసారం' చేయడం అంటారు. ఆమెకి మెడకింద వెచ్చగా తగిలేవరకూ తనకు కన్నీళ్ళు కారుతున్నట్లు తెలియనేలేదు.



స్కూటర్ చప్పుడైతే చాలు... విశ్వనాథ్ వస్తాడనీ, సంతోషకరమైన వార్త చెప్తాడనీ ఎదురుచూస్తూ కూర్చుంది.

అతను ఆ రాత్రి రానేలేదు.

❖ ❖ ❖

శక్తి బ్యాంక్‌కి వెళ్ళడానికి తయారవుతూ వుండగా "శక్తీ... శక్తీ" అంటూ విశ్వనాథ్ ఆమె వాటాలోకి వచ్చాడు.

బాబుని ఎత్తుకున్న గోపాలరావు ఆశ్చర్యంగా చూస్తూ వుండగానే, అతను ఆమె వున్న గదిలోకి వెళ్ళి చేతిలో వున్న స్వీట్ బాక్స్‌లోంచి ఓ స్వీట్ తీసి "నోరు తెరూ" అన్నాడు.

శక్తి ఆనందంగా "గాయత్రి వచ్చిందా?" అని అడిగింది.

"ముందు నోరు తెరు...ఆ!" అంటూ అతను స్వీట్ ఆమెనోట్లో పెట్టాడు.

"అబ్బా! సస్పెన్స్‌తో చంపక చెప్పు బాబూ!" అంది శక్తి.

"నువ్వు కరెక్ట్‌గానే గెస్ చేశావు శక్తీ! నేను వెళ్ళేసరికి గాయత్రి ఒక్కతే వాళ్ళ డాబామీద కూర్చొని వుంది. ఆమెచేతిలో మా పెళ్ళిఫోటోల ఆల్బమ్ వుంది. కాస్సేపు బింకంగా మాట్లాడినా, తర్వాత నన్ను పట్టుకుని ఏడ్చేసింది. పాపని చూడాలనంటే ఇప్పుడే స్కూల్‌కి తీసుకెళ్ళి చూపించి మళ్ళీ వాళ్ళ ఇంటిదగ్గర దిగబెట్టి ఇటొస్తున్నాను" అన్నాడు.

"మళ్ళీ వాళ్ళ ఇంటిదగ్గర దిగబెట్టడం ఎందుకూ? ఇక్కడికి తీసుకొస్తే అమ్మగారు సంతోషించేవారుగా!" అంది.

"ఈరోజు మంచిరోజు కాదుట. ఆదివారం వస్తానంది" అన్నాడు.

"ఎనీ హౌ... ఐయామ్ వెరీ హేపీ!" అంది మనఃస్ఫూర్తిగా శక్తి.

"అమ్మకి కూడా చెప్పాలి. అసలే రాత్రంతా కంగారుపడి వుంటుంది" అని వెళ్ళిపోయాడు.

గోపాలరావు లోపలికి ఇచ్చి "ఏమంటాడూ?" అని అడిగాడు.

శక్తి నోట్లో స్వీట్ వుండటంతో చెప్పడానికి కాస్త టైం పట్టింది.

అంతలోనే ఆయన "ఎవరైనా ఏమనుకుంటారూ? సరాసరి లోపలి కొచ్చి నోట్లో స్వీట్ పెడతాడా? ఛీ! మంచివాడనుకున్నాను ఇన్నాళ్ళూ" అన్నాడు.

"నాన్నా!!" అంది నిశ్చేష్టురాలైన శక్తి.

"ఏమీ లేకపోతే తన ఇంట్లోకే ఎందుకు తెచ్చి పెట్టుకుంటాడూ? బండి నడపడం ఎందుకు నేర్పిస్తాడూ అని లోకం అనుకోదూ!" కోపంగా అన్నాడాయన.

శక్తికూడా కోపంగా "నా గురించి నువ్వేనా ఇలా మాట్లాడుతున్నదీ?" అంది.

"ఏం? అనుమానించడం, అపార్థాలు చేసుకోవడం నీ ఒక్కదానికే చేతనవునా?" ఇంకా కోపంగా అడిగాడు.

తండ్రి తనతో ఇలా మాట్లాడటం ఎన్నడూ అలవాటులేని శక్తి కొయ్యలా నిలబడి చూస్తుండిపోయింది.

"ఒక మగాడు నీకు అన్నివిధాలా ఆసరా అవుతూ సహాయాలు చేస్తుంటే తప్పులేదు. పైగా ఎవరూ అనుమానించకూడదు. కానీ నీకు మాత్రం అనుమానించి అవతలి మనిషి చెప్పేది వినిపించుకునేపాటి సహనం కూడా లేదు! నువ్వేం చేస్తున్నావో ఒకసారి నువ్వే తీరిగ్గా ఆలోచించుకో" అని తండ్రి వాకిట్లోకి వెళ్ళిపోయాడు.

శక్తి దిగ్భ్రమగా చూస్తుండిపోయింది.

"శక్తీ... శక్తీ..." అన్న పార్వతమ్మగారి పిలుపు వినిపించి ఆవిడ వాటాలోకి వెళ్ళింది.

"విన్నావా తల్లీ... గాయత్రి వస్తోందట" ఆవిడ సంతోషంగా చెప్పింది.

"ఔను! విన్నాను. చాలా సంతోషం. నాకు టైం అవుతోంది. వెళ్ళొస్తానండీ" అని శక్తి తన ఇంట్లోకి వచ్చి బ్యాగ్ తీసుకుని వెళ్ళిపోయింది.

❖ ❖ ❖

సెంటర్లోని ఆ బట్టల దుకాణం చాలా రష్‌గా వుంది. ఇంద్రనీల్ కళ్ళకి వున్న కూలింగ్ గ్లాసెస్ తీసి షాప్ ఓనర్ని అడిగాడు.

"ఇక్కడ చందూ అనే కుర్రాడు కొత్తగా చేరాడట. ఓసారి పిలుస్తారా?"

"అలాగే సార్" అని అతను ఓకుర్రాడితో చందూకి కబురు పెట్టాడు.



ఇంద్రనీల్ ఆయనతో "అతను నాకు చాలా దగ్గరవాళ్ళ అబ్బాయి. ఓసారి బయటికి పంపిస్తారా?" అని అడిగాడు.

ఆయన తల నిమురుకుంటూ "చాలా రష్‌గా వుంది. చూశారుగా ఎంత బిజీ టైమో!" అన్నాడు.

"వాళ్ళ మదర్‌కి సీరియస్‌గా వుంది" చెప్పాడు ఇంద్రనీల్.

ఆలోచించి "సరే" అన్నాడాయన.

ఇంతలో ఓ పొడవాటి కుర్రాడు బిక్కమొహం వేసుకుని వచ్చి "బాబాయ్... మీరా?" అన్నాడు.

"పద... నీతో పనుంది" చందూ భుజంమీద చెయ్యివేసి బైటికి నడిపించాడు ఇంద్రనీల్.

చందూ నాలుగు అడుగులు వేసి "నేను ఆ ఇంటికి రాను బాబాయ్. అంతకన్నా నరకం నయం" అన్నాడు.

ఇంద్రనీల్ నవ్వి "నరకం ఎప్పుడు చూశావు?" అన్నాడు.

చందు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"అమ్మకోసం కూడా రావా? నీకోసం బెంగపడి మంచంపట్టింది" అన్నాడు.

చందూ తలెత్తి "మరి... మరి... ఆరోజు నాన్న నన్ను కొడుతుంటే నన్నే తిట్టిందిగా! ఆవిడా ఆయన పార్టీయే. పిల్లల్నీ, పెళ్ళాన్నీ మా నాన్న తన పనివాళ్ళలా చూస్తాడు. ఆయన సొమ్ముతో చదువుకోవడం కంటే... ఇలా పనిచేసుకుని ఒక్కపూట తిన్నా మేలు" అన్నాడు.

ఇంద్రనీల్‌కి అరుంధతి మొహం జ్ఞాపకం వచ్చింది. పెద్దబొట్టు పెట్టుకుని, తలనిండా పూలు పెట్టుకుని ఏడొచ్చి ఎటుపోయినా తన సౌభాగ్యాన్ని మాత్రం కాపాడుకుంటుంది. సంతానంగురించి పెద్దగా పట్టించుకోదు. పెద్దకొడుకు ఇల్లు వదిలేసి పారిపోయాక కళ్ళు తెరుచుకుని లబలబలాడుతూ ఇంద్రనీల్ కనిపిస్తే, కొడుకుని వెతికిపెట్టమని ఏడ్చింది.

"మీ నాన్నవల్ల జీవితంలో అందరికన్నా కష్టపడింది మీ అమ్మ. అసహాయురాలు కాబట్టి ఆ అవమానాలు సహిస్తూ మీకోసం అక్కడ పడివుంది. మొగుళ్ళంటే అంటారూ, కొడ్తారూ... అదే కాపురం చేయడం

అనుకుందా అమాయకురాలు. ఇప్పుడు మీరు పెద్దయ్యారు. లోకం చూస్తున్నారు. మీ నాన్నకి బుద్ధిచెప్పి మీ అమ్మని సుఖపెట్టాల్సిందిపోయి, ఇంకా మనస్తాపం తెచ్చే పనులు చేస్తావా? తప్పుకదూ?" అని ఘందలించాడు.

"ఆయనకి ఎవరేం చెప్పినా బుద్ధిరాదు. అమ్మని ఇప్పటికీ అనరాని మాటలంటాడు. ఒంగదీసి వీపుమీద బెల్టుదెబ్బలు కొడతాడు. అడ్డు పడ్డానని ఒకసారి నన్నూ చచ్చేట్లు కొట్టాడు. అమ్మకూడా నన్నే తిట్టింది. ఇంకా ఆ ఇంట్లో వుండాలంటారా?" ఉద్రేకంగా అడిగాడు చందు.

"అందుకని నీ సుఖం నువ్వు చూసుకుని అమ్మనీ, తమ్ముళ్ళనీ వదిలేసి వచ్చేస్తావా?"

"వాళ్ళు నాతో రమ్మంటే వస్తారా?"

"అడిగి చూశావా?"

"అమ్మ ఒక్కనాటికీ ఒప్పుకోదు. చావైనా బతుకైనా ఆ ఇంట్లోనే, ఆయనతోనే అని డిసైడ్ అయిపోయింది."

"ఎదుటివాళ్ళు చెప్పేది వినకుండా మొండిగా మీ శక్తి పిన్నిలా వాదించకు! అమ్మని వదిలిపెట్టి రావడం బుద్ధున్నవాళ్ళు చేసే పనికాదు" కఠినంగా అన్నాడు ఇంద్రనీల్.

"నేను ఇక్కడ వున్నట్లు ఎలా తెలిసింది?"

"ఇందద్రనీల్ తలచుకుంటే తెలుసుకోలేని సంగతులేవీ వుండవు. నీ క్లోజ్ ఫ్రెండ్స్‌ని పట్టుకుని రాబట్టాను గానీ... పద ఇంటికి పోదాం"

"ఆ ఇంటికా?"

"ఒద్దు! మా ఇంటికిరా. అమ్మనీ తమ్ముళ్ళనీ కూడా తీసుకుని రా."

"నాన్న వూరుకుంటాడా?"

"ఊరుకోకూడదు. అందుకేగా ఈ ప్లాను."

"పద చెప్తాను" అతని భుజంమీద చెయ్యివేసి స్కూటర్ దగ్గరకి తీసుకెళ్ళి "ఎక్కు" అన్నాడు ఇంద్రనీల్.

చందు మాట్లాడకుండా ఎక్కి కూర్చున్నాడు.

❖ ❖ ❖



శంకర్ మండిపడిపోతున్నాడు. కోపంతో ముక్కుపుటాలు ఎగిరెగిరిపడు తున్నాయి. అటూ ఇటూ బోన్లో పులి తిరుగుతున్నట్లుగా పచార్లు చేస్తున్నాడు.

అతని ఎదురుగా కూర్చుని పచార్లు ఆపితే మాట్లాడాలని చూస్తున్నాడు ఇంద్రనీల్.

ఇంతలో శంకర్ కోపంగా "వాళ్ళ వంశమే అలాంటిది. నీతి జాతీ లేని వంశం. ఛీ! సిగ్గులేకుండా ఉత్తరంకూడా రాసిపెట్టిపోయింది. పైగా ముగ్గురి పిల్లలతో" అని అరిచాడు.

ఇంద్రనీల్ శాంతంగా "ఏవని రాసిందీ?" అన్నాడు.

"నా నోటితో ఎలా చెప్పనూ? ఛీ.. ఆ సిగ్గులేని రాతను నువ్వే చదువుకో... చదివీ, తీసుకెళ్ళి ఆ ముసలాడి మొహాన కొట్టు. తన కూతుళ్ళ గొప్పదనానికి మురిసి ముక్కలై ఛస్తాడు" అని ఉత్తరం ఇంద్రనీల్ మీదకి విసిరాడు.

ఇంద్రనీల్ అతనికి కనపడకుండా చిన్నగా నవ్వుకుని ఉత్తరం పైకే చదవసాగాడు.

"శ్రీవారికి... ఇన్నేళ్ళ కాపురం చేసినా మీకు ఎప్పుడూ నా శీలంమీద నమ్మకం కలిగించలేకపోయాను. ఎంత నిప్పులా వున్నా మీరు నిప్పుతొక్కిన కోతిలా నామీద ఎగిరి తంతూనే వున్నారు. నాకు జీవితంమీద విరక్తి పుట్టింది. చచ్చిపోదామని నిర్ణయించుకుని నా కమల్‌కి ఇష్టమైన ఎర్రచీర కట్టుకుని వెళ్ళి చెరువులో దూకబోయాను. నన్ను ఎవరో పట్టి ఆపారు. ఎవరా అని చూద్దును గదా. నా కళ్ళని నేనే నమ్మలేకపోయాను. అతను నా కమల్!

"అరూ... ఏం కష్టమొచ్చిందని ఇంతకు తెగించావు? నేను సమయానికి వచ్చి కాపాడుకోబట్టి సరిపోయింది కానీ" అన్నాడు.

నేను ఏడుస్తూ నా దుఃఖమయిన గాథ చెప్పాను. మీ విలనిజానికి అతను మండిపడి నా పరిస్థితికి కన్నీరు కార్చాడు. వెంటనే "అరూ... ఆ జీవితాన్ని అద్దంమీద పిచికరెట్టని తుడిచిపారేసినట్లు తుడిచిపారేయ్... నాతో కొత్త జీవితాన్ని ప్రారంభించు" అన్నాడు.

ఇంద్రనీల్ చదువుతుంటే వింటున్న శంకర్ కసిగా "నాతో జీవితం పిచికరెట్టా? మరి ఆ రెట్టమరకల్లాంటి పిల్లలో?" అన్నాడు.

ఇంద్రనీల్ ఆగమని అతనికి సైగచేసి చదవడం కొనసాగిస్తూ "నీ పిల్లలూ నీతోబాటే నా సొంతం అవుతారు. నువ్వు మానసికంగా ఎప్పుడూ నా దానివే అరూ..." అన్నాడు.

నేను ఒక్కక్షణం ఆలోచించాను. మంగళసూత్రం ఉరితాడులా అడ్డుపడి 'వెళ్ళొద్దు... నువ్వు భారత స్త్రీవి' అంది. కానీ ప్రేమపాశం వెంటనే పూలహారంలా పలకరించి వెళ్ళిపో! ఈ అనుమానపు మొగుడితో ఎన్నేళ్ళు కాపురం చేసినా వాతలూ, తిట్లూ తప్ప ఒక్క ప్రియమైన పలకరింపా, సరదానా... ఛో!' అంది.

శంకర్ ఎగిరిపడుతూ "బోడి స్పెషల్ ఎఫెక్ట్లొకటీ! అందుకే ఈ ఆడాళ్ళకి సినిమాలు చూపించకూడదు" అన్నాడు.

ఇంద్రనీల్ నవ్వుకుని "చివరికి వెళ్ళిపోవడానికి నిశ్చయించుకున్నాను. ఈ పదిహేనేళ్ల కాపురంలో నేను ఓ చల్లని మాటకీ, సున్నితమైన పలకరింపుకీ కూడా మొహం వాచిపోయానేమో... ఆలస్యం చెయ్యకుండా ఆటోలో ఇంటికొచ్చి ఈ ఉత్తరం రాసిపెట్టి, పిల్లల్ని తీసుకుని వెళ్ళిపోతున్నాను.

'పెళ్ళాం లేచిపోయింది' అనే ఈ అపఖ్యాతి రేపటినుంచీ ఎలా భరిస్తారో అన్న విషయం తలుచుకుంటుంటే కడుపు చెరువౌతోంది. కానీ మీలాంటి భర్తలకి ఇటువంటి పరిస్థితి ఎప్పుడో ఒకప్పుడు తప్పదు కాబట్టి భరించండి.

వెళ్ళిపోయే ముందు చివరిగా ఒక్కమాట... ఈసారి మళ్ళీ పెళ్ళాడితే ఆ అమ్మాయికి మీ తిట్లు వినపించకుండా చెవిటీ, మీకు ఎదురు చెప్పకుండా మూగా, ఎవడ్నీ చూడకుండా గుడ్డీ, మీరెంత బాధపెట్టినా తెలియకుండా పిచ్చీ వున్నదాన్ని చూసి చేసుకోండి.

సెలవు.

ఒకప్పటి మీ భార్య
అరుంధతి వ్రాలు.



ఇంద్రనీల్ చదవడం ఆపగానే, శంకర్ జుట్టు పీక్కుంటూ "ఈ వయసులో... అదీ ముగ్గురు పిల్లలతో లేచిపోవడం... ఏమిటయ్యా ఇదీ? ఇదెక్కడైనా విన్నావా?" అన్నాడు.

ఇంద్రనీల్ వాడిగా "పాలవాడితో మాట్లాడినా, కూరలవాడికేసి చూసినా, కాస్త శుభ్రంగా తయారయినా, ఇష్టమైన వంటచేసినా అనుమానించి సాధించి, ఆమె ఇంతకు తెగించేదాకా తెచ్చారు. మీరు సరిగ్గా చూసుకునుంటే ఆ కమల్‌తో వచ్చీరాని వయసులో సాగించిన వన్‌వే ట్రాఫిక్ ప్రేమని ఆవిడ ఎప్పుడో అద్దంమీద మరకలా తుడిచి పారేసేది. కానీ ఆవిణ్ణి మరిచిపోనీకుండా మీరు గుచ్చిగుచ్చి అనుక్షణం గుర్తుచేస్తూనే వున్నారు. చివరికి తాను శీలవతి అని ఎటూ నిరూపించుకోలేదు గనుక... శీలం గూట్లో పెట్టి ఆ కమల్‌తో వెళ్ళిపోయింది. తప్పెవరిదంటారూ? ఓసారి ఆలోచించండి" అన్నాడు.

శంకర్ ఎటూ చెప్పలేక దిక్కులు చూశాడు. అనవసరంగా అరుంధతిని తను తిట్టడం, కొట్టడం అతని కళ్ళల్లో మెదిలింది.

"ఇప్పటికైనా మించిపోయిందిలేదు. మీరెళ్ళి ఈ విషయం నలుగురికీ తెలిసేలోపే ఆవిడ కాళ్ళో, గడ్డమో పట్టుకుని బతిమాలి తీసుకొచ్చేయండి. లేకపోతే రేపటినుంచీ తలెత్తుకుని తిరగలేరు. లోకం కుళ్లబొడిచి చంపుతుంది. ఆ తర్వాత మీ యిష్టం" అన్నాడు ఇంద్రనీల్.

"బావుంది... నేనెళ్ళి దాని కాళ్ళు పట్టుకోవాలా?" కస్సుమన్నాడు శంకర్.

"మరీ! అవసరం మీది. లేకపోతే ఇంకోమార్గం వుంది" అన్నాడు.

"ఏమిటీ?" ఆశగా అడిగాడు శంకర్.

"మీరు ముక్కు మూసుకుని ఏ నుయ్యో గొయ్యో చూసుకోవడం" తాపీగా చెప్పాడు.

"ఆ!!"

"మరి చెపుతుంటే వినరేం? ఇంకా కలకత్తా వెళ్ళే రైలు బయల్దేరి వుండదు. త్వరగా పదండి" తొందరపెడుతూ అన్నాడు.

శంకర్ విధిలేక అతనివెంట నడిచాడు.

అతను ఇంటికి తాళం పెట్టబోతుండగా ఆటోవచ్చి ఆగింది. అందులో నుంచి పెద్దకొడుకు చందూ దిగాడు.

"నాన్నా... అమ్మ నీకు ఆఖరి అవకాశం ఇవ్వడంకోసం ఈ అగ్రిమెంట్ పంపించింది. ఇందులో వున్నవన్నీ సమ్మతమైతే నిన్ను సంతకం పెట్టి ఇవ్వమంది. అప్పుడు మేం కమల్‌గారితో వెళ్ళకుండా వెనక్కొచ్చేస్తాం!" అంటూ ఒక కాయితం మడతవిప్పి, "నువ్వు చదువు బాబాయ్..." అని ఇంద్రనీల్‌కి యిచ్చాడు.

"దొంగముండ! ఏం రాసిందో త్వరగా చదువు" అన్నాడు పళ్ళు కొరుకుతూ శంకర్.

"ఒకటి... నన్ను ఇప్పటినుంచీ ఒక్క తిట్టుకూడా తిట్టకూడదు. కనీసం నోర్ముయ్... అవతలికి పో" అని కూడా అనకూడదు.

రెండు... చెయ్యి చేసుకోవడం కాదుగదా... నా ఇష్టంలేకుండా నన్ను తాకను కూడా తాకకూడదు.

మూడు... జీతం మొత్తం తెచ్చి నా చేతిలో పెట్టాలి. నేను వారానికి పదిరూపాయల చొప్పున లెక్కగట్టి నీ సొదరుకి ఇస్తాను.

నాలుగు... మీ బంధువులెవరూ మన ఇంటికి రాకూడదు. మా వైపు బంధువులొస్తే మీరు నోరెత్తకూడదు. నేను రెండుసార్లు దగ్గగానే మాటలాపేసి అక్కడినుంచి వెళ్ళిపోవాలి.

ఐదు... పిల్లల్ని తిట్టడం కానీ, కొట్టడంకానీ చేస్తే వెయ్యి గుంజీలు తియ్యాలి.

ఆరు... మా నాన్నగారిని సంవత్సరానికి ఆర్నెల్లు మన యింట్లో వుంచుకుని కన్నతండ్రిని చూసినట్లు చూడాలి.

ఏడు... నా పర్సనల్ విషయాల్లో తల దూర్చకూడదు. నా ఇష్టమైన హీరోల సినిమాలు నా ఇష్టమొచ్చినన్నిసార్లు నన్ను చూడనివ్వాలి.

మీకు అంగీకారమైతే అరుంధతీ శంకర్‌గా మీ ఇంటికొస్తాను. లేదా అరుంధతీకమల్‌గా కలకత్తా వెళ్ళిపోతాను."

"చూశావా దాని పొగరు?" రంకెలు వేశాడు శంకర్.



ఇంద్రనీల్ భయంగా చుట్టూ చూస్తూ "అరవకయ్యా మొగడా... త్వరగా ఇంటిగుట్టు రట్టవకముందే సంతకంపెట్టు.... ఊ..." అని పెన్ అందించాడు.

శంకర్ కోపం దిగమింగుకుని సంతకం పెట్టి "ఎప్పుడొస్తారట ఆవిడా?" అన్నాడు.

"ఇప్పుడే... ఆటోలోనే వుంది" అని, "అమ్మా! నాన్న ఎగ్రిమెంట్‌మీద సంతకం పెట్టాడు దిగు" అని అరిచాడు చందు.

అరుంధతి ఆటోలోంచి సూట్‌కేస్‌తో దిగింది. పిల్లలుకూడా బెలూన్లతో, బిస్కెట్ పాకెట్లతో దిగి "అయితే మనం కలకత్తా వెళ్ళడం లేదా?" అని అడిగారు.

"ఇంక కలకత్తా అక్కర్లేదు. కలకత్తా కాళి ఇహనుంచీ మన ఇంట్లో వుంటుంది దుష్టసంహారం చెయ్యడానికి!" అంటూ భర్తని ఓ చూపు చూసి లోపలికి నడిచింది అరుంధతి.

శంకర్ ఏదో అనబోయి ఎగ్రిమెంట్‌వంక చూసి తలవంచుకున్నాడు.

ఇంద్రనీల్ లోపలికెళ్ళి "వదినా... ఇంక వెళ్ళిరానా! ఈ రోజుకింక హౌరా మెయిల్ మిస్సయినట్లేనా?" అన్నాడు.

"ఔరా! మా మరిది ఎంత ఘటికుడో కదా!" అని చిన్నగా నవ్వింది అరుంధతి.

చందూ అగ్రిమెంట్ పేపర్లు తండ్రిముందు ఊపుతూ లోపలికి విలాసంగా నడిచాడు.

శంకర్‌మాత్రం భార్య ఈ వయసులో లేచిపోనందుకు సంతోషించాడు.

ఇంద్రనీల్ ఎక్కడున్నాడో కూడా తెలీని కమల్‌కి, తమ నాటకంలోకి పనికి వచ్చినందుకు మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

❖ ❖ ❖

శక్తి లంచ్ చేస్తుండగా ప్యూన్ వచ్చి చెప్పాడు "మీకోసం ఎవరో అమ్మాయి వచ్చింది మేడం" అని.

"నా కోసమా! సరే... కూర్చోమను" అని శక్తి బాక్స్‌మూత మూసి బయటికి వెళ్ళింది.

అక్కడున్న సోఫాలో కూర్చుని కుండీలోని ఇన్‌డోర్ ప్లాంట్ ఆకుల్ని తడిమిచూస్తున్న అమ్మాయి శక్తిని చూడగానే లేచి నిలబడింది. శక్తికి ఆమెని పోల్చుకోవడానికి ఒక్కక్షణం పట్టింది అంతే!

ఆ అమ్మాయి అందంగా, నాజూగ్గా వుంది. జీన్స్, టీ షర్టులతో జుట్టు పైకి దువ్వి నడినెత్తిన ముడేసి దానిచుట్టూ పూసలతో అమర్చిన బ్యాండ్‌పెట్టింది. నుదుటిన పాములా మెలికలు తిరిగినట్లున్న స్టిక్కర్ బొట్టు పెట్టింది. చేతులకీ, చెవులకీ బ్లాక్ మెటల్ ఆర్నమెంట్స్ వేసుకుంది.

శక్తిని చూసి చిరునవ్వుతో "నమస్తే! నా పేరు మాధవి" అంది.

"తెలుసు!" అని ఆమెని పరీక్షగా చూస్తూ "ఏం పనిమీద వచ్చారు?" కటువుగా అడిగింది శక్తి.

"ఇంద్రనీల్ గురించి... కానీ ఇక్కడ కాదు. మీరోసారి నాతోవస్తే ఓ అరగంటసేపైనా మాట్లాడుకోవాలి" అంది.

శక్తి వాడిగా "చూడండీ... మీతో అతని గురించి మాట్లాడాల్సిందేం లేదు నాకు. మీరు వెళ్ళచ్చు" అని వెనక్కి తిరగబోయింది.

"శక్తి చాలా తెలివైంది అంటాడు ఇంద్రనీల్. మీ అనాలోచిత ప్రవర్తన చూస్తుంటే అలా అనిపించడంలేదు" అంది ఆ అమ్మాయి.

శక్తి రోషంగా చూసి "మీ విలువైన అభిప్రాయాలు వినాల్సిన అవసరం నాకులేదు. ఇంకోసారి ఇలాంటి రాయబారాలు పంపవద్దన్నానని మీ ఇంద్రనీల్‌తో చెప్పండి. ఇంక దయచెయ్యండి" అంది.

ఆ అమ్మాయి నవ్వి "మీ ఆయన మా ఇంద్రనీల్ ఎలా అవుతాడండీ? అందుకే ఓసారి బయటికి రమ్మంటున్నాను. ప్లీజ్" అంది.

"అవసరంలేదు" మొండిగా అంది శక్తి.

"సరే... ఓ పదినిముషాలు ఎదురుగుండా బస్టాప్‌లో వెయిట్‌చేస్తాను. మనసు మారితే రండి. ఇదే మీ జీవితంలో మంచి అవకాశం. అనవసరంగా మొండితనానికి పోయి చెయ్యిజార్చుకోకండి. బై... ఐ విల్ వెయిట్ ఫర్ యూ!" అని ఆ అమ్మాయి వెళ్ళిపోయింది.

విసురుగా లంచ్ రూమ్‌లోకి వచ్చేసింది.

అందరూ వెళ్ళిపోయారు.

విశ్వనాథ్ ఒక్కడే వున్నాడు.



"శక్తీ! ఆ అమ్మాయి ఎవరు?" అని అడిగాడు.

"ఎవరోలే!" తీసిపారేసినట్లు అంది.

"నేను అంతా విన్నాను. నాకు కొంత అర్థమైంది. నువ్వు ఓసారి వెళ్ళి ఆ అమ్మాయి చెప్పేది వింటే బావుంటుంది" అన్నాడు.

"అది నా పర్సనల్..." అనబోయి ఆగిపోయింది.

విశ్వనాథ్ నవ్వాడు. "చూశావా! అనలేక మాటలని మింగేశావు. నీ మాట మన్నించి నేను నా భార్యతో మాట్లాడి కాపురం చక్కబరుచుకున్నాను. నువ్వుకూడా ఆ అమ్మాయి చెప్పేదేమిటో విని ఓసారి ఆలోచించు. ఫ్రెండ్‌షిప్‌లో ఒకరి మాట ఒకరు మన్నించుకోవాలి" అన్నాడు.

"నీకు తెలీదు విశ్వం!" అంటూ జరిగిన విషయం టూకీగా చెప్పింది శక్తి.

"శక్తీ! గాయత్రి కూడా మా మరదలితో నేను ఏకాంతంగా వుండటం చూసి అపార్థం చేసుకుంది. అపార్థం చేసుకోవడానికి అరసెకను పట్టదు. నువ్వు పొరపడ్డావేమో!"

"అయితే అతనే నిజం చెప్పడానికి ప్రయత్నించవచ్చుగా?"

"ఆడదాన్ని శంకిస్తే మీకు అవమానం చేశాడంటూ పెద్దగా ఫీలయి గొడవ చేస్తారు. అతని శీలాన్ని శంకించి మీరు గొడవచేస్తే కూడా అతనే అపాలజీ చెప్పుకుని రాజీపడాలా? అతనికి మాత్రం మానాభిమానాలు వుండవా?" ఎర్రనైన ముఖంతో అడిగాడు విశ్వనాథ్.

శక్తి మునిపంట పై పెదవిని బిగపట్టి ఆలోచనగా చూసింది.

"శక్తి మూర్ఖురాలు కాదని నా ఉద్దేశం. అవతలివాళ్ళు చెప్పేది వినేపాటి సహనంకూడా లేనివాళ్ళని మూర్ఖులంటారు" అన్నాడు.

అతనిమాట పూర్తయ్యేలోపే శక్తి గభాల్న డోర్ తీసుకుని అవతలికి వెళ్ళిపోయింది.

అతను కిటికీలోంచి చూస్తూ వుండగానే ఆమె టీవీయస్ స్టార్ట్ చేసుకుని బస్‌స్టాప్ వైపు వెళ్ళడం కనిపించింది.

విశ్వనాథ్ తృప్తిగా చూశాడు.

❖ ❖ ❖

"మీరొస్తారని నాకు తెలుసు" నవ్వుతూ అంది మాధవి.

"త్వరగా చెప్పండి" అంది అసహనంగా శక్తి.

"ఇక్కడకాదు. అలా ఎదురుగుండా వున్న హోటల్‌కి వెళ్ళి కాఫీ తాగుతూ మాట్లాడదాం" అంది మాధవి.

శక్తి మొహం చిట్లించి "పదండి" అంది.

ఇద్దరూ హోటల్లోకి వెళ్ళి ఫ్యామిలీ రూంలో కూర్చున్నాక "ఊ... కాఫీ తాగుతారా?" అడిగింది మాధవి.

"ఒద్దు. త్వరగా మాట్లాడండి" అంది శక్తి.

మాధవి సర్వర్‌కి రెండు కాఫీలు ఆర్డరిచ్చి "శక్తీ... మీ ఆయన మీకు తెలియకముందునుంచే నాకు తెలుసు" అంది.

"అయితే..." షార్ప్‌గా రియాక్ట్ అవుతూ అడిగింది.

"మేం ఇద్దరం కలిసి ఒక బిజినెస్ స్టార్ట్ చేశాం. దానిపేరు 'స్మైల్' సర్వీస్. మాకు కొంతమంది కాస్టలీ కస్టమర్స్ వుంటారు. వాళ్ళ ఆఫీసులు, ఇళ్ళూ అన్నీ మేము శుభ్రంచేయడం, రిపేర్లూ అవీ చేయించడం, ఇన్‌డోర్ డెకరేషన్‌లూ, ఫంక్షన్‌లూ అరేంజ్ చేయడం చేస్తుంటాము. అంటే హౌస్‌కీపింగ్ అన్నమాట."

"అయితే ఇవన్నీ నాకెందుకు చెబుతున్నారూ?" శక్తి చిరాగ్గా అడ్డుపడింది.

"పూర్తిగా విన్నాక మాట్లాడండి. మేం పార్టనర్స్‌గా ఆ బిజినెస్ మొదలు పెట్టాక మీరు అతన్ని కలవడం, పెళ్ళాడటం చకచకా జరిగిపోయాయి.

అతను అడిగిన కండిషన్‌కి ఒప్పుకుని మీరు నెలకి నాలుగురోజులు ఫస్ట్‌వీక్‌లో సెలవు మంజూరు చేయడంతో అతను వచ్చి ఎకౌంట్స్ అవీ చూసి, అసిస్టెంట్లకి వర్క్ ఎలాట్‌చేసి, సూపర్‌విజన్ చేసేవారు. ఈలోగా నాకు నెలతప్పింది."

శక్తిమొహంలోకి అసహ్యం పొంగుకొచ్చింది. ఛీత్కారంగా చూసింది.

మాధవి నవ్వి "ఇంద్రనీల్ వల్లకాదు! శ్యామ్ వల్ల!" శ్యామ్ ఆ సమయానికి దుబాయ్ వెళ్ళాడు. అతను వెళ్ళిపోయాక నాకు ప్రెగ్నెన్సీ కన్‌ఫర్మ్ అయింది. అతడు రావడానికి ఏడాది పడుతుంది. ఏం చెయ్యాలో



తోచలేదు. అబార్షన్ చేయమంటే డాక్టర్ నా భర్త సంతకం అడిగింది. ఆ సమయంలో ఇంద్రనీల్ వచ్చాడు.

పరిస్థితి వివరించాడు. తను భర్త సంతకంపెట్టి నాకు అబార్షన్ చేయిస్తానన్నాడు. ఆ టైమ్‌కి మీరు యాదృచ్ఛికంగా అదే నర్సింగ్‌హోంకి వచ్చి అతన్ని అపార్థం చేసుకున్నారు. ఒకవేళ మీరు డాక్టర్‌ముందు అతన్ని నిలదీసినా, ఇంద్రనీల్ నా గర్భానికి కారణం తనే అని చెప్పి వుండేవాడు అనుకోండి!

అతనికి తన భవిష్యత్తుకంటే కూడా ఇతరుల జీవితమే ముఖ్యం అనిపిస్తుంది. బహుశా ఎలాగైనా బతికేయగలననే ఓవర్ కాన్ఫిడెన్స్ ఏమో! మొత్తానికి మీ అనుమానం తప్పు అని చెప్పడమే మా ఉద్దేశం. నాకు శ్యామ్‌వల్లే ప్రెగ్నెన్సీ వచ్చింది. అది నిజం!" అంది.

"ఇదంతా నిజం అనడానికి రుజువేమిటి?" అడిగింది శక్తి.

మాధవి నవ్వి "ఒక్క నిముషం..." అని బయటికి వెళ్ళి తనతో ఒక యువకుణ్ణి తీసుకొచ్చింది.

"ఇదిగో ఇతనే శ్యామ్! మా వెడ్డింగ్ ఫోటోలు ఇవిగో..." అని బ్యాగ్‌లోంచి ఆల్బమ్ తీసి అందిస్తూ "మీ అనుమానం నిజంకాదు కాబట్టే ఇంద్రనీల్, నేనూ ఏడాదిగా పెళ్ళి చేసుకోలేదు. మిమ్మల్ని కలపడానికి నేను శ్యామ్ వచ్చేవరకూ ఓపిక పట్టాల్సి వచ్చింది" అంది.

శక్తికి ఆ ఫోటోల్లో పెళ్ళికొడుకు పక్కన ఇంద్రనీల్ కూడా కనిపించాడు.

"ఇంద్రనీల్ నాకూ తెలుసు! చాలా మంచిమనిషి. మీరు పొరబడి అతన్ని బాధపెట్టి, మీరూ బాధపడ్డారు మేడం" అన్నాడు శ్యామ్.

శక్తి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

"కాఫీ తీసుకోండి" అందించింది మాధవి.

"థాంక్యూ మాధవీ!" అంది కప్పు అందుకుంటూ శక్తి.

❖ ❖ ❖

శక్తి ఇంటికొచ్చేసరికి ఇల్లంతా చాలా సందడిగా వుంది.

అరుంధతి పిల్లలూ, సుమతి పిల్లలతో గోపాలరావు ఉషారుగా కబుర్లు చెబుతూ కనిపించాడు.

"అదిగో శక్తి..." అంది అరుంధతి.

సుమతి ఎదురెళ్ళి చెల్లెల్ని కౌగిలించుకుంది.

అక్కలిద్దరూ సంతోషంగా వుండటం శక్తి గమనించింది.

"ఏవిటే, మీ ఇద్దరికీ లాటరీలో కోట్లు వచ్చిపడ్డాయా? లేక ఎలక్షన్స్ లేకుండా ప్రధానమంత్రి పదవి వచ్చిందా? ఇంత సంతోషంగా కనిపిస్తున్నారు?" అని పరిహాసం చేసింది శక్తి.

"అలాంటిదేం కాదు కానీ... అంతకన్నా గొప్ప విషయం జరిగింది. నే చెప్తా ముందు" అని అరుంధతి తిరకాసు పెట్టింది.

"అబ్బా! ఇద్దరూ ఒద్దు. నేను చెప్తాను వుండండమ్మా" అన్నాడు ఆనందంగా గోపాలరావు.

"అందరూ కలిసి కాకుండా ఎవరు చెప్పినా నాకు సమ్మతమే" అంది శక్తి.

"అయితే విను ఇంద్రనీల్ ఏం చేశాడో" అన్నాడు తండ్రి.

ఆ పేరు వినగానే శక్తి ఆతృతగా "ఏం చేశాడూ?" అంది.

సుమతి అందుకొని గిరి ఏక్సిడెంట్ నాటినుంచి ఇంద్రనీల్ ఆడిన నాటకం, అందువల్ల తన భర్తలో వచ్చిన మార్పూ అన్నీ పూసగుచ్చినట్లు చెప్పింది. ఆ తరువాత నాటకం చెపుతుంటే అందరూ నవ్వు ఆపుకోలేక పోయారు.

"రెండుసార్లు దగ్గానంటే చాలు! మీ బావ ఠక్కున నోరు మూసేసుకుంటున్నాడు" అంది అరుంధతి.

"ఆ కమల్‌తో లేచిపోవడానికి అసలు అతని మొహం అయినా గుర్తుందటే నీకూ!" అని నవ్వింది శక్తి.

"మొత్తానికి మా మరిది భలే హీరోలే" అంది సుమతి.

"ఏం లాభం? మనకంటే చాలా తెలివైనదనుకుని మురిసిపోయాం మన చెల్లెల్ని చూసుకుని. ఇదేమో వజ్రాన్ని బొగ్గురాయనుకుని విసిరి పారేసింది. మనమే నయం... బొగ్గుల్ని సానపెట్టి వాడుకుంటున్నాం..." అంది అరుంధతి.



"నిజమే! చాలా తెలివితక్కువగా ప్రవర్తించాను. నేను కళ్ళారా చూసింది అంతా అబద్ధమని ఈరోజే తెలుసుకున్నాను" అంటూ మాధవి తనని కలిసి చెప్పిన విషయాలు చెప్పింది శక్తి.

"నే చెప్పలేదూ! ఇంద్రనీల్ బంగారం" అన్నాడు గోపాలరావు.

సుమతి హడావుడిగా ఇంద్రనీల్ అడ్రస్ కాయితం తీసుకొచ్చి ఇచ్చి "వెంటనే వెళ్ళు, అటువంటి వుత్తముణ్ని పోగొట్టుకోకు. ఏడ్చి లాభంలేదు" అంది.

గోపాలరావు కూడా "వెళ్ళమ్మా, అతని గొప్పతనం నాకు తెలుసు. నిన్ను ఏమీ అనడు. బాబుకోసం ఎంతగా కలవరించిపోతున్నాడో... తీసుకెళ్ళు" అన్నాడు.

శక్తి లేచి తండ్రి కాళ్ళకి నమస్కరించి బాబుని ఎత్తుకుని బయటికి రాగానే, విశ్వనాథ్ నవ్వుతూ "బెస్ట్ ఆఫ్ లక్" అన్నాడు.

"థాంక్యూ" అని శక్తి వేగంగా వెళ్ళిపోయింది.

❖ ❖ ❖

'స్మైల్' ఆఫీసులో ఫోన్ దగ్గర వున్న అమ్మాయి "ఎస్ మేడమ్!" అంది శక్తిని చూసి.

"ఇంద్రనీల్‌గారిని కలవాలి అని చెప్పండి. నా పేరు శక్తి" బాబుని భుజం మీద వేసుకుని జోకొడుతూ అంది శక్తి.

"వన్ మినిట్!" అంటూ రిసెప్షనిస్ట్ ఇంద్రనీల్‌తో మాట్లాడి "లోపలికి రమ్మంటున్నారు, వెళ్ళండి మేడం" అంది.

శక్తి కాళ్ళు తడబడుతుండగా లోపలికి వెళ్ళింది.

ఇంద్రనీల్ తలవంచుకుని ఏదో రాస్తూ "ఎస్ మేడమ్... మే ఐ హెల్ప్ యూ!" అన్నాడు.

"ఎస్... ఐ వాంట్ మై స్వీట్ హోమ్ బ్యాక్" అంది శక్తి.

ఇంద్రనీల్ తల ఎత్తాడు.

కన్నీళ్ళతో శక్తి అడుగులు ముందుకి వేసింది.

అతను నవ్వుతూ "హౌస్ కీపింగ్ ఈజ్ మై డ్యూటీ!" అని బాబుని ఆమె దగ్గర్నుంచి అందుకుని గుండెలకి హత్తుకున్నాడు.

అతని కళ్ళల్లో తదాత్మ్యతని అపురూపంగా చూసింది శక్తి.

"శక్తీ... నేను అదృష్టవంతుణ్ని" అన్నాడు ఆమెని దగ్గరగా పొదువుకుంటూ.

"కాదు... నేనే అదృష్టవంతురాల్ని" అంది.

"కాదు... నేనే!"

"కాదు... నేనే!"

"ఔను" అన్నాడు ఇంద్రనీల్.

"కాదు" అంది వెంటనే శక్తి.

ఆ ఇద్దరి పోట్లాటకి అర్థం తెలియకపోయినా బాబు కిలకిలా నవ్వాడు. ఆ నవ్వుతో వాళ్ళిద్దరూ కూడా శృతి కలిపారు.

దూరంగా ఎక్కడో కోయిల వగరు మామిడిపూత తిన్నా తియ్యగానే కూస్తోంది.

శుభం